www.andhrajyothy.com

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

ఆదివారం | 29-6-2025 | పేజీలు: 14 + 28 పేజీల ఆదివారం అనుబంధం | వెల (Price) : Rs. 8.00 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 74 | శ్రీ విశ్వావసు నామసంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, ఆషాఢమాసం, శుక్ల పక్షం తిథి: చవితి ఉ.9:15 తదుపరి పంచమి, నక్షత్రం: ఆశ్లేష ఉ.6:34 తదుపరి మఖ, వర్జ్యం: రా.6:57-8:36, దుర్ముహూర్తం: సా.5:05-5:57, అమృతఘడియలు: తె.4:52-6:31, రాహుకాలం: సా.4:30-6:00, సూర్యోదయం: 5:47, సూర్యాస్తమయం: 6:49 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru



శ్రీసత్యసాయి జిల్లా రొళ్ళ మండలం వడ్రహట్టి గ్రామంలో వేరుశనగ సాగు కోసం సిద్ధం చేసిన పొలం

జూన్ ముగుస్తున్నా చినుకు కోసం చింతే

- ఊరించి.. ఉసూరుమనిపించిన వానలు
- పలు జిల్లాల్లో తక్కువ వర్షపాతం నమోదు
- నారుమళ్లకు నీటి కోసం రైతుల ఎదురుచూపులు
- ఎగువన ఆల్మట్టి, నారాయణపూర్‌లకు భారీగా వరద
- దిగువన నెమ్మదిగా నిండుతున్న రిజర్వాయర్లు

అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): నైరుతి ముందే వచ్చేసింది. మే నెలలో వర్షాలు దంచికొట్టాయి. తీరా జూన్ నెల వచ్చేసరికి ముఖం చాటేశాయి. అడపా దడపా కురుస్తున్న వర్షాలతో పొలాలను దుక్కిదున్ని సిద్ధం చేసుకున్న రైతులు.. వర్షాలు కురిస్తే నారుమళ్లు పోసుకుందామని చూస్తున్నారు. వాతావరణం చూస్తే అస్తవ్యస్తంగా ఉంది. ఓరోజు వర్షం దంచికొడితే.. ఇంకో రోజు ఎండ మాడుపగలకొడుతోంది. అనిశ్చిత వాతావరణ పరిస్థితులతో రైతులు ఆందోళన చెందుతున్నారు. రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో బాగానే వర్షాలు పడినా.. ఇంకొన్ని జిల్లాల్లో తక్కువ వర్షాలతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. శ్రీసత్యసాయి, చిత్తూరు, కడప, అనంతపురం, పల్నాడు జిల్లాల్లో ఈ సీజన్‌లో తక్కువ వర్షపాతం నమోదు కావడంతో.. ఈ జిల్లాలు చినుకు కోసం ఎదురుచూస్తున్నాయి. శ్రీసత్యసాయి జిల్లాలో సాధారణ వర్షపాతం కంటే 19 శాతం తక్కువగా నమోదయ్యింది. పల్నాడులో 16 శాతం మేర వానలు

మిగతా 14వ పేజీలో...

నేడు అల్పపీడనం

రేపటి నుంచి ఉత్తర కోస్తాలో వర్షాలు

మార్చే యత్నం.. మారిన రేవంత్



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిలో మార్పు కనిపిస్తోంది. మంత్రులతో నిర్మొహమాటంగా వ్యవహరిస్తున్నట్టు చెబుతున్నారు. పార్టీ సమావేశాల్లో కూడా తన మనసులోని మాటను సూటిగా చెబుతున్నారు. ముఖ్యమంత్రిగా ఆయా శాఖల పనితీరుపై సమీక్షలు మొదలెట్టారు. అదే సమయంలో మంత్రులు తమ పనితీరును మెరుగుపరచుకోవాలని, స్థానిక ఎన్నికల్లో పార్టీని గెలిపించాల్సిన బాధ్యత మంత్రులపైనే ఉంటుందని స్పష్టంచేస్తున్నారు.

..కొంత మంది మంత్రులు, నాయకులు పార్టీ అధిష్ఠానానికి ముఖ్యమంత్రిపై ఫిర్యాదులు చేయడం ఎక్కువైంది. పరిస్థితి ఎంత దూరం వెళ్లిందంటే, రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని మార్చడం అవసరమని కాంగ్రెస్ అగ్రనాయకత్వం అభిప్రాయపడేలా చేశారు. ఆయన నాయకత్వంలో స్థానిక ఎన్నికలకు వెళ్లలేమని ఫిర్యాదు చేశారు. ఎన్నికల నాటితో పోలిస్తే కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో బలహీనపడిందని చెప్పుకొచ్చారు. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానం కూడా అలవాటు ప్రకారం అసంతృప్తులనే ప్రోత్సహించింది.

...నాయకత్వంలో లోపాలు గుర్తిస్తే వాటిని సరిదిద్దుకోవడానికి సలహాలు, సూచనలు ఇవ్వాలి గానీ ఏకంగా నాయకత్వాన్నే మార్చాలనుకోవడం ఆత్మహత్యాసదృశం అవుతుందని క్షేత్ర స్థాయి నుంచి కూడా పార్టీ అధిష్ఠానానికి అభిప్రాయాలు అందాయి. దీంతో రేవంత్ రెడ్డి నాయకత్వాన్ని మార్చాలన్న అభిప్రాయానికి పార్టీ అధిష్ఠానం స్వస్తి చెప్పింది.

కేసీఆర్ హయాంలో విచ్చలవిడిగా వేల సంఖ్యలో ప్రత్యర్థుల ఫోన్లను దొంగచాటుగా, అక్రమంగా విన్నప్పటికీ కేసీఆర్ ఓటమి నుంచి తప్పించుకోలేకపోయారు. ఇక నాకు సంబంధించినంత వరకు రెండేళ్ల కాల్ డేటా తెప్పించుకున్నారు. ఇది అమలులో ఉన్న చట్టాలు, నిబంధనలకు విరుద్ధం. మావోయిస్టులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారి జాబితాలో నా నంబర్ చేర్చారు. నా ఫోన్ మాత్రమే కాదు, మరికొందరు మీడియా యజమానుల ఫోన్లనూ ట్యాప్ చేశారు.

ఫోన్ ట్యాపింగ్‌లో బాధితులకు న్యాయం జరగాలన్నా, నిందితులకు శిక్ష పడాలన్నా సుప్రీం పర్యవేక్షణలో దర్యాప్తు చేయాలి. ఈ అరాచకానికి కర్త, కర్మ, క్రియ నాటి సీఎం కేసీఆర్ అన్నది అందరికీ తెలిసిందే. కేసీఆర్ అండ్ కో సేఫ్ గా ఉంటారా? జైలుకు వెళతారా? అన్నది కాలమే చెప్పాలి!

కొత్త పలుకు -ఆర్కే విశ్లేషణ 4లో..



జగన్ కారు కింద సింగయ్య నలిగిన దృశ్యాలు

తొక్కి చంపింది జగన్ కారే

సింగయ్య మృతి ఘటనపై వైరల్ అవుతున్న వీడియో ఒరిజినలే

మార్ఫింగ్ చేసిన ఆధారాలు లేవు.. ఫోరెన్సిక్ నివేదిక స్పష్టీకరణ!

- దీంతో జగన్‌ను ఇరికిస్తున్నారన్న వైసీపీ నాయకుల నోళ్లకు తాళం
- 'బాబు కల్పిత మరణ దృశ్యం'మన్న రోత పత్రిక రాతలకు చెక్
- 1న జగన్ క్వాష్ పిటిషన్‌పై హైకోర్టులో విచారణ
- అదే రోజున కోర్టుకు ఫోరెన్సిక్ నివేదిక సమర్పణ
- జగన్ కారుకు ఇప్పటికే ఫిట్‌నెస్ పరీక్షలు పూర్తి

గుంటూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పల్నాడు పర్యటనలో సింగయ్యను తొక్కి చంపింది కాన్వాయ్‌లోని జగన్ వాహనమేనని తేలిపోయింది. సింగయ్యను ఢీ కొట్టిన సందర్భంలో సెల్‌ఫోన్‌లో తీసిన వీడియో వైరల్‌గా మారింది. అయితే, ఈ వీడియోను మార్ఫింగ్ చేశారంటూ నోరు పారేసుకున్న వైసీపీ నేతల నోళ్లకు ఫోరెన్సిక్ నివేదిక తాళం వేసింది. సింగయ్యను ఢీ కొట్టింది జగన్ ప్రయాణిస్తున్న కారేనని ఆ నివేదిక స్పష్టంచేసినట్లు తెలిసింది. జగన్ కారు కుడివైపు ముందు చక్రం కింద సింగయ్య నలుగుతున్న సమయంలో జగన్ ఎడమవైపు నుంచి కార్యకర్తలకు అభివాదం చేస్తుండటం, ఓ కార్యకర్త బానెట్‌పై నిలబడి చిందులు వేస్తుండటం వీడియోలో స్పష్టంగా కనిపించింది. అయితే ఆ వీడియో ఒరిజినల్ కాదంటూ ప్రజలను, కేసును తప్పుదారి పట్టించేలా మాజీ మంత్రి అంబటి రాంబాబు వంటి వైసీపీ నేతలు గొంతు చించుకున్నారు. అది 'బాబు కల్పిత మరణ దృశ్య'మంటూ జగన్ సొంత పత్రికలో రోత రాతలు రాశారు. ముందుగా ఎస్పీ.. కారు నంబర్‌తో సహా ప్రకటించారని, ఆ తర్వాత మార్ఫింగ్ వీడియోను ప్రభుత్వం సృష్టించి జగన్‌ను కేసులో

మిగతా 14వ పేజీలో...

ఆ ఎమ్మెల్యేలను గాడిలో పెడతారా?

- ఇసుక, మద్యం, గనులు, సెటిల్మెంట్లపై కొందరు ఎమ్మెల్యేలపై ఫిర్యాదులు
- ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్న బాబు
- మహానాడులోనూ గట్టి వార్నింగ్
- అయినా కొందరి తీరు మారని వైనం
- పార్టీకి, ప్రభుత్వానికి తలనొప్పులు
- వారిని 'సరిచేయ'డానికి సిద్ధమైన అధిష్ఠానం
- నేడు టీడీపీ విస్తృతస్థాయి సమావేశం
- 1-1 చర్చించి.. వారి తప్పులు చెప్పే చాన్స్

కూటమి సుపరిపాలన పైనా కీలక చర్చ

2 నుంచి 'ఇంటింటికీ మంచి ప్రభుత్వం'

(అమరావతి - ఆంధ్రజ్యోతి)

గత ప్రభుత్వ హయాంలో ఇసుక, మద్యం, గనులు విపరీతంగా దోపిడీకి, అడ్డగోలు అక్రమాలకు గురయ్యాయి. దీంతో వీటి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని అధికారులను, వాటి జోలికి పోవద్దని టీడీపీ ఎమ్మెల్యేలను అధినేత చంద్రబాబు హెచ్చరిస్తూనే ఉన్నారు. మహానాడు వేదికగా బహిరంగంగానే వార్నింగ్ కూడా ఇచ్చారు. దీంతో ఎమ్మెల్యేలు చాలావరకు దారికివచ్చినా, కొందరు మాత్రం కట్టు తప్పుతున్నారు. పార్టీకి, ప్రభుత్వానికి తలనొప్పులు తెచ్చిపెడుతున్నారు. దీంతో ఇలాంటివారిని గుర్తించి 'సరిచేయడానికి' ఆదివారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించనున్నారు. ఇప్పటికే క్షేత్రస్థాయి నుంచి ముఖ్యమంత్రి చంద్రబాబు నివేదికలు తెప్పించుకున్నారు. దారి తప్పిన అలాంటి ఎమ్మెల్యేలను, నేతలను గాడిలో పెట్టేందుకు, కొరడా ఝళిపించేందుకు సిద్ధమయ్యారు. ఆదివారం సమావేశంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎమ్మెల్యేలకు

మిగతా 13వ పేజీలో...

బీజేపీ రాష్ట్ర సారథి ఎవరు?

- నేడు షెడ్యూల్.. జూలై 1న ఫైనల్ 3
- అధ్యక్ష పీఠం కోసం ఆశావహుల క్యూ
- సుజనా, పార్థసారథి, మాధవ్ యత్నం
- రేసులో మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి
- పురందేశ్వరి కొనసాగింపుపైనా చర్చ




శుభాన్షు శుక్లాతో వీడియో కాన్ఫరెన్స్‌లో మోదీ

నా దేశం ఎంతో గొప్పది!

- అంతరిక్షం నుంచి ఘనంగా కనిపిస్తోంది
- రోజుకు 16సార్లు సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు చూస్తున్నాం 12
- ఐఎస్ఎస్ నుంచి శుభాన్షు శుక్లా
- వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన ప్రధాని
- మీరెంత దూరంగా ఉన్నా మా హృదయాలకు దగ్గరగా ఉన్నారు: మోదీ

నటి పాకీజాకు సహాయం చేయాలంటే..



గుంటూరు సిటీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): సినీ హాస్య నటి పాకీజా (వాసుగి) అత్యంత దీనావస్థలో ఉండి భిక్షాటన చేస్తున్నారన్న విషయాన్ని 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తెచ్చింది. 'పాపం.. పాకీజా' అనే శీర్షికతో శనివారం కథనం ప్రచురించగా, పాకీజాకు సాయం చేసేందుకు పలువురు ముందుకొచ్చారు. అయితే, ఆ కథనంలో ఇచ్చిన ఆమె ఫోన్ నంబరులో పొరపాటు దొర్లింది. పాకీజాకు సహాయం చేయదలచిన వారు 81488 86254 అనే ఈ నంబరులో సంప్రదించవచ్చు.



పన్నుల్లో నొక్కుడు

వాణిజ్య పన్నుల శాఖలో ఇంకా పాత పోకడలే

- వైసీపీ హయాం నాటి అధికారులదే హవా
- చీఫ్ కమిషనర్ ఆఫీసులో అంతా అస్మదీయులే
- కీలక కమిటీలు, విధుల్లోనూ సొంతవారే
- 'రిజిస్ట్రేషన్' ప్రక్రియా వారి అధీనంలోనే
- సెంట్రల్ రిజిస్ట్రేషన్ యూనిట్‌కు కూటమి ప్రభుత్వంలో ఆమోద ముద్ర
- శాఖలో యథేచ్ఛగా అక్రమ వసూళ్ల పర్వం
- వ్యాపారులతో కుమ్మక్కు.. ఆదాయానికి గండి

కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తయినా వాణిజ్య పన్నుల శాఖలో ఇంకా పాత పోకడలు పోలేదు. వైసీపీ హయాంలో నియమితులైన కొందరు అధికారులు ఇంకా చక్రం తిప్పుతున్నారు. చీఫ్ కమిషనర్ ఆఫీసుతో పాటు ఆదాయం వచ్చే కీలక పోస్టుల్లో అందరూ వైసీపీ అస్మదీయులే. పన్నుల వసూళ్లు, తనిఖీల్లో బాధ్యతలూ వారికే. దీంతో యథేచ్ఛగా అక్రమాలు సాగిపోతున్నాయి.

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గత వైసీపీ ప్రభుత్వం ఓవైపు వాణిజ్య పన్నుల శాఖలో సంస్కరణల పేరిట జీఎస్టీ ఆదాయానికి గండి పడేలా చేయగా.. మరోవైపు అధికార యంత్రాంగాన్ని కూడా భ్రష్టు పట్టించింది. గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన కొంతమంది ఉన్నతాధికారులు ఇప్పటికీ చీఫ్ కమిషనర్ కార్యాలయంలో

మిగతా 2వ పేజీలో...

ఏఐతో నేరగాళ్లకు చెక్

- ఏపీ పోలీసుల వినూత్న ప్రయత్నం.. సాఫ్ట్‌వేర్ నిపుణులతో హ్యాకథాన్ 2
- యూజ్ కేసులతో మేధో మథనం.. సులువుగా వినియోగించేలా సాఫ్ట్‌వేర్
- వాయిస్ కమాండ్లతోనే డేటా ప్రత్యక్షం.. దర్యాప్తు పుంజుకుంటుందనే విశ్వాసం

ఇక ఈవీ బస్సులే!



మహిళలకు ఉచిత బస్సు పథకం అమలుపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

- ఆర్టీసీలో బస్సుల సంఖ్య పెరగాలి.. అవి ఎలక్ట్రిక్ వాహనాలై ఉండాలి
- ఆక్యుపెన్సీ పెంచేలా చర్యలు తీసుకోవాలి.. సీఎం ఆదేశాలు
- ఆగస్టు 15 నుంచే మహిళలకు ఉచిత ప్రయాణమని స్పష్టీకరణ
- మున్సిపాలిటీల్లో కేంద్ర ప్రాజెక్టులకు మరిన్ని నిధులు సమీకరించాలి
- ఏఐఐబీ, యూఐడీఎఫ్ పనుల్లో ఏ మాత్రం జాప్యం జరగకూడదు
- మున్సిపల్ శాఖ సమీక్షలో ముఖ్యమంత్రి నిర్దేశం

అమరావతి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఇకపై ఏపీఎస్‌ఆర్టీసీలో ప్రవేశపెట్టే బస్సులన్నీ ఎలక్ట్రిక్ వాహనాలే ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు స్పష్టం చేశారు. ఆర్థికంగా భారమైనా.. ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం అమలు చేసి తీరుతామని పేర్కొన్నారు. ఉండవల్లిలోని తన క్యాంపు కార్యాలయంలో సీఎం చంద్రబాబు శనివారం ప్రజారవాణాపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలను చేశారు. ఆక్యుపెన్సీ పెరిగేలా చర్యలు తీసుకోవాలని, అందుకు అనుగుణంగా కొత్త బస్సులను సమకూర్చుకోవాలని నిర్దేశించారు. ఇప్పటికే ఆర్టీసీ వద్ద ఉన్న

మిగతా 13వ పేజీలో...

తిరుమల యాత్రికులకు బీమా!



- సదుపాయం కల్పనపై టీటీడీ యోచన
- పాలకమండలి సమావేశంలోనూ చర్చ!
- నిత్యం సగటున 70 వేల మంది కొండపైకి
- వీరందరికీ బీమా కల్పించడం సాధ్యమేనా?
- టికెట్ లేని సర్వదర్శనం భక్తుల మాటేమిటి?
- సాధ్యాసాధ్యాలపై అధికారుల తర్జనభర్జనలు
- తొక్కిసలాట ఘటన నేపథ్యంలో నిర్ణయం?

(తిరుపతి-ఆంధ్రజ్యోతి)

శ్రీవారి దర్శనం కోసం తిరుమల వచ్చే యాత్రికులందరికీ బీమా సదుపాయం కల్పించే దిశగా టీటీడీ యోచిస్తోంది. దీనిపై ఇంకా స్పష్టమైన ప్రతిపాదన రూపుదిద్దుకోనప్పటికీ సాధ్యాసాధ్యాలపై పాలక, అధికారవర్గాల్లో ఆలోచన మొదలైంది. అయితే రోజువారీగా భారీగా వచ్చే భక్తులకు బీమా కల్పించడం సాధ్యమేనా? దర్శనం

మిగతా 3వ పేజీలో...

భారత్‌కు పంపే సొమ్ముపై రెమిటెన్స్ పన్ను లేనట్టే!

12

- అమెరికాలోని ఎన్నారైలకు పెద్ద ఊరట
- 'బిగ్ బ్యూటిఫుల్ యాక్ట్' ముసాయిదాలో కీలక మార్పులు చేసిన ఆ దేశ సెనేట్
- రెమిటెన్స్ పన్ను ఒక శాతానికి తగ్గింపు



ఆస్పత్రి నుంచి వెళ్లేలోగా బర్త్ సర్టిఫికెట్ మంజూరు!

రాష్ట్ర ప్రభుత్వాలకు కేంద్రం నిర్దేశం

'రా' చీఫ్‌గా పరాగ్



- 1989 పంజాబ్ క్యాడర్ ఐపీఎస్ అధికారి
- 20 ఏళ్లకు పైగా 'రా'లో కీలక బాధ్యతలు

12



బీఆర్ఎస్వీ దాడిలో ధ్వంసమైన కార్లు

మహా టీవీ కార్యాలయంపై బీఆర్ఎస్వీ దాడి !

- కేటీఆర్‌పై ప్రసారమైన కథనానికి నిరసన
- ఫర్నిచర్, కార్లపై రాళ్లు, ఓ ఉద్యోగికి గాయాలు
- బీఆర్ఎస్వీ అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ అరెస్టు
- మహాటీవీపై క్రిమినల్ డిఫమేషన్ చర్యలు: కేటీఆర్

బంజారాహిల్స్, హైదరాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): హైదరాబాద్, ఫిలింనగర్‌లో ఉన్న మహా టీవీ కార్యాలయంపై బీఆర్ఎస్వీ (భారతీ రాష్ట్ర సమితి విద్యార్థి సంఘం) కార్యకర్తలు శనివారం దాడి చేశారు. ఫోన్ ట్యాపింగ్ వ్యవహారంలో కేటీఆర్‌పై ప్రసారం చేసిన కథనానికి నిరసనగా రాళ్లు, కర్రలతో దాడి చేశారు. సుమారు 20 మంది కార్యకర్తలు కార్యాలయంలోని సామగ్రి, బయట ఉన్న కార్లు ధ్వంసం చేశారు. ఈ దాడిలో మహాటీవీకి చెందిన ఓ ఉద్యోగికి గాయాలయ్యాయి. దాడి సంగతి తెలుసుకున్న డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రోడ్డు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, సీపీఐ నేత నారాయణ, ఎమ్మెల్సీ అద్దంకి దయాకర్, బల్మూరి వెంకట్ తదితరులు ఆ కార్యాలయాన్ని సందర్శించి దాడిని ఖండించారు. ఈ దాడికి సంబంధించి మహాటీవీ చేసిన ఫిర్యాదు మేరకు బీఆర్ఎస్వీ రాష్ట్ర అధ్యక్షుడు గెల్లు శ్రీనివాస్ యాదవ్‌ను పోలీసులు అరెస్టు చేశారు. దాడికి పాల్పడిన ఐదుగురిని కూడా అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఫోన్ ట్యాపింగ్ అంశంలో కేటీఆర్‌పై తప్పుడు వార్తలు ప్రసారం చేశారని పేర్కొంటూ మహా టీవీకి బీఆర్ఎస్ పార్టీ లీగల్ నోటీసులు పంపింది. మహాటీవీ తన విధానం మార్చుకోకపోతే పరువు నష్టం దావా, క్రిమినల్ డెఫమేషన్ చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్టు కేటీఆర్ పేర్కొన్నారు. ఇక, అన్నపూర్ణ క్యాంటీన్ల పేరు మార్పుపై రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని కేటీఆర్ తీవ్రంగా తప్పుబట్టారు. 2028లో తమ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చాక పథకాల పేర్లను పునరుద్ధరిస్తామని తెలిపారు. కాగా మహాన్యూస్ ప్రధాన కార్యాలయంపై జరిగిన దాడిని ఏపీ సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ ఖండించారు. బెదిరింపులు, దాడులతో మీడియాను కట్టడి చేయాలనే ఆలోచన మంచిది కాదని, ప్రజలు, సమాజం దీన్ని ఆమోదించరని స్పష్టం చేశారు. మీడియా సంస్థపై దాడి చేయడం . మహిళా సిబ్బందిపై బీఆర్ఎస్ గూండాలు విరుచుకుపడటం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఇక బీఆర్ఎస్ నేతలకు సిట్ నోటీసులు

- ఫోన్ ట్యాపింగ్ బాధితుల్లో బీఆర్ఎస్ నేతలు
- ఇప్పటి వరకు.. 200 మందికి పైగా బాధితుల వాంగ్మూలాలు

హైదరాబాద్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఫోన్ ట్యాపింగ్ కేసులో బాధితులుగా ఉన్న బీఆర్ఎస్ నేతలకు నోటీసులు ఇచ్చేందుకు సిట్ సన్నద్ధమైనట్లు సమాచారం. ఇప్పటి వరకు బాధితులుగా ఉన్న 200 మందికి పైగా కాంగ్రెస్, బీజేపీ నాయకులు, మీడియా ప్రతినిధుల వాంగ్మూలాలను సిట్ నమోదు చేసింది. బాధితులుగా ఉన్న బీఆర్ఎస్ ద్వితీయ, తృతీయ శ్రేణి నాయకుల వాంగ్మూలాలను త్వరలో నమోదు చేయనున్నట్లు తెలిసింది. సిట్ ఇప్పటి వరకు సేకరించిన సాక్ష్యాధారాల్లో భాగంగా.. మావోయిస్టుల సానుభూతిపరుల పేరుతో 615 మంది ఫోన్లను ట్యాప్ చేయడం ద్వారా అప్పటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకర్‌రావు భారతీయ టెలిగ్రాఫ్ చట్టం, ఐటీ చట్టాన్ని ఉల్లంఘించారని నిర్ధారించింది. బాధితుల వాంగ్మూలాలతో ప్రభాకర్‌రావు పాత్రపై బలమైన ఆధారాలను సేకరించనున్నట్లు తెలుస్తోంది. న్యాయస్థానాల్లో ఈ కేసు నిలబడి, అక్రమంగా ట్యాపింగ్ చేసిన తీరులో శిక్షలు పడేలా చేసే దిశలో సిట్ వేగంగా అడుగులు వేస్తోంది. అప్పటి పీసీసీ చీఫ్, ప్రస్తుత సీఎం రేవంత్‌రెడ్డి ఇంటి సమీపంలో నిందితులు మకాం వేసి, ఫోన్ ట్యాపింగ్ చేశారనడానికి నిందితుల సెల్ టవర్ లొకేషన్లు కీలకంగా మారుతాయని అధికారులు భావిస్తున్నారు. ఇప్పటికే కోర్టులో చార్జ్‌షీట్ దాఖలు చేసిన సిట్.. కొత్తగా సేకరించిన ఆధారాలతో త్వరలో అనుబంధ చార్జ్‌షీట్ వేయడానికి సన్నాహాలు చేస్తోంది.

ప్రతి ఒక్కరూ డేటా విశ్లేషించగలరు



నేరగాళ్ల కదలికలు కనిపెట్టడానికి వాట్సాప్, గూగుల్ టేకౌట్ వినియోగించాల్సి వస్తోంది. కాల్ డిటెక్షన్ రికార్డు (సీడీఆర్), ఇంటర్నెట్ ప్రోటోకాల్ రికార్డు (ఐపీఆర్), బ్యాంకు స్టేట్‌మెంట్లు చూడాల్సి వస్తోంది. సిబ్బందిలో ప్రతీ ఒక్కరూ ఇది చేయలేరు. ఏఐ సహాయంతో డేటా సేకరించి నిందితులను గుర్తించేందుకే ఈ ప్రయత్నం. ఈ హ్యాకథాన్‌లో ఆరు బృందాలు పని చేస్తున్నాయి. ఇప్పుడు తయారు చేసే ఏఐ పవర్డ్ సాఫ్ట్‌వేర్ ద్వారా సీడీఆర్, ఐపీఆర్‌లను ఎవరైనా సులువుగా వినియోగించవచ్చు. నేరస్థులను పట్టుకోవచ్చు. కొద్ది రోజుల్లోనే ఈ సిస్టమ్‌ని పోలీసు శాఖకు అందుబాటులోకి తీసుకొస్తాం.

- కొమ్మి ప్రతాప్ శివ కిశోర్, ఏలూరు జిల్లా ఎస్పీ

చాట్ డేటాలు సులువుగా విశ్లేషణ



విస్తృతమైన గ్రూపు, వాట్సాప్ చాట్‌ల డేటాలను విశ్లేషించి సరళీకృతం చేయడం ద్వారా పోలీసు సిబ్బందికి సహకరించేందుకు యూజ్ కేస్-7లో సవాళ్లను అధిగమించేందుకు ప్రయత్నిస్తున్నాం. ఇది పెద్ద మొత్తంలో మెసేజ్‌లను టాపిక్ ఆధారిత అంశాలుగా కుదిస్తుంది. దీని వలన చాట్‌లలోని ప్రధాన అంశాలను ఇన్వెస్టిగేషన్ అధికారులు గుర్తించడం సులభం అవుతుంది. సమాచార ప్రాసెసింగ్‌పై వెచ్చిస్తున్న సమయాన్ని తగ్గించి కార్యాచరణ సామర్థ్యాన్ని పెంచేందుకు దోహదపడుతుంది. ఇందుకోసం ఎల్ఎల్ఎం మాడ్యూల్స్, పైథాన్ వంటివి వినియోగిస్తున్నాం.

- సమన్విత, ఇంజనీరింగ్ విద్యార్థిని, వీవీఐటీ, గుంటూరు

ఏఐతో నేరగాళ్లకు చెక్

ఏపీ పోలీసుల వినూత్న ప్రయత్నం.. సాఫ్ట్‌వేర్ నిపుణులతో హ్యాకథాన్

యూజ్ కేసులతో మేధో మథనం

గుంటూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కృత్రిమ మేధ (ఏఐ) ప్రపంచంలోని అన్ని రంగాల్లోనూ ప్రవేశిస్తోంది. ఆ అత్యాధునిక సాఫ్ట్‌వేర్ ప్రయోజనాలు అందిపుచ్చుకోవాలని ఏపీ పోలీసులు కూడా ప్రయత్నిస్తున్నారు. అందులో భాగంగా పోలీసు శాఖలో ప్రతీ ఒక్కరూ వినియోగించేలా ఏఐతో రూపొందించే ఆధునిక పరిజ్ఞానం రూపుదిద్దుకుంటోంది. కంప్యూటర్ కమాండ్లు తెలియకపోయినా కేవలం వాయిస్ కమాండ్స్ ఇస్తే సమగ్ర సమాచారం రియల్‌టైంలో ఇచ్చేలా ఐటీ రంగ నిపుణులు ప్రయత్నిస్తున్నారు. గుంటూరులోని ఆర్‌వీఆర్ ఇంజనీరింగ్ కళాశాలలో ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ఫర్ ఏపీ పోలీసు పేరుతో నిర్వహిస్తున్న మూడు రోజుల జాతీయ స్థాయి హ్యాకథాన్‌లో రెండో రోజు శనివారం పోలీసు ఉన్నతాధికారులు, ఐటీ నిపుణులు, విద్యార్థులు టెక్నికల్ సెషన్స్‌లో నిమగ్నమయ్యారు. బృందాలుగా విడిపోయి తమకు ఇచ్చిన యూజ్ కేస్ (డేటా సేకరణలో పోలీసులు ఎదుర్కొంటున్న సమస్యలు)ల్లో సవాళ్లను పరిష్కరించేందుకు మెదడుకు పనిచెప్పారు. పోలీసు శాఖ గుర్తించిన ఎనిమిది యూజ్ కేస్‌లకు సంబంధించి సులభమైన సాఫ్ట్‌వేర్‌లను ఆదివారం మధ్యాహ్నం కల్లా ఇంజనీర్లు అందిస్తారని పోలీసు ఉన్నతాధికారులు ఆశిస్తున్నారు. ఈ హ్యాకథాన్ సందర్భంగా సీనియర్ ఐపీఎస్ అధికారులు, సాఫ్ట్‌వేర్ నిపుణులు, విద్యార్థులను 'ఆంధ్రజ్యోతి' పలకరించింది. హ్యాకథాన్ గురించి వారి అభిప్రాయాలు వారి మాటల్లోనే...



పోలీసు హ్యాకథాన్‌కు హాజరైన సాఫ్ట్‌వేర్ నిపుణులు

వాయిస్ బేస్డ్ క్వరీయింగ్‌పై వర్కు చేస్తున్నాం



నేను విప్రో కంపెనీలో సాఫ్ట్‌వేర్ డెవలపర్‌గా పనిచేస్తున్నాను. ఈ హ్యాకథాన్‌లో యూజ్ కేస్-2 ఏఐ పవర్డ్ వాయిస్ బేస్డ్ నేచురల్ లాంగ్వేజ్ క్వరీయింగ్, రిపోర్టు జనరేషన్ ఫ్రం క్రైం అండ్ క్రిమినల్ ట్రాకింగ్ నెట్‌వర్కు సిస్టమ్ (సీసీటీఎన్ఎస్) డేటా అంశంపై నలుగురు సభ్యుల బృందంతో కలిసి పనిచేస్తున్నాను. దీనిని ఓ సవాలుగా స్వీకరించాం. సీసీటీఎన్ఎస్ డేటాకు ఇంగ్లీషు/తెలుగులో ఒక కమాండ్ పంపితే రిపోర్టు జనరేట్ అయ్యేలా ఏఐ సాఫ్ట్‌వేర్‌ని తయారు చేస్తున్నాం. ప్రస్తుతం ప్రతి పోలీసుస్టేషన్‌లో డేటా ఉంటుంది. కానీ ఆ డేటా ఓ సిబ్బంది పరిధిలోనే ఉంటుంది. అతనిపైనే అందరూ ఆధారపడాలి. ఇప్పుడు మేము తయారు చేసే సాఫ్ట్‌వేర్‌తో వాయిస్ కమాండ్ ద్వారా కోరిన సమాచారం సీసీటీఎన్ఎస్ నుంచి వస్తుంది. దీని వలన పనిలో ఎంతో వేగం పెరుగుతుంది.

- పవన్, సాఫ్ట్‌వేర్ డెవలపర్, విప్రో

ఏఐ పవర్డ్ కాల్‌డేటా విశ్లేషిస్తున్నాం



మా స్వస్థలం నెల్లూరు జిల్లా. టీ-హబ్‌లో రాక్సాన్ అనే స్టార్టప్‌ను ఏర్పాటు ఏర్పాటు చేశాను. మా టీంకు ఏఐ పవర్డ్ సీడీఆర్/ఐపీడీఆర్‌కు చెందిన పెద్ద డేటాను విశ్లేషించే సాఫ్ట్‌వేర్ రూపకల్పనకు అవకాశం ఇచ్చారు. ఎక్కడైనా నేరం జరిగితే టవర్ డేటాని వినియోగించి డేటాని సేకరిస్తారు. అలానే కాల్ రికార్డ్స్, ఇంటర్నెట్ వినియోగంపై సమాచారం సేకరించి అనుమానితులను గుర్తిస్తారు. అయితే ఇప్పుడు ఈ రికార్డ్స్ ఎక్కువైపోయాయి. దీంతో వాటిని విశ్లేషించడం కోసం చాలా సమయం పడుతోంది. దీనిని అధిగమించేందుకు ఏఐ సాఫ్ట్‌వేర్‌ని రూపొందిస్తున్నాం. దీంతో నిమిషాల్లోనే వందల కాల్ రికార్డ్స్, ఇంటర్నెట్ రికార్డులను విశ్లేషించే సదుపాయం పోలీసులకు అందుబాటులోకి వస్తుంది.

- దినేష్, రాక్సాన్ స్టార్టప్ సీఈవో, టీ హబ్

వార్తల విశ్లేషణకు ఉపయోగపడేలా..



పోలీసులకు సంబంధించిన వార్తలు తేదీల వారీగా ఆటోమేటిక్‌గా ఇచ్చేందుకు మినిమల్ వయబుల్ ప్రొడక్టు(ఎంవీపీ)ని అభివృద్ధి చేయడం ప్రధాన లక్ష్యం. రోజూ పోలీసు అధికారులు వార్తలు చదవాలి. అప్పుడే ప్రజల సమస్యలు తెలుస్తాయి. అయితే పని ఒత్తిడిలో ఆ పని చేయలేకపోతున్నారు. ఏఐని వినియోగించి అంశాల వారీగా వార్తలను క్రోడీకరిస్తే పోలీసు అధికారులకు ఎంతగానో ఉపయోగపడుతుంది. డయల్ 112, క్రైం హాట్‌స్పాట్స్‌లో శాంతి భద్రతలపై వేగంగా హెచ్చరికలు పంపే అంశంపైనా సాఫ్ట్‌వేర్‌ని రూపొందించాలని కోరాం. ఇది వస్తే క్రైం జరిగిన కచ్చితమైన ప్రదేశానికి పోలీసులు వేగంగా చేరుకొనే అవకాశం ఉంటుంది. రాబోయే రోజుల్లో హీట్ మ్యాప్‌లు కూడా జనరేట్ చేసి ఏఏ ప్రాంతాల్లో ఎలాంటి కేసులు ఎక్కువగా వస్తున్నాయనేది తెలుసుకోవచ్చు. అలానే డైనమిక్ బీట్ సిస్టమ్స్ ఏర్పాటు చేయొచ్చు.

- మల్లిక గార్గ్, ఏపీఎస్పీ 5వ బెటాలియన్ కమాండెంట్, విజయనగరం

వార్తల అంశాలను విభజిస్తున్నాం



మా బృందం యూజ్ కేస్-8పై పని చేస్తోంది. ఆంగ్ల వార్త పత్రికల్లోని కథనాలను సరళమైన తెలుగు భాషలోకి అనువదించి స్నేహపూర్వక డ్యాష్‌బోర్డు ద్వారా/పీడీఎఫ్ నివేదికగా అందిస్తాం. సీనియర్ పోలీసు అధికారులు చెప్పిన విధంగా వివిధ జిల్లాలకు సంబంధించిన నిర్దిష్టమైన వార్తల కంటెంట్‌పైనా దృష్టి పెడుతున్నాం. వార్తలను ఫిల్టర్ చేయడానికి, సంకలనం చేయడానికి, క్రాస్-రిఫరెన్స్‌కు ఏఐని వినియోగిస్తున్నాం. వివిధ పత్రికలు ఒకే సంఘటనపై ఎలా నివేదిస్తాయనే దానిపై విశ్లేషణ చేసేలా సాఫ్ట్‌వేర్ రూపొందిస్తున్నాం.

- కె.వెంకట ఈశ్వర్, ఇంజనీరింగ్ విద్యార్థి, అపోలో యూనివర్సిటీ, చిత్తూరు

లోకం తీరు



ఏడేళ్లుగా తండ్రిని పట్టించుకోలే.. చస్తే వచ్చారా?

- మృతుడి నలుగురు సంతానంపై గ్రామస్థుల కన్నెర్ర
- మృతదేహం దరిదాపుల్లోకి వెళ్లనీయకుండా అడ్డగింత
- అంత్యక్రియలు చేసిన గ్రామస్థులు

తూప్రాన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): తల్లి చనిపోయి.. ఒంటరిగా ఉంటున్న వృద్ధుడైన కన్న తండ్రిని గత ఏడేళ్లలో ఎన్నడూ పట్టించుకోలేదు. ఒక్కసారైనా ఆయన దగ్గరకు వెళ్లలేదు.. ఫోన్ చేసైనా మాట్లాడలేదు! ఇటీవల.. కిందపడిపోయి తీవ్రంగా గాయపడ్డాడని స్థానికులు ఫోన్ చేసి చెప్పినా.. పలకరించేందుకు వారికి మనసొప్పలేదు. తీరా.. అతడు చనిపోయాడని తెలియడంతో ఆ బిడ్డలు అంత్యక్రియలకు ఊరొచ్చారు. అయితే వారిని ఆ గ్రామస్థులు అడ్డుకున్నారు. ఆ వృద్ధుడి మృతదేహం దరిదాపుల్లోకి కూడా వారిని వెళ్లనీయలేదు. తెలంగాణలోని మెదక్ జిల్లా తూప్రాన్ మండలం వట్టూరు గ్రామంలో ఈ ఘటన జరిగింది. గ్రామానికి చెందిన బింగి దేవయ్య (75), నర్సమ్మ దంపతులకు యాదగిరి, శ్రీనివాస్ కుమారులు.. ధనమ్మ, సంతోష, రమేశ్వరీ కూతుళ్లు ఉన్నారు. ఐదుగురు పిల్లలకూ దేవయ్య దంపతులు పెళ్లిళ్లు చేశారు. పెద్ద కుమారుడు బతుకుదెరువు కోసం ఊరు విడిచి వెళ్లిపోయాడు. చిన్న కుమారుడు శ్రీనివాస్ వృద్ధ దంపతుల బాగోగులు చూసేవాడు. ఏడేళ్ల క్రితం దేవయ్య భార్య నర్సమ్మ, మూడేళ్ల క్రితం కొడుకు శ్రీనివాస్ చనిపోయారు. అప్పటి నుంచి ఇంట్లో ఒంటరిగా ఉంటున్న దేవయ్యను మిగతా సంతానం ఎన్నడూ పట్టించుకోలేదు. శుక్రవారం రాత్రి దేవయ్య మృతిచెందాడు. శనివారం అంత్యక్రియలు నిర్వహించేందుకు నలుగురు సంతానం ఊరొచ్చారు. దేవయ్య బతికున్నప్పుడు ఎన్నడూ పట్టించుకోలేదంటూ వారిని మృతదేహం వద్దకు గ్రామస్థులు రానివ్వలేదు. గ్రామస్థులే అంత్యక్రియల కోసం తలో చేయి వేశారు. దేవయ్య బాగోగులు చూసిన శ్రీనివాస్ కుమారుడితోనే అంత్యక్రియలు చేయించారు.

పన్నుల్లో నొక్కుడు

(మొదటి పేజీ తరువాయి)

కీలక స్థానాల్లో పాతుకుపోయారు. కూటమి ప్రభుత్వంలో కూడా తమ హవా కొనసాగిస్తున్నారు. తమ ఆధిపత్యాన్ని కాపాడుకునేందుకు కిందిస్థాయి అధికారులు, ఉద్యోగుల్లో వర్గాలను పెంచి పోషిస్తున్నారు. చీఫ్ కమిషనర్ కార్యాలయం మొత్తాన్నీ అస్మదీయులతో నింపేసుకున్నారని, తమ చేతికి మట్టి అంటకుండా అక్రమ వసూళ్ల పర్వాన్ని కొనసాగిస్తున్నారని ఆ శాఖ ఉద్యోగులే చెబుతున్నారు. వ్యాపారులతో కుమ్మక్కై ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి. రాష్ట్రంలో అత్యధికంగా పన్నులు చెల్లించే (టాప్ ట్యాక్స్ పేయర్స్) దాదాపు 200 మంది నుంచి పన్నుల వసూళ్ల కోసమని చీఫ్ కమిషనర్ కార్యాలయంలో 2 ప్రత్యేక సర్కిళ్లను (స్టేట్ సర్కిల్ 1, 2) ఏర్పాటు చేశారు. పన్నుల వసూళ్లకు సంబంధించిన ప్రతి షోకాజ్ నోటీసుకు ముందస్తు అనుమతి కోసం ప్రత్యేకంగా ప్రాంతీయ స్థాయిలో ఒకటి, రాష్ట్ర స్థాయిలో మరొకటి.. రెండు పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేశారు. ఈ రెండు కమిటీలలోనూ ఉన్నతాధికారులకు అనుకూలంగా పనిచేసే 200 మందిని నియమించుకున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

వాహన తనిఖీల విధులూ...

ప్రభుత్వానికి పన్నులు చెల్లించకుండా సరుకు అక్రమ రవాణా చేసే వాహనాల తనిఖీలకు కూడా ఉన్నతాధికారులు తమకు అనుకూల అధికారులనే పంపుతున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. తమ అక్రమాలకు అడ్డుగా ఉంటారన్న ఉద్దేశంతో వాహన తనిఖీల విధుల నుంచి జీఎస్టీవోలను తప్పించి.. డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్, అసిస్టెంట్ కమిషనర్లను పంపిస్తున్నారని చెబుతున్నారు.

అనధికారికంగా సీఆర్‌యూ..

రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వాణిజ్య పన్నుల శాఖ సర్కిల్ కార్యాలయాల్లో నిర్వహించే రిజిస్ట్రేషన్ ప్రక్రియను కూడా ఆ శాఖ ఉన్నతాధికారులు తమ అధీనంలోకి తీసుకున్నారు. జీఎస్టీ చట్టం అమలులోకి వచ్చాక లైసెన్సులు మంజూరు చేయడం మొదలుకొని పన్నుల చెల్లింపు వరకు మొత్తం కార్యకలాపాలన్నీ ఆన్‌లైన్‌లో సాగించేలా మార్పులు చేశారు. కొత్తగా వ్యాపారం పెట్టాలనుకునేవారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకుంటే చాలు జీఎస్టీ అధికారులు ఎలాంటి పరిశీలన లేకుండానే ఆన్‌లైన్‌లోనే లైసెన్సు మంజూరు చేసేస్తున్నారు. ఈ విధానంలో అక్రమాలు ఎక్కువగా జరుగుతున్నాయనే కారణాన్ని బూచిగా చూపించి రిజిస్ట్రేషన్ల ప్రక్రియ మొత్తాన్ని కేంద్రీకృతం చేస్తూ వాణిజ్య పన్నుల శాఖ చీఫ్ కమిషనర్ కార్యాలయంలో గత ఏడాది ఏప్రిల్ ఒకటో తేదీన సెంట్రల్ రిజిస్ట్రేషన్ యూనిట్ (సీఆర్‌యూ)ను అనధికారికంగా ఏర్పాటు చేశారు. ఇందులో వివిధ కేడర్ల అధికారులతో పాటు అవసరమైన సిబ్బందిని నియమించారు. ఉన్నతాధికారులు తమకు అనుకూలంగా ఉండేవారినే నియమించుకున్నారనే విమర్శలు ఉన్నాయి. దూర ప్రాంతాల్లోని వ్యాపారులు రిజిస్ట్రేషన్లతో సహా ప్రతి అవసరానికి చీఫ్ కమిషనర్ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తోంది. తీరా వచ్చిన తర్వాత ఇక్కడ ఏ అధికారితో తమ పని పూర్తవుతుందో తెలియక అనేక ఇబ్బందులు పడుతున్నారు. ఇలాంటి ఇబ్బందులు, విమర్శలు వస్తున్నా గత ప్రభుత్వంలో అనధికారికంగా ఏర్పాటు చేసిన ఈ సీఆర్‌యూను అధికారికంగా కొనసాగించే అంశాన్ని పరిశీలించాలని వాణిజ్య పన్నుల శాఖ ప్రధాన కమిషనర్ ఇటీవల రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. ప్రభుత్వం దానిని నోటిఫై చేస్తూ ఉత్తర్వులు కూడా జారీ చేసింది. గత ప్రభుత్వంలో ఉద్దేశపూర్వకంగా చేసిన విధానపరమైన తప్పిదాలను కూటమి ప్రభుత్వం కూడా కొనసాగిస్తుందనే విమర్శలు వస్తున్నాయి.

ఆ పోస్టులను భర్తీ చేయరే?

'సరైన వ్యక్తులు.. సరైన చోట ఉంటేనే మెరుగైన ఫలితాలు సాధించగలుగుతాం. దీనిపై కసరత్తు చేయండి' అని ముఖ్యమంత్రి చెబుతుంటే.. రాష్ట్ర ప్రభుత్వానికి పన్నుల రూపంలో అత్యధిక ఆదాయాన్ని ఇచ్చే కీలకమైన విశాఖపట్నం 2, విజయవాడ 2 డివిజన్లకు ఏడాది కాలంగా జాయింట్ కమిషనర్లనే నియమించలేదు. రాష్ట్రం మొత్తమ్మీద వచ్చే జీఎస్టీ ఆదాయంలో 40 శాతానికిపైగా ఈ రెండు ప్రధాన నగరాల నుంచే వస్తోంది. ఇంతటి కీలకమైన నగరాల్లో జీఎస్టీ జాయింట్ కమిషనర్ పోస్టులను భర్తీ చేయకపోవడానికి కారణాలేంటో వాణిజ్య పన్నుల శాఖ ఉన్నతాధికారులే చెప్పాలి. ఇంకా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 16 డివిజన్ కార్యాలయాలు, 109 సర్కిల్ కార్యాలయాల్లో 6 డిప్యూటీ కమిషనర్లు, 30కి పైగా రెగ్యులర్ అసిస్టెంట్ కమిషనర్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ ఖాళీలను భర్తీ చేస్తే.. వాటి పరిధిలో ఉన్న కింది స్థాయి పోస్టులు కూడా ఆటోమేటిక్‌గా భర్తీ అయ్యి పనులు సకాలంలో పూర్తవుతాయి. జీఎస్టీవోలు(ఏసీటీవోలు)గా, డిప్యూటీ అసిస్టెంట్ కమిషనర్లుగా 15 ఏళ్ల నుంచి పనిచేస్తున్న వారిలో ఇప్పటికీ పదోన్నతులు రానివారు పెద్దసంఖ్యలో ఉన్నారు. విచిత్రమేమంటే.. జూనియర్, సీనియర్ అసిస్టెంట్లకు 2017 నుంచి ఇప్పటి వరకు కూడా జీఎస్టీ పోర్టల్‌లో పని చేసేందుకు లాగిన్లు కూడా ఇవ్వలేదు. పైఅధికారుల ఐడీలతో లాగిన్ అయ్యి వారు పని చేయాల్సిన దుస్థితి నెలకొంది. ఈ లోపాలను సరిదిద్దేందుకు చర్యలు తీసుకోవాలని పన్నుల శాఖ ఉద్యోగులు ప్రభుత్వాన్ని కోరుతున్నారు.

సాగర్ నిర్వహణ మాకు అప్పగించండి

- 2023 నవంబరుకు ముందున్న పరిస్థితిని పునరుద్ధరించాలి
- కృష్ణాబోర్డును కోరిన తెలంగాణ

హైదరాబాద్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : నాగార్జునసాగర్ ప్రాజెక్టు నిర్వహణను తమకు అప్పగించాలని తెలంగాణ కోరింది. కృష్ణానది యాజమాన్య బోర్డు ప్రత్యేక సమావేశం శుక్రవారం వర్చువల్ విధానంలో జరిగింది. ఢిల్లీ నుంచి కృష్ణాబోర్డు ఛైర్మన్ అతుల్ జైన్ హాజరుకాగా.. అమరావతి నుంచి ఏపీ జల వనరుల శాఖ ఈఎన్‌సీ కె. నర్సింహమూర్తి, తెలంగాణ నుంచి ఈఎన్‌సీ(జనరల్) మహ్మద్ అంజద్ హుస్సేన్ హాజరయ్యారు. నాగార్జునసాగర్ నిర్వహణను పూర్తిగా తెలంగాణకే అప్పగించాలని, ఆపరేషన్ అండ్ మెయింటెనెన్స్(ఓ అండ్ ఎం) పనులు రాష్ట్రమే చూస్తుందని, డ్యామ్ నిర్వహణ, రక్షణ అవసరాల నేపథ్యంలో తమకే అప్పగించాలని తెలంగాణ ఈఎన్‌సీ(జనరల్) మహ్మద్ అంజద్ హుస్సేన్ కోరారు. జాతీయ ఆనకట్టల భద్రత సంస్థ(ఎన్‌డీఎస్‌ఏ)కు చెందిన ధర్మ వెబ్‌సైట్ ప్రకారం కూడా తెలంగాణ నిర్వహణలోనే సాగర్ ఉండాలని ఉందని గుర్తుచేశారు. సాగర్‌పై 2023 నవంబరు 29వ తేదీకి ముందున్న పరిస్థితిని పునరుద్ధరించాలని తెలంగాణ విజ్ఞప్తి చేసింది. ఈ నెలాఖరు వరకే సీఆర్‌పీఎఫ్ సాగర్ రక్షణ బాధ్యతలు చూడనుందని, ఆ తర్వాత తమకు అప్పగిస్తే తాము బలగాలను మోహరిస్తామని నివేదించారు. దాంతో కృష్ణా బోర్డు ఛైర్మన్ అతుల్‌జైన్ స్పందిస్తూ.. ఈమేరకు కేంద్ర జలశక్తి శాఖకు నివేదిక ఇస్తానని బదులిచ్చారు. దీనిపై ఏపీ ఈఎన్‌సీ కె.నర్సింహమూర్తి స్పందిస్తూ.. 2025 డిసెంబరు నెలాఖరుదాకా సాగర్ రక్షణ బాధ్యతలు చూడటానికి సీఆర్‌పీఎఫ్ సుముఖత చూపుతూ సమాచారం ఇచ్చిందని, ఈ నేపథ్యంలో యథాతథ స్థితిని కొనసాగించాలని కోరారు. డిసెంబరు తర్వాత సాగర్ నిర్వహణపై చర్చిద్దామని ఏపీ స్పష్టం చేసింది. ఇక కృష్ణాబోర్డు ఉద్యోగులు ఇన్సెంటివ్ రూపంలో పొందిన మొత్తాన్ని రికవరీ చేయరాదనే హైకోర్టు తీర్పునకు బోర్డు ఆమోదం తెలిపింది. ఇక ముందు ఇన్సెంటివ్‌ను వర్తింపచేయబోమని ప్రకటించింది. తాము కూడా అంతర్రాష్ట్ర విభాగానికి ఇప్పటిదాకా ఇస్తున్న ఇన్సెంటివ్‌ను రద్దు చేస్తామని ఏపీ తెలిపింది.

'ఉపాధి'లో చేసిన పనులే మళ్లీ మళ్లీ!

- ప్రతి పనికీ జియో ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి
- కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ ఆదేశాలు

అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో ఒకసారి చేసిన పనులే మళ్లీ మళ్లీ వేర్వేరు పేర్లతో, అదే ప్రాంతంలో చేస్తున్నారని, దీనిని అరికట్టేందుకు జియో ఫెన్సింగ్ చేయాలని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ జాయింట్ సెక్రటరీ రోహిణి ఆర్ భజిభకరే అన్ని రాష్ట్రాల అధికారులను ఆదేశించారు. 10 మీటర్ల పరిధిలో జియోఫెన్సింగ్ చేయడం ద్వారా దీనిని నియంత్రించవచ్చన్నారు. దీనిపై సిబ్బందికి వెంటనే శిక్షణ ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పథకం అమలు తీరుపై రోహిణీ ఇటీవల అన్ని రాష్ట్రాల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఉపాధి పథకంలో ఏడు రిజిస్టర్ల నిర్వహణ మరింత మెరుగుపడాలని, బిల్లులు, పన్ను రశీదులు, రాయల్టీ రశీదులకు సంబంధించిన వివరాలు తనిఖీల్లో కనిపించట్లేదన్నారు. పలు రాష్ట్రాల్లో మెటీరియల్ పనుల కోసమే శ్రామికులకు పనులు కల్పిస్తున్నారన్నారు. అధిక పని దినాల కల్పన జరుగుతున్న తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు పలు సూచనలు ఇచ్చారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరకే కోకో గింజల కొనుగోలు

- కిలోకు రూ.500 చెల్లిస్తున్న కంపెనీలు

అమరావతి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కోకో రైతుల సమస్య దాదాపు పరిష్కారమైంది. ప్రభుత్వం నిర్ణయించిన ధరకు పలు కంపెనీలు కోకో గింజలు కొనుగోలు చేస్తున్నాయి. కిలోకు రూ.500 చొప్పున కంపెనీలు రైతులకు చెల్లిస్తే.. అందులో రూ.50 సదరు కంపెనీలకు రాష్ట్ర ప్రభుత్వం తిరిగి చెల్లిస్తోంది. ఈ ఏడాది కోకో ధరలు పడిపోయి రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో ప్రభుత్వం జోక్యం చేసుకుని, కనీస మద్దతు ధరను నిర్ణయించింది. అయినా అన్ని కంపెనీలు, వ్యాపారులు కోకో గింజల కొనుగోలుకు ముందుకు రాకపోవడంతో సీఎం చంద్రబాబు ధరలపై సమీక్ష జరిపారు. సేకరణ ధరలో కిలోకి రూ.50 ప్రభుత్వం భరిస్తుందని ప్రకటించారు. మంత్రి అచ్చెన్నాయుడు పలు దఫాలు చర్చలు జరిపి మాండలీస్, డీపీ చాకొలెట్స్ వంటి కంపెనీలను ఈ మేరకు ఒప్పించారు. దీంతో ఏలూరు, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, కోనసీమ, కృష్ణా, ఎన్టీఆర్, కాకినాడ, మన్యం, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాలకు చెందిన 3,394 మంది రైతుల నుంచి 2,228 టన్నుల కోకో గింజలను కొనుగోలు చేయగా.. ఇందుకోసం ప్రభుత్వం రూ.3 కోట్లు విడుదల చేసిందని ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాసులు శనివారం తెలిపారు.

పరిశోధనలతో ఆర్థిక వ్యవస్థ ఉత్తేజితం

- మనది మూడో అతిపెద్ద అంకుర వ్యవస్థ
- నీతి ఆయోగ్ సభ్యుడు వీకే సారస్వత్



రాజానగరం, జూన్ 28(ఆంధ్రజ్యోతి): పరిశోధనల ద్వారా ఆర్థిక వ్యవస్థ ఉత్తేజితమవుతుందని, తద్వారా దేశం గ్లోబల్ లీడర్‌గా మార్పు చెందుతుందని నీతి ఆయోగ్ సభ్యుడు, ప్రఖ్యాత మిస్సైల్ శాస్త్రవేత్త, పద్మభూషణ్ అవార్డు గ్రహీత వీకే సారస్వత్ అన్నారు. తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం వెలుగుబందలోని గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం(జీజీయూ)లో వికసిత్ భారత్-2047 లక్ష్యానికి అనుగుణంగా భారత ప్రభుత్వం.. రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి 'వికసిత్ భారత్ ఎట్ 2047 కోసం పరిశోధన, ఆవిష్కరణను ఉపయోగించడం' అనే అంశంపై రెండు రోజుల పాటు జరిగే జాతీయ సదస్సు శనివారం ప్రారంభించారు. జీజీయూ చాన్సలర్ కేవీవీ సత్యనారాయణరాజు (చైతన్యరాజు)అధ్యక్షతన జరిగిన ఈ సదస్సులో సారస్వత్ ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. 30 ట్రిలియన్ల ఆర్థిక వ్యవస్థగా రూపొందడం, రక్షణ, శాస్త్ర సాంకేతిక రంగాల్లో స్వయం సమృద్ధి సాధించడం, సుస్థిరతను కార్బన్ న్యూట్రాలిటీని సాధించడం వంటి లక్ష్యాలను వికసిత్ భారత్‌లో ప్రధాని మోదీ నిర్దేశించినట్లు సారస్వత్ తెలిపారు. వీటి సాధనకు పరిశోధనలు అవసరమన్నారు. మనం డిజిటల్ ఎకానమీపై దృష్టి సారించాలని, 2030 నాటికి ఒక ట్రిలియన్ డిజిటల్ ఎకానమీ లక్ష్యాన్ని చేరుకోవాలని అభిలషించారు. ప్రభుత్వం చేపట్టిన చర్యల వల్ల 2014లో ప్రపంచ ఇన్నోవేషన్ ఇండెక్స్ (జీఐఐ)లో 76వ స్థానంలో ఉన్న దేశం ప్రస్తుతం 39వ స్థానానికి చేరుకుందని తెలిపారు. ప్రస్తుతం మనది మూడో అతిపెద్ద అంకుర వ్యవస్థ అని, 2023లో గంటకు మూడు చొప్పున స్టార్టప్స్ నమోదయ్యాయని, ప్రస్తుతం 118 యూనికార్న్ స్టార్టప్‌లు ఉన్నాయని వెల్లడించారు. కార్యక్రమంలో జీజీయూ ప్రో చాన్సలర్ కె.శశికిరణ్ వర్మ, వైస్ చాన్సలర్ యు.చంద్రశేఖర్, ప్రో వైస్ చాన్సలర్ కేవీబీ రాజు తదితరులు పాల్గొన్నారు.

జడ్పీ పరిధిలో కారుణ్య నియామకాలు చేపట్టాలి

గుంటూరు(తూర్పు), జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కరోనా సమయంలో మృతి చెందిన టీచర్ల కుటుంబాలకు వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద జెడ్పీ పరిధిలో కారుణ్య నియామకాలు చేపట్టాలని ఏపీజేఏసీ అమరావతి రాష్ట్ర చైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని కోరారు. గుంటూరులో శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. కరోనా సమయంలో 2744 మంది ప్రభుత్వ ఉద్యోగులు మరణించగా, వారి కుటుంబాల్లో 1488 మందికి కారుణ్య నియామకాలు కింద ఉద్యోగాలు కల్పించారని గుర్తుచేశారు. మిగిలిన వారికి వన్ టైమ్ సెటిల్‌మెంట్ కింద కారుణ్య నియామకాల కల్పించారని పేర్కొన్నారు. అయితే, జడ్పీల్లో కారుణ్య నియామకాలు ఆయా డిపార్ట్‌మెంట్‌లలో మాత్రమే కల్పించాలనే క్లాజ్ చేర్చడంతో ఈ ప్రక్రియ నిలిచిపోయిందని తెలిపారు.

తిరుమల యాత్రికులకు బీమా!

(మొదటి పేజీ తరువాయి)

టికెట్ గానీ, టైమ్ స్లాట్ టోకెన్ గానీ లేకుండా వచ్చే సర్వదర్శనం భక్తుల మాటేమిటి? అంటూ తర్జనభర్జనలు సాగుతున్నాయి. ఈ నెల 17న తిరుమలలో జరిగిన టీటీడీ పాలకమండలి అత్యవసర సమావేశంలో అజెండాతో సంబంధం లేకుండా తిరుమల యాత్రికులకు బీమా సదుపాయం కల్పించడంపై కొందరు పాలకవర్గ సభ్యులు, అధికారుల మధ్య చర్చ జరిగినట్టు సమాచారం. తిరుమల వచ్చి వెళుతున్న భక్తులు అనారోగ్యం బారిన పడినా, గాయపడినా ఇప్పటి వరకూ వైద్య సదుపాయం కల్పిస్తున్నారు. అలాగే ఎవరైనా అనారోగ్యంతోనో లేక ప్రమాదాల్లోనో మరణిస్తే ఎక్స్‌గ్రేషియా తరహాలో ఆర్థిక సాయం అందిస్తున్న ఉదాహరణలూ ఉన్నాయి. తిరుమల ఘాట్ రోడ్డులో తరచూ ప్రమాదాలు జరిగి పలువురు గాయపడుతున్నారు. అరుదుగా మరణాలు కూడా సంభవిస్తున్నాయి. వీటికి తోడు నడక దారిలో వన్యప్రాణుల మూలంగా భక్తులకు ప్రమాదం పొంచి ఉంటోంది. అయితే ఈ ఘటనల్లో ఎప్పుడూ టీటీడీ పెద్దగా ఒత్తిడికి లోనుకాలేదు. బీమా సదుపాయం గురించి ఆలోచించింది లేదు. అయితే ఈ ఏడాది జనవరిలో తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటన టీటీడీని కుదిపివేసింది. ఆ ఘటనలో మరణించిన వారి కుటుంబాలకు, గాయపడిన వారికి టీటీడీ ఆర్థిక సాయం చేసింది. అప్పటి నుంచే యాత్రికులకు బీమా సదుపాయం కల్పించాలన్న ఆలోచన మొదలైంది. కాకపోతే దానిపై సీరియస్‌గా దృష్టి సారించలేదు. అధికారులు, పాలక మండలి సభ్యుల మధ్య మాత్రం తరచుగా ఈ విషయమై చర్చ మాత్రం నడుస్తోంది.

టీటీడీపై పెనుభారం

తిరుమలకు రోజువారీ సగటున 70 వేల నుంచి 80 వేల మంది భక్తులు వస్తుంటారు. వారాంతాల్లో, సెలవు దినాలు, ప్రత్యేక దినాల్లో ఈ సంఖ్య లక్ష దాటుతుంది. అంతమందికి బీమా సదుపాయం కల్పించడం సాధ్యమేనా అన్న ప్రశ్న టీటీడీ వర్గాలను వేధిస్తోంది. ఎందుకంటే ప్రతి భక్తుడి తరఫునా బీమా కంపెనీలకు టీటీడీనే ఏడాది పొడవునా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుంది. ఆర్థికంగా టీటీడీపై ఇది పెనుభారం మోపే అవకాశముంది. అలాగే తిరుమలకు వచ్చే యాత్రికులకు ఏ ప్రాతిపదికన బీమా కల్పించాలన్నది కూడా ప్రధాన ప్రశ్నే. శ్రీవారి మెట్టు, అలిపిరి నడక దారి, ఘాట్ రోడ్డు.. ఇలా మూడు మార్గాల్లో యాత్రికులు తిరుమల వెళ్తున్నారు. ఈ మూడు చోట్లా ప్రతి యాత్రికుడి వివరాలనూ టీటీడీ నమోదు చేయాల్సి ఉంటుంది. యాత్రికుల పేర్లు, చిరునామా, ఆధార్ నంబరు, మొబైల్ నంబరు వంటి వివరాల నమోదుకు సమయం పడుతుంది. అప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదుకు ప్రత్యేక సాఫ్ట్‌వేర్ అవసరం. ఈ పని కోసం విడిగా యంత్రాంగం సైతం కావాల్సి ఉంటుంది. ఇదంతా టీటీడీపై అదనంగా భారం మోపే అంశాలే. ఆన్‌లైన్‌లో బుక్ చేసుకునే భక్తులు, సిఫారసు లేఖలతో వెళ్లేవారు, టైమ్ స్లాట్ బుకింగ్‌తో వెళ్లేవారికి చేతిలో ఏదో ఒక ఆధారం ఉంటుంది. అయితే ఉచిత లేదా సర్వదర్శనం క్యూలో వెళ్లే యాత్రికుల వద్ద ఎలాంటి రశీదులూ, ఆధారాలూ ఉండవు. వీరు ఆధార్ కూడా వెంట తెచ్చుకునే పరిస్థితి ఉండదు. అలాంటి వారికి బీమా కల్పించడం సాధ్యమేనా? అని చర్చ నడుస్తోంది.

ఇంకా ఆలోచన దశలోనే..

యాత్రికులకు బీమా అంశం టీటీడీలో ప్రస్తుతానికి ఆలోచన దశలోనే ఉంది. ఇంకా ప్రతిపాదనగా రూపు దిద్దుకోలేదు. టీటీడీ ఉన్నతాధికారులు, పాలకవర్గం సీరియస్‌గా తీసుకుని ముందుగా దానిపై లోతైన కసరత్తు చేయాల్సి ఉంటుంది. ఆ తర్వాతే ప్రతిపాదన రూపొందించాల్సి ఉంది. ఆపై ప్రభుత్వ అనుమతితో గానీ అమలు చేసే పరిస్థితి లేదు. ఇప్పటికే గత వైసీపీ ప్రభుత్వంలో ఆర్థిక క్రమశిక్షణ గాడితప్పిన నేపథ్యంలో టీటీడీ యంత్రాంగం బీమా సదుపాయ కల్పన గురించి ఎంతవరకూ ముందుకు వెళ్తుందో వేచి చూడాలి.

బీజేపీ రాష్ట్ర సారథి ఎవరు?

- నేడు షెడ్యూల్.. జూలై 1న ఫైనల్
- అధ్యక్ష పీఠం కోసం ఆశావహుల క్యూ
- సుజనా, పార్థసారథి, మాధవ్ యత్నం
- రేసులో మాజీ సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి
- పురందేశ్వరి కొనసాగింపుపైనా చర్చ

అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): "బీజేపీ రాష్ట్ర సారథి ఎవరు?. పార్టీ పగ్గాలు ఎవరికి దక్కుతాయి." ఇదీ.. రాష్ట్ర బీజేపీ నేతలు, కార్యకర్తల్లో గత కొన్ని రోజులుగా జరుగుతున్న చర్చ. ఎట్టకేలకు ఈ చర్చకు ముగింపు పలుకుతూ అధ్యక్ష ఎన్నిక ప్రక్రియపై రాజ్యసభ సభ్యుడు పాకా సత్యనారాయణ శనివారం విజయవాడలో ప్రకటన చేశారు. ఆదివారం(29వ తేదీ) షెడ్యూల్ విడుదల చేస్తామని, 30న నామినేషన్లు స్వీకరించి అదే రోజు సాయంత్రానికి ఉపసంహరణ గడువు విధిస్తామని చెప్పారు. జూలై 1న రాష్ట్ర అధ్యక్షుడి ఎన్నిక జరుగుతుందన్నారు. అదే రోజు సా యంత్రం నూతన అధ్యక్షుడి పేరు వెల్లడిస్తామని చెప్పారు. అయితే, ఈ ఏడాది జనవరి ఆఖర్లో జరగాల్సిన బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నిక ప్రక్రియ పార్లమెంటు సమావేశాలు, పహల్గాం ఉగ్రదాడి తదితర కారణాలతో వాయిదా పడింది. దేశవ్యాప్తంగా పది రాష్ట్రాల అధ్యక్షులతో పాటు జాతీయ అధ్యక్షుడిని కూడా తాజాగా ఎన్నుకోనున్నారు. 2023, జూలైలో రాష్ట్ర బీజేపీ సారథ్యం చేపట్టిన దగ్గుబాటి పురందేశ్వరిని కూడా మార్చబోతున్నట్లు పార్టీలో కొందరు చెబుతుండగా ఆమెను కొనసాగించే అవకాశం లేకపోలేదనే వారూ ఉన్నారు. గత సెప్టెంబరు నుంచి నవంబరు వరకు పార్టీ సభ్యత్వం పూర్తి చేసి గ్రామ, వార్డు, మండల కమిటీలు పూర్తి చేశాక జిల్లాల అధ్యక్షుల నియామకం కూడా పూర్తి అయింది. మరో వైపు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడిగా కొత్త వ్యక్తిని జాతీయ నాయకత్వం నియమించడం దాదాపు ఖరారైనట్లు భావిస్తున్నారు. ఈ క్రమంలో సుమారు పది మంది వరకు ఆశావాహులు పార్టీ అధ్యక్షుడి పదవి కోసం పోటీ పడుతున్నారు. విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి, ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, విశాఖకు చెందిన మాజీ ఎమ్మెల్సీ మాధవ్, అదేవిధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి పేర్లు ప్రముఖంగా ప్రచారంలో ఉన్నాయి. ప్రస్తుత అధ్యక్షురాలి సామాజిక వర్గానికి చెందిన సుజనా చౌదరికి అధ్యక్ష బాధ్యతలు అప్పగిస్తే బాగుంటుందని, పార్టీకి నిధుల కొరత కూడా ఉండబోదనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. అయితే, బీసీ వర్గానికి అవకాశం ఇవ్వాలనే వాదనతో పార్థసారథి పేరు ప్రచారంలోకి వచ్చింది. తెలంగాణకు చెందిన ఒక రాజ్యసభ సభ్యుడు సారథి కోసం జాతీయ స్థాయిలో ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇక, రాయల సీమకు చెందిన బీసీ నాయకుడికి మంత్రి(సత్య కుమార్) పదవి, రెండు రాజ్యసభకు సీట్లు కూడా బీసీ(ఆర్. కృష్ణయ్య, పాకా సత్యనారాయణ)లకే ఇచ్చినందున మరో బీసీ నేతకే రాష్ట్ర అధ్యక్షుడి పదవి ఇస్తారా.? అనే చర్చ కూడా నడుస్తోంది. అదే ప్రామాణికతను పాటిస్తే ఉత్తరాంధ్ర నుంచి పీవీఎన్ మాధవ్ లాంటి వారిని పరిగణనలోకి తీసుకునే అవకాశం ఉందని సీనియర్ నాయకులు భావిస్తున్నారు. ఇప్పటికే పార్టీ ముఖ్యులతో చర్చించి అభిప్రాయాలు తీసుకున్న రాష్ట్ర పార్టీ సహ ఇన్‌చార్జి శివప్రకాశ్‌కు కొందరు ఆశావాహులు తమకు అవకాశం కల్పించాలని కోరినట్లు తెలిసింది. అయితే, బీజేపీ జాతీయ నాయకులు మాత్రం ఎవరికీ ఎలాంటి హామీ ఇవ్వడం లేదు. మరోవైపు రాష్ట్ర మంత్రి సత్య కుమార్ మూడు రోజులుగా ఢిల్లీలోనే మకాం వేయడం గమనార్హం. ఇదిలావుంటే, సీమకు చెందిన మాజీ సీఎం కిరణ్ కుమార్ రెడ్డి గత ఎన్నికల్లో రాజంపేట నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ తర్వాత ఆయనకు ఎలాంటి పదవీ దక్కలేదు. వైసీపీని కట్టడి చేసేందుకు, రెడ్డి సామాజిక వర్గాన్ని ఆకర్షించేందుకు కిరణ్‌కుమార్ వంటి వారికి అవకాశం ఇచ్చే చాన్స్ లేకపోలేదని పార్టీ వర్గాల్లో చర్చ సాగుతుండడం గమనార్హం.

ఆరోగ్యాంధ్ర సాకారమే లక్ష్యం

- టైమ్స్‌నౌ హెల్త్ కాంక్లేవ్‌లో మంత్రి సత్యకుమార్

న్యూఢిల్లీ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్‌లో గత వైసీపీ ప్రభుత్వ ఐదేళ్ల పాలనతో అవసాన దశలోకి చేరిన ఆరోగ్య రంగానికి ఆయువు పోస్తున్నామని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ తెలిపారు. ఆరోగ్యాంధ్రప్రదేశ్ సాకారమే తమ లక్ష్యమని, దానికోసం అహర్నిశలు కృషి చేస్తున్నామని పేర్కొన్నారు. శనివారం ఢిల్లీలో జరిగిన టైమ్స్‌నౌ నేషనల్ డాక్టర్స్ డే కాంక్లేవ్ 8వ ఎడిషన్‌లో ఆయన ప్రసంగించారు. ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు నాయకత్వంలో వికసిత్ భారత్, స్వర్ణాంధ్ర లక్ష్యాలను సాధించేందుకు, ఆరోగ్య, సంపన్న, సంతోషకరమైన ఆంధ్రప్రదేశ్‌ను నిర్మించేందుకు నిబద్ధతతో పనిచేస్తున్నామని తెలిపారు. ఏపీలో ఏడాది క్రితం వరకు ఆరోగ్య రంగం అవసాన దశలో ఉందని, ఏడాది పాలనలో దాన్ని బలోపేతం చేసేందుకు సంస్కరణలు తీసుకొచ్చామని పేర్కొన్నారు. రాబోవు 2-3 ఏళ్లలో పీపీపీ మోడల్‌లో మరిన్ని ఆరోగ్య సంస్థలను ఏర్పాటు చేస్తామని వెల్లడించారు. ఎన్‌టీఆర్ వైద్యసేవను ఆయుష్మాన్ భారత్‌తో అనుసంధానం చేశామన్నారు. ఆర్థిక సమస్యల కారణంగా ఎవరూ ఆరోగ్య సంరక్షణకు దూరం కాకూడదనేదే తమ ప్రభుత్వ లక్ష్యమని చెప్పారు.

ప్రమోషన్స్ పూర్తిచేసి బదిలీలు చేయాలి

- వార్డు సచివాలయ రాష్ట్ర జేఏసీ

విజయవాడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్లు పూర్తయినా సచివాలయ ఉద్యోగులకు ప్రమోషన్స్ లేవని, ప్రమోషన్ ప్రక్రియ పూర్తయిన తరువాతే ట్రాన్స్‌ఫర్స్ ఇవ్వాలని వార్డు సచివాలయ రాష్ట్ర జేఏసీ చైర్మన్ బి.గంటయ్య ఒక ప్రకటనలో ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. రేషనలైజేషన్, ప్రమోషన్ విధానం ప్రకారమే గ్రామవార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలు చేపట్టాలని కోరారు. పాఠశాలలు తెరిచిన సమయంలో బదిలీలు చేపడితే కష్టమవుతుందని అభిప్రాయం వ్యక్తం చేశారు.

సివిల్ వివాదాల్లో జాగ్రత్తలు పాటించాలి : జస్టిస్ భానుమతి



జ్యోతి ప్రజ్వలన చేసి వర్క్‌షాపును ప్రారంభిస్తున్న హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి

కర్నూలు లీగల్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సివిల్ వివాదాల పరిష్కారంలో తీసుకోవాల్సిన విధి విధానాలపై జాగ్రత్తలు తీసుకోవాలని ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ బీఎస్ భానుమతి అన్నారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలోని న్యాయాధికారులకు శనివారం స్థానిక జిల్లా కోర్టులో రెండో జిల్లాస్థాయి వర్క్‌షాపును ఆమె జ్యోతి వెలిగించి ప్రారంభించారు. సివిల్ ప్రొసీజర్ కోడ్‌లోని సెక్షన్-9, లోక్‌అదాలత్ తీర్పులపై ఒకరోజు వర్క్ షాపులో ఆమె మాట్లాడుతూ లోక్‌అదాలత్ తీర్పులు అమలయ్యేందుకు గట్టిగా కృషి చేయాలని కోరారు. హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ వి.రాధాకృష్ణ కృపాసాగర్, విశ్రాంత జిల్లా న్యాయాధికారి టి.వేణుగోపాల్‌రావు రిసోర్స్ పర్సన్స్‌గా ఈ విధి విధానాలను వివరించారు.

తిరుమలలో సర్వదర్శనానికి 16గంటలు

తిరుమల, జూన్28(ఆంధ్రజ్యోతి): తిరుమలలో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్-2లోని 31 కంపార్టుమెంట్లతో పాటు నారాయణగిరి ఉద్యానవనంలోని 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వీరికి 16 గంటల దర్శన సమయం పడుతోంది. శ్రీవారి ఆలయ ప్రాంతంతో పాటు మాడవీధులు, కాటేజీలు, అఖిలాండం, లడ్డూ కేంద్రం వంటి ప్రాంతాలు రద్దీగా మారాయి. అలాగే గదులకు కూడా డిమాండ్ పెరిగింది.

శ్రీవారి సేవలో హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతి



తిరుమల ఆలయం వద్ద కుటుంబంతో జస్టిస్ సుమతి

తిరుమల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఏపీ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ సుమతి శనివారం ఉదయం వీఐపీ బ్రేక్ సమయంలో కుటుంబ సమేతంగా తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. రంగనాయక మండపంలో వేదపండితులు ఆశీర్వదించగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు.

భాస్కర నాయుడిని కాటేసిన నాగుపాము

- ఆస్పత్రిలో వెంటిలేటర్‌పై టీటీడీ ఉద్యోగికి చికిత్స
- ఇప్పటి వరకు 14 వేల పాములు పట్టిన ఘనత



తిరుమలలో పామును పట్టుకున్న భాస్కర నాయుడు (ఫైల్)

తిరుమల, జూన్ 28(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తులకు పాముల బెడద లేకుండా చేసే టీటీడీ ఉద్యోగి భాస్కర నాయుడు.. పామును పట్టే క్రమంలో మళ్లీ పాము కాటుకు గురయ్యారు. తిరుమలలోని గోగర్భం డ్యాం సమీపంలోని గార్డెన్‌లో శనివారం నాగుపామును పట్టుకుని బ్యాగులో వేస్తుండగా అతడి ఎడమచేతిపై కాటేసింది. రెండు నిమిషాల్లోనే కుప్పకూలిన భాస్కర నాయుడిని అక్కడి ఉద్యోగులు హుటాహుటిన తిరుమలలోని అశ్విని ఆస్పత్రికి తరలించారు. విషం విరుగుడు మెడిసన్(యాంటీ వీనం) ఇచ్చినప్పటికీ పరిస్థితి విషమంగా మారడంతో వెంటిలేటర్‌పై తిరుపతిలోని అమర ఆస్పత్రికి తరలించి వైద్యం అందిస్తున్నారు. 1982లో టీటీడీ అటవీ శాఖలో కార్మికుడిగా చేరిన భాస్కర నాయుడి నైపుణ్యం గమనించి పాములు పట్టేందుకు ఆయనకు ప్రత్యేక విధులు కేటాయించారు. 2021లో రిటైరైనప్పటికీ కాంట్రాక్ట్ ఉద్యోగిగా మళ్లీ విధుల్లోకి తీసుకున్నారు. ఇప్పటి వరకు ఆయన దాదాపు 14 వేలకు పైగా పాములు పట్టారు. 2022 జనవరిలో ఒకసారి తిరుపతిలో విషపూరితమైన పాము కాటేయడంలో నెలరోజుల పాటు ఆస్పత్రిలో చికిత్స పొంది కోలుకుని మళ్లీ విధుల్లోకి చేరారు. కాగా, ప్రస్తుతం ఆయన కోలుకుంటున్నారని టీటీడీ అటవీ విభాగ అధికారులు తెలిపారు.

అరెస్టయిన ఒక్క రోజులోనే జీవిత ఖైదు!

- భార్యను హత్యచేసి...23ఏళ్ల తర్వాత పట్టుబడ్డ వ్యక్తికి శిక్ష విధిస్తూ తీర్పు



బళ్లారి గాంధీనగర్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): భార్యను హత్యచేసిన కేసులో అరెస్టయిన మరుసటిరోజునే నిందితునికి జీవితఖైదు విధిస్తూ కోర్టు తీర్పు విధించింది. కర్ణాటక రాష్ట్రం రాయచూరు జిల్లా మాన్వి తాలూకా హాలదాళగ్రామానికి చెందిన హనుమంతప్ప హుసేనప్ప గంగావతి నగర పరిధి లక్ష్మీ క్యాంపులో ఉంటూ... 2002లో మూడో భార్యతో గొడవ పడి, ఆమెను చంపేశాడు. మృతదేహాన్ని గోనెసంచిలో కట్టి, బళ్లారి-కంప్లి కేఎస్ ఆర్టీసీ బస్సులో వేసి పారిపోయాడు. 23ఏళ్ల అజ్ఞాతంలో ఉండి 75ఏళ్ల వయస్సులో కొద్ది నెలల క్రితం సొంతూరుకు వచ్చాడు. గంగావతి నగర పోలీసులకు ఈ సమాచారం అందడంతో పాతకేసు తిరగదోడి హనుమంతప్పను గురువారం అరెస్టు చేశారు. ఈ కేసును విచారించిన కొప్పళ జిల్లా సెషన్స్ కోర్టు.. అరెస్టు అయిన మరుసటి రోజు శుక్రవారం హనుమంతప్పకు జీవితఖైదు, రూ.10 వేల జరిమానా విధించింది. న్యాయాధికారి సదానంద నాగప్ప నాయక్ ఈ కేసులో తీర్పునిచ్చారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ



కొత్తపలుకు

■ ఆర్కే RK

మార్చే యత్నం.. మారిన రేవంత్

ఫోన్ ట్యాపింగ్ జాబితాను ప్రతి ఆరు నెలలకు ఉన్నత స్థాయిలో సమీక్షించాలి. ఈ కమిటీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వం వహిస్తారు. ఏయే సందర్భాలలో కాల్ డేటా సేకరించవచ్చు, ఫోన్ ట్యాపింగ్ చేయవచ్చు అన్న విషయమై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన నిబంధనలు విధించి రాష్ట్రాలకు పంపింది. అయినా నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నేతృత్వంలోని కమిటీ ఇవేమీ పట్టించుకోకుండా గుడ్డిగా ఆమోదించింది. అత్యవసర పరిస్థితులలో ఐజీ, ఆ పైస్థాయి అధికారి మాత్రమే ఫోన్ ట్యాపింగ్‌కు అనుమతించవచ్చు. ఈ కేసును సీరియస్‌గా తీసుకొని విచారణ జరిపితే నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆ కమిటీలోని ఇతర అధికారులతో పాటు పలువురు ఐపీఎస్ అధికారులను శిక్షించాల్సి ఉంటుంది. ఈ కారణంగా వారంతా ప్రభుత్వానికి సహాయ నిరాకరణ చేస్తున్నారు. ప్రస్తుతం సిట్‌కు ఏసీపీ స్థాయి అధికారి నేతృత్వం వహిస్తున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఆ స్థాయి అధికారులు ఏం ప్రశ్నించగలరు?

తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో మార్పు కనిపిస్తోంది. ఏడాదిన్నర క్రితం ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన ఆయన ఇంత కాలంగా అనేక సందర్భాలలో టేకిట్ ఈజీ ధోరణి ప్రదర్శించారు. సహచర మంత్రులతో స్నేహపూర్వకంగా వ్యవహరించారు. మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇచ్చారు. ఈ క్రమంలో పలువురు మంత్రులు, అధికారులు అదుపు తప్పారు. ఫలితంగా ముఖ్యమంత్రికి ప్రభుత్వంపై పట్టు రాలేదన్న విమర్శలు వినిపించాయి. దీంతో రేవంత్‌రెడ్డి ఇటీవలి కాలంలో మంత్రులు, శాసనసభ్యులతో కొంత నిర్మొహమాటంగా వ్యవహరించడం మొదలుపెట్టారు. పార్టీపై, ప్రభుత్వంపై పట్టు సాధించే ప్రయత్నాలు ప్రారంభించారు. ఈ మార్పు అకస్మాత్తుగా వచ్చింది కాదు. ముఖ్యమంత్రిలో ఈ తెగింపు రావడానికి కారణం ఏమిటి? ముఖ్యమంత్రిగా తన స్థానం పదిలం చేసుకోవాలని ఎందుకు నిర్ణయించుకున్నారు? అన్న ప్రశ్నలు సహజంగానే తలెత్తుతాయి. ఆయనలో ఈ మార్పు రావడానికి సహచర మంత్రులతో పాటు సొంత పార్టీ నాయకులు, పార్టీ అధిష్ఠానం కూడా కారణమని స్పష్టమవుతోంది. ముఖ్యమంత్రిగా ఆయనకు తగినంత స్వేచ్ఛ ఇవ్వకుండా కాంగ్రెస్ పార్టీ అధిష్ఠానం ఇబ్బందులపాల్జేసింది. దీంతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, పార్టీ అధిష్ఠానానికి మధ్య అంతరం ఏర్పడిందన్న వార్తలు ప్రచారంలోకి వచ్చాయి. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్‌గాంధీ ఆయనకు అపాయింట్‌మెంట్ ఇవ్వడం లేదన్న ప్రచారం కూడా జరిగింది. రేవంత్‌రెడ్డి ఢిల్లీలో ఉన్న సమయంలోనే రాహుల్‌గాంధీ ఆయనను కలుసుకోకుండా పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను కలుసుకోవడం ఈ వార్తలకు బలం చేకూరింది. ఈ క్రమంలో పార్టీ అధిష్ఠానానికి మళ్లీ సన్నిహితం అవడానికి ఆయన తన వంతు ప్రయత్నం చేశారు. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానం కొంత మెత్తబడింది. అయితే, అదే సమయంలో కొంత మంది మంత్రులు, నాయకులు పార్టీ అధిష్ఠానానికి ముఖ్యమంత్రిపై ఫిర్యాదులు చేయడం ఎక్కువైంది. పరిస్థితి ఎంత దూరం వెళ్లిందంటే, రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని మార్చడం అవసరమని కాంగ్రెస్ అగ్రనాయకత్వం అభిప్రాయపడేలా చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ఫైర్ బ్రాండ్ లీడర్‌లా వ్యవహరించిన రేవంత్‌రెడ్డి, ముఖ్యమంత్రిగా ఆ స్థాయిలో వ్యవహరించకపోవడం వాస్తవం. ఇందుకు అనేక కారణాలున్నాయి. వాటిలో ప్రధానమైనది కాంగ్రెస్ అధిష్ఠానమే. కాంగ్రెస్ సంస్కృతిని అవగాహన చేసుకోవడానికి ఆయనకు కొంత సమయం పట్టింది. ముఖ్యమంత్రిగా అనేక పరిమితుల మధ్య పనిచేయవలసి వచ్చింది. అయినా కాంగ్రెస్ అధిష్ఠానం మనసెరిగి వ్యవహరించడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలో ఆయన నాయకత్వ ప్రతిభపై నీలినీడలు కమ్ముకున్నాయి. ముఖ్యమంత్రిగా ఉండి కూడా కొంత మంది మంత్రుల శాఖల్లో జోక్యం చేసుకోలేని విధంగా పార్టీ అధిష్ఠానం ఆరంభంలోనే ఆంక్షలు విధించింది. రేవంత్‌రెడ్డి కూడా కొన్ని సందర్భాలలో తొందరపాటు ప్రదర్శించారు. అందరూ తనవాళ్లే అన్నట్టుగా తన మనసులోని అభిప్రాయాలను అందరి ముందూ బయటపెట్టేవారు. దీంతో పార్టీలోని రేవంత్‌రెడ్డి ప్రత్యర్థులు తమ వ్యూహాలకు పదును పెట్టారు. రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని మార్చాల్సిన అవసరం ఉందని పార్టీ అధిష్ఠానానికి నూరిపోశారు. ఆయన నాయకత్వంలో స్థానిక ఎన్నికలకు వెళ్లలేమని ఫిర్యాదు చేశారు. ఎన్నికల నాటితో పోలిస్తే కాంగ్రెస్ పార్టీ తెలంగాణలో బలహీనపడిందని చెప్పుకొచ్చారు. దీంతో కాంగ్రెస్ అధిష్ఠానం కూడా అలవాటు ప్రకారం అసంతృప్తులనే ప్రోత్సహించింది. ఒక దశలో రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని మార్చే విషయం కూడా పార్టీ అధిష్ఠానం పరిశీలించింది. ఈ అభిప్రాయానికి వచ్చిందే తడవుగా ఢిల్లీ పెద్దలు రంగంలోకి దిగి అత్యంత గోప్యంగా అభిప్రాయ సేకరణకు పూనుకున్నారు. ఎంపిక చేసిన కొంత మందికి, ముఖ్యంగా ఎన్నికలకు ముందు, ఆ తర్వాత ఇతర పార్టీల నుంచి వచ్చి కాంగ్రెస్‌లో చేరిన వారికి ఫోన్లు చేసి ముఖ్యమంత్రిని మారిస్తే ఎలా ఉంటుందంటూ ఆరా తీశారు. అయితే ఈ క్రమంలో కాంగ్రెస్ అధిష్ఠానానికి షాకింగ్ విషయాలు తెలిసొచ్చాయి. రాష్ట్ర నాయకత్వాన్ని మార్చాలన్న పిచ్చి ఆలోచన చేయొద్దు.. అలా చేస్తే ప్రభుత్వం నెల రోజుల్లోనే పతనమవుతుందని ఒక సీనియర్ ఎమ్మెల్యే కుండబద్దలు కొట్టారు. మారిస్తే ప్రభుత్వం ఒక్క రోజు కూడా మనుగడ సాగించలేదు అని మరో సీనియర్ నాయకుడు కూడా తేల్చి చెప్పారు. రేవంత్‌రెడ్డి నాయకత్వంపై నమ్మకంతోనే తాను ప్రతిపక్ష పార్టీ నుంచి గెలిచి కూడా కాంగ్రెస్‌లో చేరానని, రేవంత్‌రెడ్డే లేకపోతే మేం ఈ పార్టీలో ఎందుకుంటామని మరో ఎమ్మెల్యే స్పష్టంచేశారు. నాయకత్వంలో లోపాలు గుర్తిస్తే వాటిని సరిదిద్దుకోవడానికి సలహాలు, సూచనలు ఇవ్వాలి గానీ ఏకంగా నాయకత్వాన్నే మార్చాలనుకోవడం ఆత్మహత్యాసదృశం అవుతుందని క్షేత్ర స్థాయి నుంచి కూడా పార్టీ అధిష్ఠానానికి అభిప్రాయాలు అందాయి. దీంతో రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని మార్చాలన్న అభిప్రాయానికి పార్టీ అధిష్ఠానం స్వస్తి చెప్పింది. ఈ విషయం ముఖ్యమంత్రికి తెలుసో లేదో తెలియదు గానీ ఆయన మాత్రం గేరు మార్చాలన్న నిర్ణయానికి వచ్చారు. ఇటీవలి కాలంలో ఆయనలో ఈ మార్పు స్పష్టంగా కనిపిస్తోంది. మంత్రులతో నిర్మొహమాటంగా వ్యవహరిస్తున్నట్టు చెబుతున్నారు. పార్టీ సమావేశాల్లో కూడా తన మనసులోని మాటను నిర్మొహమాటంగా చెబుతున్నారు. ముఖ్యమంత్రిగా ఆయా శాఖల పనితీరుపై సమీక్షలు మొదలెట్టారు. అదే సమయంలో మంత్రులు తమ పనితీరును మెరుగుపరచుకోవాలని, స్థానిక ఎన్నికల్లో పార్టీని గెలిపించాల్సిన బాధ్యత ఎక్కడికక్కడ మంత్రులపైనే ఉంటుందని స్పష్టంచేస్తున్నారు. విధానపరమైన ప్రకటనలను మంత్రులు తమంతట తాము చేయకుండా పీసీసీ అధ్యక్షుడి ద్వారా కట్టడి చేయించారు. ముఖ్యమంత్రి అనుమతి లేకుండా మంత్రులు విధానపరమైన ప్రకటనలు చేయకూడదని ఆంక్షలు విధించారు. అదే సమయంలో పార్టీ అధిష్ఠానం ఆలోచనలతో సంబంధం లేకుండా తన మానాన తాను పనిచేసుకుపోవాలన్న నిర్ణయానికి ముఖ్యమంత్రి వచ్చినట్టుగా కనిపిస్తోంది. పార్టీపైన, ప్రభుత్వంపైన పట్టు పెంచుకుంటే తన నాయకత్వానికి ఢోకా ఉండదన్న అభిప్రాయానికి రేవంత్ వచ్చారని చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే పార్టీ, ప్రభుత్వ వ్యవహారాల్లో ఆయన స్పీడ్ పెంచారు. తదుపరి దశలో మంత్రులను కట్టడి చేయడంపై ముఖ్యమంత్రి దృష్టిపెడతారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు.

ప్చ్.. అధిష్ఠానం తీరంతే!

రేవంత్‌రెడ్డి విషయం అలా ఉంచితే, జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ ఏమీ మారలేదని ఈ పరిణామాలతో స్పష్టమవుతోంది. పుష్కర కాలం క్రితం కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు ప్రదర్శించిన పెత్తందారీ పోకడలనే ఇప్పుడూ ప్రదర్శిస్తోంది. నిజానికి ఇప్పుడు కాంగ్రెస్ పార్టీ జాతీయ స్థాయిలో కుంచించుకుపోయింది. పలు రాష్ట్రాలలో ఆ పార్టీకి ఉనికి లేదు. సమీప భవిష్యత్తులో కేంద్రంలో అధికారంలోకి వస్తుందన్న విశ్వాసం కాంగ్రెస్ శ్రేణుల్లో నానాటికీ సన్నగిల్లుతోంది. ప్రధాని మోదీ రాజకీయం ముందు ఆ పార్టీ నిలబడలేకపోతోంది. ప్రస్తుతం కర్ణాటక, తెలంగాణ, హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రాలలో మాత్రమే కాంగ్రెస్ అధికారంలో ఉంది. అది కూడా స్థానికంగా బలమైన నాయకులు ఉండటం వల్లనే అక్కడ పార్టీ అధికారంలోకి రాగలిగింది. కర్ణాటకలో అధికారంలోకి రావడానికి భారతీయ జనతా పార్టీ యడియూరప్పను దూరం పెట్టడం ఎంత కారణమో, కాంగ్రెస్ సిద్దరామయ్య నాయకత్వంలో ఉండటం కూడా అంత కారణం. తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి రేవంత్‌రెడ్డే ప్రధాన కారణం. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నియంతృత్వ పోకడలతో తెలంగాణ ప్రజలు విసుగు చెందారు. అయితే కాంగ్రెస్–బీజేపీలో ప్రత్యామ్నాయ పార్టీగా దేన్ని ఎంచుకోవాలో తేల్చుకోలేని స్థితిలో తెలంగాణ సమాజం ఉండింది. ఈ దశలో కాంగ్రెస్ నాయకత్వ పగ్గాలు చేపట్టిన రేవంత్‌రెడ్డి రాజకీయంగా విజృంభించారు. అదే సమయంలో బీజేపీ రాష్ట్ర నాయకత్వం మారడం కూడా కాంగ్రెస్‌కు లాభించింది. ముఖ్యమంత్రి పదవి చేపట్టాలన్న తన లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇదే అదనుగా భావించిన రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో అమీతుమీకి సిద్ధపడ్డారు. ఎన్నికల ఖర్చు కోసం అందినచోటల్లా అప్పులు చేశారు. కాంగ్రెస్ పార్టీ సంస్కృతికి ఆయన కొత్త అయినప్పటికీ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఒంటి చేత్తో పోరాడారు. ప్రజలు కూడా కేసీఆర్‌కు ప్రత్యామ్నాయాన్ని రేవంత్‌రెడ్డిలో చూసుకున్నారు. ఫలితంగా ఏడాదిన్నర క్రితం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 65 స్థానాలు లభించాయి. అభ్యర్థుల ఎంపికలో పార్టీ అధిష్ఠానం ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఉండి వుంటే కాంగ్రెస్ పార్టీకి 70కి పైగా సీట్లు లభించి ఉండేవి.

ఎవరి ఆదేశాలతో, ఎవరి కోసం ఇన్ని వందల ఫోన్లు ట్యాప్ చేశారని సిట్ అధికారులు ప్రశ్నిస్తున్నా ప్రభాకరరావు మౌనాన్నే ఆశ్రయిస్తున్నారు. ఇలా అయితే ప్రస్తుత దర్యాప్తు వృథా ప్రయాసే అవుతుంది. గజం మిథ్య, పలాయనం మిథ్య అన్నట్టుగా ఈ ఎపిసోడ్ మిగలకూడదు అంటే తగు నిర్ణయం తీసుకోవలసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే.

కాంగ్రెస్ విజయం సాధిస్తే రేవంత్‌రెడ్డి ముఖ్యమంత్రి అవుతారన్న అభిప్రాయం సర్వత్రా వ్యాపించింది. అయినా ముఖ్యమంత్రి ఎంపికపై కాంగ్రెస్ లెజిస్లేచర్ పార్టీ అభిప్రాయాలు సేకరించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి పదవి కోసం పోటీపడిన ఒకరిద్దరితో పాటు, వారికి మద్దతు ప్రకటించిన ఐదారుగురిని మినహాయిస్తే మిగతా వారందరూ రేవంత్‌రెడ్డి నాయకత్వాన్ని బలపరిచారు. 2004లో వైఎస్ రాజశేఖరరెడ్డికి ఎటువంటి అనుకూల వాతావరణం ఉందో రేవంత్‌రెడ్డికి కూడా అటువంటి సానుకూల పరిస్థితి వచ్చింది. అయినా ముఖ్యమంత్రి ఎంపికలో కాంగ్రెస్ అధిష్ఠానం కొద్ది రోజులు తాత్సారం చేసింది. ముఖ్యమంత్రిగా రేవంత్‌రెడ్డిని ఎంపిక చేసినా మంత్రివర్గం కూర్పులో ఆయనకు స్వేచ్ఛ ఇవ్వలేదు. మంత్రులుగా ఎవరిని తీసుకోవాలో, వారికి ఏయే శాఖలను కేటాయించాలో కూడా పార్టీ అధిష్ఠానమే నిర్ణయించింది. అదే సమయంలో మంత్రులకు పూర్తి స్వేచ్ఛ ఇవ్వాలని, వారి శాఖల్లో జోక్యం చేసుకోవద్దని షరతు విధించింది. అయినప్పటికీ ముఖ్యమంత్రి అవ్వాలన్న కోరిక ఫలించిన సంతోషంలో రేవంత్‌రెడ్డి ఇవేమీ పట్టించుకోలేదు. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన తర్వాత మంత్రులు, పార్టీలో సీనియర్లను సమన్వయం చేసుకోవడం రేవంత్‌రెడ్డికి తలనొప్పిగా మారింది. ముఖ్యమంత్రిగా ఉండి కూడా వంద కోట్ల రూపాయల బిల్లులను కూడా విడుదల చేయించలేని దుస్థితి నెలకొంది. ఆర్థికమంత్రిగా భట్టి విక్రమార్కకు బిల్లుల చెల్లింపు అధికారం కట్టబెట్టారు. ఏయే శాఖల్లో ఎవరెవరికి ఎంత మొత్తం చెల్లించాలో సంబంధిత శాఖల మంత్రులు సూచిస్తే తదనుగుణంగా బిల్లులు చెల్లించే విధానం అమలు చేస్తున్నారు.

తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి రావడానికి రేవంత్‌రెడ్డే ప్రధాన కారణం. అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ నియంతృత్వ పోకడలతో తెలంగాణ ప్రజలు విసుగు చెందారు. అయితే కాంగ్రెస్–బీజేపీలో ప్రత్యామ్నాయ పార్టీగా దేన్ని ఎంచుకోవాలో తేల్చుకోలేని స్థితిలో తెలంగాణ సమాజం ఉండింది. ఈ దశలో కాంగ్రెస్ నాయకత్వ పగ్గాలు చేపట్టిన రేవంత్‌రెడ్డి రాజకీయంగా విజృంభించారు. అదే సమయంలో బీజేపీ రాష్ట్ర నాయకత్వం మారడం కూడా కాంగ్రెస్‌కు లాభించింది. ముఖ్యమంత్రి పదవి చేపట్టాలన్న తన లక్ష్యాన్ని చేరుకోవడానికి ఇదే అదనుగా భావించిన రేవంత్‌రెడ్డి ఎన్నికల్లో అమీతుమీకి సిద్ధపడ్డారు. ఎన్నికల ఖర్చు కోసం అందినచోటల్లా అప్పులు చేశారు. కాంగ్రెస్ పార్టీ సంస్కృతికి ఆయన కొత్త అయినప్పటికీ ఎన్నికల్లో పార్టీ విజయం కోసం ఒంటి చేత్తో పోరాడారు. ప్రజలు కూడా కేసీఆర్‌కు ప్రత్యామ్నాయాన్ని రేవంత్‌రెడ్డిలో చూసుకున్నారు. ఫలితంగా ఏడాదిన్నర క్రితం జరిగిన ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి 65 స్థానాలు లభించాయి. అభ్యర్థుల ఎంపికలో పార్టీ అధిష్ఠానం ఒత్తిళ్లకు తలొగ్గకుండా ఉండి వుంటే కాంగ్రెస్ పార్టీకి 70కి పైగా సీట్లు లభించి ఉండేవి.

ఇటువంటి సవాలక్ష పరిమితులు ఉన్నప్పటికీ పార్టీ అధిష్ఠానం పట్ల విధేయతతో రేవంత్‌రెడ్డి సర్దుకుపోయారు. అధిష్ఠానం చెప్పిన విధంగా నడుచుకున్నారు. ఈ క్రమంలో ముఖ్యమంత్రిగా ఆయన రెండు మూడు నిర్ణయాలు అనాలోచితంగా చేశారు. మరోవైపు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆర్థిక కష్టాలు చుట్టుముట్టాయి. ఇంకోవైపు పార్టీ నిధుల కోసం అధిష్ఠానం తెలంగాణపైనే ఆధారపడిన పరిస్థితి. ప్రభుత్వ ప్రతిష్ఠ మసకబారడానికి ఇది కూడా ఒక కారణం అయింది. ఈ నేపథ్యంలో రాష్ట్ర నాయకత్వాన్ని మార్చాలన్న ఆలోచన అధిష్ఠానానికి రావడం పలువుర్ని దిగ్భ్రాంతికి గురిచేస్తోంది. పార్టీ పగ్గాలు జాతీయ స్థాయిలో సోనియాగాంధీ చేతికి వచ్చాక ఢిల్లీలో సామంతరాజులు ఎక్కువయ్యారు. కేంద్రంలో అధికారంలో ఉన్నప్పుడు రాష్ట్ర నాయకత్వాలపై అంతులేని పెత్తనం చేశారు. రాజశేఖరరెడ్డి వంటి వారు కూడా డబ్బు మూటలతో సామంతులను సంతృప్తిపరచాల్సిన పరిస్థితి. ఇప్పుడు పార్టీ కేంద్రంలో అధికారం కోల్పోయి పదకొండేళ్లు అయింది. అయినా ఢిల్లీలో పెద్దలుగా చెలామణి అవుతున్న వారిలో మార్పు లేదు. జాతీయ స్థాయిలో పార్టీ బలహీనపడినా రాష్ట్రాలలో పెత్తనాన్ని కొనసాగిస్తున్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని చీటికిమాటికీ ఢిల్లీకి పిలిపించుకొని రోజుల తరబడి వేచివుండే పరిస్థితి కల్పించారు. కేంద్రంలో పదకొండేళ్లుగా అధికారంలో ఉన్న భారతీయ జనతా పార్టీలో ఈ సంస్కృతి లేదు. ప్రధాని మోదీ నాయకత్వంలోని ఆ పార్టీ అత్యంత బలంగా ఉంది. అయినా రాష్ట్రాలలో పార్టీ పరంగా, ప్రభుత్వ పరంగా సమస్యలు ఉత్పన్నమైతే వాటి పరిష్కారానికి ఢిల్లీ నుంచి పార్టీ ప్రతినిధులను పంపుతున్నారే గానీ ముఖ్యమంత్రులను ఢిల్లీకి పిలిపించుకోవడం లేదు. ఢిల్లీలో కాంగ్రెస్ అధిష్ఠానం పెద్దలకు ఇప్పుడు చేయడానికి పని కూడా లేదు. అయినా అయినదానికీ కానిదానికీ ఆ ఇద్దరు ముగ్గురు ముఖ్యమంత్రులను కూడా ఢిల్లీకి పిలిపించుకుంటున్నారు. ఇటువంటి ధోరణులను విడనాడకపోవడం వల్లనే జాతీయ స్థాయిలో కాంగ్రెస్ పార్టీ పరిస్థితి మెరుగుపడటం లేదు. గతంలో వలె రాష్ట్రాలపై పార్టీకి పట్టు ఉండటం లేదు. అయినా ఢిల్లీ నుంచి పెత్తనం చేయాలని అనుకుంటున్నారు. రాష్ట్రాలలో బలమైన నాయకులు ఉన్నప్పుడు జాతీయ స్థాయిలో కాంగ్రెస్ బలంగా ఉండేది. జాతీయ స్థాయిలో పార్టీ బలపడాలంటే రాష్ట్రాలలో పటిష్ఠమైన నాయకత్వాలను అభివృద్ధి చేసుకోవాలన్న ప్రాథమిక సూత్రాలను విస్మరిస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే కాంగ్రెస్ పార్టీ ప్రస్తుత దుస్థితికి ఆ పార్టీ అధిష్ఠానమే కారణం. ఈ నేపథ్యంలో దాదాపు దశాబ్దం తర్వాత తెలంగాణలో అధికారంలోకి రాగలిగాం అన్నది విస్మరించడంతో పాటు అందుకు కారణం ఎవరు అన్న వాస్తవాన్ని విస్మరించి ఏడాదిన్నరకే నాయకత్వాన్ని మార్చాలన్న ఆలోచన చేయడమే వింతగా ఉంది. అయితే పార్టీ అధిష్ఠానం ఆలోచనలతో సంబంధం లేకుండా రాష్ట్రంలో తన నాయకత్వాన్ని పటిష్ఠం చేసుకోవాలన్న ఆలోచనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వచ్చారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు. ఈ క్రమంలోనే ఆయన కరకుగా వ్యవహరించాలన్న నిర్ణయానికీ వచ్చారట. ఏది ఎలా జరగాలని ఉంటే అలానే జరుగుతుంది. ఇకపై నా స్టయిల్లోనే ముందుకు వెళతాను అన్న నిర్ణయానికి రేవంత్‌రెడ్డి వచ్చారని చెబుతున్నారు. ఫలితమే ఇటీవలి కాలంలో ఆయనలో మనం చూస్తున్న మార్పు.

ట్యాపింగ్ లోగుట్టు వీడాలంటే..

ఈ విషయం అలా ఉంచితే తెలంగాణలో కేసీఆర్ హయాంలో విచ్చలవిడిగా సాగిన టెలిఫోన్ ట్యాపింగ్ విషయానికి వద్దాం. 2018కి ముందు అధికారులు ఎంత అరాచకంగా వ్యవహరించారో ఈ ఉదంతం చెబుతోంది. వందల వేల సంఖ్యలో ప్రత్యర్థుల ఫోన్లను దొంగచాటుగా, అక్రమంగా విన్నప్పటికీ కేసీఆర్ ఓటమి నుంచి తప్పించుకోలేకపోయారు. ఇంత భారీ స్థాయిలో ఫోన్ ట్యాపింగ్ జరిగిన విషయం కూడా కాకతాళీయంగా బయటపడింది. ఎన్నికల ఫలితాలు వెల్లడైన తర్వాత ఆ నాటి ప్రభువుల కోసం అడ్డగోలుగా వ్యవహరించిన నాటి ఎస్ఐబీ అధికారులు తమను తాము కాపాడుకొనే క్రమంలో సర్వర్లు, హార్డు డిస్కులు ధ్వంసం చేశారు. ఈ క్రమంలో తీవ్రవాదులు, ఉగ్రవాదులకు సంబంధించి కొన్ని ఏళ్లుగా సేకరించి భద్రపరిచిన సమాచారాన్ని కూడా ధ్వంసం చేశారు. ఇది అత్యంత తీవ్రమైన నేరం. దీంతో ప్రభుత్వ మార్పిడి తర్వాత ఎస్ఐబీ అధికారుల ఫిర్యాదుతో కేసు నమోదైంది. తీగ లాగితే డొంక కదిలినట్టు 2018 ఎన్నికలకు ముందు విచ్చలవిడిగా ఫోన్ ట్యాపింగ్ జరిగిందని వెల్లడైంది. నేరస్థులు ఎన్ని జాగ్రత్తలు తీసుకున్నప్పటికీ ఎక్కడో ఒకచోట పొరపాటు చేస్తారు అన్నట్టుగా నాటి ఎస్ఐబీ చీఫ్ ప్రభాకరరావు బృందం సర్వీస్ ప్రొవైడర్లకు పంపిన మెయిల్ ఒకటి విచారణ అధికారులకు లభించింది. దీంతో ఎవరెవరి ఫోన్లు ఎంతకాలం దొంగచాటుగా విన్నదీ వెలుగులోకి వచ్చింది. ఈ దురాగతానికి వివిధ స్థాయిలలో అనుమతించిన అధికారులందరికీ ఈ నేరంతో సంబంధం ఉన్నట్టే. అమలులో ఉన్న నిబంధనలకు విరుద్ధంగా వివిధ స్థాయిల్లో అధికారులు గుడ్డిగా అనుమతించారు. ఫోన్ ట్యాపింగ్ అరాచకానికి నాటి ముఖ్యమంత్రి కేసీఆర్‌కు అత్యంత విశ్వాసపాత్రులైన, ఆయన సామాజిక వర్గానికే చెందిన అధికారులు ప్రభాకరరావు, ప్రణీత్‌రావు, రాధాకృష్ణరావు వంటి వారు పాల్పడ్డారు. మునుగోడు ఉప ఎన్నికలో ప్రత్యర్థి పార్టీ అభ్యర్థులకు నిధులు అందకుండా కట్టడి చేయడం కోసం విచ్చలవిడిగా ఫోన్ ట్యాపింగ్ చేయించి అధికార పార్టీ గెలుపునకు సహకరించిన ప్రణీత్‌రావు అనే ఇన్‌స్పెక్టర్‌కు ఆక్సిలరేటెడ్ ప్రమోషన్ ఇచ్చి డీఎస్పీగా నియమించుకున్నారు. ప్రభాకరరావు అప్పటికే పదవీ విరమణ చేసినా ఆయననే ఎస్ఐబీ చీఫ్‌గా నియమిస్తూ నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్‌కుమార్ అడ్డగోలుగా జీవో ఇచ్చారు. మరో రిటైర్డ్ అధికారి రాధాకృష్ణరావును టాస్క్‌ఫోర్స్ డీసీపీగా నియమించారు. వీళ్లందరూ చట్టవిరుద్ధంగా వ్యవహరించి కేసీఆర్ సేవలో తరించారు. ఫోన్ ట్యాపింగ్ జాబితాను ప్రతి ఆరు నెలలకు ఉన్నత స్థాయిలో సమీక్షించాలి. ఈ కమిటీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నేతృత్వం వహిస్తారు. ఏయే సందర్భాలలో కాల్ డేటా సేకరించవచ్చు, ఫోన్ ట్యాపింగ్ చేయవచ్చు అన్న విషయమై కేంద్ర ప్రభుత్వం స్పష్టమైన నిబంధనలు విధించి రాష్ట్రాలకు పంపింది. అయినా నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి నేతృత్వంలోని కమిటీ ఇవేమీ పట్టించుకోకుండా గుడ్డిగా ఆమోదించింది. అత్యవసర పరిస్థితులలో ఐజీ, ఆ పైస్థాయి అధికారి మాత్రమే ఫోన్ ట్యాపింగ్‌కు అనుమతించవచ్చు. ఈ కేసును సీరియస్‌గా తీసుకొని విచారణ జరిపితే నాటి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, ఆ కమిటీలోని ఇతర అధికారులతో పాటు పలువురు ఐపీఎస్ అధికారులను శిక్షించాల్సి ఉంటుంది. ఈ కారణంగా వారంతా ప్రభుత్వానికి సహాయ నిరాకరణ చేస్తున్నారు. సాక్షిగా సంతకం చేయడానికి కూడా శాంతికుమారి వంటి వారు నిరాకరిస్తున్నారు. సిట్ అధికారులు సుప్రీంకోర్టు ఆదేశాలతో రాష్ట్రానికి తిరిగి వచ్చిన ప్రభాకరరావును విచారిస్తున్నారు. అయితే ఆయన నోరు విప్పకపోగా అప్పటి ఇంటెలిజెన్స్ చీఫ్ అనిల్‌ను అడగండి అని బుకాయిస్తున్నారు. అనిల్‌ను అడిగితే తాను పేరుకు మాత్రమే ఇంటెలిజెన్స్ చీఫ్‌ని అని, అంతా ప్రభాకరరావు చూసేవారని చెబుతున్నారు. ప్రస్తుతం సిట్‌కు ఏసీపీ స్థాయి అధికారి నేతృత్వం వహిస్తున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ అధికారులను ఆ స్థాయి అధికారులు ఏం ప్రశ్నించగలరు? ఎస్ఐబీ చీఫ్‌గా ఉన్నప్పుడు వాడిన ఫోన్లను ఇవ్వమని సిట్ అధికారులు కోరగా, అమెరికాలో మరచిపోయానని ప్రభాకరరావు చెబుతున్నారు. కేంద్రం జారీ చేసిన నిబంధనల ప్రకారం ఎమ్మెల్యేలు, ఎంపీల ఫోన్ నంబర్లను ట్యాప్ చేయకూడదు. అలా చెయ్యాలంటే పెద్ద తతంగమే ఉంటుంది. దీంతో ప్రభాకరరావు బృందం కేవలం ఫోన్ నంబర్లను మాత్రమే సర్వీస్ ప్రొవైడర్లకు, రివ్యూ కమిటీకి పంపేవారు. ఇలా పంపిన కొన్ని జాబితాలపై నాటి ఇంటెలిజెన్స్ చీఫ్ అనిల్ సంతకం లేదు. ఇక నాకు సంబంధించినంత వరకు రెండు సంవత్సరాల కాల్ డేటా తెప్పించుకున్నారు. ఇది అమలులో ఉన్న చట్టాలు, నిబంధనలకు విరుద్ధం. మావోయిస్టులకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించిన వారి జాబితాలో నా ఫోన్ నంబర్ చేర్చారు. 2018 ఎన్నికలకు ముందు సెప్టెంబరు మాసంలో నా ఫోన్ సంభాషణలను నేరుగా విన్నారు. నా ఫోన్ మాత్రమే కాదు, మరికొందరు మీడియా యజమానుల ఫోన్లనూ ట్యాప్ చేశారు. తమాషా ఏమిటంటే, ఈ మొత్తం ఎపిసోడ్‌లో ఫోన్ ట్యాపింగ్ చేసిన అధికారులను బురిడీ కొట్టించింది బీజేపీ ఎంపీ రఘునందనరావు ఒక్కరే. ఎన్నికల సందర్భంగా ఆయన ఫోన్ కూడా ట్యాప్ చేశారు. అయితే అధికారులను తప్పుదారి పట్టించడం కోసం ఆయన ఫలానా కారులో డబ్బు పంపుతున్నానని అవతలి వ్యక్తికి చెప్పారు. ఆ వెంటనే అధికారులు సదరు నంబరు కారును క్షుణ్ణంగా తనిఖీ చేశారు. ఏమీ దొరక్కపోవడంతో కారును విడి భాగాలుగా ఊడదీసి మరీ తనిఖీ చేశారు. అయినా ఏమీ దొరక్కపోవడంతో తాము బోల్తా పడ్డామని సదరు అధికారులు తెలుసుకున్నారు. ఈ ఫోన్ ట్యాపింగ్‌లో బాధితులకు న్యాయం జరగాలన్నా, నిందితులకు శిక్ష పడాలన్నా సుప్రీంకోర్టు పర్యవేక్షణలో ఉన్నత స్థాయి కమిటీ దర్యాప్తు చేయాలి. ఈ అరాచకానికి కర్త, కర్మ, క్రియ నాటి ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నది అందరికీ తెలిసిందే. అయితే ఆయనకు వ్యతిరేకంగా ఒక్కరు కూడా నోరు విప్పడం లేదు. ఎవరి ఆదేశాలతో, ఎవరి కోసం ఇన్ని వందల ఫోన్లు ట్యాప్ చేశారని సిట్ అధికారులు ప్రశ్నిస్తున్నా ప్రభాకరరావు మౌనాన్నే ఆశ్రయిస్తున్నారు. ఇలా అయితే ప్రస్తుత దర్యాప్తు వృథా ప్రయాసే అవుతుంది. గజం మిథ్య, పలాయనం మిథ్య అన్నట్టుగా ఈ ఎపిసోడ్ మిగలకూడదు అంటే తగు నిర్ణయం తీసుకోవలసింది రేవంత్‌రెడ్డి ప్రభుత్వమే. చూద్దాం ఏం జరుగుతుందో.. కేసీఆర్ అండ్ కో సేఫ్‌గా ఉంటారా? జైలుకు వెళతారా? అన్నది కాలమే చెప్పాలి!



శోధన, బోధనలో దొణప్ప వెలుగులు

'విద్యార్థి ఎంత ఎదిగితే దేశం అంత ఎదిగి సుభిక్షమవుతుంద'నే సూత్రాన్ని ఆచరించి అందరికీ మార్గదర్శకంగా నిలిచిన గురు సార్వభౌముడు ఆచార్య తూమాటి దొణప్ప. భాషాశాస్త్రానికి తెలుగులో తగిన పుస్తకాలు దొరకని రోజుల్లో తేలికగా అర్థమయ్యేలా, ఆసక్తి కలిగించేలా బోధించిన భాషాశాస్త్ర పండితుడు దొణప్ప. అనంతపురం జిల్లా ఉరవకొండ మండలం రాకట్ల గ్రామంలో తూమాటి సంజీవప్ప, తిమ్మక్క దంపతులకు 1926, జూలై 1న జన్మించారు. పుట్టినప్పుడు ఆయనకు దొణతిమ్మరాయచౌదరి అని పేరు పెట్టారు. పాఠశాల రికార్డుల్లో మాత్రం దొణప్ప అని పేరు మార్చారు. బాల్యంలో భీమప్పగారి వద్ద సంస్కృతాంధ్రాలు చదివారు. భారత, భాగవత రామాయణాలు గురువుగారి నేతృత్వంలో అధ్యయనం చేశారు. వజ్రకరూర్‌లో 1939–42 మధ్య విద్యాభ్యాసం చేశారు. 1946లో ఉరవకొండ ఉన్నత పాఠశాలలో ఎస్.ఎస్.ఎల్.సి. పూర్తి చేశారు.

అనంతపురంలో ఇంటర్మీడియట్ చదివారు. అక్కడే చిలుకూరి నారాయణ రావు పాఠాల వల్ల పరిశోధనపై ఆసక్తి కలిగింది. ఆపై ఆంధ్ర విశ్వవిద్యాలయంలో బి.ఎ. ఆనర్స్‌లో గంటిజోగి సోమయాజి, దువ్వూరి వెంకటరమణ శాస్త్రి వంటి ఉద్దండ పండితుల నేతృత్వంలో చదువు కొనసాగింది. ఆనర్స్‌లో 'ద్రవిడియన్ ఫిలాలజీ అండ్ జనరల్ లింగ్విస్టిక్స్'ను ప్రత్యేకాంశంగా చదివారు. గంటిజోగి సోమయాజి పర్యవేక్షణలో తెలుగులో 'వైకృత పద స్వరూప నిరూపణము' అనే అంశంపై పరిశోధన చేశారు. 1958లో ఆంధ్ర విశ్వవిద్యాలయం తెలుగు శాఖలో అధ్యాపకుడిగా చేరి భాషా శాస్త్ర బోధనలో తనదైన శైలిలో బోధించ ప్రారంభించారు. తరగతి గదిలో చెప్పిన పాఠం పరీక్షల వరకూ గుర్తుండేలా బోధించేవారు.



గుంటూరులో ఆంధ్ర విశ్వవిద్యాలయం పీజీ సెంటర్‌ను విశ్వవిద్యాలయంగా మార్చే ప్రక్రియలో 1976లో అధ్యాపకుల బదిలీలు జరిగాయి. ఈ నేపథ్యంలో తన వద్ద పని చేస్తున్న పరిశోధక విద్యార్థి బృందంతో సహా 1976 సెప్టెంబర్ 11న కొత్తగా నామకరణం చేసిన నాగార్జున విశ్వవిద్యాలయానికి వెళ్లారు. అక్కడే శాఖాధిపతిగా, విశ్వవిద్యాలయ కళాశాలకు ప్రిన్సిపల్‌గా, రిజిస్ట్రార్‌గా పలు పదవీ బాధ్యతలు చేపట్టారు. ఏ పదవిలో ఉన్నా క్లాసు టైమ్‌కి మాత్రం తప్పక వచ్చి పాఠాలు చెప్పిన మహామహోపాధ్యాయుడాయన. ఎన్టీఆర్ ముఖ్యమంత్రి అయిన తర్వాత తెలుగు కళలు, చారిత్రక వారసత్వ సంపదల పరిరక్షణకు ఒక విశ్వవిద్యాలయం స్థాపించాలని భావించారు. 1986 జనవరి 8న తెలుగు విశ్వవిద్యాలయాన్ని ప్రారంభించి, తొలి వైస్ ఛాన్సలర్‌గా ఆచార్య తూమాటి దొణప్పను నియమించారు. ఈ విశ్వవిద్యాలయం కేవలం ఒక ప్రాంతానికి పరిమితం కాకూడదని తెలుగు భాషా సాహిత్యంతో పాటు, కళలు, జానపద కళలు, పురావస్తుశాఖ మొదలైన అధ్యయనాలను అభివృద్ధి చేయాలని శ్రీశైలం, కూచిపూడి, రాజమండ్రి, వరంగల్ ప్రాంతాల్లో నాలుగు అనుబంధ శాఖలు ఏర్పాటు చేశారు.

బాధ్యతాయుతమైన ఉపకులపతిగా ఉన్నా, రచనా వ్యాసంగం కొనసాగించారు. ఆయన ఏ రచనా ప్రక్రియ ప్రారంభించినా ఆమూలాగ్రం పరిశోధించి చికిలీపట్టి, నగిషీ చేయగల సమర్థుడు. ఆయన రచనల్లో అధిక భాగం ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమి అవార్డులు, ప్రత్యేక పురస్కారాలు పొందిన రచనలే. వాటిల్లో ఆంధ్ర సంస్థానాలలో సాహిత్య పోషణ, భాషా చారిత్రక వ్యాసావళి, జానపద కళాసంపద, తెలుగు హరికథా సర్వస్వం, తెలుగులో కొత్త వెలుగులు, ఆకాశ భారతి, వైకృత పద స్వరూప నిరూపణము, బాలల శబ్ద రత్నాకరములతో పాటు సంపాదకుడిగా తెలుగు వ్యుత్పత్తి పదకోశము, త్రివేణి, మాండలిక వృత్తి పద కోశము, అన్వేషణ మొదలైన ముద్రిత గ్రంథాలున్నాయి. దొణప్ప రచించిన మూడు వేల పుటలకు పైగా అముద్రిత రచనలను ముద్రించే యత్నాలు శతజయంతి కమిటీ నేతృత్వంలో కొనసాగుతున్నాయి. ఆయన పర్యవేక్షణలో తెలుగు వారి ఇంటిపేర్లు, ఊర్ల పేర్లు, సంప్రదాయ ఆధునిక కవుల రచనలు, క్రైస్తవ, ముస్లిం, జైన, బౌద్ధం, తెలుగు–సంస్కృత వ్యాకరణాలు మొదలైన పరిశోధనా గ్రంథాలు వెలువడ్డాయి. ఉద్యోగ విరమణానంతరం ప్రత్యేక అనుమతితో ఆయన వద్ద పలువురి పరిశోధనలు కొనసాగాయి.

ఆచార్య దొణప్ప నేతృత్వంలో అరవై మందికి పైగా పీహెచ్‌డీ డిగ్రీలు పొందారు. విద్యార్థుల జీవితాలను ఉన్నతంగా తీర్చిదిద్దే విధంగా నిత్యం తెలుగు భాషా పరిశోధనలకు ప్రాధాన్యమిచ్చేవారు. పీహెచ్‌డీ పొందినవారినుద్దేశించి 'పీహెచ్‌డీ పట్టా పరిశోధనకు తొలిమెట్టు. అనంతరం అధిరోహించి పరిశోధించవలసినది ఎంతో ఉంది' అని చెప్పేవారు. గురువులకే గురువుగా, తెలుగు భాషా సాహిత్యాన్ని జీవిత పరమార్థంగా భావించి జీవించిన ఆచార్య దొణప్ప 1996 సెప్టెంబరు 6న విజయవాడలో తనువు చాలించారు. ఆయన శిష్య బృందం ప్రపంచవ్యాప్తంగా విస్తరిల్లి నేటికీ ఆయన మార్గాన్ని అనుసరిస్తున్నారు. ఆచార్య తూమాటి దొణప్ప శతవత్సరాన్ని (1926–2025) పురస్కరించుకుని ఆయన కుటుంబసభ్యులు, విద్యార్థులు, అభిమానులు ఏడాది పొడవునా శతజయంతి వేడుకలు, సదస్సులు, తెలుగు భాషా సాహిత్య కార్యక్రమాలు జరపడానికి ప్రణాళికలు సిద్ధం చేశారు. శత జయంత్యుత్సవాలు జూలై 1, 2025న సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ ప్రాంగణంలో ప్రారంభమవుతాయి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణలోని వివిధ విశ్వవిద్యాలయాల్లో, పలు సాహిత్య సంస్థల ద్వారా 'ఆచార్య దొణప్ప శతజయంతి సాహిత్య వేడుకల నిర్వహణకు ప్రణాళికలు సిద్ధమయినాయి. తెలుగు భాషా సాహిత్య ఆచార్యునికి సాహిత్య అభిమానులు, అంతేవాసులు ఏడాదిపాటు నిర్వహించే తెలుగు భాషా సాహిత్య సభలు, అముద్రిత గ్రంథాల ప్రచురణ కొత్త వెలుగులు చూపుతాయనడంలో సందేహం లేదు.

■ ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి

(జూలై 1 నుంచి ఆచార్య తూమాటి దొణప్ప శతజయంతి ఉత్సవాలు)





ఇంద్రకీలాద్రికి రోప్‌వే

సీతమ్మవారి పాదాలు-ఓం టర్నింగ్-భవానీ ఐల్యాండ్

- దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం అధికారుల ప్రతిపాదన
- గతంలో రెండుసార్లు ప్రతిపాదించిన ఏపీటీడీసీ అధికారులు
- గందరగోళ అలైన్‌మెంట్ల కారణంగా తిరస్కరణ
- దేవదాయ మంత్రి వద్దకు చేరిన తాజా ప్రతిపాదన
- పర్వతమాల ప్రాజెక్టు కింద చేపట్టాలని భావన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : జగన్మాత కనకదుర్గమ్మను దర్శించుకోవటానికి ఇంద్రకీలాద్రి వచ్చే భక్తుల కోసం దేవస్థాన అధికారులు రోప్‌వే ఏర్పాటు చేయాలని ప్రతిపాదించారు. గతంలో రెండుసార్లు పర్యాటకాభివృద్ధి సంస్థ (ఏపీటీడీసీ) అధికారులు ఈ ప్రాజెక్టును ప్రతిపాదించగా, ఈసారి మాత్రం శ్రీదుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం అధికారులే తెరపైకి తెచ్చారు. రాష్ట్ర దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, దుర్గగుడి ఈవో శీనానాయక్ ఈ ప్రతిపాదన చేశారు. జాతీయ రహదారుల సంస్థ (ఎన్‌హెచ్) పర్వతమాల పథకం కింద దీనిని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. సీతమ్మవారి పాదాల నుంచి ఇంద్రకీలాద్రిపై ఓం టర్నింగ్ వరకు, తిరిగి భవానీ ఐల్యాండ్ వరకు ఈ ప్రతిపాదన చేశారు. దేవస్థానం, ప్రభుత్వంపై ఖర్చు పడకుండా పూర్తిగా కేంద్ర ప్రభుత్వ నిధులతో దీనిని ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు.

గతంలో రెండుసార్లు ప్రతిపాదనలు

రోప్‌వే ప్రాజెక్టు కోసం గతంలో రెండుసార్లు ఏపీటీడీసీ అధికారులు ప్రతిపాదన పెట్టారు. రాజీవ్‌గాంధీ పార్కు నుంచి దుర్గగుడిపైకి ఒకటి, రాజీవ్ గాంధీ పార్కు నుంచి దుర్గగుడికి.. అక్కడి నుంచి మిగతా 6లో..


ఇంద్ర వైభవం

కనకదుర్గానగర్ రెండోదశ విస్తరణకు శ్రీకారం

గోశాల నుంచి మల్లేశ్వరాలయం దాటే వరకు..

- దుర్గగుడి అధికారుల ప్రతిపాదనకు ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్
- సంప్రదింపులతో భూమి సేకరించాలని ఆదేశాలు
- పరిహారంపై నివేదిక ఇవ్వాలని అధికారులకు సూచన
- రెండు స్కూళ్లు, నాలుగు ఇళ్లు తొలగించే అవకాశం
- మూడోదశ విస్తరణకూ ఒప్పుకొంటే కాటేజీలు నిర్మించే చాన్స్

ఇంద్రకీలాద్రి మాస్టర్‌ప్లాన్‌కు అనుగుణంగా కనకదుర్గానగర్ రెండోదశ విస్తరణకు రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు అవసరమైన భూసేకరణ జరపటానికి ఆమోదముద్ర వేసింది. ఈ ప్రక్రియ సంప్రదింపుల మార్గంలో నడవాలని నిర్దేశించింది. భూములు తీసుకోవాల్సిన వారితో ముందుగా మాట్లాడి, పరిహారానికి సంబంధించి వారు ఎంత కోరుకుంటున్నారో తెలుసుకోవాలని దుర్గగుడి యంత్రాంగానికి ప్రభుత్వం సూచించింది. బాధితులతో మాట్లాడాక సమగ్ర నివేదిక పంపాలని దేవస్థాన అధికారులకు నిర్దేశించింది.



కనకదుర్గానగర్‌లో విస్తరించాల్సిన ప్రాంతం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : ఇంద్రకీలాద్రి మాస్టర్ ప్లాన్‌లో భాగంగా తొలిదశ విస్తరణలో అర్జునవీధికి అభిముఖంగా మొత్తం 187 ఇళ్లను తొలగించారు. ఆ తర్వాత దేవస్థాన అధికారులు ప్రహరీ నిర్మించారు. ఈ భూసేకరణ వల్ల మహామండపం వద్ద ప్రాంతం విశాలంగా మారింది. అలాగే, అన్నదానసత్రం, లడ్డూ పోటు కేంద్రాలను ఏర్పాటు చేశారు. కొత్తగా భవనాలు నిర్మిస్తున్న నేపథ్యంలో ఈ ప్రాంతం మళ్లీ ఇరుగ్గా మారింది. మాస్టర్‌ప్లాన్ ప్రకారం అనేక అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాల్సి ఉంది. దీంతో రానున్న రోజుల్లో ఇబ్బందికర పరిస్థితులు తలెత్తే అవకాశం ఉన్న నేపథ్యంలో రెండోదశ విస్తరణకు శ్రీకారం చుట్టారు.

రెండో దశలో..

ప్రస్తుత మహామండపం నుంచి మల్లేశ్వరస్వామి ఆలయం దిగువన ఉన్న ప్రాంతం మొత్తాన్ని రెండో దశలో భాగంగా భూసేకరణ జరపాలని దేవస్థాన అధికారులు మిగతా 6లో..

మూడో దశలో..

మాస్టర్ ప్లాన్ ప్రకారం ఇంద్రకీలాద్రి సమగ్రాభివృద్ధికి మూడో దశ భూములు కూడా అవసరం. రాష్ట్రంలోనే రెండో అతిపెద్ద ఆలయమైన ఇంద్రకీలాద్రికి అశేషసంఖ్యలో భక్తులు వస్తున్నారు. అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చే భక్తులకు తిరుపతి తరహాలో ఇక్కడ కాటేజీలు అందుబాటులో లేవు. కనకదుర్గానగర్ దిగువన తగిన స్థలం ఉంటే ఇక్కడ మల్టీప్లెక్స్‌లతో కూడిన కాటేజీలను ఏర్పాటు చేయవచ్చు. దీనివల్ల విజయవాడ వచ్చినవారు రెండు, మూడు రోజులు ఇక్కడే గడిపే అవకాశం ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇస్తే మూడోదశ విస్తరణకు కూడా ఇదే మంచి తరుణం.

నూతన ప్రాజెక్టును ప్రారంభిస్తున్న హోంమంత్రి అనిత. చిత్రంలో సీపీ రాజశేఖర్‌బాబు, ఎంపీ కేశినేని చిన్ని, కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యేలు సుజనా చౌదరి, కొలికపూడి శ్రీనివాస్, గద్దె రామ్మోహన్, బొండా ఉమా, శ్రీరాం తాతయ్య



ఆధ్యాత్మిక ప్రదేశాల భద్రతకు 'డివైన్ సురక్ష' 8

- నూతన ప్రాజెక్టును ఆవిష్కరించిన హోంమంత్రి అనిత
- అన్ని ఆలయాలు, ప్రార్థనా మందిరాలకు సీసీ కెమెరాలు

సీతారామపురంలోని స్థలం ఇదే..



పున్నయ్య స్థలాలు హాంఫట్

సీతారామపురంలో దేవదాయ స్థలం విక్రయం

- దాతల సదాశయానికి తూట్లు
- పట్టించుకోని అధికారులు

వన్‌టౌన్ /గుణదల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : దేవదాయ శాఖకు చెందిన ఆస్తులు కబ్జాకు గురవుతున్నా, విక్రయ లావాదేవీలు జరుగుతున్నా అధికారులు తమకేం సంబంధం లేనట్టుగా వ్యవహరిస్తున్నారు. కబ్జాదారుల నుంచి ఆమ్యామ్యాలు దండుకుంటున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. దాతల ఆశయాలకు తూట్లు పొడుస్తూ, వారి ఆస్తులను అడ్డగోలుగా విక్రయించేందుకు కబ్జాదారులతో కుమ్మక్కవుతున్నారనే ఆరోపణలు వస్తున్నాయి.

దాతలిచ్చిన స్థలంలో దారుణాలు

నగరానికి చెందిన కూనాల పున్నయ్య అనే వ్యక్తి 1922లో సుమారు రూ.30 వేలతో కూనాల పున్నయ్య అన్నసత్రం ఏర్పాటుచేశారు. కాలినడకన మిగతా 6లో..

కబానా కహానీ

అద్విక డబ్బంతా దుబాయిలోని కబానా కంపెనీకి..

- ముందు జాగ్రత్తగా ఆదిత్య తెలివితేటలు
- కేసు నమోదుకు ముందే ల్యాప్‌టాప్ డేటా డిలీట్
- మొత్తం డేటాను రిట్రీవ్ చేసిన పోలీసులు
- కబానాకు నిధులు మళ్లించినట్టు గుర్తింపు
- వివరాల కోసం దుబాయి కంపెనీకి మెయిల్
- ఆదిత్య తమ్ముళ్ల కోసం హైదరాబాద్ వెళ్లిన కాప్స్
- బాధితుల జాబితాలో పెరుగుతున్న 'పెద్దవారు'
- తాజాగా ఓ పోలీసు ఉన్నతాధికారి పీఏ
- ఆయన డబ్బు రాబట్టేందుకు ఓ కానిస్టేబుల్ హడావిడి



నగరంలోని అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కార్యాలయం

1,200 మంది నుంచి రూ.300 కోట్లు వసూలు చేసిన అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ అధినేత ఆదిత్య ఆ మొత్తాన్ని ఏం చేశాడు? దుబాయిలోని ట్రేడింగ్ కంపెనీ కబానాకు పంపించాడా? ఆ వివరాలేమీ బయట పడకుండా ముందే ల్యాప్‌టాప్‌లో డేటా డిలీట్ చేశాడా? ఈ ప్రశ్నలన్నింటికీ పోలీసులు అవుననే సమాధానం చెబుతున్నారు. ఈ కంపెనీలో పెట్టుబడి పెట్టిన డబ్బంతా కబానాకు వెళ్లడం వెనుక కుట్రను ఛేదించే పనిలో పోలీసులు ఉండగా, ఈ కంపెనీలో పెట్టుబడి పెట్టిన 'పెద్దవారి' జాబితా రోజురోజుకూ పెరిగిపోతోంది.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : 1,200 మంది నుంచి రూ.300 కోట్లు వసూలు చేసి ఝలక్ ఇచ్చిన అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ కంపెనీ లిమిటెడ్ అధినేత శ్రీవెంకట ఆదిత్య ఆ మొత్తాన్ని దుబాయిలో ఉన్న కబనా ట్రేడింగ్ కంపెనీకి మళ్లించాడని పోలీసులు గుర్తించారు. అంతేకాదు.. ఆ వివరాలను ల్యాప్‌టాప్‌లో లేకుండా చేశాడు. నష్టాలు రావడం మొదలై, ఏజెంట్ల నుంచి ఒత్తిడి పెరుగుతున్న సమయంలో కబనా పేరు కనిపించకుండా చేశాడు. ఈ ట్రేడింగ్ కంపెనీలోకి హవాలా మార్గంలో డబ్బును పంపినట్టు నిర్ధారించారు. అద్విక ట్రేడింగ్ కంపెనీ నుంచి ఇప్పటి వరకు ఏయే మార్గాల ద్వారా ఎంతెంత మొత్తంలో నిధులు కబనా ఖాతాల్లోకి వెళ్లాయో వివరాలు ఇవ్వాలని పోలీసులు ఆ కంపెనీకి మెయిల్ చేశారు. అవి వచ్చాక లెక్కలు ఏవిధంగా మారతాయో వేచి చూడాలి.

తెలంగాణకు చేరిన పోలీసులు

ఈ కేసు దర్యాప్తులో మొత్తం 50 మంది పోలీసు అధికారులు, సిబ్బంది పనిచేస్తున్నారు. ఆదిత్య ఇక్కడే కాకుండా తెలంగాణ నుంచి పెట్టుబడులను రప్పించినట్టు తెలిసింది. హైదరాబాద్‌లో ఆదిత్య ఇద్దరు తమ్ముళ్లు ఈ వ్యవహారాలను నడిపినట్టు భావిస్తున్నారు. వారికోసం ఒక బృందం అక్కడకు వెళ్లింది. ఏజెంట్లు, ఖాతాదారులను నమ్మించడానికి ఆదిత్య గోల్డ్‌లీఫ్ పేరుతో నకిలీ ట్రేడింగ్ వెబ్‌సైట్‌ను తయారు చేయించాడు. అందులో రూ.120 కోట్లు తన పెట్టుబడిగా చూపించాడు. ఇదికాకుండా అద్వికలో ట్రేడింగ్ చేయడానికి స్టాక్ మార్కెట్‌లో అనుభవం ఉన్న మహిళను సలహాదారుడిగా నియమించుకున్నాడు. లబ్బీపేటలో ఉంటున్న ఆమెను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఆమెకు ఇప్పటి వరకు వేతనంగా రూ.2.50 కోట్లు చెల్లించినట్టు తెలిసింది.

కమీషన్ ఆశచూపి..

ఖాతాదారులతో ఎలాంటి సంబంధాలు లేకుండా ఏజెంట్ల వ్యవస్థను ఏర్పాటు చేసుకున్న ఆదిత్య వారి ద్వారా పెట్టుబడులను రప్పించుకున్నాడు. ఎంత ఎక్కువ డిమాండ్ చేస్తే అంత మొత్తంలో కమీషన్లు ఇచ్చాడు. ఏజెంట్లు కొంత కమీషన్‌ను మినహాయించుకుని మిగిలిన దాన్ని ఖాతాదారులకు ఇచ్చేవారు. తొలి నాళ్లలో కమీషన్ దండిగా అందడంతో ఖాతాదారులే ఏజెంట్ల అవతారమెత్తారు. 6 నుంచి 12 శాతం వరకు కమీషన్లు చెల్లించినట్టు తెలిసింది. వచ్చిన పెట్టుబడులు, ఇచ్చిన కమీషన్లకు సంబంధించిన మొత్తం వివరాలను ఆదిత్య మిగతా 6లో..

ఇద్దరూ ఇద్దరే..

గతంలో కార్పొరేషన్‌లో కలెక్షన్ లీలలు



విజయవాడ నగరపాలక సంస్థ.. కొంతమంది అధికారులకు కాసులు కురిపించే భాండాగారం. అందుకే ఇక్కడ ఉద్యోగమంటేనే ఎగిరి గంతేసేస్తారు. ఇక్కడి నుంచి వేరొకచోటకు వెళ్లిపోయినా తిరిగి వచ్చేందుకు తెగ తాపత్రయ పడిపోతారు. ఇక్కడే పనిచేసి, బాగా వసూళ్లు చేసి, అనేక ఆరోపణలు ఎదుర్కొని, వేర్వేరు ప్రాంతాలకు వెళ్లిన ఇద్దరు అధికారులు తిరిగి వీఎంసీలో అడుగుపెట్టడానికి ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ ఇద్దరూ వీఎంసీకి రావడానికి ప్రయత్నిస్తున్నారని తెలియటంతో అధికారులు, ఉద్యోగులు కంగారు పడిపోతున్నారు. - కార్పొరేషన్, ఆంధ్రజ్యోతి

- ఓ పశువైద్యుడు, ఓ అధికారిణి రూటే వేరు
- వైసీపీ హయాంలో భారీగా వసూళ్లు
- అనేక ఆరోపణలపై ఇతర ప్రాంతాలకు బదిలీ
- తిరిగి బదిలీపై ఇక్కడికి వచ్చేందుకు ప్రయత్నాలు
- భయపడిపోతున్న వీఎంసీ ఉద్యోగులు 6

మత్తుమయం!

స్పిరిట్‌కు బానిసలవుతున్న యువత

- పెరిగిన స్పిరిట్, వైట్‌నర్, నిద్రమాత్రల వాడకం
- డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే మెడికల్ షాపుల్లో లభ్యం!
- మొక్కుబడిగా పర్యవేక్షణ
- మరణాలు సంభవిస్తున్నాయని విజిలెన్స్ కమిటీ సభ్యుల ఆందోళన



8

నేడు దుర్గమ్మకు భాగ్యనగర్ బంగారు బోనాలు



ఆషాఢ సారె సమర్పించిన అనంతరం దుర్గమ్మకు నమస్కరిస్తున్న భక్తులు 6లో



రూ.7,32,550 విలువ చేసే ఫ్రాన్స్‌కు చెందిన మద్యం బాటిల్ ఇది

మంచి కిక్కు ఇచ్చే కల్చర్

నగరంలో రాయల్ లుక్ మద్యం మార్టులు

సండే స్పెషల్

- ఫారెన్ లిక్కర్ బ్రాండ్స్‌తో ఘనంగా ఏర్పాటు
- ఫైవ్‌స్టార్ సదుపాయాలతో ఆహ్వానం
- అందుబాటులో రూ.లక్షల విలువైన మద్యం

జీవితం ఒక్కటే.. ఆనందం కోసం ఎన్నో మార్గాలు వెతుక్కుంటాం. ఆహ్లాదం కోసం కొందరు, ఆహారం కోసం ఇంకొందరు ఆనందాన్ని వెతుక్కుంటారు. మరికొందరు మాత్రం ఆ ఆనందం 'గమ్మత్తు'గా ఉండాలనుకుంటారు. ఎన్ని కష్టాలున్నా రేపటికి వాయిదా వేసేసి, ఆరోజును మత్తులో కప్పేయాలనుకుంటారు. మెట్రోపాలిటన్ హంగులతో ముందుకెళ్తున్న విజయవాడ నగరంలో కూడా ఈ కిక్కు ఇచ్చే కల్చర్ బాగానే వేళ్లూనుకుంటోంది. ఫైవ్‌స్టార్ హోటల్ రేంజ్‌లో కొత్తగా పుట్టుకొస్తున్న మద్యం మార్టులే ఇందుకు నిదర్శనంగా చెప్పుకోవచ్చు.





(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : అమరావతి రాజధానిగా రూపు దిద్దుకుంటున్న తరుణంలో విజయవాడ కూడా మెట్రోపాలిటన్ నగరాల జీవనశైలికి దగ్గరవుతోంది. చాలాకాలంగా నగరంలో నైట్ కల్చర్ ఎక్కువవుతుండటంతో అర్ధరాత్రి 12 దాటినా నచ్చిన ఫుడ్ దొరుకుతుంది. ఒక్కసారిగా మారిపోయిన జీవనశైలి మద్యం రంగంలోనూ వినూత్న మార్పులను తీసుకొచ్చింది. ఇంటర్నేషనల్ మద్యం బ్రాండ్లను రుచి చూడాలనుకునే మందుబాబులకు నగరంలో అన్ని వెరైటీలు లభిస్తున్నాయి. ఫ్రాన్స్, స్కాట్లాండ్, మెక్సికో, జర్మనీ తదితర దేశాల మద్యం బ్రాండ్లు అందుబాటులోకి వచ్చాయి. ఈ మార్పులకు అనుగుణంగా లిక్కర్ మార్ట్‌లు మిగతా 6లో..

కొలిచిన వారి కొంగు బంగారం

» దుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణలు

ఇంద్రకీలాద్రి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రి దుర్గామల్లేశ్వర దేవస్థానంలో కనకదుర్గమ్మకు ఆషాఢ సారె సమర్పణ చేసి మొక్కులు తీర్చుకోవడానికి శనివారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి పెద్దఎత్తున భక్తబృందాలు తరలివచ్చాయి. ఈ సందర్భంగా ఆలయ ఉద్యోగులు వారికి స్వాగతం పలికారు. భక్త బృందాలకు ఉచిత దర్శనం ఏర్పాటు చేసినట్టు ఈవో వీకే శీనానాయక్ తెలిపారు. సారె సమర్పణకు వచ్చే వారు దేవస్థానం టోల్‌ఫ్రీ నెంబరు 180042 59099లో నమోదు చేసుకుంటే, ఏర్పాట్లు సులభం అవుతాయని ఈవో తెలిపారు. అమ్మవారికి సారె సమర్పించిన అనంతరం మహామండపం భక్తులకు సామూహిక ఆశీర్వచనం, ఉచిత ప్రసాదం అందజేశారు. సుమారు 46 భక్త బృందాలు విచ్చేసినట్టు అధికారులు తెలిపారు.



దుర్గమ్మకు సారె సమర్పిస్తున్న భక్తబృందం

నేడు భాగ్యనగర్ బంగారు బోనాల సమర్పణ

ఇంద్రకీలాద్రి: ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మకు ఆదివారం తెలంగాణ భాగ్యనగర్ బంగారు బోనం సమర్పణ జరగనుంది. గత కొన్నేళ్లుగా హైదరాబాద్ ఉమ్మడి దేవాలయాల కమిటీ అమ్మవారికి బంగారు బోనాలు సమర్పించటం జరుగుతోంది. సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని, ప్రజలు, రైతులు సుఖ సంతోషాలతో ఉండాలని, తెలుగు రాష్ట్రాల ప్రజలు సోదరభావంతో ఉంటూ అభివృద్ధి బాటలో సాగాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర సంస్కృతి సంప్రదాయాలకు అనుగుణంగా భాగ్యనగర్ మహంకాళి జాతర అమ్మవారి బోనాల ఉత్సవాల కమిటీ ఆధ్వర్యంలో బంగారు బోనాలను సమర్పిస్తుంటారు. ఈ క్రమంలో ఆదివారం ఉదయం 9 తర్వాత బోనాల భక్తబృందం జమ్మిదొడ్డిలో తొలుత పూజలు నిర్వహించి కళాబృందాలు, డప్పు వాయిద్యాలు, మేళతాళాలు, భక్తుల నినాదాలు, పోతురాజుల విన్యాసాలతో దుర్గమ్మకు జేజేలు పలుకుతూ ఊరేగింపు బయలుదేరుతుంది. అనంతరం ఇంద్రకీలాద్రిపై అమ్మవారికి బంగారు బోనం సమర్పిస్తారు.



అమ్మవారికి బంగారు బోనాలు ఫైల్

దుర్గమ్మ దేవస్థానంలో యాగశాల అందుబాటులోకి తేవాలి



అధికారులు, అర్చకులతో కలిసి యాగశాల పనులు పరిశీలిస్తున్న ఈవో

ఇంద్రకీలాద్రి : ఇంద్రకీలాద్రిపై హోమాది కార్యక్రమాల నిమిత్తం దాత సంగా నరసింహారావుచే నిర్మించిన యాగశాల త్వరగా భక్తులకు అందుబాటులోకి తేవాలని ఈవో శీనానాయక్ అధికారులను ఆదేశించారు. శనివారం ఈఈ కోటేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకులు కోట ప్రసాద్‌లతో కలిసి యాగశాల పనులు పరిశీలించారు. అమావాస్య, పౌర్ణమి రోజుల్లో చండీ హోమం నిర్వహించేందుకు పెద్ద ఎత్తున భక్తులు తరలి వస్తున్నారని, ఢిల్లీ, ముంబయి ప్రాంతాల నుంచి కూడా ముందస్తుగా పూజా టిక్కెట్ బుక్ చేసుకుంటున్నారని ఈవో గుర్తుచేశారు. ప్రస్తుతం చండీ హోమం జరుగుతున్న ప్రదేశం చాలకపోవడంతో భక్తులు ఇబ్బంది పడుతున్నందున కొత్త యాగశాల అందుబాటులోకి తేవాలని, ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన చేయాలన్నారు. తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు.

అరుణాచల గిరి ప్రదక్షిణకు ఆర్టీసీ బస్సులు

బస్‌స్టేషన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : అరుణాచల గిరిప్రదక్షిణకు వెళ్లే భక్తుల కోసం ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసినట్టు ఎన్టీఆర్ జిల్లా ప్రజా రవాణా అధికారి ఎం.వై.దానం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జూలై 10 పౌర్ణమి సందర్భంగా 8వ తేదీ రాత్రి 8 గంటలకు విజయవాడలో బస్సు బయలుదేరి 9వ తేదీ ఉదయం కాళహస్తి దర్శనం, మధ్యాహ్నం కాణిపాకం, సాయంత్రం గోల్డెన్ టెంపుల్ సందర్శన, అనంతరం 10వ తేదీ ఉదయం అరుణాచలం చేరుకుంటుందన్నారు. గిరి ప్రదక్షిణ పూర్తయిన అనంతరం అదేరోజు సాయంత్రం బయలుదేరి 11వ తేదీ ఉదయం 6గంటలకు విజయవాడ చేరుకుంటుందన్నారు. సూపర్ లగ్జరీ బస్సుల్లో రానుపోను చార్జీ రూ.2,500లు అని తెలిపారు. ప్రతినెలా 30 రోజులు ముందుగానే పౌర్ణమినాడు అరుణాచలం వెళ్లేందుకు రిజర్వేషన్ చేసుకోవచ్చని తెలిపారు. పౌర్ణమి రోజునే కాకుండా 35 మంది ఒక బృందంగా కోరిన తేదీల్లో వారి నివాసాల వద్ద నుంచే బస్సులు నడపనున్నట్టు తెలిపారు. ఆన్‌లైన్ ద్వారా గాని, సమీప బస్‌స్టేషన్‌లోగాని అధీకృత ఏజెంట్ల వద్ద గాని టిక్కెట్లను బుక్ చేసుకోవచ్చన్నారు. వివరాల కోసం 8074298487, 7382898942 ఫోన్ నెంబర్లలో సంప్రదించవచ్చునని తెలిపారు.

న్యాయవాదులకు శిక్షణ అకాడమీపై హర్షం

» ప్రకాశం పంతులు లేదా కోకా సుబ్బారావు పేరు పెట్టాలని బార్ కౌన్సిల్ తీర్మానం

అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని న్యాయవాదుల శిక్షణ కోసం ప్రత్యేక శిక్షణ అకాడమీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై ఏపీ బార్ కౌన్సిల్ హర్షం వ్యక్తం చేసింది. అకాడమీకి స్వాతంత్ర సమరయోధులు, ప్రముఖ న్యాయవాది, ఆంధ్ర రాష్ట్ర తొలి ముఖ్యమంత్రి టంగుటూరి ప్రకాశం పంతులు లేదా ప్రముఖ న్యాయకోవిదులు, తెలుగు రాష్ట్రాల నుంచి తొలి సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిగా వ్యవహరించిన కోకా సుబ్బారావు పేరు పెట్టాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని విజ్ఞప్తి చేసింది. తద్వారా భావి తరాల న్యాయవాదులకు స్ఫూర్తిగా ఉంటుందని పేర్కొంది. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఛైర్మన్ ఎన్.ద్వారకానాథ్‌రెడ్డి అధ్యక్షతన శనివారం నిర్వహించిన సర్వసభ్య సమావేశంలో ఈ మేరకు ఏకగ్రీవ తీర్మానం చేశారు.

సీఎంవోహెచ్‌గా అర్జునరావు

కార్పొరేషన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : వీఎంసీ చీఫ్ మెడికల్ అండ్ హెల్త్ ఆఫీసర్(సీఎంఓహెచ్)గా డాక్టర్ కె.అర్జునరావును నియమించారు. దీనికి సంబంధించి హెల్త్ అండ్ మెడికల్, కుటుంబ సంక్షేమ శాఖ శనివారం ఉత్తర్వులు ఇచ్చింది. ప్రస్తుతం ఆయన ప్రధాన కార్యాలయంలో జాయింట్ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు.



తానా సభలకు హాజరైన తంగిరాల సౌమ్యను సత్కరిస్తున్న ఎన్ఆర్ఐలు

చంద్రబాబు నిర్ణయాలు దేశ ప్రగతికి మార్గదర్శకం

» వాషింగ్‌టన్ డీసీలో ప్రవాసాంధ్రులతో సౌమ్య

నందిగామ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): చంద్రబాబు తీసుకున్న విప్లవాత్మక నిర్ణయాలు దేశ ప్రగతికి మార్గదర్శకమవుతున్నాయని ప్రభుత్వ విప్, నందిగామ ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అన్నారు. తెలుగు వారు ఎక్కడ ఉన్నా అభివృద్ధిపథంలో నడవాలని ఆమె ఆకాంక్షించారు. తానా సభలలో హాజరయ్యేందుకు వాషింగ్‌టన్ డీసీ వెళ్లిన ఆమెకు ప్రవాస భారతీయులు, వారి తల్లిదండ్రులు ఆత్మీయ ఆతిథ్యం అందించారు. అమెరికా రాజధాని మెట్రో ప్రాంతంలో భానుమాగులూరి అధ్యక్షతన సౌమ్యకు అభినందన సభ జరిగింది. ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించిన సౌమ్య మాట్లాడుతూ, చంద్రబాబు ఎంతో దూరదృష్టితో సాంకేతిక విద్యను అందరికీ అందుబాటులోకి తీసుకురావటంతో మీరంతా అమెరికాలో ఉన్నారని చెప్పారు. తెలుగుదేశం పార్టీని కష్టకాలంలో అధికారంలోకి తీసుకురావటానికి మీరు చేసిన కృషి మరపురానిదన్నారు. తానా మాజీ అధ్యక్షుడు సతీష్ వేమన మాట్లాడుతూ, రాజధాని అమరావతి అభివృద్ధిలో ఎన్నారైలు అంతా భాగస్వాములు కావాలని, రాష్ట్రాభివృద్ధి కోసం చంద్రబాబు చేస్తున్న కృషికి మనవంతు సహకారం అందిద్దామన్నారు. గుంటూరు మిర్చి యార్డ్ ఛైర్మన్ మన్నవ సుబ్బారావు మాట్లాడుతూ, పీ4 కార్యక్రమంలో ప్రవాసులంతా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సభకు అధ్యక్షత వహించిన భాను మాగులూరి మాట్లాడుతూ, యువత భవితే రాష్ట్రాని ప్రగతి వంటిదన్నారు. చంద్రబాబు దార్శనికత వల్ల సాంకేతిక రంగంలో గ్రామీణ స్థాయి నుంచి లక్షలాది మంది ప్రపంచవ్యాప్తంగా ఉపాధి అవకాశాలను అందిపుచ్చుకుంటున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో చింతా సతీష్, రమేష్ అవిరినేని, రంజిత్ కోమటి, ఎండూరు సీతారామారావు, కూచి హనుమంతరావు, చామర్తి శ్రావ్య, జాస్తి కిషోర్, చెరుకూరి ఇందుశేఖర్, నంబూరి చంద్రనాథ్, బండి సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు.

కబానా కహానీ

(5వ పేజీ తరువాయి)

ల్యాప్‌టాప్ నుంచి తొలగించేశాడు. అద్విక కార్యాలయంలో సోదాలు నిర్వహించిన పోలీసులు ల్యాప్‌టాప్, కొన్ని రికార్డులను స్వాధీనం చేసుకుని పరిశీలిస్తున్నారు. ల్యాప్‌టాప్‌లో ఎలాంటి డేటా కనిపించకపోవడంతో ప్రశ్నించే సరికి డిలీట్ మాట బయటకొచ్చింది. దీంతో పోలీసులు సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి డేటాను రిట్రీవ్ చేశారు. ఆ సమయంలో ఆదిత్య అమ్మాయిలతో నగ్నంగా మాట్లాడిన దృశ్యాలు బయటపడ్డాయి.

బాధితుల్లో పోలీసు ఉన్నతాధికారి పీఏ

అద్విక ట్రేడింగ్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ఓ పోలీసు ఉన్నతాధికారి సహాయకుడి పేరు బయటకొచ్చింది. ఆయన ఏకంగా రూ.35 లక్షలు పెట్టుబడి పెట్టినట్టుగా తెలిసింది. ఈ మొత్తాన్ని ఎలాగైనా వెనక్కి రప్పించుకోవాలని భావిస్తున్నారు. ఈ బాధ్యతను విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్‌లో పనిచేస్తున్న ఓ కానిస్టేబుల్ భుజాన వేసుకున్నాడు. ఆదిత్యను అదుపులోకి తీసుకున్నప్పటి నుంచి ఈ కానిస్టేబుల్ నిత్యం ఇన్‌స్పెక్టర్లు, ఎస్ఐలు, ఆయా దర్యాప్తు బృందాల్లో ఉన్న సిబ్బందికి ఫోన్ చేస్తున్నాడు. ఓ ఉన్నతాధికారికి పీఏగా వ్యవహరించే వ్యక్తి డబ్బులు ఉన్నాయని, వాటిని ఎలాగైనా ఇప్పించాలని చెబుతున్నాడు. విజిలెన్స్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ లోగడ విజయవాడ టాస్క్‌ఫోర్స్‌లో పనిచేశాడు. కేసు దర్యాప్తు మొత్తం టాస్క్‌ఫోర్స్ అధికారుల కనుసన్నల్లో సాగుతున్నందున ఆ సిబ్బంది ఉదయం నుంచి సాయంత్రం వరకు విరామం లేకుండా ఫోన్లు చేస్తున్నాడు. కాగా, ఉన్నతాధికారి వ్యక్తిగత సహాయకుడే కాకుండా ఈ కానిస్టేబుల్ కూడా పెట్టుబడులు పెట్టినట్టు తెలిసింది. అద్వికలో అన్ని రంగాలకు చెందిన ప్రముఖులు ఉన్నారు. ఇప్పటికే నిఘా విభాగంలో పనిచేస్తున్న ఓ ఇన్‌స్పెక్టర్ పేరు బయటకు వచ్చింది. ఆయన తన బినామీ ద్వారా రూ.50 లక్షలు పెట్టించాడు.

మంచి కిక్కు ఇచ్చే కల్చర్

(5వ పేజీ తరువాయి)

రూపుదిద్దుకుంటున్నాయి. తాజాగా బెంజిసర్కిల్ దగ్గర ఏర్పాటు చేసిన 'రా లిక్కర్ హెవెన్' మద్యం మార్ట్‌లో ఫైవ్‌స్టార్ కేటగిరీ కింద విక్రయాలు జరుగుతున్నాయి. గాయత్రీనగర్‌లో మరో మాల్ ఏర్పాటుకు సన్నాహాలు కూడా జరుగుతున్నాయి. గతంలో ఇలాంటి తరహా లిక్కర్ అవుట్‌లెట్ ఒకటి డీవీ మానర్ రోడ్డులో ఏర్పాటు చేశారు. ఎవరు ఏది తాగినా సరే.. అందరూ డిగ్నిఫైడ్ అనిపించుకునేలా ఈ స్టోర్స్‌ను ఇంద్రభవనాల్లా సిద్ధం చేస్తున్నారు.

రూ.27 వేల నుంచి రూ.7 లక్షల వరకు..

బెంజిసర్కిల్ దగ్గర ఏర్పాటు చేసిన రా లిక్కర్ హెవెన్ లిక్కర్ మార్ట్ ఇంద్రభవనాన్ని తలపిస్తుంది. ఫైవ్‌స్టార్ హోటల్‌ను తలదన్నేలా ఉంటుంది. ఇక్కడ అన్ని రకాల మద్యం బ్రాండ్లు దొరుకుతాయి. స్వదేశీ మద్యంతో పాటు విదేశీ బ్రాండ్లు ప్రత్యేకం. సాధారణ, మధ్యతరగతి ప్రజల నుంచి మిలియనీర్ వరకు అందరూ కొనేందుకు వీలుగా అన్ని రకాల మద్యం బాటిళ్లు ఇక్కడ లభిస్తాయి. సామాన్యులు, మధ్యతరగతి వర్గాలకు కూడా ఇవి అందుబాటులో ఉంచాలన్న ఉద్దేశంతో రూ.190 నుంచి లోకల్ మద్యం బ్రాండ్స్ అందుబాటులో ఉంచారు. ఈ మార్ట్‌లో ప్రీమియం బ్రాండ్లు మాత్రమే అమ్ముతారు. ఈ ప్రీమియం బ్రాండ్లలో రెడ్ వైన్, బ్రాందీ, విస్కీ, రమ్, జిన్, వోడ్కా, బీర్ వంటి విదేశీ బ్రాండ్లు ఉంటాయి. వీటి ధర కనిష్టంగా రూ.27 వేల నుంచి గరిష్టంగా రూ.7.33 లక్షల వరకు ఉంటుంది. ఫ్రాన్స్‌కు చెందిన లూయిస్ 13 బ్రాండ్ బాటిల్ ధర రూ.7.33 లక్షలు ఉంది. రేమి మార్టిన్ బాటిల్ రూ.68 వేలకు లభిస్తుండగా, స్కాట్లాండ్‌కు చెందిన ది సింగిల్ టన్ బాటిల్ రూ.10,300, జర్మనీకి చెందిన జాగర్ మార్టర్ రూ.5,040, మెక్సికోకు చెందిన టకీలా బ్రాండ్ బాటిల్ రూ.4,300, బ్లూ లేబుల్ రూ.37 వేలు, రాయల్ సెల్యూట్ రూ.28 వేలు వంటి బ్రాండ్స్ కూడా ఇక్కడ ఉన్నాయి. త్వరలో ప్రారంభంకానున్న ఈ మార్ట్‌లో మరిన్ని విదేశీ బ్రాండ్స్ వచ్చే అవకాశం ఉంది. నచ్చిన బ్రాండ్స్ కొనుక్కుని ఇంటికి తీసుకెళ్లవచ్చు. తాగటానికి అనుమతి లేదు. వీటితో పాటు విదేశీ సిగార్స్, లైటర్స్ కూడా విక్రయిస్తారు.

ఇంద్ర వైభవం

(5వ పేజీ తరువాయి)

నిర్ణయించారు. దేవదాయ శాఖ ద్వారా ప్రాథమిక ప్రతిపాదన పంపగా, ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. రెండో దశలో కేవలం నాలుగు ఇళ్లే భూ సేకరణలో ఉన్నాయి. గోసాల వద్ద రాజస్థాన్ స్కూల్‌తో పాటు అడపా రాములు మునిసిపల్ స్కూల్ ఉంది. ఇవి రెండూ అతిపెద్ద విస్తీర్ణంలో ఉన్నాయి. ఈ రెంటినీ తొలగించాల్సి ఉంటుంది. అడపా రాములు మునిసిపల్ స్కూల్‌లో పిల్లలు లేక పోవటంతో మూసివేసే పరిస్థితి ఉంది. దీంతో ఈ స్కూల్ తొలగింపు విషయంలో ఇబ్బంది తలెత్తదు. కార్పొరేషన్ అధికారులతో చర్చిస్తే సరిపోతుంది. కాగా, రాజస్థాన్ స్కూల్ నిర్వాహకులతో సంప్రదింపులు జరపాల్సి ఉంటుంది. వీరికి ప్రత్యామ్నాయంగా మరో చోట స్కూల్ నిర్వహించుకోవటానికి అవసరమైన స్థలాన్ని కేటాయించాలి. నాలుగు ఇళ్లే కాబట్టి రెవెన్యూ శాఖ ద్వారా సంప్రదింపులు జరపటం కష్టమైన పనికాదు. ఈ రెండు స్కూళ్ల భూములను తీసుకోగలిగితే, కనకదుర్గానగర్‌ను విస్తరించే అవకాశం తేలికే.



బదిలీల ప్రక్రియలో ఎస్పీ గంగాధరరావు

కొనసాగిన మహిళా పోలీసుల బదిలీల కౌన్సెలింగ్

మచిలీపట్నం టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసు కార్యాలయం సమావేశపు హాలులో 2వ రోజుగా శనివారం మహిళా పోలీసుల బదిలీల కౌన్సెలింగ్ జరిగింది. కృష్ణా, ఎన్టీఆర్, ఏలూరు జిల్లాలకు చెందిన మహిళా పోలీసులు ఈ కౌన్సెలింగ్‌లో పాల్గొన్నారు. 530 మందికి కౌన్సెలింగ్ నిర్వహించారు. మ్యూచువల్, స్పౌజ్, దివ్యాంగుల కోటా, ఆరోగ్య సమస్య ప్రాతిపదికన బదిలీలు చేపడుతున్నామన్నారు.

సజ్జలవి పిచ్చి ప్రేలాపనలు

» దేవినేని ఉమా ఫైర్



గొల్లపూడి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అధికారంలోకి వచ్చిన ఆరు నెలల్లో జైల్లో పెడతామని సజ్జల రామకృష్ణారెడ్డి పిచ్చి ప్రేలాపనలు చేస్తున్నాడని మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం గొల్లపూడిలో మీడియా సమావేశంలో ఉమా మాట్లాడుతూ, వైసీపీ పీకల్లోతు అవినీతిలో కూరుకుపోయిందని, జగన్మోహన్ రెడ్డి బాధ్యతారహితంగా వ్యవహరిస్తే సజ్జల సమర్థించుకుంటూ మాట్లాడుతున్నాడన్నారు. జగన్మోహన్ రెడ్డి డైరెక్షన్‌లో సజ్జల, వై.వి.సుబ్బారెడ్డి, మాజీమంత్రులు, వైసీపీ దుర్మార్గులు కట్టుకథలు అల్లుతున్నారన్నారు. కంటైనర్లతో జగన్మోహన్ రెడ్డి దోచుకున్న వేలకోట్లు కక్కించడానికి కూటమి ప్రభుత్వం సిద్ధంగా ఉందని, పోలీసుల ముందు దోషిగా నిలబడి జైలుకు వెళ్లే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. వాస్తవాలకు సమాధానం చెప్పలేక కూటమి ప్రభుత్వంపై బురదజల్లి జగన్ రోత పత్రికలో అసత్యాలు, అబద్ధాలు వండివారుస్తున్నారని తెలిపారు. సూపర్ సిక్స్ హామీలను ముఖ్యమంత్రి చంద్రబాబు సమర్థవంతంగా అమలు చేస్తున్నారని, రాబోయే నాలుగేళ్లలో రాష్ట్రాభివృద్ధి కోసం అమలు చేయాల్సిన ప్రణాళికలు, స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలపై ప్రభుత్వం దృష్టి సారించిందని తెలిపారు.

మద్యం మత్తులో ట్రావెల్స్ బస్సు డ్రైవర్

» బస్సు సీజ్.. డ్రైవర్‌పై కేసు నమోదు



డ్రైవర్ సత్యనారాయణ, మీటర్‌లో ఆల్కహాల్ శాతం

విజయవాడ, జూన్ 28(ఆంధ్రజ్యోతి) : పూటుగా మద్యం సేవించి ప్రయాణికులను తీసుకెళ్తున్న ప్రైవేటు ట్రావెల్స్ బస్సు డ్రైవర్ ట్రాఫిక్ పోలీసులకు చిక్కాడు. అతడి శరీరంలో మత్తు సాధారణ స్థాయిని మించి ఉండటంతో పోలీసులు కంగుతిన్నారు. ఓ ప్రయివేటు ట్రావెల్స్‌కు చెందిన బస్సు విజయవాడ నుంచి కుప్పం వెళుతోంది. బస్సుకు నెరుసు సత్యనారాయణ డ్రైవర్‌గా ఉన్నాడు. అతడు బెంజ్ సర్కిల్ వద్ద శనివారం 15మంది ప్రయాణికులను ఎక్కించుకున్నాడు. నిబంధనల ప్రకారం ఎంజీ రోడ్డులోకి రాత్రి పదిగంటలు దాటిన తర్వాత మాత్రమే బస్సులు ప్రవేశించాలి. సత్యనారాయణ రాత్రి ఎనిమిది గంటలకే బస్సును ఎంజీ రోడ్డులోకి తీసుకొచ్చాడు. ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం వద్ద ఉన్న 5వ ట్రాఫిక్ స్టేషన్ ఎస్ఐ సాగర్ సిబ్బందితో బస్సును ఆపి డ్రైవర్ సత్యనారాయణను ప్రశ్నిస్తుండగా మద్యం మత్తులో ఉండటంతో ఎస్ఐ బ్రీత్‌ఎనలైజర్‌ను ఊదించగా శరీరంలో 85.1 మిల్లీగ్రాముల మద్యం మత్తు ఉన్నట్టు తేలింది. వెంటనే బస్సును సీజ్ చేసి డ్రైవర్ సత్యనారాయణపై డ్రంక్ అండ్ డ్రైవ్ కేసు నమోదు చేశారు.



రాఘవాపురం వద్ద ప్రభుత్వ స్థలాలను పరిశీలిస్తున్న కేంద్రీయ విద్యాలయాల అధికారులు

నందిగామలో కేవీ నిర్మాణానికి స్థల పరిశీలన

నందిగామ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): కేంద్రీయ విద్యాలయం నిర్మాణం కోసం అనువైన భూమి కోసం అధికారులు అన్వేషణ చేపట్టారు. శనివారం కేంద్రీయ విద్యాలయాల డిప్యూటీ కమిషనర్ మంజునాథ్, ఆర్డీవో కె.బాలకృష్ణ, మునిసిపల్ చైర్‌పర్సన్ మండవ కృష్ణకుమారిలు పల్లగిరి, రాఘవాపురం, హనుమంతుపాలెం తదితర ప్రాంతాల్లోని ప్రభుత్వ భూములను పరిశీలించారు. సుమారు ఐదెకరాల భూమి అవసరం ఉందని డిప్యూటీ కమిషనర్ తెలిపారు. అధునాతన వసతులతో నలభై కోట్లతో కేంద్రీయ విద్యాలయ భవన నిర్మాణం చేపడుతున్నట్టు తెలిపారు. రాఘవాపురం కొండ పక్కన ఉన్న భూమి నిర్మాణానికి అనుకూలంగా ఉందని ఆయన తెలిపారు. రెవెన్యూ అధికారులు భూమిని ఇస్తే తక్షణమే పనులు ప్రారంభిస్తామని చెప్పారు. ఆర్డీవో బాలకృష్ణ మాట్లాడుతూ, త్వరలో నివేదికను జిల్లా కలెక్టర్‌కు అందజేస్తానని, ఆయన అనుమతితో సాధ్యమైనంత త్వరలో భూమిని కేటాయించనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ సురేష్, మునిసిపల్ ఏఈ ఫణికుమార్, పట్టణ టీడీపీ అధ్యక్షుడు ఏచూరి రామకృష్ణ, కత్తురోజు శ్రీనివాసాచారి, విజయవాడ కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపాల్ నాగఫణికుమార్ తదితరులు పాల్గొన్నారు.

పున్నయ్య స్థలాలు హాంఫట్

(5వ పేజీ తరువాయి)

భద్రాచలం రాములవారి గుడికి వెళ్లేవారికి, దుర్గగుడికి వచ్చేవారికి అన్నదానం చేయాలనే సదాశయంతో ఈ ట్రస్టును ఏర్పాటు చేశారు. ఆయన భార్య అన్నపూర్ణను ట్రస్టీగా నియమించారు. ఈ ట్రస్టుకు పశ్చిమ గోదావరి జిల్లా చాటపర్రు గ్రామ పరిధిలో 21 ఎకరాలు, కృష్ణాజిల్లా కేసరపల్లిలో ఏ5.95 సెంట్లు, వన్‌టౌన్ వడ్డేవారి వీధిలో 340 గజాల ఖాళీస్థలం, తవ్వావారి వీధిలో 768 గజాల పెంకుటిల్లుతో పాటు సీతారామపురం సెంటర్ సత్యసాయిబాబా మందిర్ రోడ్డులో 1,400 గజాల్లో పెంకుటిల్లు ఉంది. మరికొంతభాగం ఖాళీగా ఉంది. వీటిపై వచ్చే ఆదాయంతో బాటసారులకు అన్నదానం నిర్వహించాలి. అయితే, వీరికి సంతానం లేకపోవటంతో దత్తత కుమారుడికి ట్రస్ట్ బాధ్యతలు అప్పగించి వీలునామా రాశారు. కాలక్రమేణా 1967, అక్టోబరు 31న ఈ ట్రస్ట్ దేవదాయ శాఖ పరిధిలోకి వెళ్లింది. 1992లో దేవదాయ శాఖ అధికారులు అన్నసత్రానికి ఈవోను నియమించారు. పున్నయ్య దంపతుల దత్తత కుమారుడు చనిపోవటంతో ఆ బాధ్యతలు అతని ఇద్దరి కుమారులు చూస్తున్నారు. ఇద్దరిలో పెద్దవాడైన పూర్ణచంద్రరావు ట్రస్టుకు ఈవోను నియమించటాన్ని వ్యతిరేకించగా, రెండో కుమారుడు హరినారాయణ ట్రస్ట్ దేవదాయ శాఖ ఈవో పరిధిలోనే ఉండాలని చెప్పడంతో ఇద్దరి మధ్య భేదాభిప్రాయాలు తలెత్తాయి. దీనిపై పూర్ణచంద్రరావు 1999లో జిల్లాకోర్టును ఆశ్రయించారు. పూర్ణచంద్రరావు అన్నసత్రం ట్రస్టీగా కొనసాగేందుకు కోర్టు అనుమతినిచ్చింది. దీనిపై దేవదాయ శాఖ అధికారులు 2005లో హైకోర్టును ఆశ్రయించగా, స్టేటస్కో ఇచ్చింది. నాటి నుంచి ఆ కేసు కోర్టులోనే పెండింగ్‌లో ఉంది. ఈ క్రమంలో 2016లో ట్రస్టుకు చెందిన ఓ మహిళ సీతారామపురంలోని 1,400 గజాల స్థలంలో 600 గజాలను గాబ్రియేల్ అనే వ్యక్తికి విక్రయించింది. అతను ఆ మహిళకు ముందుగా రూ.10 లక్షలు అప్పు ఇచ్చి, ప్రామిసరీ నోట్లు, చెక్కులు తీసుకున్నట్లు, ఆమె సకాలంలో డబ్బు చెల్లించకపోవటంతో 600 గజాల స్థలాన్ని దొంగ రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిసింది. గాబ్రియేల్ ఆ స్థలాన్ని 2023లో వెంకటేశ్వరరెడ్డి అనే వ్యక్తికి విక్రయించినట్లు, అతను ప్రస్తుతం మరొకరికి విక్రయించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్టు సమాచారం. ఇంత వ్యవహారం జరుగుతున్నా అధికారులు మాత్రం తమకేమీ తెలియదన్నట్టుగా వ్యవహరిస్తుండటం వెనుక అనేక అనుమానాలు కలుగుతున్నాయి.

చాటపర్రు స్థలం కూడా..

మరోవైపు ట్రస్టుకు సంబంధించిన పశ్చిమగోదావరి జిల్లా చాటపర్రు గ్రామ పరిధిలోని 21 ఎకరాలకు గానూ ఏ12.09 సెంట్లే మిగిలిందని అధికారులు చెబుతున్నారు. 2018లో నాటి ఈవో చాటపర్రు గ్రామంలో ఉన్న భూమిని పరిశీలించి 21 ఎకరం ఉన్నట్టు రిపోర్టులో రాశారు. మిగిలిన భూమి ఏమైందో దేవదాయ శాఖ అధికారులకే తెలియాలి. ప్రస్తుతం భూములకు కౌలు కూడా చెల్లించట్లేదనే ఆరోపణలు వస్తున్నాయి. బకాయిలు సుమారు రూ.2 కోట్ల వరకు ఉండొచ్చని తెలుస్తోంది.

ఆస్తులను కాపాడుతున్నాం

కూనాల పున్నయ్య అన్నసత్రం భూములను అన్యాక్రాంతం కాకుండా తగిన చర్యలు తీసుకుంటున్నాం. అన్నసత్రం భూముల వివరాలను పైస్థాయి అధికారులకు తెలియజేశాం. వారి ఆదేశాల మేరకు తగిన చర్యలు తీసుకుంటాం.

వై.సీతారామయ్య, కూనాల పున్నయ్య అన్నసత్రం ఈవో

ఇద్దరూ ఇద్దరే..

(5వ పేజీ తరువాయి)

కామాంధుడు మళ్లీ వస్తే..

ఎక్కడున్నావ్, ఏం చేస్తున్నావ్, ఏ డ్రెస్ వేసుకున్నావ్, చీర కట్టుకున్నావా, చుడీదార్ వేసుకున్నావా.. జోనల్ ఇన్‌చార్జిగా కొన్నాళ్లు పనిచేసిన ఓ పశువైద్యుడు కమ్ కామాంధుడు మహిళా ఉద్యోగులతో రాత్రిపూట మాట్లాడిన మాటలివి. అప్పట్లో ఈ కామాంధుడి గురించి నగరపాలక సంస్థలో తీవ్రస్థాయిలో విమర్శలు వచ్చాయి. తన కింద పనిచేసే మహిళా ఉద్యోగులను ఇబ్బందులకు గురిచేసేవాడు. వైసీపీ పాలనలో తనకు పైస్థాయిలో పలుకుబడి ఉందని పలువురు అధికారులను బెదిరించేవాడు. కబేళాలో ఎటువంటి టెండర్లు లేకుండా సొంత కలెక్షన్లు చేసి అందినకాడికి దండుకున్నాడని, షెడ్ల ఏర్పాటు పేరట లక్షలు కాజేశాడనే ఆరోపణలు ఉన్నాయి. అటువంటి వసూల్ రాజా మళ్లీ వస్తున్నాడని తెలిసి ఉద్యోగులు కంగుతింటున్నారు. పశువుల డాక్టర్‌తో ఏ ఇబ్బందులు ఎదుర్కోవాలోనని మహిళలు ఆందోళన చెందుతున్నారు. ఓ అధికార పార్టీ ఎమ్మెల్యే సిఫార్సులేఖతో సచివాలయం చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నట్టు తెలిసింది.

మహిళా అధికారిణి పైరవీలు

వసూలులో మహిళా అధికారిణి ఆల్ టైమ్ రికార్డు సృష్టించింది. నగరంలో పేద, మధ్య తరగతి ప్రజలకు పథకాలు, డ్వాక్రా రుణాలు, ఇతర సంక్షేమ కార్యక్రమాలన్నీ యూసీడీ విభాగం నుంచే జరుగుతాయి. ఈ మహిళా అధికారిణి ఉన్న సమయంలో ఈ విభాగాన్ని కలెక్షన్‌కు కేంద్రంగా మార్చేసింది. తనకింద పనిచేసే సోషల్ వర్కర్లను, రిసోర్స్‌పర్సన్లను కలెక్షన్ ఏజెంట్లుగా మార్చి వసూలు చేసేదన్న ఆరోపణలు ఉన్నాయి. తన తప్పులు కప్పిపుచ్చుకోవడానికి మేయర్‌కు విలువైన గిఫ్టులు కూడా ఇచ్చేదని వీఎంసీలో బహిరంగంగానే మాట్లాడుకుంటున్నారు. సంక్షేమ పథకాలతో పాటు డ్వాక్రా రుణాలకు ఓ టారిఫ్ పెట్టి మరీ వసూలు చేసిందని ఆరోపణలు ఉన్నాయి. నెలనెలా తనకు ఇవ్వాల్సింది ఇవ్వకుంటే కిందిస్థాయి ఉద్యోగులను తీవ్ర ఇబ్బందులకు గురిచేసేదన్న విమర్శలూ ఉన్నాయి.

ఇంద్రకీలాద్రికి రోప్‌వే

(5వ పేజీ తరువాయి)

భవానీ ఐల్యాండ్‌కు రెండోది. కానీ, ఈ ప్రతిపాదనలు పట్టాలెక్కలేదు. మొదటి ప్రతిపాదన ఆగమశాస్త్రానికి విరుద్ధంగా ఉందని వైదిక కమిటీ అభ్యంతరం వ్యక్తం చే సింది. రెండో ప్రతిపాదనకు అలైన్‌మెంట్ అక్కన్న, మాదన్న గుహల పైగా వెళ్తుండటంతో ఆర్కియాలజీ శాఖ అభ్యంతరం తెలిపింది. ఈసారి మాత్రం దేవస్థాన అధికారులు ఎవరికీ అభ్యంతరం లేకుండా ఉండేలా సీతమ్మవారి పాదాల నుంచి ఓం టర్నింగ్ వరకు, తిరిగి ఓం టర్నింగ్ నుంచి భవానీ ద్వీపం వరకు రోప్‌వేను ప్రతిపాదించారు. రాష్ట్రంలోనే రెండో అతిపెద్దదైన దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానానికి ఇటీవల భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. రోప్‌వే ప్రాజెక్టు అందుబాటులోకి వస్తే మరింత పెరిగే అవకాశం ఉంటుంది.



దుర్గగుడి కొండ దిగువన ఆక్రమణలు తొలగిస్తున్న దేవస్థానం సిబ్బంది

దుర్గగుడి స్థలంలో ఆక్రమణల తొలగింపు

ఇంద్రకీలాద్రి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : దుర్గగుడి స్థలంలో టోల్ గేటు నుంచి రథం సెంటర్ వరకు ఉన్న ఆక్రమణలను దేవస్థానం అధికారులు వన్‌టౌన్ పోలీసులతో కలిసి శనివారం తొలగించారు. శనివారం ఈవో వీకే శీనానాయక్ తన ఛాంబర్‌లో ఆర్డీవో, పశ్చిమ తహసీల్దార్, ఏసీపీ, వీఎంసీ టౌన్ ప్లానింగ్ అధికారులతో సమావేశం నిర్వహించి ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆక్రమణలు తొలగించటానికి సహకరించాలని కోరారు. దీంతో అధికారులు ఆక్రమణలు తొలగించారు. శనివారం ఉదయం దేవస్థానం అధికారులు ఆక్రమణలు తొలగించాలని వ్యాపారస్తులకు సూచించారు. వారు స్పందించకపోవటంతో అధికారులు పశ్చిమ ఏసీపీ దుర్గారావు, రెవెన్యూ, వీఎంసీ అధికారులతో కలిసి ఆక్రమణలను తొలగించే కార్యక్రమం చేపట్టారు. దుర్గగుడి అధికారులు తమ షాపులను తొలగిస్తున్నారంటూ వ్యాపారస్తులు భవానీపురంలోని పశ్చిమ నియోజకవర్గం కార్యాలయ కార్యదర్శి ప్రత్తిపాటి శ్రీధర్‌ను కలిసి తమ గోడు చెప్పుకున్నారు.

బ్రాయిలర్ ధరలు
అమరావతి (రూ.లలో)
బ్రాయిలర్ బర్డ్ 102,110, 121
చికెన్ విత్ స్కిన్ 194
చికెన్ స్కిన్‌లెస్ 204
నెక్ కోడిగుడ్ల ధర (100)
విజయవాడ జోన్ రైతు ధర రూ. 560

తెనాలి నియోజకవర్గ పరిశీలకుడిగా గొట్టిపాటి



పటమట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): టీడీపీ సంస్థాగత ఎన్నికలకు తెనాలి నియోజకవర్గ పరిశీలకుడిగా టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి గొట్టిపాటి రామకృష్ణ ప్రసాద్ నియమితులయ్యారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో పామర్రు నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడిగా ఆయన బాధ్యతలు నిర్వహించారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఏలూరు జిల్లా ఎన్నికల పరిశీలకునిగా పని చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తామన్నారు.



4, 5, 6 తేదీల్లో బిటో ఎక్స్‌పో-2025

లబ్బీపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): యువ పారిశ్రామికవేత్తలను తీర్చిదిద్దడంతో పాటు వ్యాపార రంగంలో అభివృద్ధిపై అవగాహన కల్పించాలనే ఉద్దేశంతో జూలై 4,5,6న బిటో ఎక్స్‌పో 2025 నిర్వహిస్తున్నట్టు బిజినెస్ బై బ్రాహ్మిణ్ ట్రస్ట్ వ్యవస్థాపకుడు, జాతీయ అధ్యక్షుడు బుర్రా ఫణిచంద్ర, కార్యదర్శి పరిమి గిరిబాబు తెలిపారు. లబ్బీపేటలోని ఓ హోటల్‌లో ఎక్స్‌పో పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ట్రస్టు ఆధ్వర్యంలో ఈ ఎక్స్‌పో గాంధీనగర్‌లోని ఫిల్మ్ చాంబర్ హాలు నందు జరుగుతుందని, ఉదయం 10 నుంచి సాయంత్రం 7 గంటల వరకు జరిగే ఎక్స్‌పోకు ఎలాంటి ప్రవేశ రుసుము లేదని తెలిపారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో ట్రస్టు సభ్యుడు మాజీ మేయర్ జంధ్యాల శంకర్, చెరువు రామకోటయ్య, బసవరాజు, శ్రీనివాస్, కుందా రామనారాయణ పాల్గొన్నారు.

సర్టిఫికెట్ కోర్సులు పూర్తిచేయాలి

● డాక్టర్ భాగ్యలక్ష్మి ● ఘనంగా జాతీయ గణాంకశాస్త్ర దినోత్సవం

గుణదల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యాభ్యాసంతోపాటు సర్టిఫికెట్ కోర్సులు పూర్తిచేస్తేనే భవిష్యత్ ఉంటుందని ఎస్ఆర్ఆర్ అండ్ సీవీఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే భాగ్యలక్ష్మి తెలిపారు. 19వ జాతీయ సాంఖ్యాక శాస్త్ర దినోత్సవాన్ని పురస్కరించుకుని ఎస్ఆర్ఆర్ కళాశాలలో వ్యాసరచన, పోస్టర్ ప్రజంటేషన్ పోటీలను శనివారం నిర్వహించారు. కళాశాలలో బేసిక్ స్టాటిస్టిక్స్ విత్ ఆర్ నందు సర్టిఫికెట్ కోర్సును పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కే భాగ్యలక్ష్మి మాట్లాడుతూ డిగ్రీ పూర్తి చేసేవారు విద్యాభ్యాసం పూర్తి చేసుకునేలోపు ఇతర సర్టిఫికెట్ కోర్సులను పూర్తి చేసుకుంటే మంచి భవిష్యత్ ఉంటుందన్నారు. సాంఖ్యాక శాస్త్ర విభాగాదిపతి కే అశోక్, గణితశాస్త్ర విభాగాదిపతి కేవీ నాగలక్ష్మి, అధ్యాపకులు డాక్టర్ జీ లలిత, డాక్టర్ రజనీకాంత్, ఎం సుధాకర్, పీ రమేష్ పాల్గొన్నారు.

నలంద డిగ్రీ కళాశాలలో

లబ్బీపేట: జాతీయ గణాంకశాస్త్ర దినోత్సవం నలంద డిగ్రీ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన సెమినార్‌లో ముఖ్య అతిథిగా పాల్గొన్న డేటా సైంటిస్ట్ కావ్య మాట్లాడుతూ విద్యార్థులకు స్టాటిస్టిక్స్ నేర్చుకోవడం ద్వారా అనేక ఉపాధి అవకాశాలున్నాయని, స్టాటిస్టిక్స్ నిష్ణాతులైన మహనీయులు పీసీ మహల్‌నాబిస్ వివిధ రంగాల్లో చేసిన సేవలను వివరించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ ఎం అనురాధ మాట్లాడుతూ ప్రొఫెసర్ పీసీ మహల్‌నాబిస్ జయంతిని పురస్కరించుకొని 2007 నుంచి ప్రతి ఏడాది నేషనల్ స్టాటిస్టిక్స్ డే నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పలు పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. అధ్యాపకులు పీ రవి కుమార్ ఎ.గాయత్రి పాల్గొన్నారు.





ఎస్ఆర్ఆర్ కళాశాలలో బేసిక్ స్టాటిస్టిక్స్ విత్ ఆర్‌లో కోర్సు పూర్తి చేసిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న ప్రిన్సిపాల్ డాక్టర్ భాగ్యలక్ష్మి, నలంద డిగ్రీ కాలేజీలో గెలుపొందిన విద్యార్థులకు మెడల్, ప్రశంసా పత్రాలను అందజేస్తున్న డేటా సైంటిస్ట్ కావ్య, ప్రిన్స్‌పాల్ అనురాధ

పీబీ సిద్ధార్థలో..

మొగల్రాజపురం: పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్సు కళాశాలలో జాతీయ గణాంక దినోత్సవాన్ని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆచార్య నాగార్జున యూనివర్శిటీ సాంఖ్యాక శాస్త్ర విభాగంలో పనిచేసిన ఆచార్య బీకే విక్టర్ బాబు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. సాఖ్యాంక శాస్త్రం వివిధ రంగాలలో ఎలా ఉపయోగపడుతుందో ఉదాహరణలతో వివరించారు. క్వాంటమ్ టెక్నాలజీలో సాంఖ్యాక శాస్త్రం ఎలా ఉపయోగిస్తారో చెప్పారు. అనంతరం బీఎస్సీ (హెచ్) - స్టాటిస్టిక్స్ ద్వితీయ, తృతీయ సంవత్సరంలో అత్యధికమార్కులు సాధించిన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలను అందించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ రాజేష్ సి జంపాల, కళాశాల అకడమిక్ అధికారి సాంఖ్యాకశాస్త్ర విభాగాధిపతి జి.చక్రవర్తి, విద్యార్థులు పాల్గొన్నారు.

న్యాయానికి అండగా నిలవాలి: చలసాని

● ఐఏఎల్ ఆధ్వర్యంలో జ్యుడీషియల్ ఉద్యోగ నమూనా పరీక్ష

విజయవాడ లీగల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): న్యాయమూర్తులుగా పదోన్నతి పొందే అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించేందుకు ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్), బెజవాడ బార్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నమూనా పరీక్షలు శనివారం సిటీ సివిల్ కోర్టులో నిర్వహించారు. 2 గంటల పాటు నిర్వహించిన పరీక్షకు 60 మంది న్యాయ విద్యార్థులు హాజరయ్యారు. పరీక్షను ఐఏఎల్ జాతీయ ప్రధాన కార్యదర్శి చలసాని అజయ్‌కుమార్, బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఏకే బాషా ప్రారంభించారు. చలసాని మాట్లాడుతూ న్యాయవాద వృత్తి ఎంతో పవిత్రమైందని, దానికి కళంకం తీసుకురాకూడదని, సమాజానికి న్యాయపరమైన సేవలు అందించాలని సూచించారు. ఐఏఎల్ ఆవిర్భావం, నిర్వహిస్తున్న కార్యక్రమాలను వివరించారు. బాషా మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఉత్తీర్ణత సాధించి భవిష్యత్తులో న్యాయమూర్తులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ఐఏఎల్ ఉపాధ్యక్షుడు ఉప్పలపాటి శివప్రసాద్ రాజు అధ్యక్షత వహించగా జిల్లా అధ్యక్షుడు ఎంఏ షరీఫ్, ప్రతినిధులు ఈఎస్ ప్రసాద్, బోను జయమ్మ, జేవీ రావు, సురేష్, బీబీఏ కార్యదర్శి కేవీ రంగారావు పాల్గొన్నారు.

రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న కూటమి ప్రభుత్వం

● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

లబ్బీపేట, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): వైఎస్ జగన్మోహన్ రెడ్డి 5 ఏళ్లలో చేసిన అవినీతి, కుళ్లును కూటమి ప్రభుత్వం కడుగుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తోందని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ అన్నారు. లబ్బీపేట 19వ డివిజన్‌లో శనివారం పర్యటించిన ఆయన స్థానిక సమస్యలను తెలుసుకోవడంతో పాటు డివిజన్‌లోని రెండు నిరుపేద కుటుంబాల జీవనోపాధికి రూ.50వేలు విలువైన బజ్జీ కొట్టు, టిఫిన్ బండిని ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం వచ్చాక అభివృద్ధి అంటే ఏమిటో ప్రజలకు చూపిస్తున్నామని, ప్రతి రహదారిని మరమ్మతులు చేయడంతో పాటు పెన్షన్ పెంపు, తల్లికి వందనంతో పాటు సూపర్ సిక్స్ అన్ని పథకాలను దాదాపు అన్నీ ప్రజలకు అందిస్తుందన్నారు. డివిజన్ అధ్యక్షుడు భాగం సాయి ప్రసాద్, ఎస్ ఫిరోజ్ పాల్గొన్నారు.



స్థానిక సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

22వ డివిజన్ ప్రజా కాపునాడు కమిటీ నియామకం

కృష్ణలంక, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ప్రజా కాపునాడు సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యర్రంశెట్టి అంజిబాబు శనివారం కృష్ణలంక 22వ డివిజన్ కమిటీని నియమించారు. ప్రజా కాపునాడు 22వ డివిజన్ కమిటీ అధ్యక్షుడిగా అల్లంశెట్టి వెంకట్, గౌరవాధ్యక్షుడిగా కర్రి సాంబయ్య, ప్రధాన కార్యదర్శిగా జూపూడి శ్రీనివాసరావు, ఉపాధ్యక్షులుగా గుండపు వెంకట అప్పారావు, పలిశెట్టి రాజేష్, కార్యదర్శులుగా పైడి మోహన్‌రావు, అల్లంశెట్టి చిన సుబ్బారావు, కొప్పిశెట్టి బాలమురళీకృష్ణ, కె.ఫణికుమార్‌ను నియమించారు.

పేద విద్యార్థికి లారీ ఓనర్స్ ఆర్థిక సాయం

బెంజ్‌సర్కిల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): లాసెట్‌లో పదో ర్యాంకు సాధించిన మహ్మద్ ఇంతియాజ్‌కి విద్యాసాయంగా రూ.10వేల చెక్కును ది కృష్ణా డిస్ట్రిక్ లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు నాగుమోతు రాజా శనివారం లారీ ఓనర్ల సంఘం హాలులో అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గూడవల్లిలోని తమ డ్రైవింగ్ స్కూల్‌లో ఇంతియాజ్ తండ్రి కరీముల్లా హెవీ వెహికల్ నడపడంలో శిక్షణ తీసుకున్నారన్నారు. అనంతరం లారీ ఓనర్స్ సంఘం మేకా వీర సూర్యనారాయణ రూ.5వేల నగదును ఇంతియాజ్‌కు అందజేశారు. లారీ ఓనర్స్ ఫౌండేషన్ ఇచ్చే స్కాలర్‌షిప్‌పత్రం అందజేశారు. ఏటా రూ.8వేలు ఇంతియాజ్‌కు జమవుతాయన్నారు. రాష్ట్ర హోటళ్ల సంఘం అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన ఐరా హోటల్ అధినేత పర్వతనేని రవికుమార్‌ను పాలవర్గ సభ్యులు సత్కరించారు. సభ్యులు పాల్గొన్నారు.

ఈ-కామర్స్‌లో ఆహార ఉత్పత్తులకు డిమాండ్

బెంజ్‌సర్కిల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మహిళలు ఇంట్లోనే ఆహార ఉత్పత్తులు తయారుచేసి ఈ-కామర్స్‌లో ప్రపంచ వ్యాప్తంగా మార్కెంటింగ్ చేసే అవకాశం ఉందని, విద్యార్థి దశలోని యువతకు కోవె స్వయం ఉపాధి మార్గా లు, నైపుణ్యాభివృద్ధి, వ్యాపారస్తులుగా శిక్షణా కల్పిస్తున్నామని కోవె ఇండియా రాష్ట్ర అధ్యక్షురాలు యార్లగడ్డ గీతా శ్రీకాంత్ అన్నారు. శనివారం స్టెల్లా కళాశాలలో కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంట్రపెన్యూర్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ చాప్టర్ ఆధ్వర్యంలో 45రోజుల పాటు పళ్లరసాలు తయారీపై వ్యాపార నైపుణ్యాభివృద్ధి శిక్షణా తీసుకున్న విద్యార్థినులకు శిక్షణా ధ్రువీకరణ పత్రాలను ప్రిన్సిపాల్ జసింతా క్వాడ్రస్ అందజేశారు. ఫ్యాప్సియా అధ్యక్షుడు వాసిరెడ్డి మురళికృష్ణ, కోవె ప్రాజెక్ట్ కో-ఆర్డినేటర్ కొడాలి కవిత, కార్యదర్శి విజయలక్ష్మి, రాజమణి, మాలతీ, సరళ జాస్తి, ఫుడ్ సైన్స్ ఉపాధ్యాయురాలు భవానీ, విద్యార్థినులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్‌లో ప్రవేశాలకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్

భారతీనగర్: జిల్లాలోని పాలిటెక్నిక్ కళాశాలల్లో అందుబాటులో ఉన్న సీట్ల భర్తీకి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో శనివారం కౌన్సెలింగ్ నిర్వహించినట్టు ప్రిన్సిపాల్ ఎం.విజయపారథి ఒక ప్రకటనలో తెలిపారు. కౌన్సెలింగ్ నిర్వహించిన మూడు కేంద్రాలలో 492 మందికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేశారన్నారు. ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో 84 మందికి, ఎస్ఆర్ఆర్, సీవీఆర్ కళాశాలలో 217 మందికి, లయోలా కళాశాలలో 191 మందికి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ చేసినట్లు తెలిపారు.

మందులతో క్యాన్సర్‌ను తగ్గించుకోవచ్చు

● ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమా

గుణదల, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ ప్రాణాంతకమైన వ్యాధి కాదని ప్రాథమిక స్థాయిలోనే గుర్తిస్తే మందులు వాడి తగ్గించుకునే అవకాశం ఉంటుందని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే బొండా ఉమా అన్నారు. గుణదల్లోని హెచ్‌సీజీ కేన్సర్ హాస్పిటల్ నందు కేన్సర్ నిర్ధారణ, నివారణకు అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం గల యంత్రాన్ని శనివారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ మిషన్ వల్ల మనిషి శరీరంలో ఏ భాగంలో కేన్సర్ కణాలున్నాయన్నది గుర్తించి ఏ స్థాయిలో ఉందన్నది తెలుసుకునే అవకాశం ఉందన్నారు. ఇలాంటి అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం గల యంత్రాన్ని అందుబాటులోకి తేవడం గర్వించదగిన విషయమన్నారు. ప్రభుత్వ పరంగా డాక్టర్ ఎన్టీఆర్ వైద్యసేవ పథకం ద్వారా 140 రకాల వ్యాధులకు ఉచితంగా సేవలందిస్తున్నట్టు తెలిపారు. హెచ్‌సీజీ కేన్సర్ హాస్పిటల్ రీజినల్ డైరెక్టర్ గోపీచంద్ మాట్లాడుతూ ఆధునాతన సెట్‌స్కాన్ యంత్రం ద్వారా కేన్సర్ కణాలు కణితలు శరీరంలో ఎక్కడున్నా సులభంగా గుర్తించవచ్చన్నారు. హాస్పిటల్ ముఖ్య కార్యదర్శి యువకిషోర్, హాస్పటల్ సిబ్బంది పాల్గొన్నారు.



కేన్సర్ నిర్ధారణ పరికరాన్ని ఆవిష్కరిస్తున్న ఉమా

కోల్‌కత్తా ఘటనలో నిందితుల్ని శిక్షించాలి: బాషా

విజయవాడ లీగల్: కోల్‌కతాలో న్యాయశాస్త్ర విద్యార్థినిపై అత్యాచారం చేసిన ఘటనలో నిందితుల్ని కఠినంగా శిక్షించాలని బెజవాడ బార్ అధ్యక్షుడు ఏకే బాషా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సంఘటనను నిరసిస్తూ బెజవాడ బార్ అసోసియేషన్ న్యాయవాదులు సోమవారం నల్లజెండాలు, రిబ్బన్లు ధరించి విధులకు హాజరుకావాలని పిలుపునిచ్చారు.

లారీ యజమానుల సమస్యలు తీర్చాలని మంత్రికి వినతి



మంత్రి రాంప్రసాద్ రెడ్డికి తమ సమస్యలు వివరిస్తున్న లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు, చిత్రంలో ఎంపీ చిన్ని

వన్‌టౌన్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): లారీ యజమానులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి ఎం.రాంప్రసాద్ రెడ్డికి లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. శనివారం విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని) ఆధ్వర్యంలో ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు మంత్రిని ఆయన క్యాంపు కార్యాలయంలో కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా లారీ యజమానులు తమకు ఎదురవుతున్న ప్రధాన సమస్యలను విన్నవించారు. క్రషర్ పరిశ్రమపై ఆధారపడి నడిచే లారీ వ్యాపారుల పరిస్థితులు, పెట్రోల్ ధరల పెరుగుదల వల్ల వ్యయ భారం, టోల్ గేట్ల వద్ద వేధింపులు, రోడ్డు గ్రాంట్లు ఆలస్యం, ఎ.టి.ఎస్. సెంబర్‌ల కారణంగా ఎదురవుతున్న సమస్యలను మంత్రి దృష్టికి తెచ్చారు. స్పందించిన మంత్రి రాంప్రసాద్ రెడ్డి సమస్యల పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ట్రైలర్ అసోసియేషన్ సెక్రటరీ సూరపనేని సురేష్, ఆంధ్రప్రదేశ్ లారీ ఓనర్స్ అసోసియేషన్ జాయింట్ సెక్రటరీ శ్రీనివాస్ రెడ్డి, జిల్లా జాయింట్ సెక్రటరీ రావి శరత్, ఎ.సుభాష్ చంద్రబోస్ పాల్గొన్నారు.

రాజమండ్రి కోర్టుకు మాజీ మంత్రి ఉమా



విజయవాడ లీగల్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు రాజమండ్రిలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టుకు శనివారం హాజరయ్యారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రస్తుత మంత్రి కొల్లు రవీంద్రను అక్రమంగా అరెస్టు చేసిన సందర్భంలో రాజమండ్రి సెంట్రల్ జైలులో ఉన్న రవీంద్రను పరామర్శించేందుకు వెళ్లిన దేవినేని ఉమా, ఇతర నేతలపై పెట్టిన అక్రమ కేసు విచారణ నిమిత్తం ఆయన కోర్టుకు హాజరయ్యారు.

హ్యూమన్ రైట్స్ మిషన్ పేరుతో డబ్బు వసూలుకు యత్నం

- ఇళ్ల నిర్మాణాలకు అనుమతుల్లేవని పెదపులిపాకలో దబాయింపు
- స్థానికులు నిలదీయడంతో పరారైన ఇద్దరు వ్యక్తులు



అక్రమ వసూళ్లకు యత్నించింది వీరే (వృత్తంలో)

పెనమలూరు, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): "మీ బిల్డింగ్‌కు పర్మిషన్ లేదు. మీ బిల్డింగ్ 50 గజాల కంటే ఎక్కువ స్థలంలో నిర్మించారు. కానీ ప్రభుత్వ అనుమతులు లేవు" అంటూ ఇద్దరు వ్యక్తులు పెదపులిపాకలోని కరకట్ట దిగువన ఎంవీఆర్ నగర్, శ్రీనగర్ కాలనీల్లో ఇళ్ల యజమానులను బెదిరించి డబ్బులు డిమాండ్ చేశారు. కాసేపు భయపడ్డ స్థానికులు తర్వాత ఎవరు మీరు ఎక్కడి నుంచి వచ్చారు అని నిలదీయడంతో వారు తాము హ్యూమన్ రైట్స్ మిషన్ నుంచి వచ్చామని, ఇక్కడ భవనాలకు ఎవరు అనుమతులు ఇచ్చారంటూ దబాయించడంతో మీ ఐడీ కార్డులు చూపించమని స్థానికులు అడిగారు. దీంతో వారు తమ ఐడీ కార్డులు చూపించారు. వెంటనే స్థానికులు అసలు భవనాలతో మీకేంపని, పోలీసులను పిలుస్తాం అనడంతో వారు అక్కడి నుంచి పలాయనం చిత్తగించారు. వారి వద్ద ఉన్న ఐడీ కార్డులు, నోట్‌బుక్‌ను స్వాధీనం చేసుకొన్న స్థానికులు నోట్‌బుక్‌లో ఉన్న విషయాలను చూసి అవాక్కయ్యారు. ఐడీ కార్డుల్లో ఒక దాన్లో నల్లమోతు ప్రసన్న అని, మరొక దాంట్లో కొచ్చర్ల నిర్మల అని ఉంది. నోట్‌బుక్‌లో ఈ అయిదు నెలలు కేవలం అక్రమ భవనాలపైనే దృష్టి పెట్టి, ఒక్కొక్కరు పాతిక లక్షల రూపాయలు వసూళ్లు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు తెలిసింది. ఎవరో తెరవెనుక వ్యక్తులు వీరిని వసూళ్లకు పంపినట్లు సమాచారం.

9న సమ్మెను జయప్రదం చేయండి

- ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి

గాంధీనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలను నిరసిస్తూ జూలై 9న జరగనున్న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘాల సమన్వయ సమితి కన్వీనర్ వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. శనివారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఇండో అమెరికన్ ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌ను తిరస్కరించాలని, తద్వారా దేశీయ రైతాంగానికి రక్షణ కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోలార్ తదితర పరిశ్రమల ఏర్పాటుకు పంట భూములను ప్రైవేట్ కంపెనీలకు కట్టబెట్టడం దుర్మార్గమని ధ్వజమెత్తారు. అనేక పోరాటాల ద్వారా కార్మికులు సాధించుకున్న హక్కులను హరిస్తూ నాలుగు లేబర్ కోడ్‌లను కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతు సంఘాల నాయకులు పి.జమలయ్య, వై.కేశవరావు, ఎం.వెంకటరెడ్డి, వి.వెంకటేశ్వర్లు, మరీదు ప్రసాద్‌బాబు మాట్లాడారు.

సింగయ్య కుటుంబానికి జగన్ రూ.2 కోట్లు చెల్లించాలి

- ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు

గాంధీనగర్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం జగన్ రెంటపాళ్ల గ్రామ పర్యటనలో కారు కింద పడి మృతి చెందిన మాదిగ సామాజిక వర్గానికి చెందిన సింగయ్య కుటుంబానికి రూ.2 కోట్ల నష్ట పరిహారం చెల్లించాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ డిమాండ్ చేశారు. గాంధీనగర్‌లోని సంఘం కార్యాలయంలో శనివారం ఆయన మాట్లాడారు. సింగయ్య మృతికి జగన్ నిర్లక్ష్యమే కారణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నికల బెట్టింగ్‌లో ఓడిపోయి ఆత్మహత్య చేసుకున్న అగ్రకులానికి చెంది వ్యక్తి కుటుంబాన్ని పరామర్శించడానికి వెళ్లిన జగన్, తనను చూడడానికి వచ్చి తనపై పూలు జల్లే క్రమంలో కారు కింద పడిన దళితుడైన సింగయ్య మృతి చెందితే ఆ కుటుంబాన్ని ఎందుకు పరామర్శించలేదని ప్రశ్నించారు. జగన్‌కు దళితులంటే ఎంత చులకనో మరోసారి రుజువైందని మండిపడ్డారు. సింగయ్య కుటుంబానికి న్యాయం చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు.

మత్తుమయం!

స్పిరిట్‌కు బానిసలవుతున్న యువత



- పెరిగిన స్పిరిట్, వైట్‌నర్, నిద్ర మాత్రల వాడకం
- డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండానే మెడికల్ షాపుల్లో విపరీతంగా లభ్యం!
- మొక్కుబడిగా డ్రగ్ ఇన్‌స్పెక్టర్ల పర్యవేక్షణ
- మరణాలు సంభవిస్తున్నాయని విజిలెన్స్ కమిటీ సభ్యుల ఆందోళన

(ఆంధ్రజ్యోతి, విజయవాడ): మెడికల్ షాపుల్లో తక్కువ ధరకు మత్తు పదార్థాలు (స్పిరిట్, వైట్‌నర్, నిద్ర మాత్రలు) లభిస్తుండటంతో యువకులు వాటికి బానిసలవుతున్నారు. ఉజ్వల భవిష్యత్‌ను నాశనం చేసుకోవడమే కాకుండా ప్రాణాలు కూడా పోగొట్టుకుంటున్నారు. సాధారణంగా స్పిరిట్‌ను ఆస్పత్రుల్లో ఆపరేషన్ సమయంలో రోగులకు ఇచ్చి ఆపరేషన్ చేస్తారు. అయితే అలాంటి స్పిరిట్‌ను ఫిజీషియన్ స్లిప్ లేకుండా నేరుగా మెడికల్ షాపుల్లో అమ్మకాలు చేయకూడదు. కానీ పశ్చిమ ఎన్టీఆర్ జిల్లాలోని మెడికల్ షాపుల్లో నిబంధనలకు విరుద్ధంగా వీటిని అమ్మడంతో యువత, యాచకులు, సాధువులు సులువుగా కొనుగోలు చేస్తున్నారు. అలాగే నిద్ర మాత్రలు సైతం ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మేస్తున్నారు. ఈరెండింటికి తోడు వైట్‌నర్ వాడే వారి శాతం సైతం అధికమయ్యింది. స్పిరిట్‌ను, వైట్‌నర్‌ను ఒక గుడ్డలో వేసి దాన్ని పీల్చడం ద్వారా వచ్చే మత్తులో యువత తేలియాడుతోంది. ఇది ఆస్పత్రుల్లో ఆపరేషన్ సమయంలో రోగులకు వినియోగించే స్పిరిట్ నేడు అంగట్లో సరుకుగా మారింది. అనధికార అమ్మకాలు జోరందుకున్నాయి. పశ్చిమ ఎన్టీఆర్ జిల్లాలోని మెడికల్ షాపుల్లో విచ్చలవిడిగా లభిస్తున్నాయి. డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండానే వినియోగదారులకు విక్రయించేస్తున్నారు. మత్తుకు అలవాటు పడిన యువకులు తక్కువ ధరకు లభించే స్పిరిట్‌ను కొనుగోలు చేస్తున్నారు. మత్తులో జోగటానికి నిద్రమాత్రలను మోతాదుకు మించి కొనుగోలు చేస్తున్నారు. కొన్ని మందుల షాపుల్లో వైట్‌నర్స్ కూడా అందుబాటులో ఉంచి రహస్యంగా విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులు కూడా వస్తున్నాయి. డ్రగ్ కంట్రోల్ అధికారుల పర్యవేక్షణ తనిఖీలు లేకపోవటంతో స్పిరిట్, నిద్రమాత్రల విక్రయాలకు అడ్డూ అదుపు లేకుండా పోయిందని విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

స్లో పాయిజన్‌గా లివర్, గుండె తదితర అవయవాలపై ప్రభావం చూపడం వల్ల కొద్ది రోజుల్లోనే ప్రాణాలు కోల్పోతున్నారు. నిద్ర మాత్రలు సైతం ప్రిస్క్రిప్షన్ లేకుండా అమ్మేయడం వల్ల ఎంత డోసు వాడలో తెలిక అనేక మంది మత్తులోకి పోయి చనిపోతున్నారు.

కొరవడిన పర్యవేక్షణ

లాభాపేక్షే ధ్యేయంగా మెడికల్ షాపు యజమానులు సాగిస్తున్న అక్రమ వ్యాపారాన్ని అరికట్టాల్సిన డ్రగ్స్ ఇన్‌స్పెక్టర్లు మామూళ్ల మత్తులో జోగుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. కొందరు అధికారులు మొక్కుబడిగా దాడులు చేస్తున్నారని, దాడులు చేసిన విషయాన్ని కూడా గోప్యంగా ఉంచడంపై అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. దీంతో మెడికల్ షాపుల్లో ఇచ్చలవిడిగా స్పిరిట్, నిద్ర మాత్రల అమ్మకాలు జరుగుతున్నాయని, వీటి వల్ల యువకుల జీవితాలు నాశనం అవుతున్నాయనేందుకు పలువురు ప్రభుత్వ విజిలెన్స్ కమిటీ సభ్యులు ప్రపంచ డ్రగ్స్ వ్యతిరేక దినోత్సవం రోజున చేసిన వ్యాఖ్యలే నిదర్శనంగా నిలుస్తున్నాయి.

ఎక్కువ సేపు నిద్రలో ఉండేందుకే..

ఆకలిని చంపేసుకునేందుకు, ఎక్కువ సమయం నిద్రలో ఉండేందుకు యాచకులు, సాధువులు, కొందరు యువత స్పిరిట్, నిద్రమాత్రలను ఎక్కువగా వాడుతున్నట్లు తెలుస్తోంది. యాచకులు, సాధువులు ఆకలిని చంపేసుకునేందుకు ఈ తరహా మత్తు పదార్థాలకు బానిసలవుతుంటే, యువత మాత్రం ఎక్కువ ఒత్తిడిని అధిగమించేందుకు వాడుతున్నట్టు సమాచారం. తల్లిదండ్రుల నిరాధరణకు గురైన వారు, ఒంటరిగా జీవించే యువత సైతం ఇలాంటివి ఎక్కువగా వాడుతున్నట్లు తెలిసింది. ఇవి వాడిన వారికి ఆకలి మందగించడం, ఎక్కువ సేపు మత్తులో జోగడం వంటివి ఉంటాయని వైద్యులంటున్నారు. మత్తులో ఉంటే సమయానికి ఆకలి అనిపించదని, ఎంత తింటారో ఎలా తింటారో వారికే తెలియదంటున్నారు. సమయానికి అలాంటి మత్తు పదార్థాలు అందకపోతే వాటికి ఎడిక్ట్ అయిన వారు విపరీతధోరణిలో చిత్ర విచిత్ర పనులు చేస్తారని వివరించారు.

దాడులు చేస్తున్నాం

జగ్గయ్యపేట, నందిగామ, మైలవరం, తిరువూరు నియోజకవర్గాల పరిధిలో ఉన్న మెడికల్ షాపుల్లో విస్తృతంగా తనిఖీలు చేస్తున్నాం. డాక్టర్ ప్రిస్క్రిప్షన్ లేకుండా స్పిరిట్, మత్తు బిల్లలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటాం.

-ఎ.సురేష్, డ్రగ్ ఇన్‌స్పెక్టర్, ఇబ్రహీంపట్నం

ఆధ్యాత్మిక ప్రదేశాల భద్రతకు 'డివైన్ సురక్ష'

- నూతన ప్రాజెక్టును ఆవిష్కరించిన హోంమంత్రి వంగలపూడి అనిత
- అన్ని ఆలయాలు, ప్రార్థనా మందిరాలకు సీసీ కెమెరాల ఏర్పాటు



కార్యక్రమంలో మాట్లాడుతున్న సీపీ రాజశేఖరబాబు, చిత్రంలో హోం మంత్రి అనిత, కలెక్టర్ లక్ష్మీశ, ఎంపీ చిన్ని, ఎమ్మెల్యేలు శ్రీనివాసరావు, సుజనా చౌదరి, రామ్మోహనరావు, బొండా ఉమా, శ్రీరాం తాతయ్య

విజయవాడ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆలయాలు, చర్చిలు, మసీదుల భద్రతకు ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ అధికారులు డివైన్ సురక్ష ప్రాజెక్టును ప్రారంభించారు. విజయవాడతోపాటు పట్టణాలు, గ్రామాల్లో సురక్ష 360 డిగ్రీల పేరుతో సీసీ కెమెరాలను దాతల సహకారంతో అందజేశారు. ఇప్పుడు డివైన్ సురక్షను పట్టాలెక్కించారు. ఈ ప్రాజెక్టును విజయవాడలోని ప్రైవేటు ఫంక్షన్ హాలులో హోంమంత్రి అనిత శనివారం ప్రారంభించారు. ఈ ప్రాజెక్టులో భాగంగా పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో సీసీ కెమెరాలను అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ లక్ష్మీశ, ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహనరావు, బొండా ఉమామహేశ్వరరావు, సుజనా చౌదరి తదితరులు పాల్గొన్నారు. పశ్చిమ నియోజకవర్గంలో సీసీ కెమెరాల ఏర్పాటుకు ఎమ్మెల్యే సుజనా చౌదరి రూ.30లక్షలను విరాళంగా ఇచ్చారు. కార్యక్రమంలో భాగంగా డీజీపీ కార్యాలయం కమిషనరేట్‌కు అందజేసిన టి-థర్డ్ డ్రోన్లను ప్రదర్శించారు. అదేవిధంగా త్వరలో అందుబాటులోకి రాబోయే సైబర్ కమాండో యాప్ పనితీరుపై ఏవీని ప్రదర్శించారు.

సాంకేతికతలో 'ఎన్టీఆర్'ది ముందు వరుస

- వంగలపూడి అనిత, హోంమంత్రి

సాంకేతికతను వినియోగించడంలో ఎన్టీఆర్ పోలీసు కమిషనరేట్ ముందు వరుసలో ఉంది. నేరం జరిగినా, ట్రాఫిక్ స్తంభించినా సాంకేతికతను వినియోగిస్తున్నారు. అసాంఘిక శక్తుల అడ్డాలను డ్రోన్ల ద్వారా గుర్తిస్తున్నారు. అస్త్రం ఏఐ టూల్ ద్వారా ఎప్పటికప్పుడు ట్రాఫిక్ సమస్యను పరిష్కరిస్తున్నారు. శక్తి యాప్ ద్వారా మహిళలకు భద్రత, భరోసా కల్పిస్తున్నాం. సురక్ష యాప్, సురక్ష డివైన్ ప్రాజెక్టు వల్ల ప్రజలకు ఎంతో మంచి జరుగుతుంది. ప్రజల భద్రత కోసం పోలీసు శాఖ, ప్రభుత్వం అడుగులు వేస్తున్నాయి.

ఆధ్యాత్మిక ప్రదేశాల భద్రత కోసమే

- ఎస్వీ రాజశేఖరబాబు, పోలీసు కమిషనర్

కమిషనరేట్ పరిధిలో దేవాలయాలు, ప్రార్థనా మందిరిరాల భద్రత కోసం కొత్తగా డివైన్ సురక్ష ప్రాజెక్టును రూపొందించారు. పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న ఆలయాలు, చర్చిలు, మసీదుల వల్ల సీసీ కెమెరాలు ఏర్పాటు చేస్తున్నాం. వాటిని విజయవాడలో ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్‌కు అనుసంధానం చేస్తాం.

త్వరలో సురక్ష స్కూల్, మార్కెట్ ప్రాజెక్టు రావాలి

- కేశినేని చిన్ని, ఎంపీ

ఆధ్యాత్మిక ప్రదేశాల భద్రతకు డివైన్ సురక్ష, సురక్ష 360 ప్రాజెక్టులను ప్రారంభించడం అభినందనీయం. అలాగే సురక్ష స్కూల్, సురక్ష మార్కెట్ ప్రాజెక్టులను పట్టాలెక్కించాలి. విజయవాడ ప్రజలకు సామాజిక అవగాహన ఎక్కువ. నగరవాసులు ప్రభుత్వానికి, పోలీస్ శాఖకు సహకరిస్తూ జిల్లా అభివృద్ధికి సాయం చేయడం గొప్ప విషయం. రాజధానిలో భాగమైన కమిషనరేట్ పరిధిని నేర రహిత ప్రాంతంగా చేయడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పనిచేస్తోంది.

డిగ్రీ అర్హతతో ఎస్ఎస్‌సీలో ఉద్యోగాలు

జూలై 4 చివరి తేదీ ● కలెక్టర్ లక్ష్మీశ

విజయవాడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): కేంద్రప్రభుత్వ శాఖల్లో గ్రూప్-బి, గ్రూప్-సి పోస్టులకు నోటిఫికేషన్ విడుదలైందని కలెక్టర్ లక్ష్మీశ ఒక ప్రకటనలో తెలిపారు. 14,582 ఉద్యోగాలకు ఆగష్టు 13 నుంచి 30వ తేదీ వరకు ఎస్ఎస్‌సి బోర్డు ఆధ్వర్యంలో పరీక్షలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఉద్యోగాలకు డిగ్రీ అర్హత కలిగిన అభ్యర్థులు ఎస్ఎస్‌సీ. జీవోవీ.ఇన్ లేదా మై ఎస్ఎస్‌సీ మొబైల్ యాప్ ద్వారా జూలై 4వ తేదీ రాత్రి 11 గంటల లోపు దరఖాస్తు చేసుకోవాలని ఆయన కోరారు.

పారదర్శకంగా ఆశా కార్యకర్తల నియామకాలు

- మోసపూరిత వ్యక్తుల మాటలు నమ్మవద్దు
- జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని

విజయవాడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఆశా కార్యకర్తల ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి కొంతమంది వ్యక్తులు డబ్బులు వసూలు చేస్తూ మోసపూరిత చర్యలకు పాల్పడుతున్నట్లు కలెక్టర్, తన దృష్టికి వచ్చిందని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డాక్టర్ ఎం.సుహాసిని ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లాలో వైద్యారోగ్య శాఖలో ఆశాకార్యకర్తల నియామకం కోసం ఈ నెల 25 నోటిఫికేషన్ ఇచ్చినట్లు పేర్కొన్నారు. ఉద్యోగానికి దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులెవరూ మోసపూరిత వ్యక్తుల మాటలు నమ్మి, ప్రలోభాలకు లొంగవద్దని విజ్ఞప్తి చేశారు. కేంద్ర, రాష్ట్ర ఆరోగ్యశాఖ నిర్ధేశించిన మార్గదర్శకాల ప్రకారమే నియామక ప్రక్రియ ఉంటుందని తెలిపారు. జిల్లా హెల్త్‌సొసైటీ ద్వారా మెరిట్ ఆధారంగా మాత్రమే నియామకాలు జరుగుతాయని వెల్లడించారు.

సీజనల్ వ్యాధులతో జాగ్రత్త!

- ముందస్తు చర్యలతో నియంత్రించవచ్చు
- ప్రాణాంతకమైన వ్యాధులు కూడా ఉన్నాయి
- లక్షణాలు కనిపించిన 72 గంటల్లో చికిత్స అవసరం



విజయవాడ, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): జిల్లాకు సీజనల్ వ్యాధుల ముప్పు పొంచి ఉంది. ఏటా వలే వాతావరణ మార్పుల వల్ల వచ్చే పలురకాల వ్యాధులు ప్రజలను ఇబ్బందులు పెట్టే అవకాశం ఉందని ఆరోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు. వేసవి నుంచి వర్షాకాలానికి మారుతున్న క్రమంలో కొన్ని రకాల వైరస్‌లు యాక్టివ్ అయ్యి టైఫాయిడ్, మలేరియా, డెంగీ, కలరా, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. కొన్ని రకాల జాగ్రత్తలు తీసుకోవడం వల్ల ఈ వ్యాధుల బారిన పడకుండా ఉండవచ్చని పేర్కొంటున్నారు.

- చేతులను పరిశుభ్రంగా కడుక్కోవడం వల్ల చాలా వరకు రోగాల బారిన పడకుండా ఉండవచ్చు. ఏదైనా ఆహారం తీసుకునే ముందు, టాయిలెట్స్‌కి వెళ్లొచ్చిన తరువాత చేతులను సబ్బుతో కడుక్కోవాలి. వర్షాకాలంలో కాచి చల్లార్చిన నీటినే తాగడంతో పాటు, ఆహారాన్ని ఎప్పటికప్పుడు వండుకుని తినాలి. వండిన ఆహారాన్ని మళ్లీ వేడి చేసి తినకూడదు. ఈగలు, దోమలు వాలకుండా ఆహారాన్ని బట్టతో కాని, తెరతో కాని కప్పాలి.
- వర్షాకాలంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుంది. నీరు నిల్వ ఉండే తొట్టెలు, టైర్లు, రుబ్బురోళ్లు ఇంటి పరిసరాల్లో ఉండకుండా చూసుకోవాలి. ఎప్పటికప్పుడు కూలర్లలో నీరు తొలగించాలి. ముఖ్యంగా ఈ సీజన్‌లో జ్వరం లక్షణాలు ఉంటే వెంటనే పరీక్షలు చేయించుకొని వైద్యం పొందాలని, లేకపోతే ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఏర్పడుతుందని వైద్య నిపుణులు చెబుతున్నారు.
- సాధారణ డెంగీ జ్వరం మూడు నుంచి నాలుగు రోజులు ఉంటుంది. మొదట ప్లేట్‌లేట్స్ తగ్గుతాయి, ఐదో రోజు నుంచి వాటంతటవే పెరుగుతాయి. ఒకవేళ ఇబ్బందిగా అనిపిస్తే వెంటనే చికిత్స తీసుకోవడం ఉత్తమం.
- డెంగీలో హిమరైజిక్ జ్వరానికి సంబంధించిన లక్షణాలు 10-15 శాతం మందిలో మాత్రమే కనిపిస్తాయి. ఈ వ్యాధిలో ప్లేట్‌లెట్స్ వేగంగా పడిపోతాయి. చర్మంపై రక్తం గడ్డకట్టడం, దగ్గినప్పుడు, మలమూత్రాలకు పోయినప్పుడు రక్తం పడడం వంటి లక్షణాలు కనిపిస్తాయి. దీంతోపాటు షాక్ సిండ్రోమ్ వ్యాధి 5 శాతం మందిలో కనిపించినప్పటికీ ప్రమాదకరమైన లక్షణమిది. బీపీ, పల్స్ ఒక్క సారిగా తగ్గిపోతాయి. అలాగే డయేరియా, లెప్టోస్పైరోసిస్ తదితర వ్యాధులు కూడా సీజనల్‌గానే వస్తాయి. వీటితో జాగ్రత్తగా ఉండాలి.

అన్ని రకాల ఏర్పాట్లు చేశాం

సీజనల్ వ్యాధులు వ్యాపించే అవకాశం ఉంది. ఆసుపత్రిలో అన్ని రకాలుగా సిద్ధం చేశాం. రక్తపరీక్షల కిట్లు, మందులు ఉన్నాయి. ఇప్పటికే సుమారు 30 బెడ్లతో వార్డులను రెడీ చేశాం. ప్రత్యేక వార్డులో ఆక్సిజన్, వెంటిలేటర్, పల్స్ టెస్టింగ్ కిట్ అన్నీ సిద్ధంగా ఉన్నాయి. రోగుల తాకిడి ఎక్కువైనా బెడ్లు పెంచడానికి వీలుగా రూంలు సిద్ధం చేస్తున్నాం. ప్లేట్‌లేట్స్ అవసరమయ్యే అవకాశం ఉండడంతో ముందుగానే రక్తాన్ని నిల్వ చేస్తున్నాం.

- డాక్టర్ కె.ఇందిరా దేవి, జనరల్ మెడిసిన్ హెచ్‌వోడీ, జీజీహెచ్

దోషరహిత ఓటర్ల జాబితా లక్ష్యం : డీఆర్‌వో



మాట్లాడుతున్న డీఆర్‌వో లక్ష్మీ నరసింహం

కలెక్టరేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : దోషరహిత ఓటర్ల జాబితా రూపొందించడంలో రాజకీయ పక్షాలు అధికారులకు పూర్తి సహకారం అందించాలని డీఆర్‌వో ఎం.లక్ష్మీ నరసింహం రాజకీయ పార్టీల ప్రతినిధులకు విజ్ఞప్తి చేశారు. కలెక్ట రేట్‌లోని వీడియో కాన్ఫరెన్సు హాల్లో శనివారం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో డీఆర్‌వో ఎం.లక్ష్మీనరసింహం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత ఓటర్ల జాబితాలో మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన వారి పేర్లను బీఎల్‌వోకు తెలియజేయాలన్నారు. ఓటరు జాబితాలో మార్పులు, ఓటరు కార్డులో ఏవైనా తప్పులు ఫారం-8 నమోదు చేసి, సరిచేసేందుకు సహకరించాల్సిందిగా కోరారు. జిల్లాలో ఫారం 6, ఫారం 7, ఫారం 8 అర్జీలకు సంబంధించిన ప్రస్తుత వివరాలను తెలియజేసి సమాచారాన్ని రాజకీయ పక్షాలకు అందించారు. మరణించిన ఓటర్ల తొలగింపుపై అన్ని స్థాయిలలోనూ విచారణ చేయాలని, ఒకే కుటుంబానికి చెందిన ఓటర్లు ఒకే పోలింగ్ బూత్‌లో ఉండేలా, ఒకే డోరు నెంబరుతో నమోదై ఉన్న ఓటర్ల విషయంలోను ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని రాజకీయ పక్షాల ప్రతినిధులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. ఎన్నికల సెల్ డిప్యూటీ తహసీల్దార్ ఏఎస్ఆర్ గోపాలరెడ్డి, వై.రామయ్య (టీడీపీ), తరుణ్ కాకాని (బీజేపీ), బి.పుష్పరాజ్ (బీఎస్పీ), బొర్రా కిరణ్ (ఐఎన్‌సీ), ఎస్.అనిల్‌చంద్ (ఐఎన్‌సీ) పాల్గొన్నారు.

బంగారు కుటుంబాలకు బాసటగా నిలవండి

ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్‌కు కలెక్టర్ లక్ష్మీశ విజ్ఞప్తి

కలెక్టరేట్, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : సామాజిక కార్యక్రమాల నిర్వహణలో ప్రత్యేక గుర్తింపు సాధించిన ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ (అమ్మ), పేదరిక నిర్మూలనకు రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన వినూత్న పీ 4 విధానం అమల్లోనూ భాగస్వామ్యం కావాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. 'అమ్మ' ప్రతినిధులు శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ లక్ష్మీశతో సమావేశమయ్యారు. పేద విద్యార్థులకు ఆర్థిక సాయం అందించి ఉన్నత విద్య అభ్యసించేందుకు అసోసియేషన్ కృషి చేస్తోందని తెలిపారు. ఏటా దాదాపు 450 మందికి రూ.18 లక్షల ఉపకార వేతనాలు అందిస్తున్నట్లు వివరించారు. మొగల్రాజపురంలోని బోయపాటి శివరామకృష్ణయ్య మున్సిపల్ కార్పొరేషన్ హైస్కూల్‌ను దత్తత తీసుకొని విద్యార్థులకు పుస్తకాలు, బ్యాగులు వంటి వాటిని అందించడంతో పాటు పాఠశాల అభివృద్ధికి అవసరమైన సౌకర్యాలు కల్పిస్తూ నగరంలో ఆదర్శవంతమైన పాఠశాలగా తీర్చిదిద్దినట్లు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ అమ్మ అసోసియేషన్ సేవా కార్యక్రమాలను ప్రశంసిస్తూ గౌరవ ముఖ్యమంత్రి దార్శనికతకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పీ 4 (ప్రభుత్వం, ప్రైవేటు, ప్రజలు భాగస్వామ్యం) విధానాన్ని తీసుకొచ్చిందని, పేదలను అన్ని విధాలా పైకి తీసుకొచ్చేందుకు ఆయా కుటుంబాలకు సరైన మార్గనిర్దేశనం అవసరమని పేర్కొన్నారు. స్వర్ణాంధ్ర 2047 సాకారానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నానికి అమ్మ అసోసియేషన్ చేయి కలపాలని, పేదరిక నిర్మూలనకు చేయూతనివ్వాలని కలెక్టర్ లక్ష్మీశ కోరారు. సమావేశంలో అసోసియేషన్ పూర్వ అధ్యక్షులు యార్లగడ్డ సుబ్బారావు, కార్యదర్శి సుంకర చంద్రశేఖర్, ప్రస్తుత అధ్యక్షులు గారపాటి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



ఆంధ్రా మోటార్ మర్చంట్స్ అసోసియేషన్ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ లక్ష్మీశ

పర్యావరణ హిత నవ్య పరిశ్రమలకు ప్రోత్సాహం

కృష్ణలంక, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) : ప్రపంచానికి ప్లాస్టిక్ కాలుష్యం పెనుసవాలుగా మారిన ప్రస్తుత పరిస్థితు ల్లో పర్యావరణ హిత నవ్య పరిశ్రమలకు ప్రోత్సాహం కల్పిస్తున్నట్టు కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ప్లాస్టిక్‌కు ప్రత్యా మ్నాయ ఉత్పత్తుల తయారీలో ముఖ్యంగా యువత, మహి ళలు కొత్త పారిశ్రామిక యూనిట్లను ఏర్పాటు చేయడం ద్వారా పారిశ్రామికవేత్తలుగా ఎదగొచ్చని చెప్పారు. ఈ విషయంపై సమన్వయ శాఖలు అవగాహన కల్పించడంతో పాటు ప్రోత్సహించాలని కలెక్టర్ లక్ష్మీశ సూచించారు. ఏపీ కాలుష్య నియంత్రణ మండలి (పీసీబీ) అధ్వర్యంలో శనివారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ఇగ్నైట్ స్టాళ్లను కలెక్టర్ లక్ష్మీశ సందర్శించారు. ప్లాస్టిక్ ఇయర్‌బడ్స్, క్యాండీస్టిక్స్, పాలీస్టరిన్ (థర్మోకోల్) వస్తువులు వంటి నిషేధిత సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వస్తువులు, ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ఉపయోగించే చెక్క స్పూన్‌లు, గుడ్డ సంచులు, కంపోస్టబుల్ ప్లాస్టిక్ ఉత్పత్తులు తదితరాలను పరిశీలించారు.





ఈ వారమే విడుదల

ఈ ఆదివారం నుంచి వచ్చే శనివారంలోగా విడుదలవుతున్న సినిమాలు, వెబ్‌సిరీస్‌ల వివరాలు

ఓటీటీ వేదిక	సినిమా/సిరీస్	విడుదల తేదీ
ప్రైమ్ వీడియో		
హెడ్ ఆఫ్ స్టేట్	ఇంగ్లీష్ చిత్రం	జూలై 2
నెట్‌ఫ్లిక్స్		
బిచ్ వర్సెస్ రిచ్ (సీజన్ 2)	కొరియన్ వెబ్ సిరీస్	జూలై 3
ది శాండ్‌మ్యాన్ (సీజన్ 2)	ఇంగ్లీష్ వెబ్ సిరీస్	జూలై 3
జీ 5		
కాళీధర్ లాపతా	హిందీ చిత్రం	జూలై 4
సోనీ ఎల్ఐవీ		
ది హంట్: ది రాజీవ్‌గాంధీ అస్సెస్సినేషన్ కేస్	ఇంగ్లీష్ చిత్రం	జూలై 4
జియో హాట్‌స్టార్		
లా అండ్ ద సిటీ	ఇంగ్లీష్ చిత్రం	జూలై 5

ఓటమి ఎదురైతే...

ఒక్కోసారి అనుకోకుండా ఓటమి ఎదురుకావచ్చు. అంతమాత్రాన నిరాశతో ప్రయత్నాన్ని ఆపకూడదు. ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుంటూ గెలుపు దిశగా ఎలా నడవాలో తెలుసుకుందాం...



- ముందుగా ఓటమిని అంగీకరించాలి. అందుకు దోహదం చేసిన కారణాలను అన్వేషించాలి. దీంతో గెలుపు దిశగా మొదటి అడుగు పడినట్లే.
- గెలుపు కోసం చేసిన ప్రయత్నాలను, పడిన కష్టాన్ని గుర్తు చేసుకోవాలి. మొదటి ప్రయత్నం మీద గౌరవం ఉంచాలి. ఓటమి బాధ నుంచి బయటపడేందుకు ప్రయత్నించాలి.
- ఓటమికి దారితీసిన కారణాలను విశ్లేషించుకోవాలి. మళ్లీ ఆ తప్పులు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలి.
- ప్రతి ఓటమీ ఒక బలమైన పాఠాన్ని నేర్పుతుంది. దాన్ని అర్థం చేసుకుంటూ ముందుకు సాగడం మొదలుపెట్టాలి.
- ఓటమి బాధతో మానసికంగా కుంగిపోకూడదు. రోజూ యోగా, ధ్యానం, వ్యాయామం చేస్తూ శారీరక, మానసిక ఆరోగ్యాన్ని కాపాడుకోవాలి.
- ఓడిపోయామనుకుంటూ ఒంటరిగా ఉండకుండా ఎదురైన సమస్య గురించి మిత్రులు, సన్నిహితులతో చర్చించి పరిష్కారం కోసం ప్రయత్నించాలి. అనుభవజ్ఞులను సంప్రదించాలి.
- స్వీయ నమ్మకాన్ని కోల్పోకుండా చిన్న చిన్న లక్ష్యాలను నిర్దేశించుకోవాలి. వాటిని సాధిస్తూ ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవాలి.
- ఓటమి ఎదురైందని అక్కడికక్కడే ఆగిపోకుండా ధైర్యంతో మళ్లీ ప్రయత్నించాలి. ఆగకుండా చేసే ప్రయత్నాలే గెలుపుకు దగ్గర చేస్తాయి.
- అదేపనిగా బాధ పడుతూ సమయాన్ని వృథా చేయకూడదు. పూర్తి సమయాన్ని విజయం సాధించడం కోసమే కేటాయించాలి.
- వ్యక్తిత్వ వికాసానికి తోడ్పడే పుస్తకాలు చదవాలి. సమయానుసారం ఆహారం తీసుకుంటూ సరైన నిద్ర వేళలు పాటించాలి. అప్పుడే మెదడు చురుకుగా పనిచేస్తుంది. ఏకాగ్రత కుదురుతుంది. చక్కని పరిష్కార మార్గం దొరుకుతుంది.

ఈ మధ్య విడుదలై... విజయం సాధించిన 'కుబేర' సినిమాకు ఒక ప్రత్యేకత ఉంది. ఈ సినిమాలో దాదాపు ప్రతి విభాగంలో అనేకమంది మహిళలు పనిచేశారు. వారిలో ఎక్కువ మంది 30 ఏళ్ల లోపు వారు కావటం విశేషం. వారిని 'నవ్య' పలకరించినప్పుడు పంచుకున్న అనుభవాలు మీ కోసం...





కుబేర మహిళా విజయం!

ప్రజాస్వామిక వాతావరణంలో...

నా పేరు అమూల్య. డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేశా. ఇక్కడ ఒక చిన్న విషయం చెప్పాలి. శేఖర్ కమ్ముల 'హ్యాపీడేస్' విడుదలయినప్పుడు నాకు 12 ఏళ్లు. ఆ సినిమా చూసి డైరెక్టర్ కావాలనుకున్నా. పెద్దయిన తర్వాత ఆయన దగ్గర అసిస్టెంట్‌గా పనిచేయటం ఒక గొప్ప అనుభవం. నేను పుట్టింది, పెరిగింది హైదరాబాద్‌లో. ముంబాయిలోని సుభాష్ ఘాయ్ ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో రైటింగ్, డైరెక్షన్‌లలో డిగ్రీ చేశా. ఇండస్ట్రీలో అడుగుపెట్టే సమయానికి నాకు ఎవరూ తెలీదు. పరిచయస్తులు ఇచ్చే సమాచారం ఆధారంగా అవకాశాలు వెతుక్కోవాల్సి వచ్చింది. అయితే అవకాశాలు త్వరగానే వచ్చాయి. 'పరంపర' వెబ్ సిరీస్ డైరెక్షన్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేశా. ఆ తర్వాత శేఖర్‌గారి దగ్గర చేరాను. షూటింగ్ సమయాల్లో రాత్రి, పగలు తేడా లేకుండా పని చేయాల్సి ఉంటుంది. ఒక విధంగా చూస్తే మహిళలకు అది కష్టమే! కానీ అదృష్టవశాత్తు నేను చేసిన ప్రాజెక్టులలో నాకు పెద్ద కష్టం కాలేదు. 'కుబేర' టీమ్‌లో చాలామంది అమ్మాయిలు ఉండటం దీనికి ఒక కారణం. రెండోది శేఖర్ సార్ అనుసరించే విలువలు. ఆయన దగ్గర మన అభిప్రాయాలను సూటిగా చెప్పవచ్చు. ప్రతి వ్యక్తి అభిప్రాయానికి గౌరవం లభిస్తుంది. ఇలాంటి ప్రజాస్వామిక వాతావరణంలో పనిచేస్తున్నప్పుడు పెద్దగా ఒత్తిడి అనిపించదు. ఇక ఆయన ఎవరిపైనా చిరాకు పడటం చూడలేదు. డైరెక్షన్ అనేది చాలా ఒత్తిడితో కూడుకున్న వ్యవహారం. అంత ఒత్తిడిలోను ఎప్పుడూ ఎవరిపైనా చిరాకు పడేవారు కాదు. ఆయన దగ్గర నుంచి నేను తప్పనిసరిగా నేర్చుకోవాల్సిన విషయం అది. ఇక 'కుబేర' షూటింగ్ సమయంలో నేను మరచిపోలేని సంఘటన ఒకటి ఉంది. ధనుష్ పాటను 800 మంది జూనియర్ ఆర్టిస్టులతో చిత్రీకరించాం. మా అందరిపైనా విపరీతమైన ఒత్తిడి ఉంది. షూటింగ్ పూర్తయ్యాక... ధనుష్ సర్ వెళ్లిపోయిన వెంటనే అందరం రిలాక్స్ అయిపోయాం. బ్యాండ్ వాళ్లు వాయించటం ఆపలేదు. దాంతో అందరూ డ్యాన్స్ చేయటం మొదలుపెట్టారు. లైట్ బాయ్ నుంచి డైరెక్షన్ డిపార్ట్‌మెంట్ వాళ్ల వరకూ అందరూ దాదాపు గంట డ్యాన్స్ చేశారు. నా జీవితంలో మరచిపోలేని సంఘటన అది.



- అమూల్య, డైరెక్షన్ డిపార్ట్‌మెంట్

అదే ఆయన ప్రత్యేకత

శేఖర్‌గారు సెట్‌లో పని చేస్తున్నప్పుడు చూడటం నేను మరచిపోలేని అనుభవం. 'కుబేర' నుంచి ఎంతో నేర్చుకున్నా. ఉదాహరణకు... ఒక అసోసియేట్ డైరెక్టర్‌ను కాబట్టి నాకు కథ తెలుసు. సీన్లు తెలుసు. కొన్నిసార్లు ఒక షాట్‌ను అనేకసార్లు తీయాల్సి వచ్చేది. 'శేఖర్ సార్ ఏ షాట్‌ను 'ఓకే' చేశారా?' అని గమనిస్తూ ఉండేదాన్ని. చాలా సందర్భాలలో- అయనకు ఒక షాట్ నచ్చేది. కానీ దానితో సంతృప్తి పడేవారు కాదు. నటీనటులకు చిన్న చిన్న మార్పులు సూచించేవారు. ఎడిటింగ్ టేబుల్ మీద చూసినప్పుడు- ఆ మార్పులే మొత్తం సీన్‌ను మార్చేసేవి. శేఖర్ సార్‌కు అంత ఫ్యాన్ ఫాలోయింగ్ ఎందుకు ఉందో నాకు అప్పుడు అర్థమయ్యేది. ఆలాగే ఆయనకు జీవితం పట్ల ఉన్న దృక్పథం చాలా గొప్పది. దాని నుంచి చాలా నేర్చుకోవచ్చు. ఎన్ని సవాళ్లు ఎదురైనా- 'వీటిని మనం దాటగలం' అనే ఆత్మవిశ్వాసం ఆయనలో కనిపించేది. ఆఫీసుకు వచ్చిన వెంటనే అందరినీ పలకరించేవారు. పేరు పేరునా "అన్నం తిన్నావా?" అని అడిగేవారు. ఇంకో విషయాన్ని కూడా ఇక్కడ చెప్పాలి. సాధారణంగా షూటింగ్‌లలో మహిళలకు బాత్‌రూమ్‌ల లాంటి సౌకర్యాలు లభించవు. ఎవరైనా డిమాండ్ చేస్తే- "ఇలా అయితే అమ్మాయిలతో పనిచేయటం కష్టం. అడ్జెస్ట్ అయిపోవాలి" అనే కామెంట్‌లు వినిపిస్తూ ఉంటాయి. కానీ 'కుబేర' షూటింగ్‌లో మాత్రం మహిళల కోసం ప్రత్యేకమైన సౌకర్యాలన్నీ కల్పించారు. భవిష్యత్తులో అందరూ ఈ ఒరవడిని పాటిస్తారనుకుంటున్నాను.

- కీర్తి, డైరెక్షన్ డిపార్ట్‌మెంట్

అనేక ప్రపంచాలు ఉన్నాయి



నేను పుట్టి పెరిగింది చెన్నైలో. ఇంతకు ముందు ధనుష్ సార్‌కు డిజైనర్‌గా పనిచేశా. శేఖర్ సార్ ఈ సినిమా కథ చెప్పిన వెంటనే వాటిలో ఉన్న ప్రపంచాలు, వాటి మధ్య వైరుధ్యాలు నాకు స్పష్టంగా కనిపించాయి. ఈ వైరుధ్యాలను ఒకేసారి చూపించాలి. ఏ డిజైనర్‌కైనా ఈ చిత్రం ఒక సవాల్ అనే చెప్పాలి. ఇందులో నలుగురు బిచ్చగాళ్లు ఉంటారు. ఒకరు తిరుపతి నుంచి, ఒకరు కేరళ నుంచి, ఒకరు కోల్‌కతా నుంచి, మరొకరు అసోం నుంచి వచ్చిన వారు. ఈ ప్రాంతాల్లో ప్రజలు దుస్తులు ధరించే విధానం వేరుగా ఉంటుంది. ఈ బిచ్చగాళ్లు వేసుకొనే దుస్తులు వాటిని ప్రతిబింబించాలి. దాని కోసం చాలా రీసెర్చ్ చేయాల్సి వచ్చింది. ఈ నలుగురిలో ఒక అమ్మాయి కూడా ఉంటుంది. ఈ అమ్మాయికి ఎలాంటి దుస్తులు వేయాలనే విషయంపై చాలా చర్చ జరిగింది. సాధారణంగా మనం గ్రామీణ ప్రాంతాల్లో పేదవారిని గమనిస్తే- వారు దుస్తులపైన ఒక గుడ్డను ధరిస్తారు. అది చున్నీ కావచ్చు, తువ్వాలు కావచ్చు. ఈ అమ్మాయికి కూడా అలాంటి దుస్తులనే డిజైన్ చేశాం. వారి దుస్తులు సహజంగా కనిపించటం కోసం చాలా కష్టాలు పడ్డాం. ముందు ఉతికే వాళ్లం. ఎండబెట్టే వాళ్లం. చిరుగులు కోసం రాతి మీద తోమేవాళ్లం. ధనికుల విషయానికి వస్తే మాకు అనేక రిఫరెన్స్‌లు లభించాయి. బాగా ధనికులు గాడీ రంగులు వేసుకోరు. వారు వేసుకొనే సూట్స్, షర్ట్స్... అన్నీ క్లాసిక్‌గా ఉంటాయి. వారు పెట్టుకొనే వాచ్‌లు, కళ్లజోళ్ల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకున్నాం. ఈ సినిమాలో సంక్లిష్టమైన సన్నివేశాలున్నాయి. వాటికి తగ్గట్టుగా దుస్తులను డిజైన్ చేయటం నిజంగా సవాలే! ఒక సీన్‌లో ధనుష్ మడ అడవుల ప్రాంతంలో బాగా తడిసిపోయి రోడ్డు మీదకు వస్తారు. ఆయన దుస్తుల మీద బురద, చిన్న చిన్న ముళ్లు కనిపించాలి. ఇలాంటి చిన్న చిన్న విషయాలలో తీసుకున్న శ్రద్ధ కూడా ఈ చిత్ర విజయానికి కారణమయింది.

- కావ్య శ్రీరాం, కాస్ట్యూమ్ డిజైనర్

పేరు చెప్పినప్పుడు థ్రిల్ అయ్యా...



నేను తోట తరణి గారి దగ్గర పనిచేసేదాన్ని. ఆయన ద్వారానే నాకు 'కుబేర'లో పనిచేసే అవకాశం వచ్చింది. నేను ఇంటర్ దాకా గుంటూరులో చదివాను. ఆ తర్వాత జేఎన్‌టీయూలో... ఆర్కిటెక్చర్‌లో డిగ్రీ చేశాను. 'మసుదా' అనే థ్రిల్లర్ సినిమాకు పనిచేశా. ప్రస్తుతం 'ఘాటి', 'హరిహరవీరమల్లు' సినిమాలకు పనిచేస్తున్నా. 'కుబేర' గురించి చెప్పాలంటే- శేఖర్ సార్ గురించి తప్పని సరిగా చెప్పాలి. ఆయన దగ్గర పని చేస్తున్నప్పుడు... 'ఒకరు ఎక్కువ-ఒకరు తక్కువ' అనే తేడా కనిపించదు. అందరికీ తమ అభిప్రాయాలు చెప్పే స్వేచ్ఛ లభిస్తుంది. అంతదాకా ఎందుకు... ప్రీరిలీజ్ ఫంక్షన్‌లో శేఖర్ సార్ మాట్లాడుతూ నా పేరు కూడా ప్రస్తావించారు. నాకు విపరీతమైన థ్రిల్లింగ్‌గా అనిపించింది. ఇక 'కుబేర' షూటింగ్ సమయంలో మేము ఎదుర్కొన్న ఛాలెంజ్ డంప్ యార్డ్ సెట్. దీనిని వీలైనంత సహజంగా తీర్చిదిద్దటానికి ప్రయత్నించాం. స్క్రీన్ మీద నిజంగా డంప్ యార్డ్‌లోనే తీసినంత బాగా వచ్చింది. ఆర్ట్ డిపార్ట్‌మెంట్ అనగానే అంతా మగవాళ్లే అనే అభిప్రాయం ఉంది. ప్రస్తుతం పరిస్థితులు మారుతున్నాయి. మహిళా ఆర్ట్ డైరెక్టర్లు కూడా వస్తున్నారు. వారందరూ విజయం సాధించాలని కోరుకుంటున్నాను.

- ఇంద్రాణి, ఆర్ట్ డిపార్ట్‌మెంట్

• సీవీఎల్ఎన్ ప్రసాద్

ఇలా చేస్తే చర్మ రంధ్రాలు కనిపించవు...

చర్మం మీద సహజంగా స్వేద గ్రంథులు అనే సన్నని రంధ్రాలు ఉంటాయి. వీటి ద్వారానే చెమట, జిడ్డు లాంటి మలినాలను చర్మం బయటికి పంపిస్తుంది. కొంతమందిలో ఈ రంధ్రాలు కొద్దిగా పెద్దవిగా తెరచుకుని ఉంటాయి. ముఖ్యంగా ముఖం మీద. వీటివల్ల ముఖం నునుపుగా మెరవదు. వీటిలో మురికి, దుమ్ము లాంటివి చేరి మొటిమలు, గుల్లలు ఏర్పడుతుంటాయి. జిడ్డు చర్మం ఉన్నవారిని ఈ సమస్య అధికంగా వేధిస్తూ ఉంటుంది. అలాంటప్పుడు చిన్న చిట్కాలతో ఈ రంధ్రాలను శుభ్రం చేసి దగ్గరకు ముడుచుకునేలా చేయవచ్చు.



- చిన్న గిన్నెలో రెండు చెంచాల కలబంద గుజ్జు, మూడు చెంచాల కీరా రసం వేసి బాగా కలపాలి. ఈ మిశ్రమాన్ని చూపుడు వేలితో ముఖమంతా పట్టించాలి. అరగంటసేపు ఆరనిచ్చి తరవాత చల్లటి నీళ్లతో కడిగేయాలి. ఇలా రెండు రోజులకు ఒకసారి చేస్తూ ఉంటే చర్మ రంధ్రాలు పూర్తిగా శుభ్రమవుతాయి. తగినంత తేమ అంది చర్మం బిగుతుగా మారుతుంది. దీంతో చర్మ రంధ్రాలు కుంచించుకుంటాయి.
- గిన్నెలో రెండు చెంచాల ఓట్స్, రెండు చెంచాల పెరుగు వేసి బాగా కలిపి పేస్టులా చేయాలి. దీన్ని ముఖాన్ని పట్టించి పావుగంటసేపు ఆరనివ్వాలి. తరవాత వేళ్లతో గుండ్రంగా రుద్దుతూ మర్దన చేస్తే చర్మం మీద పేరుకున్న మృత కణాలు, రంధ్రాల్లో చేరిన మురికి తొలగిపోతాయి. గోరువెచ్చని నీళ్లతో కడిగేసుకుంటే ముఖం పూర్తిగా శుభ్రపడుతుంది. పెరుగులోని లాక్టిక్ ఆమ్లం చర్మ రంధ్రాలు మూసుకునేలా చేస్తుంది. దీంతో చర్మం నునుపుగా కనిపిస్తుంది.
- ఒక గిన్నెలో రెండు చెంచాల ముల్తానీ మట్టిని తీసుకుని దానికి మూడు చెంచాల గులాబీ నీళ్లు కలిపి పేస్టులా చేయాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పట్టించి పది నిమిషాల తరవాత నీళ్లతో శుభ్రం చేసుకుంటే జిడ్డు పూర్తిగా తొలగిపోతుంది. చర్మం నున్నగా మెరుస్తుంది. బాగా పండిన టమాటాలను గుజ్జులా చేసి ముఖానికి ప్యాక్ వేయాలి. ఇరవై నిమిషాల తరవాత గోరువెచ్చని నీళ్లతో శుభ్రం చేసుకుంటే రంధ్రాలు అసలు కనిపించవు.
- ఒక గిన్నెలో గుడ్డు తెల్ల సొన, ఒక చెంచా నిమ్మరసం వేసి నురుగు వచ్చేలా కలపాలి. ఈ మిశ్రమాన్ని బ్రష్ సహాయంతో ముఖమంతా పట్టించాలి. అరగంటసేపు ఆరనిచ్చి చల్లటి నీళ్లతో శుభ్రం చేసుకోవాలి. వారానికి ఒకసారి ఇలా చేస్తూ ఉంటే చర్మం బిగుతుగా మారుతుంది. రంధ్రాలు కూడా సన్నగా మారతాయి.

సాలె పురుగులతో ఇబ్బందా..?

సాధారణంగా ఇంట్లో పైకప్పు మీద, సామాన్ల మధ్య సాలె పురుగులు గూళ్లు అల్లుతూ ఉంటాయి. ఇవి అంత ప్రమాదకరం కానప్పటికీ వీటివల్ల ఇల్లు అపరిశుభ్రంగా ఉందనే భావన వస్తుంది. ఈ సాలె పురుగులను సులువుగా తొలగించే చిట్కాల గురించి తెలుసుకుందాం...



- అయిదు వెల్లుల్లి రెబ్బలను కచ్చాపచ్చాగా దంచి ఒక స్ప్రే బాటిల్‌లో వేసి నిండుగా నీరు పోయాలి. రాత్రంతా నాననివ్వాలి. ఉదయాన్నే ఈ నీటిని సాలె పురుగులు గూళ్లు అల్లే ప్రదేశాల్లో పిచికారీ చేస్తే అవి వెంటనే బయటికి వెళ్లిపోతాయి. మళ్లీ రావు.
- కర్పూరం, తులసి, లావెండర్, సిట్రోనెల్లా, పుదీనా నూనెల్లో ఒకదాన్ని తీసుకుని ఒక గ్లాసు నీళ్లలో అయిదు చుక్కలు వేసి బాగా కలపాలి. ఈ నీటిని గది మూలలు, తలుపు సందులు, కిటికీల వద్ద చల్లితే సాలె పురుగులు చేరవు. ఇల్లు సువాసనతో నిండుతుంది.
- ఒక బకెట్ నీళ్లలో రెండు చెంచాల వెనిగర్ లేదా నిమ్మరసం వేసి బాగా కలపాలి. ఈ నీటిలో స్పాంజ్ లేదా పలుచని బట్టను ముంచి దానితో ఫర్నిచర్, ఫ్యాన్లు, బల్బులు, తలుపులు తదితరాలను తుడిచేస్తే సమస్య తీరుతుంది.
- గది మూలల్లో, సోఫాకి ఇరుపక్కలా, వంటగది కిటికీలో, బాల్కనీ గోడల మీద పుదీనా, రోజ్‌మేరీ, లావెండర్ మొక్కల కుండీలు ఉంచినా మంచి ఫలితం కనిపిస్తుంది. ఈ మొక్కలు ఇంట్లో తాజాదనాన్ని నింపుతాయి.
- నిమ్మ, కమలాలు, బత్తాయిలాంటి సిట్రస్ పండ్ల తొక్కలను ఎండబెట్టి ఒక గిన్నెలో వేసి గది మూలల్లో ఉంచితే సాలె పురుగులు రావు.
- ఒక చెంచా బేకింగ్ సోడా లేదా పొగాకు పొడి కలిపిన నీళ్లను గది మూలల్లో పిచికారీ చేస్తే వెంటనే ఫలితం కనిపిస్తుంది.
- కనీసం ఆర్నెలలకు ఒకసారి ఇంటిని పూర్తిగా శుభ్రం చేసుకుని అవసరం లేని సామాన్లను తొలగిస్తే సాలెపురుగులు చేరవు.

అందమంతా... బ్లౌజ్ డిజైన్‌లోనే

ఈ మధ్యకాలంలో చీరల కన్నా బ్లౌజ్‌లకు ఎక్కువ ప్రాముఖ్యత లభిస్తోంది. ప్రతి పండుగ సీజన్‌కూ కొత్త కొత్త డిజైన్‌లు అందుబాటులోకి వచ్చేస్తున్నాయి. ప్రస్తుతం ట్రెండింగ్‌లో ఉన్న డిజైన్‌లు ఏమిటో చూద్దాం..











సన్నగా ఉన్నవారికి...

- బ్లౌజ్ చేతులు చిన్నగా ఉంటేనే బాగుంటుంది.
- బోట్ నెక్, కాలర్ నెక్, హైనెక్‌లు బాగా నప్పుతాయి. ఇవి వేసుకుంటే లావుగా కనబడతారు.
- బుట్టచేతులు కూడా బాగుంటాయి. చీరకు ప్రత్యేకమైన అందాన్నిస్తాయి.
- సన్నని చారలు ఉన్న బ్లౌజ్‌లు.... ఆకర్షణీయంగా ఉంటాయి.

బొద్దుగా ఉన్నవారికి..

- డీప్ నెక్ కుట్టించుకుంటే బాగుంటుంది. దీని వల్ల సన్నగా కనబడతారు.
- వీలైనంత వరకు హైనెక్, బోట్‌నెక్‌లు కుట్టించుకోకుండా ఉంటే మంచిది.
- బ్లౌజ్ చేతులు పొడవుగా ఉంటే హుందాగా కనిపిస్తారు.
- వీరికి బుట్టచేతులు నప్పవు.

నెట్టెడ్ బ్లౌజ్‌లు

ఈ తరహా బ్లౌజ్‌లలో చేతులకు.. వెనక భాగానికి నెట్టెడ్ క్లాత్‌ను ఉపయోగిస్తారు. వీటిపై జర్దోసి, జరీ వర్క్‌లను కూడా చేయిస్తారు. సాధారణంగా హైనెక్‌నే కుడతారు. మిగిలిన బ్లౌజ్‌లతో పోలిస్తే వీటి ఖరీదు ఎక్కువ. కుట్టడానికి కూడా ఎక్కువ సమయం పడుతుంది. నెటెడ్ బ్లౌజ్‌లు సన్నగా ఉన్నవారికి బాగా నప్పుతాయి. ఈ బ్లౌజ్‌లపై మెడను పట్టి ఉండే చోకర్స్ కన్నా.. మామూలు నెక్లెస్‌లు అందంగా అమరుతాయి.



ఇండో వెస్ట్రన్ బ్లౌజ్‌లు

ఒక వైపు సంప్రదాయం.. మరో వైపు ఆధునికతలను ఈ ఇండో వెస్ట్రన్ బ్లౌజ్‌లు ప్రతిబింబిస్తాయి. డోరీ, హాల్టర్‌నెక్, మహారాణి నెక్, కాలర్‌నెక్‌లు ఈ బ్లౌజ్‌ల ప్రత్యేకత. బ్యాక్‌లెస్ బ్లౌజ్‌లు ఈ మధ్య బాగా ప్రచారంలోకి వచ్చాయి. హల్దీ, మెహందీ ఫంక్షన్లలో వీటిని ఎక్కువగా ధరిస్తున్నారు.




రాసిల్క్ బ్లౌజ్‌లు

రాసిల్క్ బ్లౌజ్ గుడ్డలు.... అనేక రంగుల్లో మనకు లభిస్తాయి. వీటిని తెచ్చుకుని బ్లౌజ్‌లు కుట్టించి వాటిపై జర్దోసి, జరీ, కర్దానా, స్టోన్ వర్క్‌లను చేయిస్తున్నారు. సాధారణంగా పెళ్లి సమయంలో ఇలాంటి బ్లౌజ్‌లను ఎంపిక చేసుకుంటూ ఉంటారు. ఈ బ్లౌజ్ డిజైన్‌లలో రాళ్లు, జరీదారాల పనితనం ఉంటుంది కాబట్టి ఖరీదు కూడా ఎక్కువే!

• ఖ్యాతి, హైదరాబాద్,
6300386749

నీరజ్‌కు మళ్లీ టాప్ ర్యాంక్



న్యూఢిల్లీ: భారత స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా.. ప్రపంచ ర్యాంకింగ్స్‌లో మళ్లీ అగ్రస్థానానికి చేరుకొన్నాడు. శనివారం విడుదల చేసిన తాజా ర్యాంక్‌ల జాబితాలో నీరజ్ మొత్తం 1445 పాయింట్లతో టాప్‌లో నిలిచాడు. గతేడాది సెప్టెంబరులో చోప్రాను వెనక్కినెట్టి గ్రెనడా త్రోయర్ అండర్సన్ పీటర్స్ టాప్ ర్యాంక్‌ను అందుకొన్నాడు. కానీ, ఆ తర్వాత నిలకడగా రాణిస్తున్న చోప్రా ఇటీవలే వరుసగా పారిస్ డైమండ్ లీగ్, ఓస్ట్రావా గోల్డెన్ స్పైక్ ఈవెంట్లు గెలిచాడు. దీంతో మళ్లీ నెంబర్‌వన్ స్థానానికి చేరుకున్నాడు. అండర్సన్ (1431) రెండో ర్యాంక్‌కు పడిపోగా, జులియన్ వెబెర్ (జర్మనీ, 1412) మూడు, పారిస్ ఒలింపిక్స్ చాంపియన్ అర్షద్ నదీమ్ (పాకిస్థాన్, 1370) నాలుగో ర్యాంక్‌లో ఉన్నారు. జాకుబ్ (చెక్, 1366) ఐదో స్థానంతో టాప్-5లో నిలిచాడు.

శతక్కొట్టిన మంధాన

- తెలుగమ్మాయి శ్రీచరణి విజృంభణ
- అరంగేట్ర మ్యాచ్‌లోనే 4 వికెట్లు

51 బంతుల్లోనే సెంచరీ

తొలి టీ20లో ఇంగ్లండ్‌పై భారత ఘన విజయం



స్మృతీ మంధాన (112)



శ్రీచరణి (4/12)

నాటింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో భారత మహిళల జట్టు ఘనంగా బోణీ చేసింది. తాత్కాలిక కెప్టెన్, స్టార్ ఓపెనర్ స్మృతీ మంధాన (62 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్సర్లతో 112) తన టీ20 కెరీర్‌లో తొలి సెంచరీతో అదరగొట్టింది. ప్రత్యర్థి బౌలర్లపై సంపూర్ణ ఆధిపత్యం చూపిన స్మృతి ఆఖరి ఓవర్‌లో వెనుదిరగగా, హర్లీన్ డియోల్ (23 బంతుల్లో 7 ఫోర్లతో 43) అద్భుత సహకారం అందించింది. ఇక, తెలుగమ్మాయి, కడప జిల్లాకు చెందిన శ్రీచరణి తన అరంగేట్ర మ్యాచ్‌లోనే సత్తా చాటుతూ ఏకంగా నాలుగు వికెట్లు పడగొట్టింది. ఫలితంగా శనివారం జరిగిన తొలి మ్యాచ్‌లో భారత్ 97 రన్స్‌తో ఘన విజయం సాధించింది. టీ20ల్లో ఇంగ్లండ్‌కిదే అతిపెద్ద ఓటమి. ఈ గెలుపుతో ఐదు టీ20ల సిరీస్‌లో భారత్ 1-0తో పైచేయి సాధించింది. రెండో మ్యాచ్ మంగళవారం జరుగుతుంది. ముందుగా బ్యాటింగ్‌కు దిగిన భారత్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 210 పరుగుల భారీ స్కోరు సాధించింది. లారెన్ బెల్‌కు మూడు వికెట్లు దక్కాయి. ఆ తర్వాత ఛేదనలో ఇంగ్లండ్ వరుస విరామాల్లో వికెట్లు కోల్పోయింది. తొలి అంతర్జాతీయ టీ20 ఆడిన యువ స్పిన్నర్ శ్రీచరణి (3.5-0-12-4) అద్భుత గణాంకాలు నమోదు చేయడంతో ఇంగ్లండ్ 14.5 ఓవర్లలో 113 పరుగులకే కుప్పకూలింది. ఇంగ్లండ్ జట్టులో కెప్టెన్ సివర్ బ్రంట్ (42 బంతుల్లో 10 ఫోర్లతో 66) మినహా ఎవరూ రాణించలేదు. రాధా యాదవ్, దీప్తి శర్మలకు రెండేసి వికెట్లు లభించాయి. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా మంధాన నిలిచింది. వామప్ మ్యాచ్‌లో తలకు గాయం కావడంతో ముందు జాగ్రత్తగా కెప్టెన్ హర్మన్‌ప్రీత్‌కు విశ్రాంతినిచ్చారు.

మంధాన, హర్లీన్ జోరు: టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు ఓపెనర్ మంధాన, వన్‌డౌన్ బ్యాటర్ హర్లీన్ తుఫాన్ ఇన్నింగ్స్‌తో భారీ స్కోరును అందించారు. అయితే చివర్లో పుంజుకున్న ఇంగ్లండ్ బౌలర్లు కాస్త కట్టడి చేయగలిగారు. ఆరంభంలో మరో ఓపెనర్ షఫాలీ (20) తడబడినా.. మంధాన సహజశైలిలో బ్యాట్ ఝుళిపించింది. మైదానం నలువైపులా భారీ షాట్లు ఆడేస్తూ చకచకా స్కోరును పెంచింది. తొలి వికెట్‌కు షఫాలీతో కలిసి 77 పరుగులు అందించింది. ఆ తర్వాత హర్లీన్ రాకతో భారత్ స్కోరు రాకెట్ వేగంతో దూసుకెళ్లింది. పదో ఓవర్‌లో ఆమె మూడు ఫోర్లు సాధించింది. అలాగే మంధాన సిక్సర్‌తో స్కోరు 11వ ఓవర్‌లోనే వందకి చేరింది. అయితే హర్లీన్ 26 పరుగుల వద్ద ఇచ్చిన క్యాచ్‌ను వ్యాట్ హాడ్జ్ వదిలేసింది. అటు అవలీలగా బౌండరీలు బాదేసిన మంధాన 51 బంతుల్లోనే టీ20 కెరీర్‌లో తొలి సెంచరీ పూర్తి చేసుకుంది. 16వ ఓవర్‌లో హర్లీన్‌ను పేసర్ లారెన్ బెల్ అవుట్ చేయడంతో రెండో వికెట్‌కు 94 పరుగుల భారీ భాగస్వామ్యం ముగిసింది. అనంతరం భారత్ వేగంగా వికెట్లను కోల్పోయింది. రిచా (12), జెమీమా (0) 18వ ఓవర్‌లో వెనుదిరిగారు. ఆఖరి ఓవర్‌లో ఫోర్‌తో స్కోరును 200కి చేర్చిన స్మృతి మంధాన ఆ వెంటనే అవుటైంది. మొత్తంగా చివరి మూడు ఓవర్లలో జట్టు 26 పరుగులే సాధించింది.

2
టీ20ల్లో భారత మహిళల జట్టుకిది రెండో అత్యధిక స్కోరు (210). గతేడాది వెస్టిండీస్‌పై 217 పరుగులు సాధించింది.

భారత్ తరఫున మహిళల టీ20ల్లో అత్యధిక స్కోరు (112) సాధించిన స్మృతీ మంధాన. హర్మన్‌ప్రీత్ (103)ను అధిగమించింది. అలాగే మూడు ఫార్మాట్లలోనూ శతకం బాదిన తొలి భారత ప్లేయర్‌గా స్మృతి నిలిచింది.

1
అంతర్జాతీయ మహిళల టీ20ల్లో ఏ వికెట్‌కైనా ఎక్కువ (21) 50+ భాగస్వామ్యాలు నమోదు చేసిన జోడీగా మంధాన-షఫాలీ. గతంలో అలీసా హీలీ-బెథ్ మూనీ (20) పేరిట ఈ రికార్డు ఉండేది.

సంక్షిప్త స్కోర్లు

భారత్: 20 ఓవర్లలో 210/5 (స్మృతీ మంధాన 112, హర్లీన్ డియోల్ 43, షఫాలీ 20; బెల్ 3/27).
ఇంగ్లండ్: 14.5 ఓవర్లలో 113 ఆలౌట్. (సివర్ 66; శ్రీచరణి 4/12, రాధా యాదవ్ 2/15, దీప్తి శర్మ 2/32).

ఆసియా స్నూకర్‌లో భారత్‌కు స్వర్ణం

కొలంబో: ఆసియా స్నూకర్ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంప్ భారత్ స్వర్ణాన్ని నిలబెట్టుకొంది. శనివారం జరిగిన ఫైనల్లో పంకజ్ అద్వానీ, బ్రిజేష్ దమానిలతో కూడి భారత జట్టు 3-1తో బలమైన మలేసియాను ఓడించింది. రెండేళ్ల క్రితం ఇరాన్‌లో జరిగిన టోర్నీలో భారత్ పసిడిని సొంతం చేసుకొంది. తొలి సింగిల్స్‌లో బ్రిజేష్ ఓడినా.. తర్వాత పంకజ్ నెగ్గి సమం చేశాడు. డబుల్స్‌లో పంకజ్/దమాని జంట గెలిచి భారత్‌కు బంగారు పతకాన్ని అందించింది.

సెమీస్‌కు తన్వీ, ఆయుష్

లోవా (యూఎస్): భారత వర్ధమాన షట్లర్లు తన్వీ శర్మ, ఆయుష్ శెట్టి యూఎస్ ఓపెన్ బ్యాడ్మింటన్‌లో సెమీస్‌కు చేరుకొన్నారు. శనివారం జరిగిన మహిళల సింగిల్స్ క్వార్టర్స్‌లో తన్వీ 21-13, 21-16తో కరుపతేవన్ లెట్‌షానా (మలేసియా)పై నెగ్గింది. కాగా, పురుషుల సింగిల్స్‌లో జూనియర్ వరల్డ్ చాంపియన్ కుయో కువాన్ లిన్ (చైనీస్ తైపీ)పై ఆయుష్ 22-20, 21-9తో సంచలన విజయం సాధించాడు.

నిఖత్ శుభారంభం



హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ మహిళల ఎలీట్ బాక్సింగ్ చాంపియన్‌షిప్‌లో తెలంగాణ స్టార్ నిఖత్ జరీన్ శుభారంభం చేసింది. శనివారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో ప్రారంభమైన ఈ పోటీల్లో 48-51 కిలోల విభాగంలో నిఖత్ 4-1తో రాశీ శర్మ (ఉత్తరప్రదేశ్)పై గెలిచింది. 60-65 కిలోల విభాగంలో మరో తెలంగాణ బాక్సర్ యషి శర్మ 5-0తో నిషా (తమిళనాడు)పై గెలిచింది. మిగతా తెలంగాణ బాక్సర్లలో 65-70 కిలోల విభాగంలో పూజ, 75-80 కిలోల కేటగిరీలో కీర్తి ఓటమి పాలయ్యారు.

దక్షిణాఫ్రికా 418/9

- ప్రిటోరియస్, బాష్ సెంచరీలు
- జింబాబ్వేతో తొలి టెస్టు



ప్రిటోరియస్ (153)

బులవాయో: అరంగేట్ర ఆటగాడు లువాన్ డ్రి ప్రిటోరియస్ (153)తోపాటు కార్బిన్ బాష్ (100 బ్యాటింగ్) శతక మోత మోగించడంతో జింబాబ్వేతో శనివారం మొదలైన తొలి టెస్టు మొదటి రోజు దక్షిణాఫ్రికా 400కు పైగా పరుగులు చేసింది. 55/4తో ఉన్న దశలో మరో అరంగేట్ర ఆటగాడు బ్రేవిస్ (51)తో కలిసి ఐదో వికెట్‌కు ప్రిటోరియస్ 95 రన్స్ జోడించాడు. అనంతరం బాష్ జతగా ఏడో వికెట్‌కు 108 రన్స్ జత చేశాడు. దాంతో ఆట ముగిసేసరికి సఫారీలు తొలి ఇన్నింగ్స్‌లో 418/9 స్కోరు చేశారు. చివంగ 4 వికెట్లు పడగొట్టాడు. కాగా.. 19 ఏళ్ల 93 రోజుల్లో శతకం బాదిన ప్రిటోరియస్ అతి పిన్న వయస్సులో ఈ ఘనత సాధించిన దక్షిణాఫ్రికా క్రికెటర్‌గా 61 ఏళ్ల రికార్డును బద్దలుగొట్టాడు. 1964లో గ్రేమ్ పొలాక్ (19 ఏళ్ల 317 రోజులు) రికార్డును అధిగమించాడు.

బుమ్రా సిద్ధమేనా!

రెండోరోజు నెట్స్‌లో చెమటోడ్చిన పేసర్



బర్మింగ్‌హామ్: ఇంగ్లండ్‌తో రెండో టెస్టుకు భారత్ సన్నాహకాల్లో శనివారం కీలక పరిణామం చోటు చేసుకుంది. పేస్ దళపతి బుమ్రా రెండో రోజు తీవ్రంగా సాధన చేయడమే ఆ పరిణామం. పని భారం నిర్వహణలో భాగంగా..వచ్చే నెల 2 నుంచి ఇక్కడ జరిగే రెండో టెస్టుకు బుమ్రాకు విశ్రాంతి ఇస్తారని విస్తృతంగా వార్తలు వస్తున్నాయి. వీటికి బలం చేకూరుస్తూ శుక్రవారం, తొలిరోజు మిగిలిన జట్టంతా ప్రాక్టీస్ చేసినా బుమ్రా పాల్గొనలేదు. బుమ్రాతోపాటు మరో పేసర్ ప్రసిద్ధ్ కూడా మొదటి రోజు సాధనకు దూరంగా ఉన్నాడు. దాంతో పనిభారం నిర్వహణలో భాగంగా బుమ్రా వైదొలగుతాడని, తొలి టెస్టులో అంతగా ఆకట్టుకోలేకపోయిన ప్రసిద్ధ్‌పై రెండో టెస్టుకు వేటు పడుతుందనే చర్చ మొదలైంది. అయితే ఈ సిరీస్‌లో 0-1తో భారత్ వెనుకంజలో ఉన్న నేపథ్యంలో రెండో టెస్టులో బుమ్రా ఆడాల్సిన అవసరం ఎంతో ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇక..శనివారంనాటి ప్రాక్టీస్‌లో పేస్ త్రయం బుమ్రా, సిరాజ్‌తోపాటు ప్రసిద్ధ్ శ్రమించారు. మొత్తంగా బుమ్రా ప్రాక్టీస్ చేయడంతో జట్టులో ఉత్సాహం నిండింది. కానీ రెండో టెస్టుకు తుది జట్టులో బుమ్రా ఉంటాడా అనే విషయమై స్పష్టత రాలేదు. ఇక.. బ్యాటర్ సాయి సుదర్శన్ రెండో రోజు సాధనలో తొలుత బ్యాటింగ్‌కు దిగాడు.

ఒక్క సెషన్‌లోనే కూల్చారు

విండీస్ చిత్తు ● 159 రన్స్‌తో ఆసీస్ గెలుపు



హాజెల్‌వుడ్ (5/43)

బ్రిడ్జిటౌన్: వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టును ఆస్ట్రేలియా మూడు రోజుల్లోనే ముగించింది. 301 పరుగుల లక్ష్య ఛేదన కోసం శుక్రవారం చివరి సెషన్‌లో విండీస్ రెండో ఇన్నింగ్స్‌ను ఆరంభించింది. అయితే పేసర్ హాజెల్‌వుడ్ (5/43) ధాటికి కేవలం 141 పరుగులకే కుప్పకూలింది. దీంతో ఆసీస్ 159 పరుగులతో భారీ విజయం దక్కించుకుంది. మూడు టెస్టుల సిరీస్‌లో 1-0తో ఆధిక్యం అందుకుంది. షామర్ జోసెఫ్ (44), గ్రీవ్స్ (38 నాటౌట్) రాణించారు. అంతకుముందు ఆసీస్ రెండో ఇన్నింగ్స్‌లో 310 పరుగులు చేసింది. షామర్‌కు 5 వికెట్లు దక్కాయి. తొలి ఇన్నింగ్స్‌లో ఆసీస్ 180, విండీస్ 190 రన్స్ చేశాయి. మరోవైపు వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ చరిత్రలో పదిసార్లు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' సాధించిన ఏకైక బ్యాటర్‌గా ట్రావిస్ హెడ్ రికార్డు నెలకొల్పాడు.

శ్రీలంక ఇన్నింగ్స్ విజయం

రెండో టెస్టులో బంగ్లా ఓటమి ● కెప్టెన్సీకి షంటో గుడ్‌బై

కొలంబో: బంగ్లాదేశ్‌తో జరిగిన రెండు టెస్టుల సిరీస్‌ను ఆతిథ్య శ్రీలంక 1-0తో గెలుచుకుంది. తొలి టెస్టు డ్రాగా ముగియగా.. చివరిదైన కొలంబో టెస్టులో లంక ఇన్నింగ్స్ 78 పరుగుల తేడాతో నెగ్గింది. 211 పరుగుల లోటుతో శనివారం నాలుగో రోజు 115/6 ఓవర్‌నైట్ స్కోరుతో బంగ్లా రెండో ఇన్నింగ్స్ ఆరంభించింది. అయితే లెఫ్టామ్ స్పిన్నర్ ప్రబాత్ జయసూరియ 5 వికెట్లతో దెబ్బతీయడంతో బంగ్లా 133 పరుగులే చేసింది. అంతకుముందు బంగ్లా తొలి ఇన్నింగ్స్‌లో 247, శ్రీలంక 458 రన్స్ సాధించింది. అటు బంగ్లా చిత్తుగా ఓడడంతో కెప్టెన్ నజ్ముల్ షంటో తన పదవికి రాజీనామా చేస్తున్నట్టు ప్రకటించాడు. 2023లో బాధ్యతలు తీసుకున్న అతడి ఆధ్వర్యంలో బంగ్లా 14 టెస్టులు ఆడగా నాలుగింట్లో నెగ్గింది.


ప్రొ హాకీ లీగ్ నుంచి భారత్ అవుట్

బెర్లిన్: ఎఫ్‌ఐహెచ్ ప్రొ హాకీ లీగ్‌లో శనివారం జరిగిన మ్యాచ్‌లో భారత మహిళల జట్టు 0-3తో చైనా చేతిలో చిత్తయింది. వరుసగా ఏడో ఓటమితో అట్టడుగున నిలిచిన భారత్.. 2025-26 సీజన్‌లో ప్రొ హాకీ లీగ్ నుంచి నిష్క్రమించింది.

బిజినెస్ ప్లస్

ఆరోగ్య బీమా... జాగ్రత్తలతో

మరింత ధీమా...



వయసుతో పాటు ఆరోగ్య సమస్యలూ పెరిగిపోతున్నాయి. ఈ ఖర్చుల భారం తప్పించుకోవాలంటే ఆరోగ్య బీమానే గతి. లేకపోతే ఇల్లూ,ఒళ్లూ గుల్లే. అలా అని ఏజెంట్లు చెప్పే మాటలు నమ్మి ఎడాపెడా ఆరోగ్య బీమా పాలసీలు తీసుకోకూడదు. అలా చేస్తే కష్ట సమయాల్లో అక్కరకు రాకపోగా మన జేబుకే చిల్లు పడే ప్రమాదం ఉంది.

చాలా మంది ఏ మాత్రం ఆలోచించకుండానే ఆరోగ్య బీమా పాలసీలు తీసుకుంటున్నారు. పాలసీ షరతులు, పరిమితుల గురించి పెద్దగా తెలుసుకోకుండానే ఏజెంట్లు చెప్పే మాటలు నమ్మి పాలసీలు తీసుకుంటున్నారు. పాలసీ తీసుకున్నాం, ఇక ఏ ఆరోగ్య సమస్య వచ్చినా బీమా కంపెనీనే భరిస్తుందనే భ్రమల్లో ఉంటున్నారు. ఇప్పుడు ఆన్‌లైన్‌లోనూ ఆరోగ్య బీమా పాలసీలు అందుబాటులో ఉన్నాయి.

దీంతో చాలా మంది స్విగ్గీ, జొమాటాలో బిర్యానీ లేదా ఇతర తినుబండారాలు ఆర్డర్ చేసినంత ఈజీగా ఆరోగ్య బీమా పాలసీలు కొనేస్తున్నారు. ఆ పాలసీ షరతులు ఏంటి? కవరేజీ పరిమితులు, మినహాయింపుల గురించి ఏమాత్రం అర్థం చేసుకోవడం లేదు. దీంతో ఆరోగ్యం దెబ్బతిని ఆస్పత్రిలో చేరేటప్పుడు అనేక సమస్యలు ఎదురవుతున్నాయి. ఈ పరిమితులు, మినహాయింపులను అడ్డుపెట్టుకుని బీమా కంపెనీలూ క్లెయిమ్స్‌కు సారీ చెబుతున్నాయి. ఈ సమస్యలు రాకుండా ఉండాలంటే ఆరోగ్య బీమా పాలసీ తీసుకునేటప్పుడే జాగ్రత్తలు తీసుకోవటం తప్పనిసరి. అవేమిటంటే..

అవగాహన

ఆరోగ్య బీమా అనేది ఒక భరోసా. అయితే వ్యాపారం పెంచుకునేందుకు కంపెనీల ఏజెంట్లు ఇప్పుడు దీన్ని కూడా వస్తువులను అమ్మినట్టు అమ్మేస్తున్నారు. పాలసీ తీసుకునే వ్యక్తికి పెద్దగా అవగాహన లేకపోతే లేని ప్రయోజనాలను ఉన్నట్టు చెప్పి మరీ అంటగడుతున్నారు. కాబట్టి కొత్తగా ఆరోగ్య బీమా తీసుకునే వ్యక్తి లేదా వ్యక్తులు పాలసీ గురించి పూర్తిగా అవగాహన చేసుకున్నాకే పాలసీ తీసుకోవడం మంచిది. ఇందుకోసం పాలసీ షరతులు, కవరేజీ పరిమితులు, మినహాయింపులను ఒకటికి రెండు సార్లు చదివి అర్థం చేసుకోవాలి. ఒకవేళ అర్థంగాకపోతే ఎవరైనా ఆర్థిక సలహాదారుని సంప్రదించడం మంచిది.

ఇప్పటికే ఉన్న వ్యాధులు

దాదాపు అన్ని బీమా కంపెనీలు ఇప్పటికే ఉన్న వ్యాధులకు వెంటనే కవరేజీ అనుమతించవు. కనీసం రెండు మూడేళ్ల తర్వాతే ఇందుకు అనుమతిస్తాయి. ఒకవేళ ఇప్పటికే ఉన్న ఆరోగ్య సమస్యలకు కూడా వెంటనే కవరేజీ కావాలంటే ప్రీమియం కొద్దిగా ఎక్కువ చెల్లించాలి.

మెటర్నిటీ ట్రీట్‌మెంట్లు

ఆరోగ్య బీమా పాలసీ తీసుకునేటప్పుడే మెటర్నిటీ ట్రీట్‌మెంట్ ఆప్షన్‌ను ఎంచుకోవాలి. లేకపోతే బీమా కంపెనీలు ఇందుకు అనుమతించవు. ఒకవేళ అనుమతించినా అందుకు సవాలక్ష పరిమితులు, ఆంక్షలు పెడుతుంటాయి.

ఆధునిక ట్రీట్‌మెంట్లు

ఆరోగ్య సమస్యలతో పాటు ట్రీట్‌మెంట్లు ఎప్పటికప్పుడు మారిపోతున్నాయి. టెక్నాలజీ అభివృద్ధితో ఇప్పుడు అధునాతన రోబోటిక్ సర్జరీలు, జన్యు (జెనెటిక్) పరీక్షలూ అందుబాటులోకి వచ్చాయి. పాలసీ తీసుకునేటప్పుడే ఇవి కూడా కవరయ్యేలా జాగ్రత్త పడాలి.

మానసిక రుగ్మతలు

మానసిక రుగ్మతలకు కూడా ఆరోగ్య బీమా వర్తింప చేయాలని బీమా నియంత్రణ, అభివృద్ధి మండలి (ఐఆర్‌డీఏఐ) ఆదేశాలు జారీ చేసింది. అయినా ఈ ఆప్షన్ ఒకటి ఉందనే విషయాన్ని బీమా కంపెనీలు పెద్దగా పాలసీదారులకు చెప్పడం లేదు. మానసిక ఒత్తిళ్లు పెరిగిపోతున్న ఈ రోజుల్లో ఆరోగ్య బీమా పాలసీ కింద ఈ రుగ్మతలకు కూడా కవరేజీ ఉండేలా చూసుకోవాలి.

గదుల అద్దె

కొన్ని ఆరోగ్య సమస్యలకు ఆస్పత్రుల్లో ఇన్‌పేషెంట్‌గా చేరక తప్పదు. అయితే ఇందుకు అయ్యే రూమ్ రెంట్‌పై బీమా కంపెనీలు అనేక పరిమితులు పెడుతుంటాయి. ఆ పరిమితికి మించి రూమ్ రెంట్ ఉంటే ఆ అదనపు మొత్తాన్ని పాలసీదారులే భరించాలి. కొన్ని బీమా కంపెనీలు రూమ్ రెంట్ ఎంత ఉన్నా, అది పాలసీ కవరేజీకి లోబడి ఉంటే చాలని చెబుతున్నాయి. పాలసీ తీసుకునేటప్పుడే పాలసీదారులు ఈ విషయంలో జాగ్రత్త పడాలి. లేకపోతే జేబుకు చిల్లు పడుతుంది.

ఓపీడీ, వ్యాధి నిర్ధారణ

ఇవాళ ఔట్ పేషెంట్ సేవలు, వ్యాధి నిర్ధారణ పరీక్షలు కూడా పెద్దభారంగా మారాయి. పెద్దపెద్ద ఆస్పత్రుల్లో డాక్టర్ కన్సల్టేషన్, వ్యాధి నిర్ధారణ పరీక్షల కోసం వేలకు వేలు ఖర్చు చేయాల్సి వస్తోంది. ఆరోగ్య బీమా పాలసీ తీసుకునేటప్పుడే ఈ ఖర్చులకూ కవరేజీ ఉండేలా జాగ్రత్త పడాలి. అయితే బీమా కంపెనీలు ఒక పరిమితి వరకే ఈ ఖర్చులను అనుమతిస్తాయి.

ఇతర జాగ్రత్తలు

- పాలసీ తీసుకునే ముందే పాలసీ బ్రోచర్‌ను కాకుండా పాలసీ పూర్తి డాక్యుమెంట్ తీసుకుని చదివి పూర్తిగా అర్థం చేసుకోవాలి.
- పాలసీ ద్వారా ఏయే సమస్యలకు కవరేజీ లభించదో ముందుగానే పూర్తిగా తెలుసుకోవాలి.
- బీమా కంపెనీల పరిభాష అందరికీ అర్థం కాదు. పాలసీలో పేర్కొనే సబ్ లిమిట్స్, కో-పే, వెయిటింగ్ పీరియడ్ అంటే ఏమిటో క్షుణ్ణంగా తెలుసుకోవాలి.
- వివాహం, పిల్లలు పుట్టినప్పుడు, వృద్ధులైన తల్లి దండ్రులు ఉన్నప్పుడు మీరు తీసుకున్న ఆరోగ్య బీమా పాలసీ మీ అవసరాలకు సరిపోతుందా? లేదా? అనే విషయాన్ని సమీక్షించుకోవాలి.
- మీ ఆరోగ్య బీమా పాలసీ కంపెనీ, పాలసీ వివరాలపై కుటుంబసభ్యులకు ముందుగానే పూర్తిగా తెలియజేయాలి. ఎందుకంటే ఏదైనా అత్యవసర పరిస్థితి ఏర్పడితే అన్ని విషయాలు చక్కబెట్టాల్సిందే వారే.

ఆరోగ్య బీమా పాలసీ తీసుకునే ముందే ఈ జాగ్రత్తలు తీసుకుంటే, అవసరమైనప్పుడు జేబులో పైసా ఖర్చు చేయకుండా ఆరోగ్య సమస్యల నుంచి తేలిగ్గా గట్టెక్కవచ్చు. లేకపోతే ఆరోగ్య పరంగానే కాకుండా ఆర్థికంగానూ దెబ్బతినే ప్రమాదం ఉంది.

హాస్పిటల్ సేవలపై జీఎస్‌టీ వర్తిస్తుందా?

ఇదీ GST



రాంబాబు గొండాల

మన దేశంలో ఆరోగ్య రంగం ఈ మధ్య కాలంలో బాగా విస్తరించింది. మన దగ్గర వైద్య సేవలు పొందేందుకు విదేశాల నుంచి కూడా రోగులు వస్తున్నారు. మరి ఇంత ప్రాముఖ్యత కలిగిన హెల్త్‌కేర్ రంగానికి సంబంధించి జీఎస్‌టీ ప్రభావం ఏమిటో తెలుసుకుందాం.

ఏ ప్రభుత్వమైనా ప్రజలందరికీ మెరుగైన వైద్య సేవలందించాలనే ప్రయత్నిస్తుంది. దీన్ని దృష్టిలో ఉంచుకుని ఆరోగ్య సంరక్షణకు వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ)లో అత్యంత ప్రాధాన్యతను ఇచ్చారు. దీన్నిబట్టి ఏదేనీ ఒక క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ అందించే అన్ని రకాల ఆరోగ్య సంరక్షణ సేవలకు జీఎస్‌టీ నుంచి మినహాయింపు లభిస్తుంది. మరి క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్, ఆరోగ్య సంరక్షణ సేవలు అంటే ఏమిటి?

క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ అంటే ఏదేనీ ఒక వైద్యశాల అంటే హాస్పిటల్, క్లినిక్, నర్సింగ్ హోమ్ లేదా వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేసే లాబ్స్ మొదలైనవి. అలాగే హెల్త్‌కేర్ సర్వీస్ అంటే అన్ని రకాల వ్యాధులకు చేసే వైద్యం. అంటే ఏదేనీ ఒక హాస్పిటల్ రోగులకు అందించే మొత్తం వైద్యంతో పాటుగా ఒక మెడికల్ ప్రాక్టీషనర్, పారామెడికల్స్ అందించే వైద్య సేవలకు కూడా జీఎస్‌టీ నుంచి మినహాయింపు ఉంది. అంతేకాకుండా, ఇన్‌పేషెంట్ ట్రీట్‌మెంట్‌కు కూడా మినహాయింపు ఉంది. అంటే, వైద్యం కోసం ఏదేనీ ఒక వ్యక్తి హాస్పిటల్‌లో అడ్మిట్ అయినప్పుడు అతను చెల్లించే మొత్తం బిల్లు మీద అంటే చికిత్సతో పాటు రూమ్‌రెంట్, డాక్టర్ కన్సల్టింగ్ చార్జీలు, అతనికి సమకూర్చే భోజనం, మందులు మొదలైన వాటి మీద జీఎస్‌టీ నుంచి మినహాయింపు లభిస్తుంది. ఇవే కాకుండా అంబులెన్స్‌కు సంబంధించి ఏదైనా సర్వీస్ పొందినా దానికి కూడా జీఎస్‌టీ వర్తించదు.

అయితే, రూమ్ రెంట్‌కు సంబంధించి 2022 జూలై నుంచి ఒక మార్పు చేయటం జరిగింది. దీని ప్రకారం రూమ్ అద్దె రోజుకు రూ.5,000 దాటే పక్షంలో దాని మీద 5 శాతం జీఎస్‌టీని చెల్లించాల్సి ఉంటుంది. కానీ, దీనికి సంబంధించి ఇన్‌పుట్ ట్యాక్ క్రెడిట్ (ఐటీసీ) తీసుకునే సౌలభ్యం సదరు హాస్పిటల్‌కు లేదు. ఇకపోతే, ఈ 5 శాతం జీఎస్‌టీ అనేది సాధారణ రూమ్‌లకు మాత్రమే. అంటే ఐసీయూ లాంటి వాటికి అద్దె ఎంత ఉన్నా జీఎస్‌టీ వర్తించదు.

అలాగే ఈ మధ్య కాలంలో సౌందర్యం ఇనుమడించటానికి కాస్మెటిక్, ప్లాస్టిక్ సర్జరీ, హెయిర్ ట్రాన్స్‌ప్లాంటేషన్ మొదలైన సేవలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. వీటికి జీఎస్‌టీ నుంచి మినహాయింపు లభించదు. కానీ ఏదేనీ ట్రీట్‌మెంట్‌లో భాగంగా ఇవి చేయాలంటే మాత్రం మినహాయింపు లభిస్తుంది. ఉదాహరణకు అందం కోసం ఒక వ్యక్తి ముక్కు లేదా ముఖానికి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకుంటే మినహాయింపు లభించదు. ఒకవేళ ఆ వ్యక్తి ఏదేనీ ప్రమాదానికి గురయి ప్లాస్టిక్ సర్జరీ చేయించుకోవాల్సి వస్తే మాత్రం జీఎస్‌టీ నుంచి మినహాయింపు లభిస్తుంది. పైన చెప్పినవన్నీ హాస్పిటల్ అందించే సేవలు. మరి హాస్పిటల్ పొందే సేవల మాటేమిటి? ఉదాహరణకు హౌస్ కీపింగ్, మెయింటెనెన్స్, సెక్యూరిటీ మొదలైన సేవలను బయటి వ్యక్తుల నుంచి పొందినప్పుడు వాటికి ఎలాంటి పన్ను మినహాయింపు ఉండదు. అలాగే హాస్పిటల్‌లో నిర్వహించే మెడికల్ షాప్, క్యాంటీన్ అమ్మకాలకు కూడా జీఎస్‌టీ నుంచి మినహాయింపు లేదు.

గమనిక: కేవలం అవగాహన కల్పించటం కోసం మాత్రమే ఇందులో కొన్ని ముఖ్య విషయాలను ప్రస్తావించటం జరిగింది. పూర్తి వివరాలకు సంబంధిత చట్టాలను క్షుణ్ణంగా పరిశీలించాలి.


మార్కెట్లోకి వీ-గార్డ్ స్మార్ట్ వాటర్ హీటర్స్



బెంగళూరు (ఆంధ్రజ్యోతి): ఎలక్ట్రానిక్ ఉపకరణాల తయారీ సంస్థ వీ-గార్డ్ మార్కెట్లోకి స్మార్ట్ వాటర్ హీటర్స్‌ను విడుదల చేసింది. ఈ సందర్భంగా వీ-గార్డ్ ఎండీ మిథున్ చిట్టిలపిల్లి మాట్లాడుతూ.. లగ్జరీ, స్మార్ట్ లివింగ్ ప్రమాణాలకు తగ్గట్టుగా ఈ సరికొత్త వాటర్ హీటర్స్‌ను తీసుకువచ్చినట్లు చెప్పారు. ఈ కొత్త వాటర్ హీటర్ల శ్రేణిని వినియోగదారుల అవసరాలకు తగ్గట్టుగా డిజైన్ చేసినట్లు ఆయన తెలిపారు. ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్ (ఐఓటీ) కనెక్టివిటీతో ఈ ప్రీమియం శ్రేణి వాటర్ హీటర్ మోడల్స్‌ను రూపొందించినట్లు మిథున్ చెప్పారు. వారంటీతో పాటు అందుబాటు ధరలతో వీటిని మార్కెట్లోకి తెచ్చామన్నారు.

రెయిన్‌బో గూటికి ప్రశాంతి హాస్పిటల్

వరంగల్‌కు చెందిన ప్రశాంతి మెడికేర్ ప్రైవేట్ లిమిటెడ్ (ప్రశాంతి హాస్పిటల్)ను రెయిన్‌బో చిల్డ్రన్స్ మెడికేర్ లిమిటెడ్ (ఆర్‌సీఎంఎల్) చేజిక్కించుకుంది. ప్రశాంతి హాస్పిటల్‌లో 76 శాతం వాటాను రూ.24.85 కోట్లకు కొనుగోలు చేసేందుకు ఒప్పందం కుదుర్చుకున్నట్లు ఆర్‌సీఎంఎల్ శనివారం ప్రకటించింది



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)

	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	97,420 ▼	89,200 ▼	1,17,800 ▼
విజయవాడ	98,650 ▼	92,600 ▼	1,09,000 ▲
విశాఖపట్నం	97,420 ▼	89,300 ▼	1,17,800 ▼
రాజమండ్రి	97,420 ▼	89,300 ▼	1,08,900 ▼
ప్రొద్దుటూరు	96,450 ▼	88,730 ▼	1,00,070 ▼
ముంబై	95,784 ▼	87,738 ▼	1,05,193 ▼

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



29వ తేదీ			
హైదరాబాద్	560	విజయవాడ	575
వరంగల్	562	గోదావరి	565
చిత్తూరు	633	విశాఖపట్నం	580
		డజను గుడ్లు రూ.	78

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	90	విజయవాడ	95
వరంగల్	90	గుంటూరు	100
కరీంనగర్	90	ఒంగోలు	103
మహబూబ్‌నగర్	90	చిత్తూరు	90
కర్నూలు	90	నెల్లూరు	95
విశాఖపట్నం	84	అనంతపురం	95
గోదావరి	95		





ట్రైలర్ సిద్ధం



పవన్‌కల్యాణ్ కథానాయకుడిగా జ్యోతికృష్ణ తెరకెక్కించిన చిత్రం 'హరిహర వీరమల్లు'. ఏ.ఎం.రత్నం నిర్మించారు. జూలై 24న చిత్రం విడుదలవుతోంది. బాబీ డియోల్ ప్రతినాయకుడి పాత్రను పోషించారు. పవన్ తొలిసారి చారిత్రక యోధుడి పాత్రను పోషించడంతో సినిమాపై అంచనాలు తారాస్థాయిలో ఉన్నాయి. ఇప్పటికే విడుదలైన టీజర్, పాటలు ఆకట్టుకున్నాయి. జూలై 3న చిత్ర ట్రైలర్‌ను విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. నిధి అగర్వాల్ కథానాయిక. ఈ చిత్రానికి ఎడిటింగ్: ప్రవీణ్.కె.ఎల్, సినిమాటోగ్రఫీ: మనోజ్ పరమహంస, సంగీతం: ఎమ్.ఎమ్.కీరవాణి.



ఇదో అద్భుతమైన వేదిక

విజయ్ దేవరకొండ

సరికొత్త ప్రతిభను ప్రోత్సాహించాలనే లక్ష్యంతో నిర్మాత దిల్ రాజు ఏర్పాటు చేసిన వేదిక 'దిల్ రాజు డ్రీమ్స్' వెబ్‌సైట్‌ను శనివారం లాంచ్ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన హీరో విజయ్ దేవరకొండ మాట్లాడుతూ "ఒక అవకాశం ఎంత గొప్పదో నాకు తెలుసు. 'దిల్ రాజు' డ్రీమ్స్ లక్షలాది మందికి ఒక హోప్ ఇచ్చింది. కొత్తవారికి ఇదో అద్భుతమైన వేదిక" అని అన్నారు. మరో ముఖ్య అతిథి, సంగీత దర్శకుడు దేవిశ్రీ ప్రసాద్ మాట్లాడుతూ "ఇలాంటి వెబ్‌సైట్‌ను నేనింతవరకూ చూడలేదు. కొత్తవారి కోసం ఇలాంటిది లాంచ్ కావడం ఆనందంగా ఉంది" అని చెప్పారు. దిల్‌రాజు మాట్లాడుతూ "ఇండస్ట్రీలోకి రావాలనుకుంటున్న కొత్తవారికి సరైన గైడెన్స్ ఇవ్వాలనే ఉద్దేశంతో చేసిన ఆలోచనే 'దిల్ రాజు డ్రీమ్స్'. ఇది సినీ ఔత్సాహికులకు సరైన వేదిక అవుతుందని ప్రారంభిస్తున్నాం. అప్లై చేసుకునే వారికి ఆల్ ది బెస్ట్" అని తెలిపారు. నిర్మాత శిరీష్ మాట్లాడుతూ "మీ ప్రతిభతో ఎదిగిన తర్వాత ఇండస్ట్రీని మర్చిపోవద్దు" అని కోరారు.

సోషియో ఫాంటసీ ప్రేమకథ



సోషియో ఫాంటసీ ప్రేమకథతో రూపుదిద్దుకున్న 'దీర్ఘాయుష్మాన్ భవ' చిత్రం జులై 11న విడుదల కానుంది. కార్తీక్‌రాజు, మిస్తీ చక్రవర్తి జంటగా నటించిన ఈ చిత్రానికి పూర్ణానంద్ దర్శకుడు. వంకాయల పాటి మురళీకృష్ణ నిర్మించారు. చక్కటి ఫ్యామిలీ కథతో రెండున్నర గంటలపాటు ప్రేక్షకుల్ని అలరించే వినోదంతో సినిమా ఉంటుందని ఆయన చెప్పారు. సోషియో ఫాంటసీ కావడంతో గ్రాఫిక్స్‌కు ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చామని తెలిపారు. 'మా సినిమాలో సీనియర్ నటి ఆమని నటన ఓ హైలైట్. హీరోహీరోయిన్లు తమ పాత్రల్లో ఒదిగిపోయారు. 'జబర్దస్త్' ఆర్టిస్టుల కామెడీ ఆద్యంతం అలరిస్తుంది' అని దర్శకుడు పూర్ణానంద్ చెప్పారు.



టైటిల్ ఖరారు

అంకిత్ కొయ్య, మానస చౌదరి జంటగా గోపీనాథ్ రెడ్డి దర్శకత్వంలో యూజీ ప్రొడక్షన్స్ బేనర్‌పై కంకణాల ప్రవీణ్‌రెడ్డి నిర్మిస్తోన్న చిత్రానికి 'లవ్ జాతర' అనే టైటిల్ ఖరారు చేశారు. ఈ మేరకు టైటిల్ అనౌన్స్‌మెంట్‌పాటు ఫస్ట్‌లుక్ పోస్టర్‌ని మేకర్స్ విడుదల చేశారు. ఈ చిత్రానికి చేతన్ భరద్వాజ్ సంగీతం అందిస్తుండగా, సిద్ధార్థ్ డీఓపీగా వ్యవహరిస్తున్నారు.

చిత్రజ్యోతి

★ SINCE 1965 ★

'కన్నప్ప' నిర్మాణం పరమేశ్వరుడి ఆజ్ఞ




- మోహన్‌బాబు

'ఆ పరమేశ్వరుడే 'కన్నప్ప' సినిమా తీయాలని నన్ను ఆజ్ఞాపించాడు. ఆదరిస్తున్న ప్రేక్షకులకు ధన్యవాదాలు. నా కుటుంబానికి పరమేశ్వరుడి ఆశీస్సులుండాలి' అని అన్నారు సీనియర్ నటుడు, నిర్మాత మోహన్‌బాబు. మంచు విష్ణు ప్రధాన పాత్రలో ముఖేశ్ కుమార్ సింగ్ దర్శకత్వంలో ఆయన నిర్మించిన చిత్రం 'కన్నప్ప' ఇటీవలె విడుదలై థియేటర్లలో విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా శనివారం ఏర్పాటు చేసిన కృతజ్ఞతా సమావేశంలో మోహన్ బాబు మాట్లాడుతూ 'మా టైమ్‌లో ఓ సినిమాకు ఇన్ని సభలు పెట్టేవాళ్లం కాదు. నటుడిగా 50 ఏళ్లు అవుతోంది. భగవంతుని ఆశీస్సులు ఉండబట్టే ఈ విజయం దక్కింది. అందుకు నా అభిమానులకు ధన్యవాదాలు. నేను చేసిన ప్రతి పాత్రను వారు ఆదరించారు. వారికి నేను రుణపడి ఉంటాను. మా భావ ప్రభాస్ సహా ఈ సినిమాకు పనిచేసిన ప్రతి ఒక్కరికీ హృదయపూర్వక అభినందనలు' అని అన్నారు. హీరో మంచు విష్ణు మాట్లాడుతూ 'మా నటీనటులకు కనిపించే దేవుళ్లు ప్రేక్షకులే. 'కన్నప్ప' పెద్ద విజయాన్ని సాధిస్తుంది. ఇదంతా శివలీల. నాకిది భావోద్వేగ ప్రయాణం. ప్రేక్షకులకు కృతజ్ఞతలు చెప్పాలనే ఈ రోజు మీ ముందుకు వచ్చాను' అని పేర్కొన్నారు.


'కాంటా లగా' షఫాలీ ఆకస్మిక మృతి



'కాంటా లగా' సాంగ్ ఫేమ్ షఫాలీ జరివాలా(42) ఆకస్మికంగా మరణించారు. శుక్రవారం రాత్రి అస్వస్థతతో ఉన్న షఫాలీని తన భర్త పరాగ్ త్యాగి ఆస్పత్రికి తీసుకెళ్లగా అప్పటికే ఆమె మృతి చెందినట్లు డాక్టర్లు తెలిపారు. ఆమె గుండెపోటుతో మరణించినట్లు వార్తలు వచ్చాయి. కానీ ఈ విషయాన్ని షఫాలీ కుటుంబ సభ్యులు ధృవీకరించలేదు. ఆమె మరణానికి గల కారణాలపై ఇంకా స్పష్టత రాలేదని.. ఈ కేసును అనుమానాస్పదంగానే పరిగణనలోకి తీసుకుని దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు వెల్లడించారు. కాగా, 2002లో వచ్చిన 'కాంటా లగా' అనే రీమిక్స్ పాటతో గుర్తింపు తెచ్చుకున్నారు షఫాలీ. ఆ తర్వాత 'ముఝ్సే షాదీ కరోగీ', 'హుడుగరు' సినిమాల్లో చిన్న పాత్రల్లో నటించారు. 'నాచ్ బలియే', 'బిగ్‌బాస్ సీజన్ 13' వంటి టీవీ రియాలిటీ షోల్లో భాగమయ్యారు.







స్కూళ్లలో జుంబా డ్యాన్స్ చేయాల్సిందే!

» కేరళ విద్యామంత్రి శివన్‌కుట్టి స్పష్టీకరణ

కొచ్చి, జూన్ 28: కేరళ పాఠశాలల్లో మాదక ద్రవ్యాల వ్యతిరేక కార్యక్రమాల్లో భాగంగా పిల్లల దేహదారుఢ్యాన్ని పెంచే జుంబా డ్యాన్స్‌ను ప్రవేశ పెట్టాలని అక్కడి ప్రభుత్వం నిర్ణయించింది. అయితే, ఈ నిర్ణయాన్ని అక్కడి ముస్లిం సంఘాలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్నాయి. జుంబా పేరుతో ఆడ, మగ కలిసి మెలిసి వ్యవహరించడాన్ని, కురచ దుస్తుల్లో కలిసి నృత్యం చేయడాన్ని సహించేది లేదని హెచ్చరించాయి. అయితే, కేరళలోని కమ్యూనిస్టు ప్రభుత్వం ఈ విషయంలో పట్టుదలతో ఉంది. మాదక ద్రవ్యాల కన్నా జుంబా నృత్యం పట్ల వ్యతిరేకతే ప్రమాదకరంగా ఉందని కేరళ విద్యామంత్రి శివన్‌కుట్టి వ్యాఖ్యానించారు. జుంబాను వ్యతిరేకించడం ద్వారా మతతత్వాన్ని ప్రేరేపిస్తున్నారని మండిపడ్డారు. పాఠశాల కరిక్యులమ్‌లో జుంబా నృత్యాన్ని భాగంగా చేసినందున దాన్ని పాటించాల్సిందేనని స్పష్టం చేశారు. జుంబాకు పంపడం, పంపక పోవడం లాంటి చాయిస్ తల్లిదండ్రులకు లేదని తేల్చిచెప్పారు. పిల్లలకు కురచ దుస్తులు వేసుకోవాలనే నిబంధన ఏమీ లేదని, రోజూ వేసుకొనే స్కూల్ డ్రెస్‌తోనే జుంబా నృత్యం చేయవచ్చని అన్నారు.

ఘర్షణ పడ్డ విద్యార్థిపై ఎన్ఎస్ఏ చట్టమా: సుప్రీం

న్యూఢిల్లీ, జూన్ 28: మధ్యప్రదేశ్‌కు చెందిన న్యాయ శాస్త్ర విద్యార్థిని జాతీయ భద్రత చట్టం(ఎన్ఎస్ఏ) కింద ముందస్తుగా నిర్బంధంలోకి తీసుకోవడం ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. వెంటనే ఆయనను విడుదల చేయాలని ఆదేశించింది. ఆ విద్యార్థిని ముందస్తు నిర్బంధంలోకి తీసుకోవాలంటూ 2024 జులై 11న మధ్యప్రదేశ్‌లోని బేతుల్ జిల్లా కలెక్టర్ ఇచ్చిన ఆదేశాలను తప్పుపట్టింది. బేతుల్‌లోని విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో అనికేత్ అలియాస్ అన్ను అనే లా విద్యార్థి ఓ ప్రొఫెసర్‌తో ఘర్షణకు దిగడంతో ఆయనపై కేసు నమోదయింది. హత్యాయత్నం, ఇతర సెక్షన్ల కింద కేసులు పెట్టారు. అతనిపై ఇతర క్రిమినల్ కేసులు కూడా ఉండడంతో ఎన్ఎస్ఏ కింద ముందస్తు నిర్బంధంలోకి తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలు ఇచ్చారు. అనంతరం భోపాల్‌లోని సెంట్రల్ జైలుకు పంపించారు. ఆ ఆదేశాలను ప్రతి మూడు నెలలకు ఒకసారి మొత్తం నాలుగుసార్లు పొడిగిస్తూ వచ్చారు. దీంతో సదరు విద్యార్థి సుప్రీంకోర్టును ఆశ్రయించారు.

పాక్‌లో ఆత్మాహుతి దాడి..16 మంది మృతి

పెషావర్, జూన్ 28: ఆఫ్ఘనిస్థాన్ సరిహద్దుల్లోని ఖైబర్ పఖ్తున్‌ఖ్వా రాష్ట్రంలో శనివారం తాలిబన్ అనుకూల హఫీజ్ గుల్ బహదూర్ సంస్థ జరిపిన ఆత్మాహుతి దాడిలో 16 మంది భద్రతా సిబ్బంది మృత్యువాత పడగా, మరో 24 మందికి పైగా గాయపడ్డారని పాకిస్తాన్ సైన్యాధికారులు తెలిపారు. ఉత్తర వజీరిస్తాన్ జిల్లాలోని ఖద్దీ ప్రాంతంలో జరిగిన ఈ ఘటనలో అక్కడికక్కడే 13 మంది మృతి చెందగా, మరో ముగ్గురు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మరణించారు. పేలుడు దాటికి రెండిళ్లపై కప్పు కూలిపోవడంతో ఆరుగురు పిల్లలు గాయపడ్డారని జిల్లా పోలీసు అధికారి ఒకరు చెప్పారు.

బుద్ధి మారని పాక్..ఉగ్ర శిబిరాల పునర్నిర్మాణం

న్యూఢిల్లీ, జూన్ 28: ఆపరేషన్ సిందూర్‌లో ధ్వంసమైన ఉగ్ర శిబిరాలను పునర్నిర్మించేందుకు ఏకంగా పాకిస్థాన్ ప్రభుత్వమే ముందుకు వచ్చింది. నిధులు సమకూర్చడంతోపాటు నిపుణుల సహకారాన్ని కూడా అందిస్తోంది. ఉగ్రవాద శిబిరాలను తిరిగి నిర్మించడంతోపాటు, వారి లాంచ్ ప్యాడ్లను మరింత ఆధునీకరిస్తోంది. ఈ మేరకు భారత ఇంటెలిజెన్స్ వర్గాలు పసిగట్టాయి. ఆయా నిర్మాణాలకు నేరుగా పాక్ ప్రభుత్వంతో పాటు, పాక్ ఇంటెలిజెన్స్. ఐసిస్, ఆ దేశ ఆర్మీ సహకరిస్తున్నాయని అధికార వర్గాలు వెల్లడించాయి. పునర్నిర్మాణం చేస్తున్న వాటిలో కరడుగట్టిన ఉగ్రవాద సంస్థ, బహవాల్‌పూర్‌లోని జైషే మహమ్మద్ కేంద్ర కార్యాలయం కూడా ఉందని పేర్కొన్నాయి. పాక్ ఆక్రమిత కశ్మీర్ సహా సరిహద్దు ప్రాంతాల్లో చిన్న, సాంకేతిక వ్యవస్థలతో కూడిన శిబిరాల పునర్నిర్మాణానికి పాక్ ఆర్మీ సహా ఐసిస్ నిధులు సమకూరుస్తున్నట్టు అధికార వర్గాలు పేర్కొన్నాయి. వీటిని ఎవరూ గుర్తించని తరహా అంటే ఎలాంటి సెన్సార్లకు చిక్కని వ్యవస్థలతో నిర్మిస్తున్నారని తెలిపాయి. అదేవిధంగా అంతర్జాతీయ సరిహద్దుల్లో 4 లాంచ్ ప్యాడ్స్‌ను తిరిగి ఆధునీకరిస్తున్నారు.

పూరీ రథయాత్రకు తొలిరోజు 10 లక్షల మంది

పూరీ, జూన్ 28: పూరీ జగన్నాథుడి రథయాత్రకు తొలిరోజు(శుక్రవారం) దాదాపు 10లక్షల మంది హాజరయ్యారు. జనం భారీగా పోటెత్తడంతోపాటు ఎండ తీవ్రంగా ఉండటంతో దాదాపు 625 మంది అస్వస్థతకు గురయ్యారు. వారిలో చాలామంది ఆస్పత్రుల్లో చేరాల్సి వచ్చిందని అధికారులు శనివారం వెల్లడించారు. కొందరికి స్వల్ప గాయాలవగా, మరికొందరికి వాంతులయ్యాయి. 200 మందికిపైగా స్పృహతప్పి పడిపోయారు. తొలిరోజే సాయంత్రానికి దేవతామూర్తులు బలభద్రుడు, దేవీ సుభద్ర, జగన్నాథుల రథాలు 2.6 కిలోమీటర్ల దూరంలోని వారి మేనత్త స్వస్థలమైన గుండిచ ఆలయానికి చేరుకోవాల్సి ఉండగా, బలగండిలో బలభద్రుడి రథం ఇరుక్కుపోవడం వల్ల శుక్రవారం రాత్రి రథాలను అక్కడే నిలిపేశారు. తిరిగి శనివారం ఉదయం 10 గంటలకు కదిలిన రథాలు గుండిచ ఆలయానికి చేరుకున్నాయి.

ముంబైలో 8 రోజులు 'డిజిటల్ అరెస్ట్'లో డాక్టర్

» రూ.3 కోట్లు కొల్లగొట్టిన సైబర్ నేరగాళ్లు

ముంబై, జూన్ 28: 'డిజిటల్ అరెస్ట్' అనేదే ఉండదంటూ ఎంతగా ప్రచారం చేస్తున్నప్పటికీ అనేక మంది దీని బారిన పడుతూ కోట్లాది రూపాయలు పోగొట్టుకుంటున్నారు. ముఖ్యంగా ఉన్నత స్థాయిలో ఉన్న వారిని లక్ష్యంగా చేసుకుని సైబర్ నేరగాళ్లు 'డిజిటల్ అరెస్ట్' పేరుతో బెదిరింపులకు గురి చేస్తూ దోచుకుంటున్నారు. తాజాగా ఇలాంటి ఘటనే ముంబైలో వెలుగుచూసింది. 70 ఏళ్ల వయసున్న ఓ డాక్టర్‌ను సైబర్ నేరగాళ్లు ఏకంగా 8 రోజులు డిజిటల్ అరెస్ట్ చేశారు. అంతేకాకుండా ఆ డాక్టర్ నుంచి రూ.3 కోట్లు కొల్లగొట్టారు. బాధితురాలికి గత నెలలో అమిత్ కుమార్ అనే వ్యక్తి నుంచి ఫోన్ వచ్చింది. టెలికం ఆపరేటర్‌ను అని చెప్పి వివరాలను సేకరించాడు. తర్వాత పోలీసునని మరో వ్యక్తి ఫోన్ చేసి మనీలాండరింగ్ చట్టం కింద కేసు నమోదైందని చెప్పి భయపెట్టాడు. ఆ తర్వాత ఆమెపై ఎనిమిది రోజుల పాటు వీడియో నిఘా పెట్టారు. ఈ క్రమంలో తీవ్ర భయాందోళనలకు గురైన ఆమె.. నేరగాళ్లు ఇచ్చిన పలు బ్యాంకు ఖాతాలకు రూ.3 కోట్లు బదిలీ చేశారు.

పద్మశ్రీ అవార్డు గ్రహీత కార్తీక్ మహారాజ్ నన్ను రేప్ చేశారు.. అబార్షన్ చేయించారు!

» బెంగాల్ పోలీసులకు ఓ మహిళ ఫిర్యాదు

కోల్‌కతా, జూన్ 28: పద్మశ్రీ అవార్డు గ్రహీత, భారత్ సేవాశ్రమ సంఘానికి చెందిన సాధువు కార్తీక్ మహారాజ్ (స్వామీ ప్రదీప్తానంద) టీచర్ ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి తనపై 2013 నుంచి అనేకసార్లు అత్యాచారానికి పాల్పడ్డారని ఓ మహిళ ఆరోపించింది. ఆయన వల్ల గర్భం దాల్చిన తనకు బలవంతంగా అబార్షన్ చేయించారని తెలిపింది. కార్తీక్ మహారాజ్ పశ్చిమ బెంగాల్‌లోని ముషీరాబాద్ జిల్లా బేల్‌డాంగా ఆశ్రమానికి అనుబంధంగా ఉన్నారు. 2012 డిసెంబరులో ఆయనను కలిశానని, ఆశ్రమానికి చెందిన ఆదివాసీ బాలికల పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా ఉద్యోగం ఇప్పిస్తానని హామీ ఇచ్చారని బాధితురాలు నబాగ్రామ్ పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. 2013 జనవరిలో తనకు పాఠశాల హాస్టల్‌లో బస కల్పించారని, అప్పటి నుంచి కార్తీక్ మహారాజ్ పలుమార్లు తనపై అత్యాచారానికి పాల్పడ్డారని ఆరోపించింది. ఈ ఆరోపణలను కార్తీక్ మహారాజ్ ఖండించారు.

2029 ప్రపంచ పోలీస్ క్రీడలు భారత్‌లో

న్యూఢిల్లీ, జూన్ 28: మరో నాలుగేళ్ల తర్వాత 2029లో నిర్వహించబోయే ప్రతిష్ఠాత్మక ప్రపంచ పోలీస్, అగ్నిమాపక క్రీడలకు భారత్ తొలిసారి ఎంపికైంది. అహ్మదాబాద్ వేదికగా ఈ క్రీడలు నిర్వహించనున్నారు. 1985 నుంచి రెండేళ్లకోసారి నిర్వహించే ఈ పోటీల్లో భారత్ 2007లో తొలిసారి పాల్గొంది. నాటి నుంచి ఇప్పటివరకు భారత్ 1400కు పైగా పతకాలు గెలుచుకుంది. ఇప్పటివరకు ఈ క్రీడలను అమెరికా 8 సార్లు, కెనడా 5, యూరప్ 4, యూకే 2, చైనా ఒకసారి నిర్వహించాయి. సర్వీసులో ఉన్న వారితో పాటు రిటైరైన పోలీస్, అగ్నిమాపక దళ సిబ్బంది, విపత్తు సేవల సిబ్బంది ఈ క్రీడల్లో పాల్గొనేందుకు అర్హులు. ఈసారి 50 అంశాల్లో క్రీడలు నిర్వహిస్తారు. 2029 ప్రపంచ పోలీస్ క్రీడలకు ఎంపిక కావడం భారత్‌కు గర్వకారణమని కేంద్ర హోం మంత్రి అమిత్ షా చెప్పారు.

డిశ్చార్జికి ముందే బర్త్ సర్టిఫికెట్!

» మంజూరు చేయాలని రాష్ట్రాలకు రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా నిర్దేశం

న్యూఢిల్లీ, జూన్ 28: ఆస్పత్రుల్లో జన్మించిన నవజాత శిశువులకు వారు డిశ్చార్జి కావడానికి ముందే తల్లులకు జనన ధ్రువీకరణ పత్రాలు అందించేలా చర్యలు తీసుకోవాలని రిజిస్ట్రార్ జనరల్ ఆఫ్ ఇండియా (ఆర్‌జీఐ) రాష్ట్రాలను కోరింది. ప్రధానంగా 50 శాతం పైగా జననాలు జరిగే ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఈ మేరకు చర్యలు తీసుకోవాలని పేర్కొంది. జనన నమోదు పూర్తయిన తర్వాత రిజిస్ట్రార్ వీలైనంత త్వరగా బర్త్ సర్టిఫికెట్‌ను ఎలక్ట్రానిక్ లేదా ఏ ఇతర ఫార్మాట్‌లోనైనా మంజూరు చేయాలని తెలిపింది. ఇందుకు ఏడు రోజుల కంటే సమయం మించరాదని స్పష్టం చేసింది. ఈ మేరకు అన్ని రాష్ట్ర ప్రభుత్వాలకు ఆర్‌జీఐ లేఖ రాసింది. దేశవ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ ఆస్పత్రులు, కమ్యూనిటీ, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు రిజిస్ట్రేషన్ యూనిట్లుగా పనిచేస్తున్నాయని పేర్కొంది. బర్త్ సర్టిఫికెట్‌కు పెరిగిన ప్రాముఖ్యతను దృష్టిలో ఉంచుకొని, దాన్ని తక్షణం జారీ చేయాల్సిన అవసరాన్ని ఆయా యూనిట్ల రిజిస్ట్రార్‌లు గుర్తించాలని సూచించింది. 2023, అక్టోబరు 1 నుంచి విద్యాసంస్థల్లో అడ్మిషన్లు, ప్రభుత్వ ఉద్యోగాలు, వివాహ నమోదు తదితర అవసరాలకు డిజిటల్ బర్త్ సర్టిఫికెట్ అనేది పుట్టిన తేదీకి ఒకేఒక్క ఆధారంగా ఉంది. జనన, మరణాల నమోదు చట్టం- 1969 ప్రకారం జనన ధ్రువీకరణ పత్రాన్ని జారీచేస్తూ వస్తున్నారు. అన్ని జననాలు, మరణాలను కేంద్ర ప్రభుత్వ పోర్టల్‌లో నమోదు చేయడాన్ని 2023, అక్టోబరు 1 నుంచి తప్పనిసరి చేశారు.

టూవీలర్లకు రెండు హెల్మెట్లు తప్పనిసరి!

» కొనుగోలు సమయంలోనే వాటిని వాహన తయారీదారులు అందించాలి

» కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదన

న్యూఢిల్లీ, జూన్ 28: ద్విచక్రవాహన తయారీదారులు వాహనం కొనుగోలు సమయంలోనే వినియోగదారులకు రెండు హెల్మెట్లు అందించడం తప్పనిసరి చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ఈ కొత్త నియమాన్ని అమల్లోకి తీసుకొచ్చేందుకు కేంద్ర రోడ్డు రవాణా, రహదారుల మంత్రిత్వ శాఖ కేంద్ర మోటార్ వాహనాల రూల్స్-1989కు పలు ముఖ్యమైన మార్పులను ప్రతిపాదించింది. కొత్త సవరణ నియమాల తుది నోటిఫికేషన్ అధికారిక గెజిట్‌లో ప్రచురించిన తర్వాత మూడు నెలల్లోపు ఈ రూల్ తప్పనిసరి అవుతుందని ప్రభుత్వ నోటిఫికేషన్ పేర్కొంది. వాహనం నడిపే వారితో పాటు వెనక కూర్చున్న వారి భద్రత కోసం కొత్త నిబంధనను తీసుకురానున్నట్లు తెలిపింది. హెల్మెట్ నిబంధనతో పాటు ప్రభుత్వం మరో భద్రతా చర్యను కూడా ప్రతిపాదించింది. 2026, జనవరి 1 నుంచి 50 సీసీ కంటే ఎక్కువ సామర్థ్యం లేదా గంటకు 50 కిలోమీటర్ల వేగం దాటే మోటార్ సైకిళ్లు, స్కూటర్లు సహా అన్ని కొత్త ఎల్2 క్యాటగిరీ ద్విచక్ర వాహనాలకు యాంటీ-లాక్ బ్రేకింగ్ వ్యవస్థ(ఏబీఎస్)లను అమర్చాల్సి ఉంటుంది. ఇది ముఖ్యంగా వాహనానికి ఆకస్మికంగా బ్రేక్ వేసిన సమయంలో మెరుగైన నియంత్రణ కల్పించడంతో పాటు జారిపోయే అవకాశాలను తగ్గిస్తుంది.

ఎంతో గొప్పది నా దేశం!

అంతరిక్షం నుంచి చాలా ఘనంగా కనిపిస్తోంది





» భూగోళాన్ని చూస్తుంటే ఏ సరిహద్దులూ లేని ఏకత్వ భావన కలుగుతోంది

» ఐఎస్ఎస్ నుంచి శుభాన్షు శుక్లా

» వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడిన ప్రధాని

» మీ యాత్ర కొత్త శకానికి శుభారంభం

» గగన్‌యాన్‌కు తొలి అడుగు: మోదీ

న్యూఢిల్లీ, జూన్ 28: ప్రధాని నరేంద్ర మోదీ శనివారం అంతర్జాతీయ అంతరిక్ష కేంద్రం (ఐఎస్ఎస్)లో ఉన్న గ్రూప్ కెప్టెన్ శుభాన్షు శుక్లాతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. 18 నిమిషాలపాటు సాగిన ఈ సంభాషణలో.. 'ఎలా ఉన్నారు? అక్కడ పరిస్థితులు ఎలా ఉన్నాయి? ఐఎస్ఎస్‌లోకి వెళ్లగానే ఏమనిపించింది?' అని మోదీ శుక్లాను ఆరా తీశారు. తాను క్షేమంగా ఉన్నానని, ఐఎస్ఎస్ నుంచి చూసినప్పుడు భారత్ ఎంతో గొప్పగా, చాలా పెద్దగా కనిపించిందని శుక్లా చెప్పారు. మొదటిసారి బయటి నుంచి భూగోళాన్ని చూస్తే ఏ ఎల్లలూ లేవనిపించిందని, ఏకత్వ భావన కలిగిందని తెలిపారు. ఐఎస్ఎస్‌లోకి అడుగుపెట్టిన తొలి భారతీయుడిగా శుక్లా చరిత్ర సృష్టించారు. శుభాన్షుతోపాటు మరో ముగ్గురు వ్యోమగాములు ఈ నెల 25న అమెరికాలోని కెనడీ స్పేస్ సెంటర్ నుంచి స్పేస్‌ఎక్స్ వ్యోమనౌకలో ఐఎస్ఎస్‌కు వెళ్లారు. శుక్లా బృందం అక్కడ 14 రోజుల పాటు వివిధ అంశాలపై పరిశోధనలు చేయనుంది. 1984లో రాకేశ్ శర్మ తర్వాత అంతరిక్ష యానం చేసిన రెండో భారతీయ వ్యోమగామి శుక్లా.

మోదీ, శుక్లా మధ్య సంభాషణ ఇలా..

మోదీ: మీకు హృదయపూర్వక శుభాకాంక్షలు. మీరు మన జాతీయ పతాకాన్ని అంతరిక్షంలోకి తీసుకెళ్లిన క్షణం భారతీయులకు గర్వకారణం. ప్రతి భారతీయుడి ఉద్వేగం, అభిమానం, ఆశలకు ప్రతినిధిగా మీతో మాట్లాడుతున్నాను.

శుక్లా: అంతరిక్షంలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించడం గర్వంగా ఉంది. మీతో పాటు 140 కోట్ల మంది భారతీయుల శుభాకాంక్షలకు ధన్యవాదాలు. భూమి నుంచి అంతరిక్షానికి సాగిన 400 కిలోమీటర్ల ప్రయాణం నా ఒక్కడిదే కాదు. యావత్ దేశానిది. నేను వ్యోమగామిని అవుతానని చిన్నప్పుడు ఎప్పుడూ అనుకోలేదు. మీ నాయకత్వంలో దేశం కలలు నెరవేరడానికి ఎన్నో అవకాశాలు లభిస్తున్నాయి.

మోదీ: మీరెలా ఉన్నారు? అక్కడి పరిస్థితులు ఎలా ఉన్నాయి?

శుక్లా: నేను బావున్నాను. నాకిదో కొత్త అనుభవం. ఐఎస్ఎస్‌లో గడిపేందుకు వీలుగా మేం ఏడాది పాటు శిక్షణ పొందాం. కానీ ఇక్కడికి వచ్చాక అంతా మారిపోయినట్లుంది. చిన్నపాటి విషయాలు కూడా పూర్తి భిన్నంగా ఉంటాయి. ఇక్కడ నిద్రపోవడం ఒక సవాల్. ఈ వాతావరణానికి అలవాటు పడడానికి కొంత సమయం పడుతుంది.

మోదీ: అక్కడ మీకెలాంటి అనుభూతి కలుగుతోంది?

శుక్లా: భారత్ ఎంతో గొప్పగా చాలా పెద్దగా కనిపించింది. నిజానికి మనం మ్యాప్‌లో చూసేదాని కంటే చాలా చాలా పెద్దగా! ఇక మొదటిసారిగా బయటి నుంచి భూమిని చూసినప్పుడు రాష్ట్రాలు, దేశాలు, ఏ సరిహద్దులు లేవనిపించింది. ఏకత్వ భావన కలిగింది. పైనుంచి చూసినప్పుడు భిన్నత్వంలో ఏకత్వమనే ఆదర్శం ఎంత అర్థవంతమైనదో తెలిసింది.

మోదీ: మీ ప్రయాణ విశేషాలు చెప్పండి!

శుక్లా: కాసేపటి క్రితం... నేను కిటికీ నుంచి బయటకు చూస్తుంటే.. మేం హవాయి మీద నుంచి వెళుతున్నాం. రోజుకు 16 సార్లు సూర్యోదయాలు, సూర్యాస్తమయాలు చూస్తున్నాం. మన దేశం ఎంతో వేగంగా ముందుకువెళుతోంది!

మోదీ: మీతో ఏ భారతీయ వంటకాలను తీసుకెళ్లారు? ఇతర దేశాలకు చెందిన తోటి వ్యోమగాములకు రుచి చూపించారా?

శుక్లా: మన గాజర్ కా హల్వా, మూంగ్ కా దాల్ హల్వా, మామిడిపళ్ల రసం తీసుకొచ్చాను. అందరం కలిసి తిన్నాం. వాళ్లకెంతో నచ్చాయి.

మోదీ: ఇవాళ, మీరు మన మాతృభూమికి దూరంగా ఉండొచ్చు. కానీ భారతీయుల హృదయాలకు చాలా దగ్గరగా ఉన్నారు. మీ పేరులో 'శుభ' ఉంది. మీ యాత్ర కొత్త శకానికి శుభారంభం'. భారత్ చేపట్టే మానవసహిత యాత్ర 'గగన్‌యాన్'కు తొలి అడుగు. మీ తోటి వ్యోమగాములకు కూడా శుభాకాంక్షలు.

శుక్లా: మీ ప్రేమాభిమానాలకు ధన్యవాదాలు.

ఎప్పుడు రద్దయ్యేది.. ఎప్పుడు వెళ్లేదీ తెలియదు!

» ఎయిర్ ఇండియా సర్వీసులతో ప్రయాణికుల ఇబ్బందులు

పుణె, జూన్ 28: అమెరికాకు చెందిన అనీశ్ అగర్వాల్ తల్లి, తండ్రి.. అనీశ్ సోదరుడు ఈనెల 27న ఎయిర్ ఇండియా విమానం (ఏ1-190)లో టొరంటో నుంచి ఢిల్లీ మీదుగా పుణె రావాల్సి ఉంది. అయితే ఉన్నట్టుండి ఎయిర్ ఇండియా సంస్థ వారి ప్రయాణ తేదీలను మార్చేసింది! ముగ్గురూ వేర్వేరు విమానాల్లో.. వేర్వేరు తేదీల్లో వెళ్లాల్సి ఉంటుందని నిర్దేశించింది. ఆ మేరకు తన సోదరుడు 27న, తండ్రి 28న, తల్లి 30న టొరంటో నుంచి విమానాల్లో భారత్‌కు బయలుదేరాల్సి ఉంటుందంటూ సందేశం వచ్చిందని అనీశ్ పేర్కొన్నారు. దీనిపై తాను ఎయిర్ ఇండియా కస్టమర్ సపోర్టు నంబరుకు ఫోన్ చేసినా ఫలితం లేకపోయిందని.. తనకాల్‌ను నాలుగు గంటలపాటు హోల్డ్‌లో పెట్టి, ఆ తర్వాత కట్ చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పని పరిస్థితుల్లో అదనంగా మూడు రోజుల పాటు టొరంటో హోటల్ గదుల్లో ఉండిపోయామని చెప్పారు. ఇక పుణె నుంచి ముంబై మీదుగా అమెరికా వెళ్లాల్సిన నలుగురు కుటుంబ సభ్యులకూ ఇదే పరిస్థితి ఎదురైంది. ఎయిర్ ఇండియా విమానాల్లో టికెట్లు బుక్ చేసుకున్న ప్రయాణికులు ఇటీవల ఇలాంటి చేదు అనుభవాలను ఎదుర్కొంటున్నారు. విమానాల నిర్వహణ, ప్రయాణికుల భద్రతకు సంబంధించి తమ అంతర్జాతీయ సర్వీసులను 15శాతం మేర తాత్కాలికంగా కుదించినట్లు సంస్థ పేర్కొంది. దేశీయంగా కొన్ని సర్వీసులనూ తగ్గించినట్లు వెల్లడించింది. ఎయిర్ ఇండియాలో సింగపూర్‌కు వెళ్లిన ఓ ప్రయాణికుడు తనకు ఎదురైన అనుభవాన్ని వివరించారు. తాను.. జూన్ 23న సింగపూర్‌కు బయలుదేరాల్సి ఉండగా 12 గంటల ముందు విమానం రద్దయిందని సమాచారం ఇచ్చారని, తర్వాత ప్రత్యామ్నాయ ఏర్పాటు చేసినా ముందు సర్వీసు కన్నా 8గంటలు నిరీక్షించాల్సి వచ్చిందని చెప్పారు.

'రా' చీఫ్‌గా పరాగ్ జైన్

» ఆపరేషన్ సిందూర్‌లో ఆయనది కీలక పాత్ర



న్యూఢిల్లీ, జూన్ 28: పాకిస్థాన్‌లోని ఉగ్ర స్థావరాలపై పక్కాగా నిఘా పెట్టి, ఆపరేషన్ సిందూర్‌తో గట్టి దెబ్బ కొట్టడంలో కీలకపాత్ర పోషించిన సీనియర్ ఐపీఎస్ అధికారి పరాగ్ జైన్.. భారత అంతర్జాతీయ నిఘా సంస్థ 'రీసెర్చ్ అండ్ అనాలసిస్ వింగ్ (రా)'కు నూతన చీఫ్‌గా నియమితులయ్యారు. ప్రస్తుతం 'రా' కార్యదర్శిగా ఉన్న రవి సిన్హా పదవీ విరమణ చేస్తుండటంతో.. జూలై 1వ తేదీ నుంచి పరాగ్ జైన్ ఆ బాధ్యతలు స్వీకరిస్తారు. రెండేళ్లపాటు ఈ పదవిలో కొనసాగుతారు. భారత్ ధ్వంసం చేసిన ఉగ్ర స్థావరాలను పాకిస్తాన్ మళ్లీ పునరుద్ధరిస్తోందంటూ వార్తలు వస్తున్న వేళ పరాగ్ జైన్ నియామకం మరింత ప్రాధాన్యం సంతరించుకుంది. 1989 పంజాబ్ కేడర్ ఐపీఎస్ అధికారి అయిన పరాగ్ జైన్.. సుమారు 20 ఏళ్లకుపైగా నిఘా, డిటెక్టివ్ విభాగాల్లో పనిచేశారు. 'రా' లో పాకిస్థాన్ డెస్క్, జమ్మూకశ్మీర్ వ్యవహారాల బాధ్యతలు పర్యవేక్షించారు. 2019లో ఆర్టికల్ 370 రద్దు, జమ్మూకశ్మీర్ పునర్వ్యవస్థీకరణ సమయంలోనూ కీలక పాత్ర పోషించారు. లష్కరేతాయిబా ప్రధాన కార్యాలయం సహా పాకిస్థాన్‌లోని కీలక ఉగ్రవాద స్థావరాలపై నిఘా పెట్టి కీలక సమాచారం సేకరించారు. ఈ డేటా ఆధారంగానే మన వైమానిక దళం అత్యంత కచ్చితత్వంతో పౌరులకు ఎలాంటి హానీ జరగకుండా ఉగ్రవాద స్థావరాలను ధ్వంసం చేయగలిగిందని నిఘా వర్గాలు చెబుతున్నాయి.

వ్యవసాయ భూముల్లోని వృక్షాల నరికివేత రూల్స్‌లో మార్పు

న్యూఢిల్లీ, జూన్ 28: ఆగ్రోఫారెస్ట్రీ(వ్యవసాయ భూముల్లో వృక్షాల పెంపకం)ని ప్రోత్సహించేందుకు గాను కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ భూముల్లోని వృక్షాల నరికివేతను సులభతరం చేస్తూ నమూనా నిబంధనలు జారీ చేసింది. దీనికి సంబంధించి కేంద్ర పర్యావరణ శాఖ ఈనెల 19న అన్ని రాష్ట్రాల ప్రభుత్వాలకు లేఖలు పంపింది. వ్యవసాయ భూముల్లోని వృక్షాలను నరికేందుకు స్పష్టమైన సమన్వీకృత నియమాలు లేకపోవడమే ఆగ్రోఫారెస్ట్రీకి కీలకమైన అవరోధంగా కేంద్రం గుర్తించినట్లు తెలిపింది. కలప ఆధారిత పరిశ్రమలు(ఏర్పాటు, నియంత్రణ) మార్గదర్శకాలు-2016 కింద ఇప్పటికే ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి కమిటీ(ఎస్ఎల్‌సీ)లే తాజా నిబంధనలనూ అమలయ్యేలా చూస్తాయి. ఈ కమిటీ వ్యవసాయ భూముల నుంచి కలప రవాణాకు, దరఖాస్తుల పరిశీలనకు ఏజెన్సీలను ఏర్పాటు చేస్తుంది. రైతులు చెట్లు నాటే తమ భూమి వివరాలను ఎన్‌టీఎంఎస్(జాతీయ టింబర్ మేనేజ్‌మెంట్ సిస్టం) పోర్టల్‌లో తప్పక నమోదు చేయాలి. ఆ ప్రదేశం, చెట్లు నాటిన తేదీ, ఆ చెట్ల సగటు ఎత్తు తదితర ప్రాథమిక సమాచారాన్ని నమోదు చేయాలి. ప్రతి చెట్టును ఫొటో తీసి, జియోట్యాగ్ చేయాలి. తర్వాత చెట్లను నరకాలంటే ఆ చెట్ల ఫొటోలను ఎన్‌టీఎంఎస్‌లో అప్‌లోడ్ చేయాలి. నరికే తేదీని తెలపాలి. ఆ తర్వాత ఆటోమేటిక్‌గా నిరభ్యంతర సర్టిఫికెట్‌ను పోర్టల్‌లో జారీ చేస్తారు.

బిహార్‌లో మొబైల్ ఈ-ఓటింగ్

యాప్ ద్వారా ఓటు వేసే అవకాశం.. దేశంలోనే తొలిసారి ప్రారంభం

» మునిసిపల్ ఎన్నికల్లో అందుబాటులోకి

» వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణుల కోసమే

» రిజిస్టర్ చేసుకున్న 10వేల మంది



పాట్నా, జూన్ 28: దేశంలో ఓటర్ల సౌకర్యం కోసం ఎన్నికల కమిషన్ ఎన్నో సదుపాయాలు కల్పిస్తోంది. అందులో నూతనంగా తీసుకొచ్చిన మొబైల్ ఈ-ఓటింగ్ ఒకటి. దీనిని దేశంలోనే తొలిసారి బిహార్‌లో ప్రారంభించారు. దీంతో మొబైల్ యాప్ ద్వారా ఓటు వేసే అవకాశం బిహార్ ఓటర్లకు దక్కింది. ఈ పైలట్ ప్రాజెక్టును స్థానిక మునిసిపల్ ఎన్నికల్లో ఆరు కౌన్సిల్స్ పరిధిలో అందుబాటులోకి తీసుకొచ్చారు. ఈ మొబైల్ యాప్‌ను వృద్ధులు, దివ్యాంగులు, గర్భిణులు, వలస కార్మికులతో పాటు పోలింగ్ స్టేషన్‌కు రాలేని విధంగా జబ్బు పడ్డ వ్యక్తుల కోసం అభివృద్ధి చేశారు. ఈ యాప్ ద్వారా ఓటు వేసే ప్రక్రియను పాట్నాలో మూడు, రోహతాస్‌లో రెండు, తూర్పు చంపారన్‌లోని ఓ కౌన్సిల్‌లో ప్రారంభించామని బిహార్ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ దీపక్ ప్రసాద్ తెలిపారు. పోలింగ్ స్టేషన్‌కు రాకుండానే 50 వేల మంది ఈ ఓటింగ్ యాప్ ద్వారా ఓటు వేసే అవకాశం ఉందని, అయితే 10 వేల మంది రిజిస్టర్ చేసుకున్నారని వెల్లడించారు.

ఎలా పనిచేస్తుంది..?

+ ట్యాంపర్ చేయడానికి వీలులేని టెక్నాలజీతో అత్యంత రక్షణ ప్రమాణాలతో ఈ మొబైల్ యాప్‌ను రూపొందించారు. బ్లాక్ చెయిన్ టెక్నాలజీతో రికార్డు అయిన ఓట్లు అత్యంత భద్రతతో, మార్చుచేయడానికి వీల్లేకుండా స్టోర్ అవుతాయి.
+ ఫేస్ రికగ్నిషన్, మ్యాచింగ్ టెక్నాలజీ యాప్ లాగిన్, ఓటింగ్ సమయంలో ఓటర్ల గుర్తింపును ధ్రువీకరిస్తుంది. డిజిటల్ స్కానింగ్, ఆప్టికల్ క్యారెక్టర్ రికగ్నిషన్ (ఓసీఆర్).. ఓట్లను కచ్చితంగా లెక్కించడానికి సహాయ పడుతుంది.
+ ఆడిట్ ట్రెయిల్స్‌తో.. ఈవీఎంలో వీవీప్యాట్ లాగానే ఓట్లను సరిపోల్చే అవకాశం ఉంటుంది.
+ ఒక మొబైల్ నంబర్ నుంచి ఇద్దరు ఓటర్లు మాత్రమే రిజిస్టర్ చేసుకునే అవకాశం ఉంటుంది. ఓటర్ ఐడీతో ప్రతి ఓటు నిర్ధారణ చేసుకున్నాకే ఓటు రికార్డు అవుతుంది.

బిహార్‌లో ఇలా మొదలైంది..

మొబైల్ యాప్ ద్వారా రిజిస్ట్రేషన్, ఓటింగ్ ప్రక్రియ యూజర్ ఫ్రెండ్లీగా ఉంటుందని, మొదటి సారి డిజిటల్ ఓటర్లయినా ఏవిధమైన గందరగోళం లేకుండా ఓటు వేయవచ్చని ఎన్నికల అధికారులు చెప్పారు. ఈ-ఓటు ఎలా వేయాలంటే..


+ మొదట ఈ-ఎస్ఈసీబీహెచ్ఆర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. (ప్రస్తుతం ఇది ఆండ్రాయిడ్ ఫోన్లలో మాత్రమే అందుబాటులో ఉంది). ఎలక్టోరల్ రోల్‌లో రిజిస్టర్ అయిన మొబైల్ నంబర్‌తో యాప్‌ను లింక్ చేయాలి. ధ్రువీకరణ పూర్తయిన తర్వాత రాష్ట్ర ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్ ద్వారా లేదా ఈ-ఎస్ఈసీబీహెచ్ఆర్ యాప్ ద్వారా ఎలక్షన్ రోజు ఓటు వేయవచ్చు.

ఓటర్ల జాబితా పునఃపరిశీలన

బిహార్‌లో ఓటర్ల జాబితాలను క్షుణ్ణంగా పునఃపరిశీలించే ప్రత్యేక ప్రక్రియ ప్రారంభమైందని ఎన్నికల కమిషన్ తెలిపింది. కేవలం భారతీయులు మాత్రమే ఓటు వేసేందుకు రాజ్యాంగం హక్కు కల్పించిందని ఈ సందర్భంగా స్పష్టం చేసింది. ఓటర్లను తొలగిస్తున్నారన్న ప్రతిపక్షాల విమర్శల నేపథ్యంలో ఈసీ ఈ ప్రకటన జారీ చేసింది. ఈఏడాది బిహార్‌తో మొదలుపెట్టి ఆరు రాష్ట్రాల్లో ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియను ఈసీ చేపట్టింది. పుట్టిన ప్రాంతాన్ని పరిశీలించడం ద్వారా అక్రమంగా వలస వచ్చిన విదేశీయులను జాబితా నుంచి తొలగించేందుకు కసరత్తు చేస్తోంది.

తొలి డిజిటల్ హైవేగా ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వే

» ఢిల్లీ-గురుగ్రామ్ హైవేపై ఏఐతో అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ వ్యవస్థ



న్యూఢిల్లీ, జూన్ 28: దేశంలోనే తొలిసారిగా డిజిటల్ హైవే అందుబాటులోకి వచ్చింది. ఢిల్లీ-గురుగ్రామ్‌ను కలిపే ద్వారకా ఎక్స్‌ప్రెస్‌వేపై ఆర్టిఫీషియల్ ఇంటలిజెన్స్ సాయంతో పనిచేసే అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్(ఏటీఎంఎస్) ఏర్పాటు చేశారు. ఈ ఎక్స్‌ప్రెస్ హైవేతో పాటు ఎన్‌హెచ్-48పై 28 కిలోమీటర్ల మేర(రెండు వైపులా) అత్యాధునిక ఏటీఎంఎస్‌ను జోడించారు. దేశవ్యాప్తంగా దీన్ని అమలు చేయాలని కేంద్రం యోచిస్తోంది. ఏఐ ఆధారిత స్మార్ట్ ట్రాఫిక్ వ్యవస్థ కలిగిన ఈ డిజిటల్ హైవేపై కిలోమీటర్‌కు ఒకటి చొప్పున మొత్తం 110 హై రిజల్యూషన్ పీటీజెడ్ కెమెరాలను అమర్చారు. ఇవి 24 గంటలూ రహదారిపై నిఘా ఉంచుతాయి. ఏటీఎంఎస్‌లో ట్రాఫిక్ మానిటరింగ్, ప్రమాదాల వీడియో చిత్రీకరణ, వాహన వేగం, సైన్‌బోర్డులు, సెంట్రల్ కమాండ్ కంట్రోల్ రూం వంటి 5 రకాల వ్యవస్థలున్నాయి. ఏదైనా ప్రమాదం జరిగితే కమాండ్ సెంటర్ వెంటనే రహదారి సిబ్బందికి సమాచారం చేరవేస్తుంది. పొగమంచు ఏర్పడినప్పుడు, రహదారిపై జంతువులు వచ్చినప్పుడు, ఇతర అడ్డంకులు ఏర్పడినప్పుడు సిబ్బందిని అప్రమత్తం చేస్తుంది.

రూల్స్ ఉల్లంఘిస్తే వెంటనే ఈ-చలాన్

నేషనల్ ఇన్ఫర్‌మాటిక్స్ సెంటర్(ఎన్ఐసీ) ఈ-చలాన్ పోర్టల్‌కు ఏటీఎంఎస్ అనుసంధానం చేయడంతో ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే వెంటనే సిబ్బందిని అప్రమత్తం చేస్తుంది. దీంతో క్షణాల్లో ఈ-చలాన్ జారీ చేసే అవకాశం ఉంటుంది. హైవేపై ప్రయాణించే సమయంలో సీటుబెల్ట్ పెట్టుకోకపోయినా, ట్రిపుల్ రైడింగ్ ఉన్నా, పరిమితికి మించిన వేగం ఉన్నా కెమెరాలు పసిగట్టి వెంటనే సిబ్బందికి సమాచారం చేరవేస్తాయి. మొత్తం 14 రకాల ట్రాఫిక్ ఉల్లంఘనలను ఏటీఎంఎస్ వ్యవస్థ పసిగడుతుంది.

భారత్‌కు పంపే సొమ్ముపై రెమిటెన్స్ పన్ను లేనట్టే!

వాషింగ్టన్, జూన్ 28: అమెరికాలోని భారతీయులకు భారీ ఊరట లభించింది. అక్కడ సంపాదించి స్వదేశాలకు పంపే సొమ్ము (రెమిటెన్స్‌ల)పై ప్రతిపాదించిన పన్నును.. అమెరికా చట్టసభ సెనేట్ 3.5 శాతం నుంచి ఒక శాతానికి తగ్గించింది. అంతేకాదు అమెరికాలోని బ్యాంకు ఖాతాలు, అక్కడ జారీ అయిన డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా బదిలీ చేసే సొమ్మును ఈ పన్ను నుంచి మినహాయించింది. కేవలం నగదు, మనీ ఆర్డర్, చెక్కుల రూపంలో పంపే రెమిటెన్సులకే పన్ను వర్తిస్తుందని పేర్కొంది. ఈ మేరకు 'బిగ్ బ్యూటీఫుల్ చట్టం' ముసాయిదాలో సెనేట్ మార్పులు చేసింది. అంటే సాంకేతికంగా రెమిటెన్సులపై పన్ను దాదాపుగా లేనట్టే! అమెరికాకు వలస వచ్చిన ఉద్యోగులు, వివిధ వృత్తులు, వ్యాపారాలు చేస్తున్నవారు అక్కడ సంపాదించి స్వదేశాలకు పంపే సొమ్ము (రెమిటెన్సు)లపై 5 శాతం పన్ను వేస్తామని ట్రంప్ యంత్రాంగం ప్రకటించిన విషయం తెలిసిందే. దీనికి సంబంధించి 'బిగ్ బ్యూటిఫుల్ బిల్' బిల్లు ప్రతినిధుల సభ ఆమోదం కూడా పొందింది. అమెరికాలో సుమారు 29 లక్షల మంది భారతీయులు ఉంటున్నట్టు అంచనా. వారు 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.2.70 లక్షల కోట్లకు (32 బిలియన్ డాలర్ల)పైగా సొమ్మును భారత్‌కు రెమిటెన్సుల రూపంలో పంపినట్టు గణాంకాలు చెబుతున్నాయి.

జగన్‌కు రాష్ట్రంలో తిరిగే హక్కు లేదు

- జగన్ అండ్ కో రాజకీయాలను చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారు
- ఏడాది పాలనలో పది లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చాం
- అభివృద్ధిపై చర్చకు సిద్ధం: మంత్రి పార్థసారథి


వీడియాతో మంత్రి కొలుసు పార్థసారథి. చిత్రంలో ఎమ్మెల్యే గంటా

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలనలో విధ్వంసం సృష్టించిన జగన్మోహన్ రెడ్డికి రాష్ట్రంలో తిరిగే హక్కు లేదని గృహ నిర్మాణ, సమాచార, పౌరసంబంధాల శాఖల మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం ఇక్కడి టీడీపీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడారు. రీ కాల్ బాబు పేరుతో వైసీపీ కార్యక్రమం నిర్వహిస్తామనడం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసీపీ హయాంలో హామీల అమలు, తమ ఏడాది పాలనపై చర్చకు సిద్ధమని సవాల్ చేశారు. జగన్, వైసీపీ నాయకుల రాజకీయాలు చూసి ప్రజలు అసహ్యించుకుంటున్నారని పేర్కొన్నారు. మూడు రాజధానుల పేరుతో ఐదేళ్లు ప్రజలను జగన్ మభ్యపెట్టారని, హైదరాబాద్ లాంటి రాజధాని ఉంటే దాని ఫలాలు రాష్ట్రమంతా అందించే అవకాశం ఉంటుందన్న కనీస జ్ఞానం ఆయనకు లేకుండా పోయిందన్నారు. బాధ్యత కలిగిన వ్యక్తిగా గడచిన ఐదేళ్లు పాలించి ఉంటే రాష్ట్రానికి పది లక్షల కోట్ల రూపాయల అప్పు మిగిలేది కాదని, నీరో చక్రవర్తి మాదిరిగా పాలించి నాశనం చేశాడని విమర్శించారు. జల్ జీవన్ మిషన్‌లో భాగంగా ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్ ఇచ్చేందుకు కేంద్రం రూ.25 వేల కోట్లు కేటాయించిందని, కానీ, రెండు వేల కోట్లు కూడా ఖర్చు చేయలేదని ఆరోపించారు. జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రానికి రూపాయి పెట్టుబడి రాలేదని, తాము ఏడాది పాలనలో పది లక్షల కోట్ల రూపాయల పెట్టుబడులకు ఎంవోయూలు చేసుకున్నామని తెలిపారు. ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మాట్లాడుతూ అక్రమాలు, అరాచకాలు, అవినీతికి బ్రాండ్ అంబాసిడర్ అయిన జగన్మోహన్‌రెడ్డి.. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎన్ని హామీలను అమలు చేశారో చెప్పాలన్నారు. మద్యపాన నిషేధం అని చెప్పి ఊరూరా మద్యాన్ని ఏరులు పారించారని, మరో 25 ఏళ్లకు మద్యంపై వచ్చే ఆదాయాన్ని కూడా తాకట్టు పెట్టారని విమర్శించారు. జగన్ రాజకీయాలను చూసి ప్రజలు నవ్వుకుంటున్నారని, అటువంటి వ్యక్తికి రాజకీయాల్లో ఉండడానికి అర్హతలేదన్నారు.

అధికారం పోయాక జగన్‌కు ప్రజలు గుర్తుకొచ్చారు

- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత



పెనుకొండ టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ఐదేళ్ల పాలనలో ప్రజల బాగోగుల గురించి జగన్ ఆలోచించిన పాపాన పోలేదని, అధికారం కోల్పోయిన తర్వాత ఆయనకు ప్రజలు గుర్తుకొస్తున్నారని బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత విమర్శించారు. శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో రూ.60 లక్షలతో నిర్మిస్తున్న అన్న క్యాంటీన్‌కు ఎంపీ బీకే పార్థసారథితో కలిసి ఆమె శనివారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో మాట్లాడారు. రప్పా రప్పా నరుకుతామని అనడంలో తప్పేముందని మాజీ సీఎం జగన్ మీడియా సమావేశంలో రెచ్చగొట్టేలా మాట్లాడటం సిగ్గుచేటన్నారు. శవ రాజకీయాలు తప్ప జగన్ ఐదేళ్లు చేసిందేమీలేదని, వైసీపీ కార్యకర్తలు ఆలోచించాలని, ఆయన క్షుద్ర రాజకీయాలకు బలికావద్దని సూచించారు. ఉనికి చాటుకోవడానికి జగన్ దేనికైనా సిద్ధంగా ఉన్నారని, తాము అభివృద్ధిపై చర్చించడానికి సిద్ధంగా ఉన్నామని అన్నారు.

స్వార్థ రాజకీయాల్లో జగన్ నెంబర్ వన్

- మోదీ హయాంలో దేశంలో అప్రకటిత ఎమర్జెన్సీ: షర్మిల



కాకినాడ, అమలాపురం టౌన్, జూన్ 28(ఆంధ్రజ్యోతి): స్వార్థ రాజకీయాలు చేసే వారిలో జగన్‌మోహన్‌రెడ్డి నెంబర్ వన్ స్థానంలో ఉన్నారని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర అధ్యక్షురాలు వైఎస్ షర్మిల అన్నారు. మహా సముద్రంలాంటి కాంగ్రెస్‌లో పిల్ల కాలువల్లాంటి పార్టీలన్నీ కలవాల్సిందేనన్నారు. కాకినాడ జిల్లాలో పార్టీ జిల్లా విస్తృతస్థాయి సమావేశానికి శనివారం ఆమె విచ్చేశారు. ఈ సందర్భంగా కాకినాడలోనూ, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోనూ ఆమె మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ బలోపేతం కావడం రాష్ట్ర ప్రజలందరికీ ఎంతో అవసరమని షర్మిల చెప్పారు. అధికార టీడీపీ, జనసేన, ప్రతిపక్ష వైసీపీ ఇలా అన్ని పార్టీలవారు బీజేపీకి తొత్తులుగా మారి పొత్తులు పెట్టుకున్నారని విమర్శించారు. మోదీకి అంత గులాంగిరీ చేయాల్సిన అవసరం ఈ పార్టీలకు ఎందుకు వచ్చిందని ప్రశ్నించారు. రాజశేఖర్‌రెడ్డి బీజేపీని వ్యతిరేకించారని తెలిసి కూడా అదే మోదీకి జగన్ దత్తపుత్రుడిగా మారారన్నారు. బీజేపీ మెడలు వంచి ప్రత్యేక హోదా తెస్తామన్న జగన్ పూర్తిగా స్వార్థ రాజకీయాల కోసం అదే బీజేపీతో అక్రమ పొత్తులు పెట్టుకుని, ఎక్కడపడితే అక్కడ మద్దతు, ఏ బిల్లుకైనా మద్దతు ఇచ్చారని, అదానీ, అంబానీలకు ఎంతో దోచి పెట్టారని ధ్వజమెత్తారు. బీజేపీతో కొట్లాడే చిత్తశుద్ధి వైసీపీకి లేదన్నారు. కాంగ్రెస్ పార్టీ రానున్న నాలుగేళ్లలో బలోపేతమవుతుందని, పిల్లకాలువలన్నీ కాంగ్రెస్ పార్టీలో కలవాల్సిందేనని చెప్పారు. ప్రజల పక్షాన నిలబడి, మోదీని, బీజేపీని ఎదిరించే సత్తా ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్‌ని బలోపేతం చేసుకోవాల్సిన అవసరం మన రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. మోదీ హయాంలో దేశంలో గత పదకొండేళ్లుగా అప్రకటిత ఎమర్జెన్సీ నడుస్తుందని ఆరోపించారు. బీఆర్ఎస్, వైసీపీ పార్టీలకు కూడా మోదీకి వ్యతిరేకంగా మాట్లాడే ధైర్యం లేదన్నారు. చివరకు మీడియాకు కూడా దమ్ము లేకుండా చేశారన్నారు. పలు పర్యాయాలు మోదీ కేడీ అంటూ వ్యాఖ్యానించారు. గోద్రా రైలు సంఘటన నుంచే మోదీ అంటే ఏమిటో దేశ ప్రజలందరికీ తెలుసన్నారు. రాహుల్‌గాంధీ క్రేజ్ అంతకంతకు పెరుగుతుండడంతో బీజేపీ ప్రభుత్వం తట్టుకోలేక ఇందిరాగాంధీ ఎమర్జెన్సీని తెరపైకి తీసుకువచ్చిందన్నారు. అంతకంటే దారుణమైన పరిస్థితులు గత 11 ఏళ్లుగా దేశంలో ఉన్న విషయాన్ని ప్రజలు గుర్తించాలన్నారు. రాష్ట్ర విభజనతో తీవ్రంగా నష్టపోయిన ఏపీకి న్యాయం చేయగల శక్తి కాంగ్రెస్ పార్టీకి మాత్రమే ఉందన్నారు. పోలవరం ప్రాజెక్టు ఎత్తును 41 మీటర్లకు తగ్గించినా ఒక్క ఎంపీ కూడా నోరు మెదపకపోవడం దారుణమన్నారు. నాటి సీఎంలు కేసీఆర్, జగన్మోహన్‌రెడ్డి హయాంలో తన ఫోన్‌ను సైతం టాపింగ్ చేశారన్నారు. ఫోన్ ట్యాపింగ్ వాస్తవాలను బయట పెడుతున్న మీడియాపై బీఆర్ఎస్ శ్రేణులు దాడి చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందన్నారు.

జగన్‌ది దండుపాళెం బ్యాచ్ ప్రభుత్వం

- ముస్లింల డబ్బు 386 కోట్లు ఏమయ్యాయి?
- ముస్లింల ద్రోహిగా మిగిలిపోయారు: వక్ఫ్‌బోర్డు



నెల్లూరు(సిటీ), జూన్ 28(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో ముస్లింల సంక్షేమానికి ఖర్చు పెట్టినట్లుగా చూపి కేంద్రం నుంచి తీసుకున్న రూ.386 కోట్లు ఎక్కడున్నాయ్? ఏమయ్యాయి జగన్?' అని రాష్ట్ర వక్ఫ్‌బోర్డు ప్రశ్నించింది. వక్ఫ్‌బోర్డు ఛైర్మన్ అబ్దుల్ అజీజ్ నేతృత్వంలో బోర్డు 4వ సమావేశాన్ని శనివారం నెల్లూరులో నిర్వహించారు. ఎమ్మెల్సీ రుహుల్లా, గుంటూరు తూర్పు ఎమ్మెల్యే నసీర్ అహ్మద్‌లతోపాటు ఇతర సభ్యులు పాల్గొన్నారు. సమావేశానంతరం మీడియాతో మాట్లాడుతూ రూ.386 కోట్లలో రూపాయి కూడా ముస్లిం, మైనార్టీల అభ్యున్నతికి ఖర్చు చేయలేదన్నారు. 25 శాతం ముస్లింలు జీవించే ప్రాంతాల్లో అమలు చేయాల్సిన ప్రధానమంత్రి జీవన వయో యోజన(పీఎంజేవీవై)ను కూడా నిర్వహించలేకపోయారని విమర్శించారు. జగన్ ప్రభుత్వం ముస్లింల పేరిట కేంద్రం వద్ద నిధులు దండుకున్న దండుపాళెం బ్యాచ్ అని ఆరోపించారు. జగన్ ముస్లింల ద్రోహిగా మిగిలిపోయారని దుయ్యబట్టారు. వక్ఫ్‌బోర్డు నుంచి వచ్చే ప్రతీ రూపాయిని పేద ముస్లింలకు ఖర్చు చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో వక్ఫ్‌భూములు 65 వేల ఎకరాలుండగా, అందులో 35 వేల ఎకరాలు అన్యాక్రాంతమయ్యాయన్నారు. వాటిని బయటకు తీయడంతోపాటు మిగిలిన భూముల ద్వారా ఆదాయ మార్గాలు అన్వేషించి ముస్లింల సంక్షేమానికి ఖర్చు చేస్తామని చెప్పారు. పీ-4 పథకం ద్వారా ప్రతి పేద ముస్లింను చేయిపట్టుకుని అభివృద్ధి పథంలో నడిపిస్తామన్నారు.


మునిసిపల్ శాఖపై అధికారులతో సమీక్షిస్తున్న సీఎం చంద్రబాబు, పాల్గొన్న మంత్రి నారాయణ

> ఆగస్టు 15వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని అమలు చేసి తీరుతాం. ఈ పథకాన్ని ఇప్పటికే అమలు చేస్తున్న పలు ఇతర రాష్ట్రాల కంటే మనమే ఉత్తమంగా ఉండాలి. అందుకు అనుగుణంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. ప్రజారవాణాలో కీలకమైన ఆర్టీసీలో ఇకపై ప్రవేశపెట్టే బస్సులన్నీ ఎలక్ట్రిక్ వాహనాలే ఉండాలి. ఆదాయ మార్గాలను పెంచుకుని, వ్యయాన్ని తగ్గించుకోవాలి.
>
> \- ప్రజారవాణాపై సమీక్షలో సీఎం

ఇక ఈవీ బస్సులే!

(మొదటి పేజీ తరువాయి)

డీజిల్ బస్సులను ఎలక్ట్రిక్ బస్సులుగా మార్చుకునే అవకాశాలను పరిశీలించాలని సూచించారు. కేంద్రం ఇచ్చే 750 ఎలక్ట్రిక్ బస్సుల నిర్వహణ వ్యయాన్ని తగ్గించేందుకు.. ఆర్టీసీ బస్టాండ్లపై సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఉత్పత్తిని పెంచుకోవాలన్నారు. వీలైనన్ని విద్యుత్ బస్సులు కొనుగోలు చేయాలని, సాధ్యం కాని పక్షంలో అద్దె బస్సులు తీసుకోవాలని సీఎం అధికారులకు సూచించారు. ఎన్నికల సూపర్ సిక్స్ హామీల్లో ఒకటైన ఆర్టీసీలో మహిళలకు ఉచిత ప్రయాణాన్ని అమలు చేసి తీరుతామని పేర్కొన్నారు. ఢిల్లీ, పంజాబ్, తమిళనాడు, కర్ణాటక, తెలంగాణల్లో ఇప్పటికే అమలవుతున్న ఉచిత ప్రయాణ పథకాల్లో ఏపీనే ఉత్తమంగా ఉండాలన్నారు. ఏపీఎస్ఆర్టీసీ ఆదాయ మార్గాలను పెంచుకుని, వ్యయాన్ని తగ్గించుకోవాలని సూచించారు. ఉచిత ప్రయాణం అమలు తర్వాత ప్రయాణికుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, మరో 2,536 బస్సులు అవసరమని ఈ సందర్భంగా అధికారులు వివరించారు. రాష్ట్రంలో 2.62 కోట్ల మంది మహిళలు ఉన్నారని, ప్రతి ఒక్కరూ వారానికి ఒక్కసారైనా ప్రయాణిస్తారని, ఏడాదిలో 88.9 కోట్ల ప్రయాణాలు మహిళలు సాగించే అవకాశం ఉందని అంచనా వేసినట్లు చెప్పారు. ఆర్టీసీపై ఏటా రూ.996 కోట్ల మేర ఉచిత ప్రయాణ భారం పడే అవకాశం ఉందని వివరించారు.

> కేంద్ర ప్రాజెక్టులకు మరిన్ని నిధులు తీసుకురావడంపై అధికారులు దృష్టి సారించాలి. పెండింగ్ బిల్లులు, ఇతర విషయాల్లో మున్సిపల్, ఆర్థిక శాఖలు సమన్వయంతో పనిచేయాలి. గత ప్రభుత్వం వివిధ పథకాలకు రాష్ట్ర వాటా ఇవ్వకపోవడంతో చాలా నిధులు రాలేదు. ఇప్పుడా పరిస్థితి తలెత్తకూడదు. ఏఐఐబీ, స్వచ్ఛ భారత్ నిధులతో పనులు వేగంగా జరిగేలా చర్యలు తీసుకోవాలి.
>
> \- మున్సిపల్ శాఖ సమీక్షలో సీఎం

పెండింగ్ బిల్లులు, యూసీల సమస్యలు పరిష్కరించాలి

అలాగే.. మున్సిపల్ శాఖపై కూడా సీఎం చంద్రబాబు విడిగా సమీక్ష నిర్వహించారు. మున్సిపల్ శాఖ పరిధిలో కేంద్ర ప్రాజెక్టులు ఏమున్నాయో చూసుకుని.. వాటికి మరిన్ని నిధులు ఏ విధంగా తీసుకురావాలనే దానిపై దృష్టి సారించాలని అధికారులను ఆదేశించారు. కేంద్ర ప్రాజెక్టులకు సంబంధించి ఏమైనా బిల్లులు పెండింగ్ ఉన్నా.. యూసీల విషయంలో ఏమైనా సమస్యలున్నా.. వాటిని ఆర్థిక శాఖతో సంప్రదించి పరిష్కరించుకోవాలని సూచించారు. ఈ విషయంలో ఆర్థిక శాఖ కూడా మున్సిపల్ శాఖకు సహకరించాలని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం వివిధ పథకాలకు రాష్ట్ర వాటా ఇవ్వకపోవడంతో చాలా నిధులు రాలేదని, ఇప్పుడు అలాంటి పరిస్థితి తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులకు నిర్దేశించారు. ఏఐఐబీ నుంచి వచ్చిన రూ.5,800 కోట్లు, స్వచ్ఛ భారత్ కింద వచ్చిన రూ.3 వేల కోట్లతో పనులు వేగంగా జరిపించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అమృత్, అమృత్-2, ఏఐఐబీ, యూఐడీఎఫ్ ప్రాజెక్టుల్లో జాప్యం జరగకుండా చూసుకోవాలని సూచించారు.

ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి

మున్సిపల్ శాఖ పరిధిలో ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని సీఎం ఆదేశించారు. గత ప్రభుత్వం ఔట్ సోర్సింగ్ విధానాన్ని అస్తవ్యస్తం చేసిందన్నారు. ఔట్ సోర్సింగ్ కార్మికుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టడంతో పాటు ప్రజలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా చూసుకోవాలని సూచించారు. అర్బన్ హౌసింగ్ విభాగాన్ని గత ప్రభుత్వం అస్తవ్యస్తం చేసిందని, వైసీపీ హయాంలో లబ్ధిదారులు చాలా ఇబ్బందులు పడ్డారని అన్నారు. పలు సమస్యలున్నాయని, త్వరలోనే దీనిపై సమావేశం ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఎస్టీపీ ప్లాంట్ల ద్వారా నీటి శుద్ధి అంశంపై మరింత దృష్టి సారించి, ఆ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు నిర్దేశించారు. లెగసీ వేస్ట్ అనేది మున్సిపాలిటీలకు, ప్రజలకు భారంగా మారిందని, లెగసీ వేస్ట్ కనిపించకుండా చర్యలు తీసుకోవడంతో పాటు భవిష్యత్‌లో చెత్తను ఎప్పటికప్పుడు డిస్పోజ్ చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

డ్వాక్రా ఉత్పత్తులకు డిమాండ్ పెంచాలి

డ్వాక్రా సంఘాల ద్వారా మహిళాభివృద్ధి జరుగుతుందని సీఎం అన్నారు. 'డ్వాక్రా సంఘాల ఉత్పత్తులకు మరింత డిమాండ్ పెరిగేలా చేయాలి. దీనికి అవసరమైన నైపుణ్య శిక్షణను నిరంతరం అందించాలి. డ్వాక్రా మహిళల ఆదాయం పెరగాలి' అని అధికారులను నిర్దేశించారు. వారి జీవన ప్రమాణాలను పెంచే దిశగా మెప్మా అధికారులు పనిచేయాలని సూచించారు. ఈ-కామర్స్ వంటి ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్‌ల ద్వారా డ్వాక్రా మహిళల ఉత్పత్తులకు మార్కెటింగ్ కల్పించేలా చూడాలన్నారు. మహిళా సాధికారతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తుందని సీఎం పేర్కొన్నారు. ప్రజలకు సేవలు అందించడంతో పాటు మనం ఆయా మున్సిపాలిటీలకు ఎంత ఖర్చు పెడుతున్నామనే విషయాన్ని కూడా ప్రజలకు వివరించాలని అధికారులకు సూచించారు. మున్సిపాలిటీల్లో రోడ్లను పూర్తి స్థాయిలో నిర్మించాలని ఆదేశించారు. సమీక్షలో మున్సిపల్ మంత్రి నారాయణ, మున్సిపల్, ఆర్థిక శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.


సింగపూర్‌లో ఎన్టీఆర్ 102వ జయంత్యుత్సవాలు

తెలుగువారి ప్రతిష్ఠను ప్రపంచ దేశాలకు చాటిచెప్పిన ఎన్టీఆర్ జయంతి ఉత్సవాలను సింగపూర్‌లో ఘనంగా నిర్వహిస్తున్న సింగపూర్ టీడీపీ ఫోరానికి చెందిన హనుమంతరావు బృందానికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అభినందనలు తెలిపారు. ఎన్టీఆర్ 102వ జయంతి ఉత్సవాలను సింగపూర్‌లో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, టీడీపీ జాతీయ ఉపాధ్యక్షుడు మాధవనాయుడు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపాలిటీల్లో ప్రతి ఇంటికీ తాగునీరు

అమృత్‌స్కీం ద్వారా టెండర్లు పిలిచాం: నారాయణ

అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో వంద శాతం రక్షిత తాగునీరు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మున్సిపల్, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి నారాయణ తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో కేంద్రం నుంచి రావాల్సిన నిధులు మధ్యలోనే నిలిచిపోయాయన్నారు. 2014-19 మధ్య కాలంలో మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనుల కోసం కేంద్రం నుంచి అనేక నిధులను తీసుకొచ్చామని చెప్పారు. ఏషియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్(ఏఐఐబీ) నుంచి రూ.5800 కోట్లు, స్వచ్ఛ భారత్ నుంచి రూ.3000 కోట్ల విడుదలకు ఆమోదం తీసుకున్నామని, అయితే గత ప్రభుత్వం రాష్ట్ర వాటా నిధులు విడుదల చేయకపోవడంతో ఆ నిధులు మధ్యలోనే నిలిచిపోయాయన్నారు. ఇప్పటికే అమృత్ స్కీం నిధులకు గ్రీన్ సిగ్నల్ వచ్చిందని, మంచినీటి పైప్‌లైన్ల కోసం టెండర్లు పిలిచామని చెప్పారు. ఈ పనులు పూర్తయితే 85 శాతం ఇళ్లకు నేరుగా తాగునీరు అందుతుందన్నారు. ఏఐఐబీ నుంచి రూ.5350 కోట్లతో మిగిలిన తాగునీటి పైప్‌లైన్లు, డ్రైనేజీ పైప్‌లైన్లు పూర్తి చేస్తామని తెలిపారు. ఈ నిధులకు సంబంధించి రాష్ట్ర వాటా ఇచ్చేలా సీఎం చంద్రబాబు ఆర్థిక శాఖకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు. శుద్ధి చేసిన నీటిని డ్రైనేజీలోకి వదిలేలా ఎస్టీపీలను కూడా 2029కి పూర్తి చేస్తామన్నారు. ప్రతి రోజూ రాష్ట్రంలో 8 వేల టన్నుల ఘన వ్యర్థాలు ఉత్పత్తి అవుతున్నాయని, వాటి నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. చెత్త నుంచి విద్యుత్ ఉత్పత్తి చేసే పది ప్లాంట్లను రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని నిర్ణయించామని, ప్రస్తుతం గుంటూరు, విశాఖలో మాత్రమే రెండు ప్లాంట్‌లు అందుబాటులోకి వచ్చాయన్నారు. ఈ ప్లాంట్‌లన్నీ అందుబాటులోకి వస్తే ప్రతిరోజూ 7500 టన్నుల చెత్తను విద్యుత్‌గా మారుస్తామని, మరో 500 టన్నుల చెత్తను వివిధ రూపాల్లో నిర్వహిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం వదిలేసి వెళ్లిన 85 లక్షల మెట్రిక్ టన్నుల లెగసీ వేస్ట్‌ను వచ్చే అక్టోబరు 2 నాటికి పూర్తిగా తొలగిస్తామన్నారు. మున్సిపాలిటీల్లో పారిశుధ్య నిర్వహణ కోసం కాంపాక్టర్లు, స్వీపింగ్ మెషిన్ల కొనుగోలుకు రూ.225 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. 2014-19 మధ్య కాలంలో 5 లక్షల టిడ్కో ఇళ్ల నిర్మాణానికి పనులు ప్రారంభించగా..గత ప్రభుత్వం వాటిని 2.60 లక్షలకు తగ్గించేసిందన్నారు. మున్సిపాలిటీల్లో ఇంజనీరింగ్ ఔట్‌సోర్సింగ్ కార్మికుల సమ్మెపై మంత్రివర్గ ఉపసంఘంలో చర్చించి నిర్ణయం తీసుకుంటామన్నారు.

అక్రమ మైనింగ్ కేసులో
వంశీకి ముందస్తు బెయిల్

మంజూరు చేసిన హైకోర్టు.. సుప్రీంకు వెళ్లనున్న సర్కార్

అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అక్రమమైనింగ్‌కు పాల్పడి ప్రభుత్వ ఖజానాకు రూ.195 కోట్ల నష్టం కలిగించిన వ్యవహారంలో మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి ముందస్తు బెయిల్ మంజూరు చేస్తూ హైకోర్టు ఇచ్చిన ఉత్తర్వులను సుప్రీంకోర్టులో సవాల్ చేయాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. అప్పీల్ దాఖలుకు చర్యలు తీసుకోవాలని అడ్వొకేట్ ఆన్ రికార్డ్(ఏవోఆర్) కార్యాలయ ప్రత్యేక అధికారిని ఆదేశించింది. దీనికి సంబంధించి హోంశాఖ ముఖ్యకార్యదర్శి కుమార్ విశ్వజీత్ శనివారం ఉత్తర్వులు ఇచ్చారు. వైసీపీ హయాంలో విజయవాడ రూరల్, బాపులపాడు గన్నవరం మండలాల పరిధిలో వల్లభనేని వంశీ, అతని అనుచరులు అక్రమమైనింగ్‌కు పాల్పడటంతో ఖజానాకు రూ.195 కోట్ల నష్టం కలిగిందని విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ శాఖ తేల్చింది. దీనిపై జిల్లా మైనింగ్ అధికారి ఫిర్యాదు ఆధారంగా గన్నవరం పోలీసులు మే 14న కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ వంశీ హైకోర్టును ఆశ్రయించారు. ప్రాసిక్యూషన్ తరపు సీనియర్ న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. అక్రమమైనింగ్ 2019 నుంచి 2024 వరకు జరిగిందన్నారు. సవివరంగా కౌంటర్ వేసేందుకు వారం రోజులు సమయం ఇవ్వాలని కోరారు.

ఆ ఎమ్మెల్యేలను
గాడిలో పెడతారా?

(మొదటి పేజీ తరువాయి)

చంద్రబాబు 'క్లాస్' తీసుకోనున్నారు. అంతే కాదు.. తీవ్రస్థాయి ఆరోపణలు ఉన్నవారిని ప్రత్యేకంగా పిలిచి 1-1 చర్చించనున్నారు. పద్ధతి మార్చుకోవాలని, ప్రజలకు చేరువ కావాలని హెచ్చరించడంతోపాటు గట్టి వార్నింగే ఇవ్వనున్నట్టు పార్టీ వర్గాల్లో చర్చ సాగుతోంది. ఏడాది పాలన పూర్తిచేసుకున్న దరిమిలా.. ప్రజల్లో సానుకూల దృక్పథం పెంచే విధానాలపై వారికి దిశానిర్దేశం చేయనున్నారు.

2 నుంచి ప్రజల్లోకి

రాష్ట్రంలో కూటమి సర్కారు ఏడాది పాలనా విజయాలు.. భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాలను ప్రజలకు వివరించడమే లక్ష్యంగా జూలై 2వ తేదీ నుంచి చేపడుతున్న 'ఇంటింటికీ మంచి ప్రభుత్వం'పై పార్టీ శ్రేణులను సీఎం చంద్రబాబు సమాయత్తం చేయనున్నారు. మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం చంద్రబాబు అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జులు, పొలిట్‌బ్యూరో సభ్యులు పాల్గొననున్నారు. 'ఇంటింటికీ మంచి ప్రభుత్వం' కార్యక్రమంతో పార్టీ శ్రేణులన్నీ ప్రజల్లోకి వెళ్లాలని అధినేత దిశానిర్దేశం చేయనున్నారు. ఏడాది పాలనలో విజయాలతోపాటు భవిష్యత్తులో చేపట్టనున్న కార్యక్రమాలను ప్రజలకు వివరిస్తారు. అదేవిధంగా ప్రతిపక్షం వైసీపీ నేతల అరాచకాలను కూడా ప్రజలకు వివరించనున్నారు.

శ్రేణులకు భరోసా కల్పించేలా..

వైసీపీ హయాంలో ఎన్నో కష్టాలు పడి పార్టీ కోసం పనిచేసిన తమకు ఏడాది కాలంలో తగిన గుర్తింపు లభించలేదన్న అసంతృప్తి పార్టీ శ్రేణుల్లో ఉంది. ఈ విషయంపై అధిష్ఠానం ఇప్పటికే దృష్టి సారించింది. వైసీపీ హయాంలో దాడులకు గురై, ఇబ్బందులు పడిన నాయకులు, కార్యకర్తల్లో చాలామందికి ఇప్పటికే ఏదో ఒకరకంగా చేయూతనిచ్చారు. మిగిలిన వారికీ త్వరలోనే తగిన గుర్తింపు లభిస్తుందన్న భరోసాను పార్టీ శ్రేణులకు కల్పించడంపై పార్టీ విస్తృత స్థాయి సమావేశంలో చంద్రబాబు చర్చించనున్నారు. పార్టీ కోసం కష్టపడిన వారికి అన్యాయం జరగబోదన్న హామీ ఇవ్వనున్నారు.

వైసీపీ అరాచకాలపై..

వైసీపీ అరాచకాలపైనా విస్తృతస్థాయి సమావేశంలో చర్చించనున్నారు. గత ఎన్నికల్లో వైసీపీని 11 సీట్లకే పరిమితం చేసి ప్రజలు బుద్ధి చెప్పారు. అయినా.. ఆ పార్టీ అధినేత సహా నాయకుల తీరు కానీ ఏమాత్రం మారలేదని, ఏడాది కూడా కాక ముందే అరాచకాలకు తెరదీశారని టీడీపీ భావిస్తోంది. ఈ నేపథ్యంలో వైసీపీ అరాచకాలను దీటుగా ఎదుర్కోకపోతే మున్ముందు మరింత బరితెగిస్తారని పార్టీ పెద్దలు భావిస్తున్నారు. ప్రజల్లోకి వెళ్లి అధికార పక్షం చేస్తున్న తప్పులను వివరించడం వరకు అభ్యంతరం లేదని, కానీ సంఘవిద్రోహ శక్తులను కూడగడుతూ శాంతిభద్రతలకు విఘాతం కలిగించడం సరైన విధానం కాదని అంటున్నారు. ఇదే అంశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నది టీడీపీ అధిష్ఠానం అభిప్రాయంగా ఉంది. వైసీపీ అరాచకాలకు చెక్ పెట్టే అంశంపై విస్తృతస్థాయి సమావేశంలో చర్చించనున్నారు.


అనంతపురం జిల్లా తాడిపత్రిలోని వైసీపీ మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి నివాసం

పెద్దారెడ్డి కబ్జా పర్వం

2 సెంట్ల సర్కారు స్థలం ఆక్రమించి ఇల్లు కట్టిన వైసీపీ మాజీ ఎమ్మెల్యే.. నిర్ధారించిన అధికారులు

తాడిపత్రి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): అనంతపురం జిల్లా తాడిపత్రి వైసీపీ మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ప్రభుత్వ భూమిని ఆక్రమించి ఇల్లు కట్టారని అధికారులు నిర్ధారించారు. రెండు సెంట్ల సర్కారు స్థలాన్ని ఆయన కబ్జా చేశారని గుర్తించారు. తాడిపత్రి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులు శనివారం పెద్దారెడ్డి ఇంటికి కొలతలు వేశారు. మాజీ ఎమ్మెల్యే తన భార్య రమాదేవి పేరిట 639, 640, 641 సర్వే నంబర్లలో ప్లాట్ నంబర్లు 2, 15లో 10 సెంట్ల విస్తీర్ణంలో ఇంటిని నిర్మించారు. ప్లాన్ ప్రకారం 5 సెంట్ల స్థలానికి మాత్రమే అనుమతులు తీసుకుని, 10 సెంట్ల విస్తీర్ణంలో ఇంటిని నిర్మించారని మున్సిపల్ అధికారులు తెలిపారు. కొలతలు వేసిన అనంతరం సుమారు 2 సెంట్ల మేర మున్సిపాలిటీ స్థలాన్ని పెద్దారెడ్డి ఆక్రమించినట్లు తేలిందన్నారు. ఇంటి అక్రమ నిర్మాణం విషయంలో గతంలోనూ మున్సిపల్ అధికారులు పెద్దారెడ్డికి నోటీసులు ఇచ్చారు. అక్రమాల గురించి ఈ ఏడాది మార్చి 11న రిజిస్ట్రార్ కార్యాలయ అధికారులు కూడా తెలిపారు. ఆక్రమణలను నిర్ధారించేందుకు భారీ పోలీసు బందోబస్తు నడుమ టౌన్ ప్లానింగ్ అధికారి సుజాత, సర్వేయర్ కైవల్యసాయి, మండల సర్వేయర్ రాంమోహన్ శనివారం కొలతలు వేశారు.

పులివెందులలో 'వైసీపీ పోలీసులు'!

సర్కారు మారినా తీరుమారని వైనం

- జగన్ సన్నిహితుడి వ్యాపారంలో బెంగళూరు వాసులకు బెదిరింపులు
- సంబంధం లేని కేసులో సెటిల్‌మెంట్?
- ఓ అధికారి ఇంట్లో నడిచిన వ్యవహారం
- అర్బన్ స్టేషన్‌లో కేసు.. రూరల్ సీఐ జోక్యం
- నోటీసులు ఇచ్చినట్టు ఒప్పుకొన్న సీఐ రమణ

కడప, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో టీడీపీ నేతృత్వంలోని కూటమి అధికారంలో ఉంది. ప్రభుత్వం వచ్చి ఏడాది దాటింది. అయితే, పులివెందుల పోలీసులు మాత్రం ఇంకా జగన్ ప్రభుత్వమే ఉందన్న భ్రమలో ఉన్నట్టు కనిపిస్తోంది. వైసీపీ హయాంలో ఐదేళ్లపాటు ఆ పార్టీకి అనుకూలంగా పనిచేశారు. అయితే, ప్రభుత్వం మారినా పులివెందుల పోలీసులు ఇప్పటికీ వైసీపీకి సానుకూలంగానే, వారి చెప్పుచేతల్లోనే వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. సంబంధం లేని సివిల్ కేసుల్లో జోక్యం చేసుకుని వైసీపీ నేతలకు మేలు చేస్తుండడం చర్చనీయాంశంగా మారింది. అసలు పులివెందులకే కాదు, రాష్ట్రానికి కూడా సంబంధం లేని కేసును డీల్ చేసి 'సెటిల్‌మెంట్' చేయడం వివాదాస్పదంగా మారింది.

సంబంధం లేని వ్యవహారం!

వాస్తవానికి ఈ వ్యవహారం బెంగళూరుకు సంబంధించింది. దుష్యంత్‌రెడ్డి లావాదేవీలు హైదరాబాద్ కేంద్రంగా ఉంటాయి. అలాంటప్పుడు.. పులివెందులకు సంబంధం లేని విషయంపై సెటిల్‌మెంట్లు చేయడం ఏంటనేది ప్రశ్న. ఇక, పులివెందుల అర్బన్ పోలీస్‌స్టేషన్‌లో ఈ నెల 5న బెంగళూరుకు చెందిన లలిత్‌జైన్, సుధాకర్ రాజేచర్, జయతీర్థం రాజేచర్, నిర్మల బంటియా, ఎండీ రామానుజన్‌లపై కేసు నమోదైంది. అసలు సంబంధం లేని కేసును వైసీపీ నేతల మెప్పు కోసం పులివెందుల పోలీసులు.. బెదిరించి మరీ సెటిల్ చేశారనే ప్రచారం జరుగుతోంది. అంతేకాదు, అర్బన్ స్టేషన్‌లో కేసు నమోదైతే రూరల్ సీఐ విచారించడంపైనా విమర్శలు వస్తున్నాయి.

సీఐ వివరణ ఇదీ

ఈ విషయమై 'ఆంధ్రజ్యోతి' పులివెందుల రూరల్ సీఐ రమణతో మాట్లాడగా.. ఇరువురినీ పిలిపించి మాట్లాడాలని ప్రయత్నిస్తే మేమే మధ్యవర్తుల ద్వారా సెటిల్ చేసుకుంటామని అంగీకరించారని తెలిపారు. బెంగళూరు వాసులు న్యాయవాదులతో వచ్చారని, 41ఏ నోటీసు ఇచ్చి పంపించామని చెప్పారు. దీనిని బట్టి వ్యవహారం జరిగిందనేది వాస్తవమని తేలింది.

విషయం ఏంటంటే

చవ్వా దుష్యంత్‌రెడ్డి.. వైసీపీ అధినేత జగన్‌కు అత్యంత సన్నిహితుడు. గతంలో కమలాపురం నియోజకవర్గం వైసీపీ ఇన్‌చార్జ్‌గా వ్యవహరించారు. దుష్యంత్‌కు పలు కాంట్రాక్టు సంస్థలున్నాయి. ఈయన కంపెనీలన్నీ హైదరాబాదులో ఉంటాయి. దుష్యంత్ రెడ్డి తండ్రి చవ్వా విజయశేఖర్‌రెడ్డి బెంగళూరులో రియల్ ఎస్టేట్ వ్యాపారి. ఇటీవల ఆయన మరణించారు. ఆయనకు బెంగళూరులోని కొందరు బకాయి ఉన్నారు. ఈ బకాయిలపై దుష్యంత్‌రెడ్డి పులివెందుల పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో హుటాహుటిన బెంగుళూరుకు వెళ్లి లలిత్‌జైన్, సుధాకర్ రాజేచర్, జయతీర్థం రాజేచర్, నిర్మల్ బంటియా, ఎండీ రామానుజన్‌లను తీసుకువచ్చి రెండు రోజులు ఇక్కడ ఉంచారు. అంతేకాదు, వారిని బెదిరించి రూ.10 కోట్లు సెటిల్‌మెంటు చేశారని సమాచారం.

ఈ-స్టాంపుల స్కామ్‌లో ముగ్గురి అరెస్టు

- కళ్యాణదుర్గంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు
- నకిలీలతో ప్రభుత్వానికి 25 లక్షలు గండి కొట్టిన 'మీసేవ బాబు'
- వివరాలు వెల్లడించిన అనంత ఎస్పీ జగదీష్



ఈ-స్టాంపుల స్కామ్ కేసు వివరాలు వెల్లడిస్తున్న అనంతపురం ఎస్పీ జగదీష్

అనంతపురం క్రైం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నకిలీ ఈ-స్టాంపుల కుంభకోణంలో ముగ్గురిని అరెస్టు చేసినట్లు అనంతపురం జిల్లా ఎస్పీ జగదీష్ వెల్లడించారు. ఈ కేసులో నిందితులు బోయ ఎర్రప్ప అలియాస్ మీసేవ బాబు, మోహన్‌బాబు, భువనేశ్వర్‌ను కళ్యాణదుర్గంలో శనివారం అదుపులోకి తీసుకున్నామని తెలిపారు. వారి నుంచి మూడు సెల్‌ఫోన్లు, 3 సీపీయూలు, 3 మానిటర్లు, 3 ప్రింటర్ కం స్కానర్లు, రెండు ప్రింటర్లు, ఒక లాప్‌లాప్, 88 ఖాళీ ఈ-స్టాంపులు, 7 వాడిన ఈ-స్టాంపులను స్వాధీనం చేసుకున్నామని పేర్కొన్నారు. కేసు వివరాలను ఆయన విలేకరుల సమావేశంలో వెల్లడించారు. కర్నూలులోని స్టాక్ హోల్డింగ్ కంపెనీ నుంచి మీసేవ బాబు రూ.32,80,750 విలువైన 15,851 స్టాంపులు కొనుగోలు చేశాడని తెలిపారు. ఇందులో 438 స్టాంపులను ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా, దాని అనుబంధ సంస్థలకు రూ.32 లక్షలకు విక్రయించాడని, కానీ ప్రభుత్వానికి మాత్రం రూ.6.52 లక్షలు మాత్రమే స్టాంప్ డ్యూటీ చెల్లించారని తెలిపారు. ఎస్ఆర్‌సీ నుంచి తీసుకున్న సొమ్ములో మిగిలిన రూ.25.48 లక్షలను ప్రభుత్వానికి చెల్లించకుండా మోసగించాడని తెలిపారు. ఈ-స్టాంపుల స్కాంపై ఎస్ఆర్‌సీ ఇన్‌ఫ్రా డెవలపర్స్ ప్రైవేట్ లిమిటెడ్ జీఎం సతీష్ నుంచి ఈనెల 22న, అలాగే బెంగళూరుకు చెందిన నియో కన్‌స్ట్రక్షన్స్ కంపెనీ లిమిటెడ్ అకౌంటెంట్ షేక్ ఇమామ్ జుబేర్, ఉరవకొండ మండలం ఆమిద్యాలకు చెందిన సూరజ్ ఇన్‌ఫ్రా కంపెనీ అకౌంటెంట్ శ్రీనివాసులు నుంచి ఈనెల 25న ఫిర్యాదులు వచ్చాయని తెలిపారు. వీటిపై మూడు కేసులు నమోదు చేశామని, ఈ కుంభకోణంపై లోతైన దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. ఎస్ఆర్‌సీ, ఇతర సంస్థలకు విక్రయించగా మిగిలిన 15,413 ఈ-స్టాంపులను ఎవరు కొనుగోలు చేశారో దర్యాప్తులో తేలుతుందన్నారు. ముగ్గురు నిందితులను కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు తరలిస్తామని తెలిపారు.

మోసం చేసిందిలా..

ఎస్ఆర్‌సీ, దాని అనుబంధ సంస్థలకు విక్రయించిన మొత్తం 438 ఈ-స్టాంపుల ముఖ విలువ రూ.6.52 లక్షలు మాత్రమే. ఈ సొమ్ము మాత్రమే ప్రభుత్వానికి చేరింది. కానీ ఈ-స్టాంపుల ముఖ విలువను ఎర్రప్ప టాంపరింగ్ చేసి ఎక్కువగా చూపించాడు. రూ.100 విలువైన స్టాంపును ఫొటో షాప్‌లో ఎడిట్ చేసి.. సున్నాలు చేర్చడం ద్వారా రూ.1,00,000కు విక్రయించాడు. ఇలా స్టాంపు ముఖ విలువ కంటే ఎక్కువగా వసూలు చేసిన సొమ్మును కాజేశాడు. తద్వారా ప్రభుత్వ ఆదాయానికి రూ.25.48 లక్షల గండి పడింది.

జూన్ ముగుస్తున్నా చినుకు కోసం చింతే

(మొదటి పేజీ తరువాయి)

తక్కువగా పడ్డాయి. చిత్తూరులో 10, కడపలో 29, అన్నమయ్యలో 18, అనంతపురంలో 6 శాతం తక్కువగా వర్షపాతం నమోదైందని జల వనరుల శాఖ వెబ్‌సైట్ ఏపీ రిమ్స్ శనివారం వెల్లడించింది. రాష్ట్రవ్యాప్తంగా సాధారణ వర్షపాతం 76.84 మిల్లీమీటర్లకుగాను 13.47శాతం తక్కువగా అంటే 66.49 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. జూన్ నెలలో ఇప్పటిదాకా శ్రీకాకుళంలో 37.5, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 29, పల్నాడులో 52.9, నెల్లూరులో 58.8, నంద్యాలలో 23.7, శ్రీసత్యసాయి జిల్లాలో 45.8, కడపలో 65.5, అన్నమయ్యలో 63.1, చిత్తూరులో 43.4, తిరుపతిలో 27.4 శాతం తక్కువగా వర్షపాతం నమోదైంది.

రాష్ట్రంలోని రిజర్వాయర్లు వెలవెల

రాష్ట్రంలోని 110 రిజర్వాయర్లలో 482.64 టీఎంసీల కుగాను 233.21 టీఎంసీల జలాలే నిల్వ ఉన్నాయి. 38,456 చెరువుల్లో 66.92 టీఎంసీలకుగాను 22.65 టీఎంసీలే నిల్వ ఉంది. మేజర్ రిజర్వాయర్లలో 865.54 టీఎంసీలకుగాను 201.25 టీఎంసీలే నీటి నిల్వలు ఉన్నాయి. మీడియం రిజర్వాయర్లలో 137 టీఎంసీలకుగాను 33 టీఎంసీలే అందుబాటులో ఉన్నాయి.

ఎగువన ప్రాజెక్టుల్లోకి భారీగా చేరుతున్న నీరు

ఎగువన కర్ణాటకలోని ఆల్మట్టి గరిష్ఠ సామర్థ్యం 129.72 టీఎంసీలకుగాను 84.55 టీఎంసీల నీరు నిల్వ ఉంది. రిజర్వాయరులోకి 1,14,327 క్యూసెక్కుల వరద వస్తుంటే.. 80,415 క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. నారాయణపూర్ గరిష్ఠ సామర్థ్యం 37.64 టీఎంసీలకుగాను 30.53 టీఎంసీల నిల్వ ఉంది. ప్రాజెక్టులోకి 80,448 క్యూసెక్కుల వరద వస్తుంటే.. 76,391 క్యూసెక్కులను కిందకు వదులుతున్నారు. జూరాల గరిష్ఠ సామర్థ్యం 9.66 టీఎంసీలకుగాను 7.33 టీఎంసీల నీరు ఉంది. జూరాలకు 1,08,921 క్యూసెక్కుల వరద వస్తుంటే.. 1,11,035 క్యూసెక్కులను దిగువన శ్రీశైలానికి వదులుతున్నారు.

నెమ్మదిగా నిండుతున్న శ్రీశైలం

శ్రీశైలం జలాశయం గరిష్ఠ సామర్థ్యం 215.81 టీఎంసీలకుగాను 139.78 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్‌లోకి 1,05,783 క్యూసెక్కుల వరద వస్తుంటే.. దిగువకు ఏమీ విడుదల చేయడం లేదు. నాగార్జున సాగర్ గరిష్ఠ సామర్థ్యం 514.2 టీఎంసీలకుగాను 138.91 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్‌లోకి 4,484 క్యూసెక్కుల వరద వస్తుంటే.. ఆ నీటిని తాగునీటి కోసం దిగువకు వదులుతున్నారు. పులిచింతల గరిష్ఠ సామర్థ్యం 45.77 టీఎంసీలకుగాను 22.35 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డ్యామ్‌లోకి వరద నీరు రావడం లేదు. ప్రకాశం బ్యారేజీ గరిష్ఠ నీటి మట్టం 3.07 టీఎంసీలకుగాను 2.98 టీఎంసీల నీరు ఉంది. ఎగువన వర్షాలతో ప్రాజెక్టులు నిండుతున్నా.. రాష్ట్రంలో తక్కువ వర్షపాతం.. ఎగువ నుంచి వరద ప్రవాహాలు తక్కువగా ఉండటంతో ప్రాజెక్టుల్లోకి నీరు ఆశించినంతగా చేరడం లేదు.


ఆల్మట్టి డ్యాం గేట్లన్నీ ఎత్తడంతో దిగువకు ప్రవహిస్తున్న నీరు

ఆల్మట్టికి వరద పోటు

- గేట్లన్నీ ఎత్తి దిగువకు నీటి విడుదల

బెంగళూరు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మహారాష్ట్రలో భారీ వర్షాలు కురుస్తుండటంతో కర్ణాటకలోని విజయపుర జిల్లాలో ఉన్న ఆల్మట్టి జలాశయానికి వరద పోటెత్తుతోంది. ఆల్మట్టి డ్యాం గరిష్ఠ నీటిమట్టం 519.60 మీటర్లు కాగా ప్రస్తుతం 516.82 మీటర్ల వరకు నీరు చేరింది. ఇన్‌ఫ్లో 1.15 లక్షల క్యూసెక్కులు ఉండటంతో మొత్తం 26 క్రస్ట్ గేట్‌లను ఎత్తివేసి 90 వేల క్యూసెక్కులను దిగువకు వదులుతున్నారు. మరో రెండు మూడు రోజుల్లో లక్ష క్యూసెక్కులకుపైగా నీటిని దిగువకు విడుదల చేసే అవకాశం ఉంది. ఆల్మట్టి గేట్లు ఎత్తడంతో నారాయణపుర జలాశయానికి భారీగా నీరు చేరుతోంది. నారాయణపుర డ్యాం గరిష్ఠ నీటిమట్టం 492.25 మీటర్లు కాగా ప్రస్తుతం 490.63 మీటర్ల వరకు నీరు చేరింది. నారాయణపురకు ఇన్‌ఫ్లో 84,445 క్యూసెక్కులు ఉండటంతో 70 వేల క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. నారాయణపుర డ్యాం ఎగువన వర్షాలు కురుస్తుండటంతో ఆ నీరు తోడై ఇన్‌ఫ్లో 1.10 లక్షల క్యూసెక్కులకు పెరిగే అవకాశం ఉందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇన్‌ఫ్లోను అనుసరించి అవుట్ ఫ్లోను పెంచే అవకాశం ఉంది.

నేడు అల్పపీడనం

- రేపటి నుంచి ఉత్తర కోస్తాలో వర్షాలు

విశాఖపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): పశ్చిమ బెంగాల్, దానికి ఆనుకుని బంగ్లాదేశ్‌లో శనివారం ఉపరితల ఆవర్తనం ఆవరించింది. దీని ప్రభావంతో ఆదివారం ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడనుంది. అనంతరం అది పశ్చిమ వాయవ్యంగా పయనించి ఉత్తర ఒడిశా దిశగా వెళ్లనుందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో ఉత్తర కోస్తా తీరం వెంబడి బలమైన గాలులు వీస్తున్నాయి. సోమవారం నుంచి ఉత్తర కోస్తాలో వర్షాలు పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది. శనివారం కోస్తాలో అనేకచోట్ల ఎండ తీవ్రత కొనసాగింది. పగటి ఉష్ణోగ్రతలు సాధారణం కంటే రెండు నుంచి నాలుగు డిగ్రీలు ఎక్కువగా నమోదయ్యాయి. జంగమహేశ్వరపురంలో 40 డిగ్రీల గరిష్ఠ ఉష్ణోగ్రత నమోదైంది. రానున్న 24 గంటల్లో కోస్తా, రాయలసీమల్లో చెదురుమదురుగా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. కాగా, సౌరాష్ట్ర, ఉత్తర అరేబియా సముద్రంలో ఉపరితల ఆవర్తనం ప్రభావంతో శనివారం కచ్, దానికి ఆనుకుని ఉన్న ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడింది. దీంతో అరేబియా సముద్రం నుంచి తేమగాలులు వస్తున్నందున ఆది లేదా సోమవారం నైరుతి రుతుపవనాలు దేశంలోని మిగిలిన ప్రాంతాలకు విస్తరించనున్నాయని వాతావరణ నిపుణుడొకరు అంచనా వేశారు.

ప్రైవేట్ స్కూళ్లలో ఉచిత ప్రవేశాల గడువు పొడిగింపు

అడ్మిషన్లు నిరాకరిస్తే శాఖాపరమైన చర్యలు: సమగ్ర శిక్ష ఎస్పీడీ శ్రీనివాసరావు

అమరావతి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): విద్యా హక్కు చట్టం కింద ఈ విద్యా సంవత్సరానికి ప్రైవేటు పాఠశాలల్లో 25 శాతం ఉచిత ప్రవేశాల కోసం లాటరీ ద్వారా ఎంపిక చేసిన రెండో విడత జాబితాలోని విద్యార్థులు తమ ప్రవేశాలను నిర్ధారణ చేసుకోవడానికి ప్రభుత్వం జూలై 2వ తేదీ వరకు గడువు పొడిగించింది. సమగ్ర శిక్ష రాష్ట్ర పథక సంచాలకుడు బి.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో ఈ విషయాన్ని తెలిపారు. ఈ సమాచారాన్ని ఎంపికైన విద్యార్థుల తల్లిదండ్రుల మొబైల్ నెంబర్లకు ఎస్ఎంఎస్‌ల ద్వారా తెలియజేయడంతోపాటు వెబ్‌సైట్‌లో కూడా అందుబాటులో ఉంచామని పేర్కొన్నారు. పూర్తి వివరాల కోసం టోల్ ఫ్రీ నెంబరు 18004258599లో సంప్రదించాలని సూచించారు. రెండో విడత లాటరీలో 8,583 మంది విద్యార్థులకు ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశాలకు సీట్లు కేటాయించారు. ప్రైవేటు పాఠశాలల యాజమాన్యాలు విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలను పరిశీలించి వారికి ఉచిత ప్రవేశాలు కల్పించాలని, సరైన కారణం లేకుండా అడ్మిషన్లు నిరాకరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



ఒంగోలు 37వ డివిజన్‌లోని ఎన్టీఆర్ పార్కులో అభివృద్ధి పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య


సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దామచర్ల, వేదికపై 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్య

'ఆంధ్రజ్యోతి' ఆలోచనలను ఆచరిస్తాం

- సమాజ హితం కోసం పాటుపడతాం
- 'అక్షరం అండగా' సభలో ఎమ్మెల్యే జనార్దన్
- కార్యక్రమ రూపకర్త, 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్యకు ప్రత్యేక అభినందనలు
- ఒంగోలు ఎన్టీఆర్ పార్కులో 70.50 లక్షల అభివృద్ధి పనులు ప్రారంభం

ఒంగోలు, జూన్ 28(ఆంధ్రజ్యోతి): సమాజ హితం కోసం 'ఆంధ్రజ్యోతి' చేసే ప్రతి ఒక్క ఆలోచననూ అమలు చేస్తామని ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్ హామీ ఇచ్చారు. ఒంగోలు నగరంలోని 37వ డివిజన్ ఎన్టీఆర్ పార్కులో శనివారం రాత్రి జరిగిన 'అక్షరం అండగా' సభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. పట్టణ ప్రాంత సమస్యల పరిష్కారం కోసం 'అక్షరం అండగా... పరిష్కారమే అజెండాగా' పేరుతో కార్యక్రమం చేపట్టడం అభినందనీయమన్నారు. దీన్ని రూపకల్పన చేసిన 'ఆంధ్రజ్యోతి' డైరెక్టర్ వేమూరి ఆదిత్యను ప్రత్యేకంగా అభినందించారు. నిధుల కొరత తీవ్రంగా ఉన్నప్పటికి 37వ డివిజన్‌లో ఐదు నెలల్లో రూ.2.60 కోట్లతో పనులు చేపట్టామని తెలిపారు. ప్రజలకు మేలుచేసే ఇలాంటి కార్యక్రమాలను ఇంకా కొనసాగించాలని కోరారు. 'అక్షరం అండగా' కార్యక్రమంలో ప్రజలు ప్రస్తావించిన అన్ని సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. సంస్థ డైరెక్టర్ వేమూరి ఆదిత్య మాట్లాడుతూ 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా' పేరుతో 'ఆంధ్రజ్యోతి' చేపట్టిన కార్యక్రమానికి ఒంగోలులో మంచి స్పందన వచ్చిందని అన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పెద్దఎత్తున అభివృద్ధి పనులు చేపట్టడంలో భాగస్వాములైన ప్రతి ఒక్కరికీ ఆయన ధన్యవాదాలు తెలిపారు. తొలుత ఎన్టీఆర్ పార్కులో చేపట్టిన రూ.70.50 లక్షల విలువైన అభివృద్ధి పనులను ఎమ్మెల్యే జనార్దన్, వేమూరి ఆదిత్య ప్రారంభించారు. అందుకు సంబంధించిన శిలాఫలకాన్ని



ఎమ్మెల్యే ఆవిష్కరించారు. పార్కులో జరిగిన లెవలింగ్, వాకింగ్ ట్రాక్ ఆధునికీకరణ పనులు, పిల్లల కోసం ఏర్పాటుచేసిన ఆట వస్తువులు తదితరాలను వారు పరిశీలించారు. 'ఆంధ్రజ్యోతి' ఒంగోలు యూనిట్ మేనేజర్ ఐవీ సుబ్బారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మేయర్ గంగాడ సుజాత, కమిషనర్ వెంకటేశ్వరరావు, స్థానిక కార్పొరేటర్ చెన్నుపాటి వేణుగోపాల్, పెద్దసంఖ్యలో స్థానికులు పాల్గొన్నారు.

అన్నదాతలకు మేలు చేసేలా ఆహారధాన్యాల సేకరణ: లావు



అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): ప్రజా పంపిణీ వ్యవస్థ కోసం ఆహార ధాన్యాలను సేకరించే ప్రక్రియలో రైతులకు మరింత మేలు చేకూర్చే దిశగా చర్యలు తీసుకుంటామని భారత ఆహార సంస్థ రాష్ట్రస్థాయి సంప్రదింపుల కమిటీ ఛైర్మన్, నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు చెప్పారు. శనివారం విజయవాడలోని ఎఫ్‌సీఐ ప్రాంతీయ కార్యాలయంలో ఆయన అధ్యక్షతన ఎస్ఎల్‌సీసీ సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పౌరసరఫరాలశాఖ కమిషనర్ సౌరబ్‌గౌర్, ఎఫ్‌సీఐ జనరల్ మేనేజర్ విజయ్ కుమార్ యాదవ్, రాష్ట్ర గిడ్డంగుల సంస్థ ఛైర్మన్ రావి వెంకటేశ్వరరావు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు. రాష్ట్రంలో ఎఫ్‌సీఐ కార్యకలాపాలపై సమీక్షించారు. అనంతరం శ్రీకృష్ణదేవరాయలు మీడియాతో మాట్లాడుతూ రాష్ట్రంలో ఉత్పత్తి అయ్యే ఆహార ధాన్యాల సేకరణను మరింత పెంచాలని ఎఫ్‌సీఐని ప్రభుత్వం కోరిందన్నారు. గతేడాది నిర్దేశించిన లక్ష్యంలో సగం కూడా సేకరించలేదని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా ఎఫ్‌సీఐ గోడౌన్లలో నిల్వ సామర్థ్యాన్ని, నిర్వహణలో నాణ్యత ప్రమాణాలను పెంచాలని నిర్ణయించినట్లు తెలిపారు. ప్రస్తుతం 70 నుంచి 80 శాతం మాత్రమే వినియోగించగలుగుతున్నారని, దీంతో ఖాళీగా ఉన్న గోడౌన్లను పౌరసరఫరాల సంస్థకు ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించామన్నారు. ఎఫ్‌సీఐ గోడౌన్లపై సౌర ఫలకల ఏర్పాటు ద్వారా దాదాపు 60 మెగావాట్లకు పైగా విద్యుత్తు ఉత్పత్తి చేసేందుకు అవకాశముందని, ఈ ప్రతిపాదనపై కార్యాచరణ ప్రణాళికలు సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశామని చెప్పారు.

నిద్రిస్తున్న తల్లిపై పెట్రోల్ పోసి నిప్పంటించిన కొడుకు

బ్యాంకు ఖాతాలోని డబ్బు ఇవ్వడం లేదని ఘాతుకం

సంగెం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): డబ్బు ఇవ్వలేదనే ఆక్రోశంతో తల్లిపై పెట్రోల్ పోసి నిప్పంటించాడో వ్యక్తి. వరంగల్ జిల్లా సంగెం మండలం కుంటపల్లి గ్రామంలో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత జరిగిందీ ఘటన. పోలీసులు, గ్రామస్థుల కథనం ప్రకారం.. ముత్తినేని సాంబయ్య-వినోద దంపతులకు కుమారుడు సతీష్, కుమార్తె ఉన్నారు. ఇద్దరికీ పెళ్లిళ్లు అయ్యాయి. సతీష్ గ్రామంలో జులాయిగా తిరుగుతుంటాడు. టెక్స్‌టైల్ పార్కు కోసం చేపట్టిన భూసేకరణలో సాంబయ్య పొలాన్ని కూడా సేకరించారు. ప్రభుత్వం చెల్లించిన పరిహారంలో కొత్త మొత్తంతో ఖానాపురం మండలం ధర్మారావుపేటలో సాగు భూమి కొన్నారు. మరో రూ.5 లక్షలను సంగెంలోని ఓ బ్యాంకులో జమ చేసుకున్నారు. ఆ సొమ్ము కోసం సతీష్ పలుమార్లు తల్లిదండ్రులపై దాడులు చేశాడు. తల్లిదండ్రులకు దూరంగా ఉండాలని గ్రామ పెద్దలు చెప్పడంతో.. ఏప్రిల్ నుంచి గీసుగొండ మండలం గంగదేవిపల్లిలో నివాసముంటున్నాడు. ఎన్నిసార్లు అడిగినా తల్లిదండ్రులు ఆ డబ్బు ఇవ్వకపోవడంతో కక్ష పెంచుకున్న సతీష్ పెట్రోల్ సీసాతో శుక్రవారం అర్ధరాత్రి తర్వాత కుంటపల్లి చేరుకున్నాడు. ఆరుబయట నిద్రిస్తున్న తల్లి వినోద(60)పై పెట్రోల్ పోసి నిప్పు అంటించి పరారయ్యాడు. స్థానికులు మంటలను అదుపు చేయగా.. పోలీసులు బాధితురాలిని వరంగల్ ఆస్పత్రికి తరలించారు.

10న మెగా టీచర్-పేరెంట్స్ మీట్

అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మెగా టీచర్ - పేరెంట్స్ సమావేశం(పీటీఎం) జూలై 10కి వాయిదా పడింది. జూలై 5న మెగా పీటీఎం నిర్వహించాలని తొలుత పాఠశాల విద్యాశాఖ నిర్ణయించింది. మొహర్రం, ఇతరత్రా కారణాల వల్ల ఈ సమావేశాన్ని 10వ తేదీకి వాయిదా వేసింది. అందుకు అనుగుణంగా ఏర్పాట్లు చేసుకోవాలని పాఠశాలల యాజమాన్యాలకు విద్యాశాఖ ఆదేశాలు జారీ చేసింది.

తొక్కి చంపింది జగన్ కారే

(మొదటి పేజీ తరువాయి)

ఇరికించే ప్రయత్నం చేసిందని ఆరోపించారు. అంతేగాక సింగయ్య మృతి చెందిన విషయమే తనకు తెలియదని, సింగయ్య మృతితో తనకు ఎటువంటి సంబంధం లేదని, అందువల్ల కేసును కొట్టివేయాలంటూ జగన్ హైకోర్టులో క్వాష్ పిటిషన్ దాఖలు చేశారు. జూలై 1న కోర్టులో ఈపిటిషన్‌పై విచారణ జరగనుంది. అదే రోజున ఫోరెన్సిక్ నివేదికను కోర్టుకు పోలీసులు సమర్పించనున్నారు.

ఆధారాలతో సిద్ధమైన పోలీసులు

పోలీస్ శాఖ ఈ కేసులో తొలినుంచీ పగడ్బందీగా విచారణ జరుపుతోంది. కారు ఢీకొట్టిన వీడియోను, పోలీసులు డ్రోన్ కెమెరా ద్వారా తీసిన వీడియో ఫుటేజీలను ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపారు. ఆ వీడియో చిత్రీకరించిన సెల్‌ఫోన్ ఐడీ, ఫోన్ ఉన్న లొకేషన్ సహా గుర్తించి అది ఒరిజినల్‌దేనని ఫోరెన్సిక్ అధికారులు నివేదిక ఇచ్చారు. నిబంధనల ప్రకారం ఇప్పటికే పోలీసులు జగన్ కారుకు ఫిట్‌నెస్ పరీక్షలు జరిపించారు. ప్రమాదం జరిగిన సమయంలో అక్కడ ఉన్న దాదాపు పదిమంది ప్రత్యక్ష సాక్షుల వాంగ్మూలాలను నమోదు చేశారు. కాగా, కారు డ్రైవర్ రమణారెడ్డితో పాటు జగన్, వైవీ సుబ్బారెడ్డి, పేర్ని నాని, విడదల రజని తదితరులను నిందితులుగా పేర్కొంటూ గుంటూరు జిల్లా నల్లపాడు పోలీసులు ఇప్పటికే కేసు నమోదు చేశారు. నిందితులు తమను కేసు నుంచి తొలగించాలంటూ పిటిషన్లు వేశారు. దీనిపై ఈ నెల 27న కోర్టులో వాదనలు జరిగాయి. ఈ సందర్భంగా ఏజీ దమ్మాలపాటి శ్రీనివాస్ కోర్టుకు ప్రాథమిక నివేదిక సమర్పించారు. అయితే ఈ ప్రమాదానికి సంబంధించిన ఫొటోలు, ఇతర అన్ని సాంకేతికపరమైన ఆధారాలను సమర్పించేందుకు గడువు కోరగా, మంగళవారం నాటికి వాటిని సమర్పించాలని కోర్టు కోరింది. ఈ నేపథ్యంలో పోలీసులు కేసును పగడ్బందీగా విచారించి ఆధారాలతో సహా నివేదికను సిద్ధం చేశారు. కాగా ప్రధాన నిందితుడు ఏఆర్ కానిస్టేబుల్, జగన్ కారు డ్రైవర్ రమణారెడ్డి విచారణకు సహకరించలేదని తెలిసింది. ప్రమాదం జరిగిన సమయంలో బ్యానెట్‌పై ఓ కార్యకర్త ఉండడంతో చక్రం కింద వ్యక్తి పడిన విషయం తనకు కనిపించలేదని, కనీసం ఆ విషయం కూడా తనకు తెలియదని పోలీసుల వద్ద డ్రైవర్ వాదించినట్టు తెలిసింది. సింగయ్య కారు చక్రం కింద నలుగుతున్న సందర్భంలో స్థానికులు డ్రైవర్‌ను అప్రమత్తం చేయడం, ఆ తర్వాత కారు వెనక్కు నడపడం, వారు సింగయ్యను పక్కకులాగడం వంటి దృశ్యాలు ఉన్న వీడియోను చూపినా, ఆయన జవాబులో మార్పులేదని తెలిసింది. ప్రమాద ఘటనపై కారులో ఎలాంటి చర్చ జరగలేదని డ్రైవర్ చెప్పటం పోలీసులను విస్మయానికి గురిచేసినట్టు తెలిసింది.

ఆ పోలీసులపై విచారణ ముమ్మరం

సింగయ్య మృతికి జగన్ కాన్వాయ్‌లోని ప్రైవేటు వాహనం కారణం అనేలా కేసును తప్పు దారి పట్టించి క్లోజ్ చేసేందుకు ప్రయత్నించినట్టు గుర్తించిన కొందరు పోలీసులపై విచారణ ముమ్మరమైంది. కూటమి ప్రభుత్వం అధికారంలో ఉన్నా.. పోలీస్ శాఖలో వైసీపీ కోవర్టులుగా కొనసాగుతున్న వారు ఎవరనేది నిగ్గు తెల్చే పనిలో ఉన్నతాధికారులు ఉన్నారు. ఈ క్రమంలో అనుమానితులైన పోలీస్ అధికారుల ప్రభుత్వ, వ్యక్తిగత నెంబర్లతో పాటు వైసీపీకి చెందిన సుమారు పదిమంది నాయకుల సెల్‌ఫోన్ కాల్ డేటాపై అధికారులు దృష్టి సారించారు. ఎవరు ఎవరితో మాట్లాడారనేదానితో పాటు వాట్సాప్ కాల్స్ ఎవరెవరి మధ్య నడిచాయనేది కూడా తెలుసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : N.Rahul Kumar, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.